# క్రాంతి

### లోపలి పేజీల్లో...


| | | |
|---|---|---|
| తెలుగు మహాసభలు | ...... | 7 |
| ఉరిశిక్షలు | ...... | 11 |
| విద్యుత్ సమస్య | ...... | 17 |
| పెరుగుతున్న అత్యాచారాలు | ...... | 22 |
| తెలంగాణ ఉద్యమం | ...... | 27 |
| మోడీ గెలుపు | ...... | 31 |
| కేంద్ర బడ్జెట్ | ...... | 35 |
| పాదయాత్రలు | ...... | 38 |
| అమరుల చరిత్రలు | ...... | 41 |
| చైనాలో స్త్రీ విముక్తి | ...... | 49 |
| పోరాటాలు, సభలు | ...... | 54 |
| హైదరాబాద్ బాంబు పేలుళ్లు | ...... | 57 |



సి.పి.ఐ. (మావోయిస్టు) ఎ.పి., ఎన్.టి., ఎ.ఒ.బి. కమిటీల అధికార పత్రిక

సంపుటి: 37 సంచిక: 1 జనవరి - మార్చి 2013 వెల: పది రూపాయలు


# ఫిలిపినో ప్రభుత్వం ప్రజలపై సాగిస్తున్న యుద్ధం

# “ఒప్లాన్ బయనిహాన్”ను వ్యతిరేకించండి !

# విజయపథంలో పురోగమిస్తున్న

# ఫిలిపినో విప్లవోద్యమానికి జేజేలు !

## 2013 ఏప్రిల్ 22 నుండి 28 వరకు ఫిలిపినో విప్లవానికి సంఘీభావ వారాన్ని పాటించండి !



ఫిలిప్పైన్స్ కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో పురోగమిస్తున్న విప్లవాన్ని నిర్మూలించే లక్ష్యంతో అమెరికా తొత్తు బెనిగ్నో అక్వినో ప్రభుత్వం ప్రజలపై సాగిస్తున్న ఫాసిస్టు యుద్ధం ‘ఒప్లాన్ బయనిహాన్’ను నూతన ప్రజాసైన్యం, ప్రజలు వీరోచితంగా తిప్పికొడుతున్నారు. ‘ఒప్లాన్ బయనిహాన్’కు వ్యతిరేకంగా, ఫిలిపినో విప్లవానికి మద్దతుగా భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ఈ సంవత్సరం ఏప్రిల్ 22 నుండి 28 వరకు సంఘీభావ వారాన్ని పాటిస్తున్నది. ఈ సందర్భంగా ఫిలిప్పినో విప్లవోద్యమం గురించి సంక్షిప్తంగా తెలుసుకుందాం.

ఫిలిప్పైన్స్ అనేది ఆగ్నేయాసియాలో మూడు లక్షల చ.కి.మీ. వైశాల్యం, సుమారు తొమ్మిదిన్నర కోట్ల జనాభాతో కూడిన ఒక చిన్న దేశం. ఇది అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థ. 7,100 దీవుల సముదాయాన్ని కలిగి, పరిపాలనా పరంగా రీజియన్లు, ప్రావిన్సులు, అధీకృత నగరాలు, నగరాలు, మున్సిపాలిటీలు, బారియోలుగా విభజించబడి వుంది. ఫిలిపినో ప్రజలు భాషాపరంగా, భౌగోళికంగా, మతపరంగా విడిపోయి ఉన్నారు. ఇక్కడ క్రిస్టియన్, ముస్లిం మతాలు ప్రధానమైనవి. క్రిస్టియన్ ఫిలిపినో ప్రజలు దేశంలో అత్యధిక సంఖ్యలో ఉండడం వల్ల అన్ని విధాలా సమాజంలో

## 2013 ఏప్రిల్ 22 నుండి 28 వరకు

## ఫిలిప్పైన్స్ విప్లవోద్యమానికి సంఘీభావ వారాన్ని పాటించండి!

- ✶ విజయపథంలో పురోగమిస్తున్న ఫిలిపినో విప్లవోద్యమానికి జేజేలు!
- ✶ ఫిలిప్పైన్స్ ప్రభుత్వం ప్రజలపై సాగిస్తున్న యుద్ధం "ఒప్లాన్ బయనిహాన్"ను వ్యతిరేకించండి!
- ✶ ఫిలిప్పైన్స్ కమ్యూనిస్టు పార్టీ (సి.పి.పి.) వర్ధిల్లాలి!
- ✶ నూతన ప్రజా సైన్యం (ఎన్.పి.ఏ.) వర్ధిల్లాలి!
- ✶ జాతీయ ప్రజాస్వామిక సంఘటన (ఎన్.డి.ఎఫ్.) వర్ధిల్లాలి!
- ✶ ఫిలిప్పైన్స్ నూతన ప్రజాస్వామిక విప్లవం వర్ధిల్లాలి!
- ✶ మార్క్సిజం-లెనినిజం-మావోయిజం వర్ధిల్లాలి!
- ✶ సామ్రాజ్యవాదం నశించాలి!
- ✶ కార్మికవర్గ అంతర్జాతీయత వర్ధిల్లాలి !

**కేంద్రకమిటీ**

**సీపీఐ (మావోయిస్టు)**

ఆధిపత్యంలో ఉన్నారు. ఫిలిపినో ప్రజలు గొప్ప సాంస్కృతిక వారసత్వం గలవారు. స్వతంత్రంగా అభివృద్ధి చెందడానికి అవసరమైన వివిధ రకాల వనరులు గల సమృద్ధ దేశమిది. విదేశీ దురాక్రమణలకు, వలస పాలనకు వ్యతిరేకంగా నిలకడగా నిరంతరాయంగా పోరాడిన ఉజ్వలమైన చరిత్ర, వీరోచిత త్యాగసాంప్రదాయం ఇక్కడి ప్రజలకు వుంది.

ఒక శతాబ్దం క్రితమే ఫిలిప్పైన్స్ దేశం ప్రత్యక్షంగా అమెరికా సామ్రాజ్యవాద దోపిడీ పీడనల కిందికి నెట్టివేయబడింది. ఫిలిపినో ప్రజలు అతి ఎక్కువగా ఆధారపడేది వ్యవసాయం మీదనే. కాని దున్నుకునేందుకు రైతులకు భూమి లేని పరిస్థితి.

ఇక్కడ కొన్ని తేలికపాటి ఉత్పత్తి, నిర్మాణం, ప్రజా ఉపయోగం, గనులకు చెందిన పరిశ్రమలు మాత్రమే, అదీ సామ్రాజ్యవాద మార్కెట్‌పై ఆధారపడి అభివృద్ధి చెందాయి. ఇలా అది సామ్రాజ్యవాద దేశాల పరిశ్రమలకు ముడిసరుకులు ఉత్పత్తి చేసే దేశంగా మిగిలిపోయింది. సామ్రాజ్యవాదులు, వీరి ప్రాపకంలో పుట్టిపెరిగిన దళారీ బూర్జువా వర్గం, బడా భూస్వామ్య వర్గం కలిసి జాతీయ బూర్జువా వర్గాన్ని ఎదగనివ్వలేదు. ఫలితంగా దేశంలో పెట్టుబడిదారీ అభివృద్ధి నిలిచిపోయింది.

క్రమంగా అమెరికా అదనపు పెట్టుబడి ఫిలిప్పైన్స్‌లోకి వచ్చి పడింది. అమెరికాతో అసమాన మారకం వల్ల దాని వాణిజ్య లోటు తీవ్రస్థాయికి చేరింది. దీనిని పూడ్చుకోవడానికి అది మరిన్ని విదేశీ రుణాలు తీసుకోక తప్పలేదు. విదేశీ రుణం తీర్చే పేరుతో విదేశీ పెట్టుబడికి అనుకూలమైన 'ఆర్థిక సంస్కరణలు' తీవ్రతరమయ్యాయి. ఇలా ఫిలిప్పైన్స్ మునుపెన్నడూ లేనివిధంగా అమెరికా సామ్రాజ్యవాదుల, ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు, బహుళ జాతి సంస్థల కబంధ హస్తాలలో ఇరుక్కుపోయింది.

దేశంలో నిరుద్యోగం నానాటికీ పెరిగిపోతోంది. నేడు అది 24 శాతానికి చేరుకుంది. ప్రత్యక్ష, పరోక్ష పన్నుల కారణంగా కార్మికుల వేతనాలు దిగజారిపోతున్నాయి. పొట్టకూటి కోసం విదేశాలకు వలసలు పెరుగుతున్నాయి.

ప్రభుత్వ సంస్కరణలతో నానాటికీ వ్యవసాయ భూమి విదేశీ కార్పొరేషన్ల, బడా దళారీ నిరంకుశ బూర్జువాల, బడా భూస్వాముల చేతుల్లోకి పోతున్నది. వ్యవసాయంలో అధిక కౌలు రేట్లు, పెరిగే వ్యవసాయ ఉత్పత్తి ఖర్చులు, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో రైతాంగం బతుకులు దుర్భరమయ్యాయి.

జాతీయ మైనారిటీలకు స్వయం ప్రతిపత్తి అంటూనే రాజకీయ, ఆర్థిక, సైనిక తదితర ప్రధాన రంగాలలో ప్రభుత్వం వారికి అధికారాలు లేకుండా చేసింది.

అన్ని వర్గాల పీడిత ప్రజల జీవన పరిస్థితులు, పని పరిస్థితులు దిగజారడంతో సామాజిక అసమానత పెరిగిపోవడం, ఉపాధి అవకాశాలు తరిగిపోవడంతో వారు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. రోజు రోజుకూ తీవ్రతరమవుతున్న ఆర్థిక, సామాజిక సంక్షోభానికి బెనిగ్నో అక్వినో ప్రభుత్వం వద్ద ఎటువంటి పరిష్కారమూ లేదు.

### ఫిలిప్పైన్స్ కమ్యూనిస్టు పార్టీ పుట్టుక - అభివృద్ధి

18వ శతాబ్దంలో స్పానిష్ దురాక్రమణకు, వలస పాలనకు వ్యతిరేకంగా ఫిలిపినో ప్రజలు వందలాది సాయుధ తిరుగుబాట్లు చేశారు. 1930ల ప్రారంభంలో ఫిలిపినో రైతాంగం చేసిన

భూస్వామ్య వ్యతిరేక తిరుగుబాటు నుంచి ఫిలిప్పైన్స్ కమ్యూనిస్టు పార్టీ (సీపీపీ) ఆవిర్భవించింది. ఇదే 'హక్ తిరుగుబాటు'గా ప్రసిద్ధి చెందింది. పార్టీ ఏర్పడిన కొద్ది నెలలకే అమెరికా సామ్రాజ్యవాదులు, వారి తొత్తు ప్రభుత్వం పార్టీని, దాని నాయకత్వాన నడిచే కార్మిక, రైతాంగ సంస్థలను నిషేధించారు. ప్రజా నాయకులను నిర్బంధించారు. అయినా ప్రజా ప్రతిఘటన తగ్గలేదు. 1932లో ఫిలిప్పైన్స్ సోషలిస్టు పార్టీ (ఎస్‌పిపి) ఆవిర్భావంతో రైతాంగ వుద్యమానికి నూతన శక్తి లభించింది. 1939లో సీపీపీ, ఎస్‌పిపిలు ఒకే పార్టీగా విలీనమయ్యాయి.

రెండవ ప్రపంచ యుద్ధంలో ఫిలిప్పైన్స్‌పై జపాన్ దురాక్రమణకు వ్యతిరేకంగా జపాన్ వ్యతిరేక ప్రజా సైన్యానికి సీపీపీ నాయకత్వం వహించింది. యుద్ధంలో ఓటమి పాలుకావడంతో ఫిలిప్పైన్స్ నుంచి జపాన్ తిరోగమించగా, అమెరికా సామ్రాజ్యవాదుల కనుసన్నలలో 1946 జూలై 4న బూటకపు స్వాతంత్ర్యం ఫలితంగా నామమాత్ర ఫిలిప్పైన్స్ రిపబ్లిక్ ఏర్పడింది. 1950లో విలీన పార్టీ నాయకత్వంలో హక్ (రైతాంగ) గెరిల్లా సైన్యం సాయుధ పోరాటాన్ని ఆరంభించింది. 1950 ఆగస్టులో హక్ గెరిల్లా యూనిట్లు మధ్య లూజాన్ ద్వీపంలోని 11 పట్టణాలపై దాడి చేసి పెద్దయెత్తున ఆయుధాలను స్వాధీనం చేసుకున్నాయి. ఒక పక్కన తూర్పు యూరప్‌లో, చైనాలో కమ్యూనిస్టులు అధికారంలోకి రావడం, ఆగ్నేయాసియా దేశాలలో విప్లవ పోరాటాలు మిన్నంటడంతో భీతిల్లిన అమెరికా సామ్రాజ్యవాదం 'కమ్యూనిస్టు బూచి'ని రూపుమాపేందుకు రంగంలోకి దిగింది. అక్కడి తొత్తు ప్రభుత్వానికి అది సైనిక సహాయాన్ని పెద్దయెత్తున అందించింది. తొత్తు పాలకులు గెరిల్లా సైన్యం, ప్రజా సంఘాలను నిషేధించారు. బూటకపు భూసంస్కరణలతో హక్ తిరుగుబాటును పక్కదారి పట్టించాలని చూశారు. పెంటగన్, సిఐఏల నిర్దేశంలో ఫిలిప్పైన్స్ సైన్యానికి శిక్షణ నిచ్చారు. ముఖ్యమైన హక్ నాయకత్వాన్ని అరెస్టు చేయడం, విలీన కమ్యూనిస్టు పార్టీలో లావా నాయకత్వం మితవాద పంథాను చేపట్టి పక్కదారి పట్టడం వల్ల హక్ తిరుగుబాటు 1954 మే నాటికి తాత్కాలికంగా వెనకపట్టు పట్టింది. కమ్యూనిస్టు పార్టీ మితవాద పార్టీగా మారిపోవడంతో హక్ గెరిల్లా సైన్యం తన కర్తవ్యాల నుండి వైదొలగింది.

## పార్టీ పునఃస్థాపన

1960 దశకం మధ్య భాగంలో ప్రపంచంలోని పలు దేశాల్లో నూతన పెను విప్లవ తరంగం ఎగిసింది. రివిజనిజానికి వ్యతిరేకంగా కామ్రేడ్ మావో నాయకత్వాన చైనా కమ్యూనిస్టు పార్టీ ఆరంభించిన గ్రేట్ డిబేట్, చైనాలో జరిగిన మహత్తర శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవం ప్రపంచవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించాయి. ఈ పరిణామాలు ఫిలిప్పైన్స్‌లోని నిజమైన కమ్యూనిస్టు విప్లవ శక్తులు పాత సీపీపీ నాయకత్వం అనుసరించిన మితవాద పంథాను తిరస్కరించి, సరైన విప్లవ పంథాను చేపట్టేందుకు తోడ్పడ్డాయి.

ఫలితంగా 1960లలో జాతీయ ప్రజాస్వామిక ఉద్యమం తిరిగి ఉవ్వెత్తున లేచింది. 1960ల చివరిలో కార్మిక సమ్మెలు మొదలయ్యాయి. విప్లవ కార్మికోద్యమం అభివృద్ధి అయ్యింది. ఇదే విధంగా గ్రామీణ ప్రాంతంలో భూమిపై హక్కు కోసం, భూస్వాముల అకృత్యాలకు వ్యతిరేకంగా ముందుకొచ్చిన రైతాంగ పోరాటం సాయుధ వ్యవసాయ విప్లవోద్యమం దిశగా అభివృద్ధి అయ్యింది.

ఈ క్రమంలోనే 1968 డిసెంబర్ 26న సీపీపీ తిరిగి స్థాపించబడింది. 60 మంది విప్లవ కమాండర్లు, పోరాటయోధులతో 9 ఆటో రైఫిళ్లు, 20 దేశవాళీ తుపాకులతో 1969 మార్చి 29న నూతన ప్రజా సైన్యం (ఎన్.పి.ఏ.) ఏర్పడింది. ఫిలిప్పైన్స్ సామాజిక, ఆర్థిక వ్యవస్థను విశ్లేషించిన ఫిలిప్పైన్స్ కమ్యూనిస్టు పార్టీ దేశ ప్రజలకు ముగ్గురు ప్రధాన శత్రువులైన సామ్రాజ్యవాదం, బడా భూస్వామ్య వర్గం, బడా దళారీ బూర్జువా వర్గాలను నాశనం గావించి దేశాన్ని విముక్తి చేయాలంటే కార్మికవర్గ నాయకత్వంలో, కార్మిక-కర్షక మైత్రి పునాదిపై, వ్యవసాయ విప్లవం ఇరుసుగా సాగే నూతన ప్రజాస్వామిక విప్లవమే ఏకైక మార్గం అని నిర్ధారించింది. ఫిలిప్పైన్స్ సమాజానికి మార్క్సిజం-లెనినిజం-మావోయిజాన్ని అన్వయించింది. దివాళాకోరు అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థను కూలదోసేందుకు, పార్టీ సాధారణ రాజకీయ పంథాను, దీర్ఘకాల ప్రజాయుద్ధ సైనిక పంథాను, ఎత్తుగడలను రూపొందించింది. ఎన్‌పీఏను అభివృద్ధి చేస్తూ, ఫిలిప్పైన్స్ జాతీయ ప్రజాస్వామిక సంఘటన (నేషనల్ డెమోక్రటిక్ ఫ్రంట్ ఆఫ్ ఫిలిప్పైన్స్-ఎన్‌డీఎఫ్‌పి)ను నిర్మించేందుకు వివిధ విప్లవ-ప్రజాస్వామిక ప్రజాసంఘాలను స్థాపించింది. క్రమంగా నూతన ప్రజాస్వామిక రాజ్యాధికార అంగాలను (పీపుల్స్ కమిటీలు) నిర్మించింది. గ్రామీణ ప్రాంతంలో విప్లవ సాయుధ పోరాటానికి, నగరాలలో విప్లవ రహస్య ఉద్యమానికి, చట్టబద్ధ ప్రజా ఉద్యమానికి పునాది వేసింది. మరోవైపు అంతర్జాతీయంగా వివిధ మావోయిస్టు సంస్థలు, పార్టీలతో కలిసి ప్రపంచ సోషలిస్టు విప్లవం కోసం, కార్మికవర్గ అంతర్జాతీయ కర్తవ్యాల నిర్వహణ కోసం కృషి చేయసాగింది. ఈ క్రమంలో సీపీపీ నాయకత్వంలో 1971లో జాతీయ ప్రజాస్వామిక వేదిక సన్నాహక కమిషన్ ఏర్పడింది.

ఎన్‌పీఏ ఏర్పడిన వెంటనే 1969, 70లలో అది ఫిలిప్పైన్స్ ప్రభుత్వ సాయుధ బలగాలపై అనేక దాడులు చేసింది. 1979 వరకు ఎన్‌పీఏ ప్రధానంగా సాయుధ ప్రచార దళాలుగా, గెరిల్లా దళాలుగా పనిచేసింది. 1979లో ప్లాటూన్లు, కంపెనీ సైజు యూనిట్లు ఏర్పడడం మొదలయ్యింది. మైదానాల్లో స్పారో యూనిట్లు (పిచ్చుక దళాలు), సాయుధ పార్టిజాన్ యూనిట్లు శత్రు ప్రాంతాలలో రహస్యంగా పనిచేసే చాలా చిన్నసైజు గెరిల్లా దళాలు ఏర్పడ్డాయి. ఇలా మైదానాల్లో కార్యకలాపాలు విస్తృతమయ్యాయి.

1970 జనవరి-మార్చి మధ్య రాజధాని మనీలాలో మిలిటెంట్ యువజన, విద్యార్థి సంఘాల నాయకత్వంలో 'ఫస్ట్ క్వార్టర్ స్టార్మ్'గా ప్రసిద్ధి చెందిన నిరసన చర్యలు బద్దలయ్యాయి. ఒక్కో నిరసన ప్రదర్శనలో 50 వేల నుంచి లక్ష మంది ప్రజలు పాల్గొన్నారు.

ఇవి దేశంలోని పెద్ద నగరాలకు, పట్టణాలకు వ్యాపించాయి. ఇవి జాతీయ చైతన్యంతో బలమైన రాజకీయ, సాంస్కృతిక ఉద్యమంగా అభివృద్ధి చెందాయి. అమెరికా సామ్రాజ్యవాదం, భూస్వామ్యం, దళారీ పెట్టుబడిదారీ విధానాలకు వ్యతిరేకంగా మౌలిక సమస్యలను ముందుకు తెచ్చాయి. ఈ ఉద్యమం మునుపెన్నడూ లేని స్థాయిలో జాతీయ ప్రజాస్వామిక విప్లవ కర్తవ్యాన్ని ప్రచారం చేసింది.

పార్టీనీ, ఎన్‌పీఏను పురిట్లోనే దెబ్బతీయడం కోసం మార్కోస్ అధ్యక్షతలోని నాటి నిరంకుశ ప్రభుత్వం 1968 నుండి 1970ల ప్రారంభం వరకు 'మొగ్గలోనే తుంచివేయటం' (నిప్ ఇన్ ద బడ్) అనే దాడి క్యాంపెయిన్ చేపట్టింది. 1970ల నుంచి 1986 వరకు 'ఒప్లాన్ మమమయాన్'ను చేపట్టి పెద్ద అణచివేత చర్యలు చేపట్టింది. 1972 సెప్టెంబర్‌లో మార్షల్ లా (సైనిక పాలన) విధించి ఫాసిస్టు నియంతృత్వాన్ని ముందుకు తెచ్చింది. ప్రజాస్వామిక హక్కులను మునుపెన్నడూ లేనివిధంగా అణచివేసింది. దేశభక్త, ప్రగతిశీల శక్తులే కాక, అధికార పక్షాన్ని విమర్శించే ఇతర పాలకవర్గాలు కూడా తీవ్ర నిర్బంధానికి గురయ్యాయి. ఈ ఫాసిస్టు పాలనలో లక్షన్నర మంది ప్రజలు ఊచకోతకు గురయ్యారు. 60 లక్షలకు మించి ప్రజలు నిర్వాసితులయ్యారు. అరెస్టులు, చిత్రహింసలు సాధారణమయ్యాయి.



అయితే సీపీపీ నాయకత్వంలో పీడిత ప్రజలు మార్కోస్ నియంతృత్వాన్ని ధిక్కరించి ధైర్యంగా ప్రతిఘటించారు. నియంతృత్వాన్ని ఎదిరిస్తూ పర్వత ప్రాంతాల నుంచి సాయుధ పోరాటం మైదానాలకూ, పట్టణాలకు, సముద్ర తీరానికి కూడా వ్యాపించింది. బహిరంగ-రహస్య ఉద్యమాలు సమన్వయంతో వేగంగా అభివృద్ధి చెందాయి.

పై అభివృద్ధిలో ఎన్‌డీఎఫ్ పాత్ర ప్రముఖమైంది. ఎన్‌డీఎఫ్ వివిధ విప్లవ-ప్రజాస్వామ్య ప్రజా సంఘాలను నిర్మించడంలో, సంఘటితం చేయడంలో కీలక పాత్ర పోషించింది. అది అనేక సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక పోరాటాలకు ప్రత్యక్షంగా నాయకత్వం వహించింది. పార్టీ, ఎన్‌పీఏ, ఎన్‌డీఎఫ్‌లు కలిసి సమైక్యంగా సాగించిన కృషి ఫలితంగా గెరిల్లా ఫ్రంట్లు, గెరిల్లాజోన్లు, గెరిల్లా బేస్‌లు ఏర్పడి అభివృద్ధి చెందాయి. ప్రజాయుద్ధం మరింత ఉన్నత దశకు పురోగమించింది.

అదే సమయంలో పార్టీ పట్టణాలలో ప్రజా సంఘాలను ఆర్గనైజేషన్ డిపార్ట్‌మెంట్ (నిర్మాణ విభాగం) కింద ఉన్న బ్యూరోల ద్వారా గైడ్ చేసింది. మార్కోస్ నిరంకుశ పాలనలో సైతం వాటిని నిలబెట్టుకుంటూనే, మార్షల్ లా విధించిన వెంటనే ఎన్‌డీఎఫ్ నాయకత్వాన 'లిబరేషన్' బులెటిన్‌ను ప్రచురించడం జరిగింది. పట్టణాల్లో శత్రు నిఘా పెరిగిన క్యాడర్లను, ప్రజా కార్యకర్తలను పార్టీ పెద్దసంఖ్యలో గెరిల్లాజోన్లకు పంపింది. 1975, 76లలో కార్మిక, విద్యార్థి ఉద్యమాలు వెల్లువెత్తాయి. గెరిల్లాజోన్ల వెలుపల చట్టబద్ధ రైతాంగ సంఘాల నిర్మాణం మొదలైంది. ఇలాంటి అత్యంత అనుకూల పరిస్థితులలో 1980ల మొదటి సగభాగంలో ఎన్‌పీఏ ఎత్తుగడల ఎదురుదాడులు ఉన్నత శిఖరాలకు చేరుకున్నవి. 1985 నాటికి ఎన్‌పీఏ 7 వేల రైఫిళ్లు కలిగిన సైన్యంగా అభివృద్ధి అయ్యింది. దేశంలోని వివిధ పోరాట సంస్థలు ఎన్‌డీఎఫ్‌లో భాగమయ్యాయి. విప్లవోద్యమానికి విదేశాలలో నైతిక, పాదార్థిక మద్దతును కూడగట్టడంలో ఎన్‌డీఎఫ్ విజయం సాధించింది.

1982లో ఎన్‌డీఎఫ్ నూతన కటిపునాన్ ముసాయిదా కార్యక్రమాన్ని రూపొందించి తన మిత్ర సంస్థలకు, ఇతర ప్రగతిశీల సంస్థలకు పంపిణీ చేసింది. 1985 ఆరంభం నాటికి ఇది దేశ, విదేశాల్లో విస్తృతంగా ప్రచారమైంది. 1983లో బెనిగ్నో అక్వినో హత్యానంతరం మునుపెన్నడూ లేని విధంగా దేశవ్యాప్తంగా ప్రజా నిరసనలు వెల్లువెత్తాయి. బహిరంగ ఉద్యమాలు సాయుధ పోరాటంతో సమైక్యం కావడంతో 1983-86 కాలంలో భారీ వెల్లువలు చోటు చేసుకున్నాయి. ఒక వేయికి పైగా ప్రజాసంఘాలు ఒకే వేదిక మీద వచ్చి 1985 మే నెలలో బయాన్ (నూతన దేశభక్తయుత కూటమి) అనే ఐక్యసంఘటనను ఏర్పాటు చేశాయి. ప్రధానంగా ఇది కార్మికులు, రైతాంగం సహా అత్యధిక పీడిత వర్గాలకు చెందినవారి దృఢసంకల్పం, బలం మీద ఆధారపడి పనిచేసింది. 10 లక్షలకు పైగా సభ్యత్వం కలిగి ఉండింది. పాలకవర్గాల్లోని కొన్ని సెక్షన్లు కూడా ఇందులో భాగమయ్యాయి. చివరకు పాలకవర్గాల అత్యంత బలమైన సాధనం అయిన సైన్యంలో కూడా తిరుగుబాటు వచ్చింది. ప్రజల నిరసన సాధారణ తిరుగుబాటు రూపాన్ని తీసుకోవడం, అనేక మంది అభివృద్ధి నిరోధకులలో సైతం అసంతృప్తి పెరగడంతో మార్కోస్ పాలనకు అమెరికా బహిరంగంగా మద్దతు వుపసంహరించుకోక తప్పలేదు. ఫలితంగా 1986 ఫిబ్రవరిలో మార్కోస్ నియంతృత్వం కుప్పకూలింది.

మార్కోస్ తర్వాత కొరజాన్ అక్వినో అధికారంలోకి వచ్చింది. వెంటనే ఆమె ఎన్‌డీఎఫ్‌తో చర్చలు జరిపి 1987లో కాల్పుల విరమణ ఒప్పందం చేసుకొంది. తాత్కాలికంగా 60 రోజుల కాల్పుల విరమణ జరిగింది. కాని, అనతికాలంలోనే ప్రభుత్వం మెండియోలా ఊచకోతకు పాల్పడి, కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి అతి పెద్ద క్రూరమైన అణచివేత క్యాంపెయిన్‌ను ఆరంభించింది.

ఆకర్షణీయమైన ప్రజాస్వామిక నినాదాలతో అధికారంలోకి వచ్చిన కొరజాన్ అక్వినో ప్రభుత్వం విప్లవ శక్తులకు, ప్రజలకు

వ్యతిరేకంగా 1987 నుంచి 'సంపూర్ణ యుద్ధం', 'క్రమక్రమంగా నిర్మాణం' అనే విధానాన్ని అవలంబించింది. 1987 మధ్యలో 'ఒప్లాన్ రెడ్ బస్టర్', 1988లో 'ఒప్లాన్ డెల్టా బస్టర్'ల ద్వారా పార్టీకి, ఎన్‌పీఏకి భారీ నష్టాలు కలిగించింది.

కొరజాన్ అక్వినో అనంతరం అధికారంలోకి వచ్చిన రామోస్ ప్రభుత్వం 1988 నుంచి 1998 వరకు 'ఒప్లాన్ లంబట్ బిటగ్-1, 2, 3, 4' అనే పేర్లతో వరుస అంతర్గత భద్రతా ఆపరేషన్లు (ఇంటర్నల్ సెక్యూరిటీ ఆపరేషన్లు-ఐఎస్ఓ) కొనసాగించింది. ఇవన్నీ అమెరికా నిర్దేశిత 'తక్కువ తీవ్రత కలిగిన యుద్ధ'(ఎల్ఐసీ) వ్యూహానికి అనుగుణంగా ఒక పక్క మానసిక యుద్ధ ఎత్తుగడలను అనుసరిస్తూ, మరో పక్క క్రూరమైన సాయుధ దాడులు సాగించాయి. 'క్లియర్-హోల్డ్-కన్సాలిడేట్' (తుడిచిపెట్టు-అధీనంలోకి తీసుకో-సంఘటితం చేయి) ఎత్తుగడను అమలు చేశాయి. రహస్య హంతక దళాలు ఏర్పడ్డాయి. ఇవి ఆ తర్వాత సివిల్ వలంటరీ ఆర్గనైజేషన్ (సీవీఓ), సిటిజెన్స్ ఆర్మ్‌డ్ ఫోర్స్ జియోగ్రాఫికల్ యూనిట్ (సీఏఎఫ్‌జీయూ)గా రంగు మార్చుకున్నాయి. దేశవ్యాప్తంగా ఫాసిస్టు బీభత్సం తాండవమాడింది. ఇది క్రమంగా అప్రకటిత మార్షల్ లాకు దారితీసింది. మార్కోస్ నియంతృత్వం పట్ల వ్యతిరేకతతో ప్రారంభంలో కొరజాన్ అక్వినో పాలన పట్ల ప్రజలలో భ్రమలు ఏర్పడినప్పటికీ త్వరలోనే అది ప్రజల నుంచి వేరుపడి పోయింది. అది వ్యూహాత్మకంగానే విప్లవోద్యమాన్ని ధ్వంసం చేయాలనుకున్నా అందులో విఫలమైంది.

అయితే 1980ల మొదట్లో పెరుగుతున్న అనుకూల పరిస్థితుల నేపథ్యంలో పార్టీ త్వరిత విజయం గురించిన భ్రమలలో కొట్టుకుపోయింది. ముఖ్యంగా సైనిక దుస్సాహసికవాదం వంటి అన్యవర్గ ధోరణులకు లోనైంది.

1990 జులైలో ఎన్‌డీఎఫ్ జాతీయ కాంగ్రెస్ జరిగింది. 1992లో అన్యవర్గ ధోరణులకు వ్యతిరేకంగా మహత్తర దిద్దుబాటు ఉద్యమాన్ని చేపట్టి రెండు పంథాల మధ్య పోరాటాన్ని లోతుగా నిర్వహించి గెరిల్లా యుద్ధాన్ని, ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం చేశారు. 1998-99 నాటికి రెండవ మహత్తర దిద్దుబాటు వుద్యమాన్ని విజయవంతంగా ముగించుకోవడంతో పార్టీ, ఎన్‌పీఏ, మొత్తం విప్లవోద్యమం గణనీయమైన అభివృద్ధిని సాధించాయి.

అధ్యక్షుడిగా జోసఫ్ ఎస్ట్రాడా అధికారంలోకి వచ్చిన తర్వాత 1998 నుండి 2001 వరకూ విప్లవోద్యమంపై 'ఒప్లాన్ మకబయాన్' పేరుతో మరో నిర్బంధ క్యాంపెయిన్ అమలు చేసింది. అయితే విప్లవ ప్రజా సాయుధ ప్రతిఘటనను అణచివేయడంలో ఈ అణచివేత దాడి కూడా విఫలమైంది.

తర్వాత అధ్యక్షురాలు గ్లోరియా అర్రోయో ప్రభుత్వం అమెరికా సామ్రాజ్యవాదుల నిర్దేశకత్వంలో 2001లో 'ఒప్లాన్ బంటే లాయ-1' పేరుతో అణచివేత దాడులకు దిగింది. కాని, ఎన్‌పీఏ దేశవ్యాప్తంగా సాగించిన ఎత్తుగడల ఎదురుదాడుల ఫలితంగా, ప్రజా ఉద్యమం ఫలితంగా 2005 మధ్య నాటికి 'ఒప్లాన్ బంటే లాయ-1' మొత్తంగానే విఫలమైంది. అయితే ప్రభుత్వం మరింత తీవ్రమైన, క్రూరమైన స్థాయిలో 'మెరుగుపర్చిన జాతీయ అంతర్గత భద్రత' పేరుతో తన విఫల పథకాన్ని 'ఆపరేషనల్ ప్లాన్ బంటే లాయ-2'గా పునరుద్ధరించి విప్లవోద్యమంపై, ప్రజలపై ఘోరమైన దమనకాండకు పాల్పడింది.

ఈ దాడిని ఓడించడానికి మునుపెన్నడూ లేనివిధంగా ఎన్‌పీఏ చేసిన దాడుల ఫలితంగా ఫిలిప్పైన్స్ సైన్యం పెద్దదెబ్బలు తిన్నది. సైన్యం, పోలీసుల మనోస్థైర్యం పడిపోయింది.

2010 మధ్య కల్లా ఎన్‌పీఏను ధ్వంసం లేదా విచ్ఛిన్నం చేస్తామని అర్రోయో ప్రభుత్వం, సైన్యం పదే పదే ప్రగల్భాలు పలికాయి. అయితే 'ఒప్లాన్ బంటే లాయ-2' మరింతగా అభాసుపాలైంది.

### "ఒప్లాన్ బయనిహాన్"

అన్ని నిర్బంధ ఆపరేషన్లు విఫలం కావడంతో ఫిలిపినో పాలకులు అమెరికా కౌంటర్ ఇన్‌సర్జెన్సీ గైడ్‌ను అనుసరిస్తూ 'ఒప్లాన్ బయనిహాన్' పేరుతో మరో విస్తృత, బహుముఖ దాడి, సంపూర్ణ విప్లవ ప్రతీఘాతుక యుద్ధంకు పూనుకున్నాయి.

'ఒప్లాన్ బయనిహాన్' అనేది 'ప్రజల్ని కేంద్రంగా చేసుకున్న వ్యూహం' అని, మానవ భద్రతా ఆపరేషన్ల చట్రం లోపల సాగే కౌంటర్ ఇన్‌సర్జెన్సీ ఆపరేషన్లనీ ఢంకా భజాయించుకున్నది. ఇది (ఒప్లాన్ బయనిహాన్) శాంతిని స్థాపించడంలో, కంబాట్ ఆపరేషన్లను తగ్గించడంలో, బెనిగ్నో అక్వినో ప్రభుత్వం చేపట్టిన విప్లవ ప్రతీఘాతుక విధానానికి అనుగుణంగా వ్యవహరిస్తుందని, 'నాన్ కంబాట్' సైనిక ఆపరేషన్ల పాత్రను బలోపేతం చేసి విస్తరిస్తుందని, ఇది పౌర-సైనిక ఆపరేషన్లు (సీఎంఓ), అభివృద్ధి కార్యకలాపాలతో కూడుకొని ఉంటుందని చెబుతున్నది.

నిజానికి, 'ఒప్లాన్ బయనిహాన్'కూ, 'ఒప్లాన్ బంటే లాయ-1, 2'లకూ, ఫిలిప్పైన్స్ సైన్యం అమలు చేసిన మునుపటి దాడి క్యాంపెయిన్లకూ మధ్య మౌలిక లేదా గుణాత్మకమైన తేడా అంటూ ఏమీ లేదు. శాంతి-అభివృద్ధి-మానవ హక్కుల కోసం భారీస్థాయిలో రూపొందించిన పథకంగా దీనిని వూరూవాడ ప్రచారం చేస్తోంది. అది 'శాంతి గెలుచుకోవడం' అనే నినాదాన్ని ప్రచారం చేస్తూ, క్రూరమైన సైనిక అణచివేత క్యాంపెయిన్లను శుద్ధ 'శాంతి-అభివృద్ధి' ఆపరేషన్లుగా చూపుతూ, ఏకకాలంలో సాగే ముప్పేట (కంబాట్, ఇంటలిజెన్స్, పౌర-సైనిక) ఆపరేషన్లను కప్పిపెడుతోంది.

ఒప్లాన్ బయనిహాన్ ప్రత్యేక లక్షణం ఏమిటంటే, అది పౌర-సైనిక ఆపరేషన్ల (సీఎంఓ) పాత్ర మీద ప్రత్యేకంగా కేంద్రీకరిస్తున్నది. ఇందులో పౌర ఏజెన్సీలను, పౌర సంఘాలను, ఎన్‌జీఓలను, ప్రభుత్వ అధికారులను, ఉద్యోగులను, చర్చికి సంబంధించిన వాళ్లను, మాస్ మీడియా (ఎలక్ట్రానిక్, ప్రింట్)ను, సమాజంలోని ఇతర రంగాలను పెద్దయెత్తున భాగస్వామ్యం చేస్తున్నది. విప్లవ వ్యతిరేక ప్రచారాన్ని, మానసిక యుద్ధ ఆపరేషన్లను

తీవ్రతరం చేస్తున్నది. తద్వారా ఎన్‌పీఏను, విప్లవ సంఘాలను అన్ని రకాలుగా ఒత్తిడికి, భయానికి గురిచేసి ఒంటరి చేసి లొంగదీసుకునేందుకు ప్రయత్నిస్తున్నది.

అమెరికా సైనిక వ్యూహానికి అనుగుణంగానే ఫిలిప్పైన్స్ ప్రభుత్వం విప్లవ వ్యతిరేక యుద్ధాలను సాగిస్తున్నది. నేటి 'ఒప్లాన్ బయనిహాన్' ఇందులో భాగమే.

'ఒప్లాన్ బయనిహాన్'కు వ్యతిరేకంగా సీపీపీ నాయకత్వంలో ఎన్‌పీఏ, ఎన్‌డీఎఫ్, ఇతర ప్రజా సంఘాలు, అనేక స్వతంత్ర పౌర సంస్థలు, పౌరహక్కుల సంఘాలు, సాయుధ-నిరాయుధ, రహస్య-బహిరంగ రూపాల్లో గత రెండు సంవత్సరాలుగా ప్రతిఘటనా పోరాటాలు సాగిస్తున్నాయి. శాంతి-అభివృద్ధి పేరుతో దేశాన్ని సైనిక శిబిరంగా మార్చివేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. సామ్రాజ్యవాదుల, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదుల ప్రయోజనాలను కాపాడే విప్లవ ప్రతీఘాతుక యుద్ధాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నాయి.

2011 నుంచి సీపీపీ దీర్ఘకాలిక ప్రజాయుద్ధంలో ప్రారంభదశ అయిన వ్యూహాత్మక ఆత్మరక్షణా దశను పరిపూర్తి చేసుకొని, మధ్య దశ అయిన వ్యూహాత్మక ప్రతిష్టంబనలోకి పురోగమించే లక్ష్యాన్ని నిర్దేశించుకొని కృషి చేస్తున్నది. దేశ, ప్రపంచ పరిస్థితులు ఇందుకు అనుకూలంగా ఉన్నాయి. ఇందుకోసం సరియైన పంథాను పార్టీ రూపొందించింది. జాతీయ విముక్తి, ప్రజాస్వామ్యాల కోసం ప్రజల ఆకాంక్షలను నిజం చేసేందుకై ప్రజాయుద్ధాన్ని సాగిస్తూ ఒక దశ నుంచి మరో దశకు దానిని పురోగమింపజేయాలని పార్టీ కేడర్లకు, ప్రజలకు అది పిలుపు నిచ్చింది.

ఎన్‌పీఏ దేశవ్యాప్తంగా వందల సంఖ్యలో చిన్న, మధ్య, పెద్ద రకం ఎత్తుగడల ఎదురుదాడులను నిర్వహించి బెనిగ్నో అక్వినో సాయుధ బలగాలను బెంబేలెత్తిస్తున్నది. పెద్దయెత్తున అది నిర్వహిస్తున్న చికాకుపరిచే చర్యలే ప్రభుత్వ సైన్యానికి ఒక గండంగా మారిపోయాయి. లక్షలాది ప్రజల క్రియాశీల భాగస్వామ్యంతో ఈ వీరోచిత ప్రతిఘటన రోజు రోజుకూ విస్తృత ప్రజాయుద్ధ రూపం తీసుకుంటున్నది.

ఈ విధంగా ఫిలిపినో ప్రజలు పట్టణాల్లో, గ్రామాల్లో, ఫ్యాక్టరీల్లో, మురికివాడల్లో, విద్యాలయాల్లో, కార్యాలయాల్లో మిలిటెంట్‌గానూ, మరోవైపు సాయుధంగానూ పోరాడుతూ ప్రపంచ పీడిత ప్రజానీకానికి ఉత్తేజంగా, ప్రేరణగా నిలుస్తున్నారు.

అమెరికా సామ్రాజ్యవాదుల, బడా దళారీ బూర్జువా, బడా భూస్వామ్య వర్గ దోపిడి ప్రయోజనాల రక్షణ కోసం ఫిలిపినో ప్రజలపై హత్యలు-అత్యాచారాలు-అరెస్టులు- చిత్రహింసలు-నిర్వాసితుల్ని చేయడం ద్వారా బీభత్సం సృష్టిస్తున్న విప్లవ ప్రతీఘాతుక 'ఒప్లాన్ బయనిహాన్'ను ప్రపంచ ప్రజలంతా వ్యతిరేకించాలి. వీరోచితంగా సాగుతున్న ఫిలిపినో విప్లవానికి మద్దతు తెలియజేయాలి. ఫిలిప్పైన్స్‌లో సాగుతున్న బహుముఖ అణచివేత దాడిని సభలు, సమావేశాలు, క్యాంపెయిన్లు, పోస్టర్లు, కరపత్రాలు, సెమినార్లు, వీధి మీటింగులు, గ్రూపు మీటింగులు తదితర రూపాలతో విశాల ప్రజారాశులలో ఎండగట్టాలి. 'ఒప్లాన్ బయనిహాన్' ఎంతటి క్రూరమైనది అయినా, అది తప్పక ఓడిపోయి తీరుతుందని ఫిలిపినో ప్రజల విప్లవ చరిత్ర, ప్రపంచ ప్రజల విప్లవోద్యమ చరిత్ర చాటిచెబుతున్నాయి. అంతిమంగా సామ్రాజ్యవాదులు, అభివృద్ధినిరోధకులు ఓడించబడతారు. ప్రజలే విజేతలుగా నిలుస్తారు.

★

---

***(43వ పేజీ తరువాయి)***

సవాలు విసరడానికి అవి సిద్ధంగా వున్నాయి. నేడు దండకారణ్యం నడిబొడ్డున, బస్తర్‌లో శిక్షణ పేరుతో తిష్టవేసి విప్లవోద్యమ అణచివేతలో పాలు పంచుకోవడానికి త్వరపడుతున్న భారత సైన్యాన్ని ఓడించడంలో అవి తమ వంతు పాత్రను తప్పక నిర్వహిస్తాయి. ఆయన అభివృద్ధి పరిచిన టెక్నిక్, ఆయన అందించిన పరిజ్ఞానం పీఎల్‌జీఏ స్వంతమైనాయి. ఆయన వద్ద టెక్నీషియన్లుగా ఆయుధ తయారీ పరిజ్ఞానం పొందిన సహచర కామ్రేడ్స్, పీఎల్‌జీఏ పోరాటయోధులు, ప్రజలు ఆయన వదిలిపోయిన కర్తవ్యాలను తుదకంటా కొనసాగిస్తారు. వారికి ఆయన సదా స్ఫూర్తిగా నిలుస్తాడు.

దండకారణ్యంలోని ఒక కుగ్రామంలో కామ్రేడ్ అమన్ అంత్యక్రియలు విప్లవ సంప్రదాయాలతో పిఎల్‌జిఎ యోధుల, ప్రజల అశ్రు నివాళిలో, విప్లవ నినాదాలు మిన్నంటుతుండగా ముగిశాయి. ఆయన సహచరి చితికి నిప్పంటించింది. దండకారణ్య వ్యాప్తంగా విషాదవార్త పాకగానే కామ్రేడ్స్ ఎక్కడికక్కడ సంస్మరణ సభలు జరిపి కామ్రేడ్ అమన్‌కు నివాళులర్పించారు. అతని కుటుంబానికి దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సంతాప సందేశాన్ని పంపింది.

ఆయన విప్లవోద్యమంలో, ప్రజల, ప్రజాగెరిల్లాల హృదయాలలో చిరస్థాయిగా నిలిచివుంటాడు. ఆయన విప్లవోద్యమంలో దీర్ఘకాలంగా, దృఢ సంకల్పంతో పనిచేసి నెలకొల్పిన ఆదర్శాలు భావి తరాలకు ప్రేరణగా నిలుస్తాయి. సామ్రాజ్యవాదాన్ని, భూస్వామ్యాన్ని, దళారీ నిరంకుశ పెట్టుబడినీ అంతం చేసి కార్మిక-కర్షక ఐక్యతా పునాదిపై పీడిత వర్గాల సంయుక్త రాజ్యాధికారాన్ని నెలకొల్పి, ఎలాంటి దోపిడీ పీడనలకు, అన్యాయాలకు, వివక్షకు తావు లేని నవ సమాజాన్ని ఆవిష్కరించడం కోసం అలుపెరుగక పోరాడడమే కామ్రేడ్ అమన్‌కు నిజమైన నివాళి అవుతుంది.

**కామ్రేడ్ అమన్ అమర్ రహే!**

★

# తెలుగును చంపేస్తూ తెలుగు మహాసభలు జరిపిన పాలకులు!

హోరెత్తిన నిరసనలు, బహిష్కరణ పిలుపుల మధ్య డిసెంబర్ 27-29 తేదీలలో తిరుపతిలో నాలుగో ప్రపంచ తెలుగు మహాసభలు జరిగాయి. ప్రపంచవ్యాప్తంగా వున్న తెలుగు ప్రజానీకంలో భావ సమైక్యత సాధించడానికి, తెలుగు మహాసభలను జరుపుతున్నట్లు, ఈ మహాసభల కోసమే పునరుద్ధరించబడిన అధికార భాషా సంఘానికి, అధ్యక్షుడైన మండలి బుద్ధ ప్రసాద్ పేర్కొన్నాడు.

ఈ మహాసభల నేపథ్యంలో వెల్లువెత్తిన నిరసనలకు అనేక కోణాలున్నాయి. తెలుగు సమాజాన్ని, భాషను, సంస్కృతిని ధ్వంసం చేస్తున్న ఈ పాలకులకు ఇటువంటి సభలు జరిపే నైతిక అర్హత లేదని ప్రకటిస్తూ పలు విప్లవ, ప్రగతిశీల రచయితల సంఘాలు, వుపాధ్యాయ సంఘాలు, తెలుగు భాషోద్యమ సమాఖ్య, తెలుగు భాషా పండితుల సంఘాలు, విద్యార్థి సంఘాలు ఈ సభలను బహిష్కరించాయి.

తెలంగాణ రాష్ట్ర సాధనకై తెలంగాణ ప్రజల పోరాటం వుధృతంగా జరుగుతున్న నేపథ్యంలో, తెలుగు వాళ్లంతా ఒక్కటిగానే వున్నారని చాటడానికి, వుద్యమాన్ని పక్కదారి పట్టించడానికి సమైక్యాంధ్ర నేతల ఒత్తిడి మేరకు కుట్రపూరితంగా ప్రభుత్వం ఈ సభలను జరుపుతున్నదని, ఈ సభలు అణచివేతలో భాగమేనని ప్రకటిస్తూ, దాదాపు తెలంగాణ వుద్యమ సంఘాలన్నీ ఈ సభలను బహిష్కరించాయి. అంతేకాదు డిసెంబర్ 20న 'తెలంగాణ యుద్ధభేరి' పేరుతో ప్రపంచ తెలంగాణ సాహిత్య మహాసభలను జరిపి, తెలుగు మహాసభల వెనుక వున్న సమైక్యాంధ్ర కుట్రను తెలంగాణావాదులు బహిర్గతం చేశారు.

తెలుగు భాష పేరిట క్రిష్ణ, గోదావరి జిల్లాలకు చెందిన అగ్ర కులాల వ్యవహారిక భాషను తెలుగు వాళ్లందరిపై రుద్దడానికి, ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు తర్వాత అత్యధిక ప్రజలు మాట్లాడే ఉర్దూ పైనా, ఇంకా అనేక ఆదివాసీ, తదితర ప్రజల మాతృభాషలపైన ఆధిపత్యాన్ని చాటుకోవడానికి తెలుగు మహాసభలను జరుపుతున్నారనేది కూడా ఈ నిరసన వెనుక వున్న మరొక ముఖ్యమైన కోణం.

ఈ సభల గురించి రాస్తూ, ఆపరేషన్ గ్రీన్‌హంట్‌లో భాగమైన సాంస్కృతిక వ్యక్తీకరణగా భావించి, విప్లవ రచయితల సంఘం ఈ సభలను బహిష్కరిస్తున్నదని, ఆ సంఘ నేత వరవరరావు పేర్కొన్నారు.

పై వాదనలన్నీ సరైనవే. తెలుగు మహాసభల సందర్భంగా తెలుగు భాషా, సంస్కృతుల గురించి మరోసారి విస్తృతమైన చర్చ జరిగింది. ఇది మంచి పరిణామమే. ముఖ్యంగా గత పదిహేనేళ్లకు పైగా తెలుగు భాష గురించి రాష్ట్రంలో చర్చ జరుగుతున్నది. ప్రపంచీకరణ ప్రభావం వల్ల ప్రపంచంలోని ఆరువేల భాషల్లో ఇప్పటికే సగం అంతరించాయని, ఇలాగే నిర్లక్ష్యం చేస్తే మరిన్ని భాషలు నశించిపోతాయని, అంతరించిపోబోయే భాషల్లో తెలుగు కూడా వుందని, యునెస్కో (యునైటెడ్ నేషన్స్ ఎడ్యుకేషనల్ సైంటిఫిక్ అండ్ కల్చరల్ ఆర్గనైజేషన్) హెచ్చరించింది. ఈ నేపథ్యంలో తెలుగు భాషాభిమానులకే కాదు, భాషల పట్ల శాస్త్రీయ దృక్పథం వున్న ఎవరికైనా ఆందోళన కలగడం సహజం. ఎందుకంటే ఒక జాతి అస్తిత్వానికి భాష కీలకంగా వుంటుంది. భాషకూ, చరిత్రకూ, సంస్కృతికీ, భవిష్యత్‌కు సంబంధం వుంటుందని ప్రముఖ భాషా శాస్త్రవేత నోమ్ చామ్‌స్కీ అంటారు. మరి తెలుగుకు ఈ దుస్థితి ఎందుకు వచ్చింది? తెలుగుకు ఇటువంటి దుస్థితి పట్టడంలో, నేడు 40 కోట్లకు పైగా ప్రజల సొమ్ముతో అట్టహాసంగా ప్రపంచ తెలుగు మహాసభలు జరిపిన పాలకులకు ఏ సంబంధమూ లేదా? అంటే కేవలం పాలకుల నిర్వాకం మూలంగానే తెలుగుకు ఈ దుస్థితి పట్టిందని చెప్పుకొని తీరాలి. వలస పాలనలో దాదాపు దేశవ్యాప్తంగా అమలైన ఇంగ్లీష్ భాషా దాస్యం నుంచి, చాలా రాష్ట్రాలు బయటపడినా, సమైక్యాంధ్రప్రదేశ్ మాత్రం బయటపడలేదు. భాషా ప్రాతిపదిక మీద రాష్ట్రాన్ని ఏర్పరుచుకోవడంలో చూపిన వుత్సాహాన్ని పరిపాలనా, శాసన, న్యాయ, విద్యా వ్యవస్థల్లో తెలుగును నెలకొల్పడంలో చూపలేదు. సమైక్య రాష్ట్రం ఏర్పడిన వెంటనే తెలుగును, ఉర్దూను అధికార భాషలుగా ప్రకటించాల్సి వున్నప్పటికీ, పాలకులు ఆ పని చేయలేదు. 1966లో తెలుగును అధికార భాషగా ప్రకటించినప్పటికీ, 2005 వరకూ దానికి సంబంధించిన చట్టబద్ధ వుత్తర్వులు వెలువడలేదంటే, తెలుగు భాష పట్ల పాలకుల చిత్తశుద్ధిని అర్థం చేసుకోవచ్చు. ఉత్తర్వులు వెలువడిన తర్వాత కూడా అమలు కోసం కృషి చేసిన వాళ్లు లేరు. ఫలితంగా ఇప్పటికీ శాసన, పరిపాలన, న్యాయ వ్యవహారాలన్నీ రాష్ట్ర భాష కాని, మన దేశ భాష కూడా కాని, వలస పాలకులు మనపై రుద్దిన ఇంగ్లీష్‌లోనే జరుగుతున్నాయి.

ఇటువంటి నేపథ్యంలో తెలుగు జాతి ప్రజలు పాలకులు తమ కోసం ఎటువంటి శాసనాలను చేస్తున్నారో అర్థం చేసుకోలేని, పరిపాలనా వ్యవహారాలను తెలుసుకోలేని పరిస్థితిలో వున్నారు. న్యాయం కోసం న్యాయస్థానాలకు పోతే, న్యాయం చేయమని తెలుగులో అడగలేని పరిస్థితి, వాదోపవాదాలను తెలుగులో వినలేని పరిస్థితి, తీర్పులను తెలుగులో పొందలేని దుస్థితి. తెలుగు భాష మీద విస్తృత చర్చ జరుగుతున్న ఈనాటికి కూడా పరిస్థితిలో మార్పేమీ లేదు. 2011-12 సంవత్సరంలో జారీ అయిన, దాదాపు అయిదు వేల ప్రభుత్వ వుత్తర్వులలో, కేవలం మూడు మాత్రమే తెలుగులో వున్నాయి. ఇక ఇప్పటికీ న్యాయస్థానాల్లో రెండు, మూడు తీర్పులు మాత్రమే తెలుగులో వెలువడ్డాయి. ప్రపంచ తెలుగు మహాసభల తిరునాళ్లు ముగిసిన తర్వాత కూడా, పరిపాలనలో తెలుగును అమలు చేయడం సాధ్యం కాదని ముఖ్యమంత్రి అన్నాడు.

*ఫిబ్రవరి 21 మాతృ భాషా దినోత్సవమని మనకు తెలుసు. తమ తల్లి భాష పట్ల బెంగాలీలకు వున్న ప్రేమ నుంచి పుట్టిన రోజిది. బంగ్లాదేశ్ పాకిస్థాన్‌లో భాగంగా వున్నప్పుడు పాకిస్థాన్ వుర్దూను పాకిస్తాన్ కంతటికీ వర్తించే అధికారిక భాషగా ప్రకటించింది. కానీ బెంగాలీ తల్లి భాషగా వున్న తూర్పు బెంగాల్ ప్రాంతం ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించింది. ఈ నేపథ్యంలో తలెత్తిన వుద్యమంలో 1952, ఫిబ్రవరి 21న ఢాకా విశ్వ విద్యాలయం వద్ద జరిగిన కాల్పుల్లో ఆరుగురు విద్యార్థులు చనిపోయారు. ఇది అంతర్జాతీయ సమాజాన్ని కదిలించింది. ఫలితంగా ప్రపంచ ఒత్తిళ్లకు లొంగి పాకిస్థాన్ 1956 ఫిబ్రవరి 26న బెంగాలీని గుర్తించింది. ఈ వుద్యమం తదనంతరం స్వతంత్ర బంగ్లాదేశ్ పోరాటానికి దారితీసింది. అలా ప్రాణత్యాగంతో తమ తల్లి భాషను కాపాడుకున్న బెంగాలీల సంస్మరణ దినమైన ఫిబ్రవరి 21ని, 1999లో యునెస్కో మాతృ భాషా దినోత్సవంగా ప్రకటించింది.*

దాదాపు మిగతా రాష్ట్రాలన్నింటిలో అధికార భాషా సాహిత్యాల అభివృద్ధికి కనీసం ప్రత్యేక శాఖలు వుంటాయి. దానికి సంబంధించిన మంత్రులు వుంటారు. తెలుగు అభివృద్ధికి కూడా ఒక సాధికారక సంస్థను, ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని తెలుగు భాషోద్యమ సమాఖ్య, తెలుగు భాషాభిమానులు చేస్తున్న డిమాండ్‌ను, పాలకులు ఎన్నడూ చెవిన పెట్టిన పాపాన పోలేదు. కంటి తుడుపు కోసం అధికార భాషా సంఘాన్ని ఏర్పాటు చేసినా, అది కేవలం రాజకీయ పునరావాస కేంద్రంగా మారిందనే విమర్శలను ఎదుర్కొంది. మూడేళ్ల క్రితం అది కూడా మూలన పడింది. తెలుగు మహాసభలు జరుపుతామని ప్రకటించిన రెండు నెలల తర్వాత అధికార భాషా సంఘం కార్యాలయానికి తాళాలు తీసి, హడావుడిగా మండలి బుద్ధప్రసాద్ అధ్యక్షతన అధికార భాషా సంఘాన్ని ఏర్పాటు చేశారు.

ఏ జాతి ప్రజల భాష గురించి మాట్లాడుకోవాలన్నా, ఆ జాతి ప్రజలు తల్లి భాషలో చదువుకొనే హక్కు గురించి తప్పకుండా మాట్లాడుకోవాలి. ఏ భాష వునికి కొనసాగాలన్నా, అది మరింతగా అభివృద్ధి చెందాలన్నా ఆ భాషలో విద్యా బోధన అనేది ప్రాథమిక షరతుగా వుంటుంది. తల్లిభాషలో విద్యాబోధన అనేది కేవలం ఆ భాషను, ఆ జాతిని కాపాడుకోవడానికి మాత్రమే కాదు, సమాజ పురోగతిలో తల్లి భాషలో విద్యాబోధన అనేది కీలక పాత్ర వహిస్తుంది. ఇతర భాషల కంటే తల్లి భాషలో నేర్చుకోవడం ద్వారానే విద్యార్థులు, విజ్ఞానాన్ని ఎక్కువగా గ్రహించగలరనేది శాస్త్రీయంగా ఎన్నడో రుజువైన విషయం. పిల్లల మేధస్సు వికసించడంలో తల్లి భాషకు మొదటి ప్రాధాన్యత వుంటుంది. కేవలం విజ్ఞాన శాస్త్రాలను నేర్చుకోవడానికే కాదు, వివిధ భాషల్లో ప్రావీణ్యత సంపాయించడానికి కూడా, తల్లిభాషలో ప్రావీణ్యత తప్పనిసరి. తల్లి భాషలో ప్రావీణ్యత లేకుండా ఏ భాషలోనూ ప్రావీణ్యత సంపాయించలేరన్నది కూడా శాస్త్రీయంగా రుజువైన విషయమే. భావ వ్యక్తీకరణకు తల్లి భాషను మించిన సాధనం లేదు. కనుక గొప్ప సాహిత్యం పుట్టుక, తల్లి భాష ద్వారానే సాధ్యం. తల్లి భాషలో విద్యా బోధనకు ఇంత ప్రాముఖ్యత వుండడం వల్లనే, భారత రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు తల్లిభాషలోనే విద్యా బోధన జరగాలని నిర్దేశిస్తున్నాయి. తల్లిభాషలో విద్యను దేశమంతా అమలు చేయాలని 1966లో కొఠారీ కమిషన్ కూడా సూచించింది.

తెలుగు భాష గురించి ఇంతగా చర్చ జరుగుతున్న నేపథ్యంలో తెలుగు మాధ్యమంలో విద్యా బోధన గురించి తప్పక మాట్లాడుకోవాలి. క్రమంగా రాష్ట్రంలో విద్యా బోధనలో ఇంగ్లిష్ మాధ్యమం ప్రాధాన్యత పెరుగుతూ, దాదాపు నేడు కేవలం ఇంగ్లిష్ మాత్రమే బోధనా మాధ్యమంగా అవతరించింది. రోజు రోజుకూ ఇంగ్లిష్ ప్రాధాన్యత ఎందుకు పెరుగుతున్నది? ఇంగ్లిష్ ప్రపంచ భాషేమీ కాదు. ప్రపంచంలో అత్యధికులు మాట్లాడే భాష కూడా కాదు. మాట్లాడే వారి సంఖ్యను ప్రామాణికంగా తీసుకుంటే ప్రపంచంలో ఇంగ్లిష్‌కు మూడో స్థానమే దక్కుతుంది. వైజ్ఞానికంగా ఎంతో పురోగతి సాధించిన రష్యా, జపాన్, జర్మనీ, చైనా తదితర ఎన్నో దేశాలు ఇంగ్లిష్‌ను పట్టించుకోవడవే లేదు. పట్టించుకోకపోవడం వల్లనే వాళ్లా అభివృద్ధిని సాధించారని కూడా చెప్పవచ్చు. అంటే వాళ్లంతా తల్లి భాషలోనే సాంకేతిక విద్యను పొందడం వల్లనే అభివృద్ధిని సాధించారు. కనీస ఇంగ్లిష్ పరిజ్ఞానం కూడా లేకుండా ఎందరో శాస్త్రవేత్తలు, సాహిత్యకారులు, రాజకీయోద్యమ నాయకులు, పరిపాలకులు ప్రఖ్యాతి పొందారు. కాని రాష్ట్రంలో మాత్రం ఇంగ్లిష్ రాని వాళ్లను చదువు రాని వాళ్ల కిందనే జమకట్టే పరిస్థితి దాపురించింది.

ఒక రాష్ట్ర అధికార భాషగా గుర్తించిన తెలుగు మాధ్యమం పరిస్థితే ఇలా వుంటే, దేశంలో లిపి కూడా లేని ఎన్నో భాషలకు చెందిన ప్రజలకు, తల్లి భాషలో విద్యను పొందడమనేది ఎంత సుదూర స్వప్నమో!

ప్రపంచీకరణ నేపథ్యంలో ఒక్క తెలుగుకే కాదు, ఎన్నో భాషలకు ప్రమాదం ఏర్పడింది. మన దేశంలోనే కాదు అనేక వెనుకబడిన దేశాల్లో ఎన్నో భాషలు ప్రమాదంలో పడ్డాయి, అంతరించిపోయాయి కూడా. మన దేశంలోని అన్ని రంగాల పైన కొనసాగుతున్న సామ్రాజ్యవాద దాడి, ముఖ్యంగా అమెరికా సామ్రాజ్యవాద దాడి భాష మీద కూడా కొనసాగుతున్నది. భాషా సంస్కృతుల్లోని వైవిధ్యాన్ని ధ్వంసం చేస్తూ సామ్ర్యాజ్యవాదం దాని పెట్టుబడికి, మార్కెటుకు దోహదపడే భాషా, సంస్కృతులను రుద్దుతున్నది. అది నెలకొల్పాలని కలలుకంటున్న ఏక ధృవ ప్రపంచంలో ఒకే మార్కెట్, ఒకే సంస్కృతి, ఒకే భాష వుండేలా విధానాలను రూపొందిస్తున్నది. ఇంగ్లిష్ పాలన ఫలితంగా మొదలైన ఇంగ్లిష్ భాషా వ్యామోహం, దేశంపై నేడు అమెరికా పట్టు బిగుస్తున్న నేపథ్యంలో మరింత వెర్రితలలు

వేస్తున్నది. తెలుగు జాతి ఆత్మగౌరవం పేరుతో ముందుకు వచ్చిన తెలుగుదేశం పార్టీ పాలనలోనే, తెలుగు భాషకు తెగులు పట్టడం మొదలైంది. తాము అవలంబించే రాజకీయార్థిక విధానాల్లో, భాషా సంస్కృతులు కూడా ఒదిగే విధంగా పాలకుల చర్యలుంటాయి. సామ్రాజ్యవాద మార్కెట్‌కు దోహదపడని సామాజిక శాస్త్రాలనే రద్దు చేయాలనుకున్న పాలనలో, తెలుగు మనుగడకు హామీ ఏముంటుంది? ప్రైవేటీకరణలో భాగంగా, విద్యా వ్యవస్థను కార్పొరేట్ రంగం చేతుల్లో పెట్టడం మూలంగా, అరకొరగా వున్న సర్కారు బడులు కూడా మూతపడి తెలుగు మాధ్యమం మూలన పడింది. ప్రైవేట్ చదువంటే ఇంగ్లిష్ చదువే అయింది. ఆ చదువు సమాజ పురోగతికి వుపయోగపడేది కాకుండా, కొద్ది శాతం మందికి ఉన్నత అవకాశాలు కల్పించేదిగా మారింది. విద్య కేవలం ఉపాధి కోసమే అన్నట్టుగా రూపొందిన, మన విద్యా విధానం ఫలితంగా కూడా తెలుగు మాధ్యమం పట్ల అనాసక్తి పెరుగుతున్నది. ఉన్నత విద్యలు, సాంకేతిక విద్యలు తెలుగు మాధ్యమంలో వుండకపోవడం వల్ల కూడా, తమ పిల్లలను ప్రాథమిక విద్య నుండి, ఇంగ్లిష్ మీడియంలోనే చదివించాలని తల్లిదండ్రులు భావిస్తున్నారు. చివరికి తెలుగును మాధ్యమంగా కాకున్నా, ఒక భాషగా కూడా చాలా బళ్లలో లేకుండా చేసారు. బళ్లలో తెలుగు మాట్లాడడమే నేరంగా దాపురించింది. తెలుగు మాట్లాడితే జరిమానాలు విధించే స్థాయిని ఎప్పుడో దాటిపోయి, భౌతికంగా హింసించే స్థాయికి ఇంగ్లిష్ వ్యామోహం చేరుకొంది. చాలా మంది తెలుగు వారు తెలుగు మాట్లాడడాన్ని నామోషీగా భావిస్తున్నారు. మాతృభాషను కనీసం నేర్చుకోకుండా ఉన్నత విద్యా, వుపాధి అవకాశాలను పొందే అవకాశం ఒక్క మన ఆంధ్రప్రదేశ్‌లోనే వుంది. ఒక భాషకు సంబంధించిన 30 శాతం ప్రజలు, ఆ భాషను నేర్చుకోకుంటే, ఆ భాష చచ్చిపోతుందని ఒక సూత్రీకరణ. ఈ లెక్కన ఇదే పరిస్థితి కొనసాగితే, తెలుగు చచ్చిపోవడానికి ఎంతో కాలం పట్టదు.

తెలుగును కాపాడుకోవాలనే తపన, కేవలం కొద్ది శాతం భాషాభిమానులకే పరిమితం అయింది. మన పొరుగున వున్న తమిళులు, తమ భాషకు ప్రాచీన హోదా సాధించుకున్నప్పుడు మాత్రం, చాలా మంది తెలుగు వారికి తెలుగుకు కూడా రెండు వేల, మూడు వేల సంవత్సరాల చరిత్ర వున్నదని గుర్తుకు వచ్చింది. ఎట్టకేలకు 2008లో తెలుగుకు ప్రాచీన హోదా సాధించుకున్నారు. అయితే ఆ తర్వాత కూడా, విద్యా బోధనలో తెలుగు మాధ్యమం అమలు పట్ల గాని, పరిపాలన, శాసన, న్యాయ వ్యవస్థల్లో తెలుగు వినియోగం గురించి కాని, పెద్దగా వుద్యమాలు చేపట్టింది లేదు. ప్రజల్లో, ముఖ్యంగా యువతలో, తాము పెంచిన పాశ్చాత్య వ్యామోహం, ముఖ్యంగా అమెరికా వ్యామోహం మూలంగా, తెలుగును పక్కకు తోసేయడం పాలకులకు పెద్ద కష్టం కాలేదు.

మరి ఇలా తెలుగును చంపేస్తున్న పాలకులకు, తెలుగు సమాజానికి విలువైన సాంస్కృతిక సాహిత్యాన్ని అందించిన విరసం వంటి సంస్థలను నిషేధించిన, రచయితలను నిర్బంధించిన, హత్యలు కూడా చేసిన చరిత్ర వుంది. అందుకే ఇటువంటి పాలకులకు తెలుగు గురించి మాట్లాడే అర్హత లేదంటున్నది. అందుకే నిరసనలు వెల్లువెత్తింది. ఇంతటి నిరసనల మధ్య కూడా ఇప్పుడీ మహాసభలను ఎందుకు జరిపినట్లు? ఆ మహాసభల్లో తెలుగు భాషను కాపాడుకుందామని తెలుగు వాడు కాని గవర్నరూ, తెలుగురాని తెలుగు ముఖ్యమంత్రీ ఎందుకు పిలుపునిచ్చినట్టు? 2013ను తెలుగు భాషా సాంస్కృతిక వికాస సంవత్సరంగా రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు ప్రకటించినట్టు? ఇన్నాళ్లకైనా కండ్లు తెరిచారని ఎవ్వరూ అనుకోరు. ప్రపంచీకరణకు దాసోహం అనే పాలకులు ఎవరూ స్థానిక భాషలను, సంస్కృతిని కాపాడలేరు. కాపాడాలని కూడా అనుకోరు. అందుకే ప్రభుత్వం ప్రపంచ తెలుగు మహాసభలను తలపెట్టగానే, ఇందులోని కుట్రను చాలా మంది స్పష్టంగానే అర్థం చేసుకున్నారు.

ఎమర్జెన్సీకి రెండు నెలలు ముందుగా 1975 ఏప్రిల్లో మొదటి ప్రపంచ తెలుగు మహాసభలు హైదరాబాద్‌లో జరిగాయి. ఆ కాలమంతా ఆంధ్రప్రదేశ్‌లో పోరాటాలు ఉవ్వెత్తున ఎగిసిన కాలం. ప్రత్యేక తెలంగాణ వుద్యమం, శ్రీకాకుళ పోరాటం అందులో ముఖ్యమైనవి. అన్ని పోరాటాలను రక్తపుటేరుల్లో ముంచిన వెంగళరావు ముఖ్యమంత్రిగా వున్న సమయంలో ఆయన నేతృత్వంలోనే ఇవి జరిగాయి. ఆనాటి నిర్బంధానికి నిరసనగా విప్లవ రచయితలు, ప్రజాస్వామికవాదులు, విద్యార్థులు ఆ సభలను బహిష్కరించారు. ఆ సందర్భంగా ప్రఖ్యాత రచయిత శ్రీశ్రీ అరెస్టు కూడా అయ్యారు. ఆ తర్వాత 1981లో మలేసియాలోనూ, 1990లో మారిషస్‌లోనూ రెండవ, మూడవ మహాసభలు జరిగాయి. 22 ఏండ్ల తర్వాత ఇప్పుడు పాలకులకు తెలుగు మహాసభలు గుర్తుకు రావడం యాధృచ్ఛికమని భావించలేం.

గత మూడేళ్లకు పైగా తెలంగాణలో ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రజలు పోరాడుతున్నారు. వెయ్యి మందికి పైగా యువత ఆత్మాహుతికి పాల్పడ్డారు. అయినప్పటికీ ఏ మాత్రం చలించని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయకుండా ఆ పోరాటాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాయి. ఒక ప్రాంతానికి చెందిన తెలుగు జాతి ప్రజలు, తమ అస్తిత్వం కోసం, ఆత్మ గౌరవం కోసం పోరాడుతుంటే, ఆత్మ త్యాగాలు చేస్తుంటే, ఆ ప్రాంతమంతా కాష్టాల గడ్డలా మండుతుంటే పండుగలు, జాతరలు జరపడం దుర్మార్గం. ఆ పోరాటాన్ని, త్యాగాలను అవహేళన చేయడం కూడా. తెలంగాణ ప్రజలు విడిపోతామంటుంటే, ప్రపంచవ్యాప్తంగా వున్న తెలుగు ప్రజల మధ్య భావ సమైక్యత ఎలా సాధ్యం? ఈనాడు తెలుగు జాతి, తెలుగు భాష అని మాట్లాడుతున్న పెద్దలు నిజానికి తెలంగాణ ప్రజలను ఏనాడు తమ జాతి సోదరులుగా చూడలేదు. వాళ్ల వనరులను ఇష్టమొచ్చినట్టుగా దోచుకున్నారు. అడుగడుగునా వివక్ష చూపారు. ఇక తెలంగాణ భాషను తెలుగే కాదన్నారు. సినిమాల్లో విలన్ల చేత మాట్లాడించి తెలంగాణ భాషను, యాసను వెక్కిరిస్తున్నారు. ఈ తెలుగు మహాసభల్లో సైతం తెలంగాణ భాష, సంస్కృతి, సంప్రదాయాల ఊసే లేకుండా పోయింది. రాయలసీమ, వుత్తరాంధ్ర భాష, సంస్కృతులు కూడా ఈ సభల్లో వివక్షకు గురయ్యాయి. ఇలా ఒకవైపు సమైక్యత అంటూనే మరోవైపు

వేర్పాటువాదాన్ని చాటుకున్నారు. ఈ వివక్ష, అన్యాయం, అవమానాలూ, అవహేళనను సహించలేని తెలంగాణ ప్రజలు విడిపోతామంటుంటే తెలుగు జాతి ఒక్కటే అంటూ, భావ సమైక్యత అంటూ పండుగలు చేయడం కుట్రపూరితం. ప్రజల్లో భావోద్రేకాలను రెచ్చగొట్టడం కూడా. తెలంగాణకు తలపెడుతున్న అన్యాయం తెలంగాణ సాహిత్యానికి కూడా వర్తిస్తుంది. పాల్కురికి సోమన ఆదికవి అని చెప్పడానికి చారిత్రక ఆధారాలున్నప్పటికీ, నన్నయనే ఆదికవిగా కొలుస్తున్నారు. బమ్మెర పోతన తెలంగాణ వాడు కాదని తప్పుడు వాదనలు చేస్తున్నారు. తెలంగాణ భాషలో రాసే రచయితలకు తెలుగులో రాయమని సలహాలు ఇస్తున్నారు. ప్రామాణిక భాష పేరుతో తమపై కొనసాగుతున్న భాషాధిపత్యాన్ని, వివక్షను సహించలేని తెలంగాణవాదులు తెలంగాణ భాష వేరు, తెలుగు భాష వేరు అనేంత వరకూ పోయారు. తెలుగు భాషను కాపాడుకుందాం అని నేడు పాలకులైనా, పాలక వర్గాలకు సేవ చేసే భాషా, సాహిత్యవేత్తలైనా అంటున్నది సమైక్యత వల్లనే తెలుగు భాషను కాపాడుకోగలమని ఉపదేశించడానికే. అలా భాషాభిమానులను, సాహిత్యకారులను సమైక్యాంధ్ర వైపుకు తిప్పుకోడానికే. ఇటువంటి కుహనా భాషాప్రియుల, భాషావేత్తల కుట్రలను నిజమైన తెలుగు భాషామానులు గ్రహించాలి. అంతేకాదు రెండు తెలుగు రాష్ట్రాలున్నంత మాత్రాన తెలుగుకు వచ్చే నష్టం ఏమీ లేదని, అంతేకాదు రెండున్నర జిల్లాల భాషాధిపత్యం క్రమంగా అంతరించి, తెలుగు భాష మరింత వైవిధ్యాన్ని, జవసత్వాలను సంతరించుకుంటుందనే స్పష్టమైన అవగాహనను కూడా కలిగి వుండాలి.

ప్రామాణిక భాష పేరిట క్రిష్ణా, గోదావరి జిల్లాల భాష కేవలం తెలంగాణ భాష మీదనే ఆధిపత్యం చేయడం లేదు. అది తెలంగాణతో పాటు మిగతా అన్ని జిల్లాల భాష మీద ఆధిపత్యం చెలాయిస్తున్నది. తెలుగు భాష అనేక మాండలికాలతో, నుడికారాలతో వైవిధ్యభరితంగా వుంటుంది. ఆ మాటకొస్తే ఏ భాషైనా వైవిధ్యభరితంగానే వుంటుంది. ప్రాంతాన్ని బట్టి చూస్తే కొన్ని గ్రామాల పరిధి దాటితే యాస మారిపోతుంది. వర్గం, కులం, మతం, లింగం, అక్షరాస్యత తదితర అంశాలన్నీ భాషను వైవిధ్యభరితం చేస్తాయి. కాబట్టి నేడు తెలుగును కాపాడుకోవడం అనే పిలుపును భాషలోని వైవిధ్యాన్ని ధ్వంసం చేయడంగా కూడా అర్థం చేసుకోవాల్సి వస్తుంది. ఈ మహాసభల్లో దళిత, వెనుకబడిన తరగతుల, మైనారిటీ రచయితల పట్ల చూపిన వివక్ష ద్వారా కూడా ఆ సెక్షన్ల భాషల పట్ల పాలకులు తీసుకుంటున్న వైఖరిని అర్థం చేసుకోవచ్చు. అంతేకాదు తెలుగు భాష, సంస్కృతులను పరిరక్షించుకోవడం పేరుతో కాలం చెల్లిన సంస్కృత భాషకు, కాలం చెల్లిన ప్రజా వ్యతిరేక సంస్కృతికి పట్టం కట్టే ప్రమాదం కూడా వుంది. రాష్ట్రపతి, గవర్నర్, ముఖ్యమంత్రి జరీ అంచు ధోతులు కట్టుకొని సంస్కృత బ్రాహ్మణుల వలె ఈ సభలకు రావడాన్ని ఈ నేపథ్యంలో అర్థం చేసుకోవచ్చు. కాబట్టి తెలుగును కాపాడుకోవడం అంటే అన్ని ప్రాంతాల, కులాల, ముఖ్యంగా అట్టడుగు కులాల భాషను, యాసను కాపాడుకోవడం, తెలుగులోని సంస్కృత వాసనలను కడిగెయ్యడం అనే స్పష్టతను కూడా నిజమైన భాషాభిమానులు కలిగి వుండాలి. తెలుగును కాపాడుకోవడం పేరిట రాష్ట్రంలో తెలుగు తర్వాత మెజారిటీ ప్రజలు మాట్లాడే ఉర్దూ భాషపై, ఇంకా ఎన్నో ఆదివాసీ తెగల భాష, యాసలపై ఆధిపత్యం చెలాయించే కుట్ర కూడా పాలకవర్గాలకు వుంటుంది. ఇది చాలా వైవిధ్య పూరితంగా వుంటుంది. ఒకవైపు పాలకులు తెలుగును నిర్లక్ష్యం చేస్తూ, దాన్ని దింపుడుకల్లం దాకా తీసుకుపోయారు. మరోవైపు అదే తెలుగును ఆయుధంగా చేసుకొని తెలంగాణ సహా ఇతర మైనారిటీ, ఆదివాసీ, అట్టడుగు ప్రజల భాషలపై ఆధిపత్యం చెలాయిస్తున్నారు. ఇవ్వాళ తెలుగు తెలుగని మొత్తుకుంటున్న పాలకులకు నిజంగా తెలుగు మీద ఏ అభిమానం వుండదు. తమ దోపిడీ ప్రయోజనాలను నెరవేర్చుకోవడానికి ప్రస్తుతం అది తెలుగును సాధనంగా ఎంచుకొంది.

నేడు దేశమంతా ప్రభుత్వం తలపెట్టిన గ్రీన్‌హంట్ ఆపరేషన్‌తో అతలాకుతలం అవుతున్నది. ఆంధ్రప్రదేశ్‌లోనూ అందుకు భిన్నమైన పరిస్థితి ఏమీ లేదు. ఒకవైపు ప్రజలతో యుద్ధం చేస్తూ మరోవైపు వాళ్ల భాషా సంస్కృతులను కాపాడుతానని చెప్పడం క్రూరమైన జోక్. రాష్ట్ర ప్రజలు తమ సమస్యల సాధన కోసం, తమ హక్కులను కాపాడుకోవడం కోసం పోరాడుతున్నారు. సెజ్‌లు, ప్రాజెక్టులు, విశాలమైన రోడ్ల పేరిట తమ వనరులను, భూములను, ఉపాధిని దోచుకుంటున్న సామ్రాజ్యవాదులకు, బహుళ జాతి సంస్థలకు, వాటికి తొత్తులుగా మారిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా, అనేక పోరాటాలు కొనసాగుతున్నాయి. సామ్రాజ్యవాద ప్రయోజనాల కోసం ప్రజలను నిర్వాసితులను చేయడమంటే వాళ్ల అస్తిత్వం, వుపాధితో పాటు వాళ్ల భాష, సంస్కృతులను కూడా ధ్వంసం చేయడం. కాబట్టి సెజ్ తదితర 'అభివృద్ధి'కి వ్యతిరేకంగా ప్రజలు చేస్తున్న పోరాటాలు విస్తృతార్థంలో భాషా, సంస్కృతులను కాపాడుకోవడానికి కూడా. భాషా, సంస్కృతులను కాపాడుతామని పోజు పెడుతున్న పాలకులు, ఈ పోరాటాలకు ఒకవైపు అణచివేతతో జవాబు చెబుతూ, మరోవైపు ఈ పోరాటాల నుండి, సమస్యల నుండి దృష్టి మళ్లించడానికి తెలుగు మహాసభలను ముందుకు తెచ్చారు.

పోరాటాల నుండి దృష్టి మళ్లించడమే కాదు. సన్మానాలు, బిరుదుల పేరుతో మేధావులు, రచయితలు, కళాకారులను బుట్టలో వేసుకొని, అణచివేతతో పాటు, తాము అవలంబిస్తున్న అన్ని రకాల ప్రజా వ్యతిరేక విధానాలకు అసమ్మతి లేకుండా చేసుకోవాలనే కుట్ర కూడా వుందీ సభల వెనుక.

అందుకే అనేక మంది, ముఖ్యంగా తెలంగాణవాదులంతా నిరసించినప్పటికీ, బహిష్కరించినప్పటికీ పాలకులు అప్రజాస్వామికంగా, నిస్సిగ్గుగా తెలుగు మహాసభలను జరిపారు. విప్లవ కవి శ్రీశ్రీని అరెస్టు చేసి, మొదటి మహాసభలు జరుపుకుంటే, వరవరరావు, చలసాని ప్రసాద్ సహా ఎందరో విప్లవ రచయితలను అరెస్టు చేసి ప్రభుత్వం ఈ సభలను జరుపుకుంది. అయినప్పటికీ

# ఎన్నికల ఎత్తుగడల్లో భాగంగా అమలవుతున్న ఉరిశిక్షలు!

ముందుగా ఎటువంటి ప్రకటన చేయకుండా అకస్మాత్తుగా ఫిబ్రవరి 9న అఫ్జల్ గురును భారత ప్రభుత్వం ఉరితీసింది. వామపక్షాలు సహా మన దేశంలోని అన్ని బూర్జువా రాజకీయ పార్టీలు, అన్ని రకాల ప్రచార, ప్రసార మాధ్యమాలు ఈ ఉరిశిక్ష పట్ల ఎనలేని సంతోషాన్ని వ్యక్తం చేసాయి. రాజకీయ పార్టీలే కాకుండా సంఘంలో ప్రముఖులుగా గుర్తింపు వున్న వాళ్లనేకులు తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తూ దృశ్య, శ్రవణ, ప్రచురణ మాధ్యమాల్లోనే కాకుండా ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటి సోషల్ నెట్ వర్క్ మాధ్యమాల ద్వారా తమ సంతోషాన్ని పంచుకున్నారు. అయితే మన దేశంలోని కొన్ని సంఘాలు, కొందరు ప్రముఖులు మాత్రం ఈ ఉరిశిక్షను ఖండించారు. దీన్ని ప్రభుత్వం చేసిన హత్య అన్నారు. అసలు మరణశిక్షనే వ్యతిరేకించడం అనే ప్రాతిపదికపై ఖండించిన వాళ్లు కొందరైతే, అఫ్జల్ గురు నిర్దోషి అని భావించడం వల్ల కూడా ఖండించిన వాళ్లు మరికొందరు. ఈ ఖండనలు చాలా చిన్న స్థాయిలో నిరసన ప్రదర్శనలకు, రచనలకు పరిమితమయ్యాయి. అఫ్జల్ పుట్టిన గడ్డ కశ్మీర్ మాత్రం మరోసారి భగ్గుమంది. పాకిస్థాన్ ఈ ఉరిశిక్షను ఖండించడమే కాక, పాకిస్థాన్ పార్లమెంట్ దీనికి వ్యతిరేకంగా తీర్మానం కూడా చేసింది. యూరోపియన్ యూనియన్ కూడా ఈ ఉరిశిక్షపై విచారం వ్యక్తం చేసింది.

అఫ్జల్ ఉరితీత కంటే కొద్ది నెలల ముందు, నవంబర్ 21న కసబ్‌ను కూడా ఉరితీసారు. కనీసం మరణశిక్షను వ్యతిరేకించే కోణంలోనైనా ఈ ఉరిని ఖండించిన వాళ్లు చాలా తక్కువ. 2008 నవంబర్‌లో ముంబాయిలోని పలు ప్రాంతాల్లో జరిగిన దాడులలో 164 మంది చనిపోయారు. 300 మందికి పైగా గాయపడ్డారు. పాకిస్థాన్ ప్రేరేపిత తీవ్రవాదులే ఈ దాడికి పాల్పడ్డారని మన దేశం ఆరోపిస్తే, పాకిస్థాన్ మాత్రం ఈ దాడితో తనకు సంబంధం లేదని ప్రకటించింది. దాడికి పాల్పడిన వారందరూ ఆ సమయంలో పోలీసులతో, ప్రభుత్వ బలగాలతో జరిగిన ఎన్‌కౌంటర్లో మరణించగా, పాకిస్థాన్ పౌరుడైన కసబ్ మాత్రం ప్రాణాలతో పట్టుబడ్డాడు. ఆ తర్వాత కసబ్‌పై కోర్టుల్లో విచారణ తంతును చేపట్టి 2010 మేలో మరణశిక్ష విధించారు. పై కోర్టుకు అప్పీళ్లు చేసుకున్నా, రాష్ట్రపతిని క్షమాభిక్ష వేడుకున్నా కసబ్‌కు మరణ శిక్ష తప్పలేదు. అంతమంది అమాయకుల మరణాలకు కారణమైన దాడుల్లో, భాగస్వామి అయిన కసబ్‌పై సానుభూతి చూపించడం సాధారణ విషయం కాదు. కాబట్టి అమలుకు ముందు మరణశిక్షను రద్దుచేయాలన్న వాళ్లు గాని, అమలు తర్వాత ఖండించిన వాళ్లు గాని పెద్దగా లేరు.

కసబ్ వలె అఫ్జల్ గురు 'నేరస్తుడు' కాదని మన దేశంలోని ప్రగతిశీలురు, ప్రజాస్వామికవాదులు గట్టిగా వాదిస్తున్నారు. కశ్మీర్ ప్రజలు అతడిని అమరుడుగా కీర్తిస్తున్నారు.

ఎన్డీయే ప్రభుత్వ హయాంలో 2001 డిసెంబర్ 13న చలికాలం సమావేశాలు జరుగుతున్న సమయంలో పార్లమెంట్‌పై దాడి జరిగింది. ఉదయం పదకొండున్నర గంటల సమయంలో ఐదుగురు సాయుధులు నిండా ఆయుధాలు, పేలుడు సామాగ్రి వున్నాయని

---

తిరుపతికి వెళ్లిన కొంతమంది విప్లవ రచయితలు అక్కడ తెలుగు తల్లి విగ్రహం దగ్గర నిరసన కార్యక్రమాలు చేపట్టారు.

ఇంతా చేస్తే ఈ సభల్లో తెలుగును కాపాడడానికి తీసుకున్న చర్యలేమీ పెద్దగా లేవు. తెలుగును కాపాడుకోవాలంటే బోధనా మాధ్యమంగా దాన్ని చేపట్టాలనే ప్రాథమిక విషయాన్ని ఎవరూ పట్టించుకోలేదు. అయితే తెలుగును ఒక భాషగా బోధించాలనే నిర్ణయం మాత్రం ప్రభుత్వం తీసుకుంది. అయితే ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం కేవలం సర్కార్ బడులకే వర్తిస్తుంది. ప్రస్తుతం 70 శాతం బళ్లు ప్రైవేటు రంగంలోనే వున్నాయి. ఇవి ప్రభుత్వ వుత్తర్వులను లెక్కచేయవు. ఇవేకాక కేంద్రీయ విద్యాలయాలు, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ వంటి కేంద్రీయ బోర్డు కింద పని చేసే బళ్లు రాష్ట్రంలో మూడు వేల పైనే వున్నాయి. వీటికి రాష్ట్ర ప్రభుత్వ వుత్తర్వులు వర్తించవు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన నిర్ణయం తెలుగును బతికిస్తుందని ఆశిస్తే ఎవరికైనా నిరాశే మిగులుతుంది.


అసలు భాషా, సంస్కృతులను పాలకులు కాపాడుతారని ఆశించడమే తప్పు. భాషా, సంస్కృతులు ప్రజలవి. ప్రజలు మాత్రమే వాటిని కాపాడుకోవాలి. పాలకులు వాటి మీద పెత్తనం చేస్తారు. వాటిని ఆయుధాలుగా చేసుకుంటారు.

ఏదేమైనా ఈ సభల నేపథ్యంలో, అంతరించిపోబోయే తెలుగు భాష గురించి విస్తృత చర్చ జరిగింది. మరెన్నో ఇతర భాష, యాసల గురించి చర్చ జరిగింది. తెలుగు సహా ఇతర భాషలను, యాసలను కాపాడుకోవాలనే, ఒక ప్రజాస్వామిక ఆకాంక్ష బలంగా ముందుకు వచ్చింది. అయితే ఏ భాషనైనా కాపాడుకోవడం, అందుకోసం చేసే పోరాటం అనేది ఒక విడి అంశంగా వుండదు. పాలకుల రాజకీయ, ఆర్థిక విధానాలకు లోబడే భాషా, సాంస్కృతిక విధానాలు కూడా వుంటాయి. ఏ భాషా, సంస్కృతులైనా వునికిలో వుండాలంటే, మరింతగా వికాసం చెందాలంటే, ఆ సమాజం తప్పనిసరిగా ప్రజాస్వామికంగా వుండి తీరాలి. కాబట్టి భాషా, సంస్కృతులను కాపాడుకోవడం కోసం చేసే పోరాటం, తప్పనిసరిగా ఆ భాషా సంస్కృతులను కబళిస్తున్న రాజకీయ, ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా ఎక్కుపెట్టేదిగా వుండాలి. దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయడం ద్వారానే అంతరించిపోతున్న జాతులను, భాషలను, యాసలను, సంస్కృతులను కాపాడుకోగలం. దేశంలోని అన్ని భాషలను, యాసలను కాపాడుకోవాలని నేడు జరుగుతున్న చర్చకు ఈ అవగాహనను జోడించినప్పుడే ఫలితం వుంటుంది.

★

చెబుతున్న తెల్లరంగు అంబాసిడర్ కారులో పార్లమెంట్ ఆవరణలోకి దూసుకు పోయారు. పార్లమెంటు భద్రత కోసం అక్కడున్న ప్రభుత్వ సాయుధ బలగాలు, ఆ కారును అడ్డుకోగా అందులో వున్న వారందరూ దిగి, ఆయుధాలతో విచక్షణా రహితంగా కాల్పులు జరిపారు. ప్రభుత్వ బలగాలు కూడా ఎదురు కాల్పులు జరిపాయి. ఇరుపక్షాల నడుమ జరిగిన కాల్పుల్లో ఎనిమిది మంది పార్లమెంట్ భద్రతా సిబ్బంది, ఒక పౌరుడితో పాటు ఆ దాడికి పాల్పడ్డ ఐదుగురూ – మహమ్మద్, రాణా, రజా, హమ్‌జా, హైదర్ – చనిపోయారని ప్రభుత్వం ప్రకటించింది. డిసెంబర్ 14న, ఈ దాడితో సంబంధం వుందంటూ, అఫ్జల్‌గురును కశ్మీర్ రాజధాని శ్రీనగర్‌లో అరెస్టు చేశారు. ఆ తర్వాత, ఇదే ఘటనతో సంబంధం వుందంటూ, ఢిల్లీ యూనివర్సిటీ పరిధిలోని జాకీర్ హుస్సేన్ కళాశాలకు చెందిన ప్రొఫెసర్ ఎస్ఏఆర్ గిలానీని అరెస్టు చేసారు. వీరితో పాటు షౌకత్ హుస్సేన్ గురు, అఫ్సాన్ గురు అనే భార్యా భర్తలను అరెస్టు చేసి, ఈ నలుగురిపై పార్లమెంటుపై దాడితో సంబంధం వుందనే అభియోగాలు మోపారు. 2002 డిసెంబర్‌లో అఫ్జల్, గిలానీ, షౌకత్‌లకు ఉరిశిక్ష విధిస్తూ ట్రయల్ కోర్టు తీర్పు చెప్పింది. అఫ్సాన్ మాత్రం నిర్దోషిగా విడుదలైంది. ఆ తర్వాత గిలానీ, షౌకత్‌లపై హైకోర్టులో కేసులు కొట్టివేయడంతో వాళ్లు విడుదలయ్యారు. కాని అఫ్జల్‌కు విధించిన ఉరిశిక్షను మాత్రం హైకోర్టు, సుప్రీం కోర్టులు కూడా ధృవీకరించడంతో, అఫ్జల్ భార్య తబస్సుమ్, 2006లో అప్పటి రాష్ట్రపతి అబ్దుల్ కలాంకు క్షమాభిక్ష పిటిషన్ దాఖలు చేసింది. ఆ పిటిషన్ దాదాపు ఆరేళ్లకు పైగా పెండింగ్‌లోనే వుండి, ఇద్దరు రాష్ట్రపతులు మారి, ప్రణబ్ ముఖర్జీ చేత తిరస్కరించబడడంతో అఫ్జల్ గురును ఉరితీశారు.

1970 ప్రాంతంలో, కశ్మీర్‌లోని బారాముల్లా జిల్లాలో వున్న సోపోర్ పట్టణ సమీపంలోని అబ్గా గ్రామంలో ఓ సాధారణ కుటుంబంలో అఫ్జల్ పుట్టాడు. సోపోర్‌లో హయ్యర్ సెకండరీ విద్యను పూర్తి చేసి, డాక్టర్ కావాలనే ఆశయంతో జీలమ్ మెడికల్ కాలేజీలో చేరాడు. అయితే అప్పటికి కశ్మీర్‌లో నెలకొని వున్న పరిస్థితి, ఎందరో యువతరం వలెనే అతన్ని కూడా వుద్యమ బాట పట్టించింది. అఫ్జల్ 1990లో జమ్మూ కశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ (జేకేఎల్ఎఫ్)లో చేరి, వాస్తవాధీన రేఖ దాటి పాకిస్థాన్ అధీనంలో వున్న కశ్మీర్‌కు వెళ్లాడు. అయితే తక్కువ కాలంలోనే పాకిస్థాన్‌పై భ్రమలు కోల్పోయి తిరిగి వచ్చి బార్డర్ సెక్యూరిటీ ఫోర్స్‌కు లొంగిపోయాడు. లొంగిపోయిన మిలిటెంట్ అనే సర్టిఫికెట్ కూడా పొందాడు. ఆ తర్వాత ఢిల్లీ వెళ్లిపోయాడు. 1990–96 మధ్య కాలంలో ఢిల్లీ యూనివర్సిటీలో చదువుకుంటూ వేరు వేరు కోచింగ్ సెంటర్లలో, ఇండ్లల్లో ట్యూషన్లు చెప్పేవాడు. అయితే కశ్మీర్‌లోనే బతకాలని నిర్ణయించుకొని 1997లో తిరిగి వచ్చాడు. కశ్మీర్‌లో లొంగిపోయిన మిలిటెంట్లకు ఏ వుద్యోగాలు ఇవ్వరు. వాళ్లు స్పెషల్ పోలీస్ ఆఫీసర్లు (ఎస్పీవో)గానో, పోలీసు ఇన్ఫార్మర్లుగానో బతకాల్సి వుంటుంది. లేదా స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్టీఎఫ్)లో చేరాల్సి వుంటుంది. ఈ నేపథ్యంలో అఫ్జల్ కమీషన్ పద్ధతి మీద మందులు, వైద్య పరికరాలు



అమ్మే వ్యాపారం మొదలు పెట్టాడు. ఆ తర్వాతి సంవత్సరం తబస్సుమ్‌తో అతనికి పెళ్లయింది. కానీ కశ్మీర్ తిరిగి వచ్చినప్పటి నుండి అతనికి ఎస్పీవోలతోనూ, ఎస్టీఎఫ్‌తోనూ వేధింపులు మొదలయ్యాయి. ఎస్పీవోలు తరచూ అఫ్జల్ దగ్గర డబ్బులు గుంజుకు పోయేవారు. భారత ప్రభుత్వ సాయుధ బలగాలకు చెందినవారు, ఎప్పుడంటే అప్పుడు తమ క్యాంపులకు తీసుకుపోయి, ఆయనను చిత్రహింసలు పెట్టేవారు. మంచుగడ్డలాంటి చల్లటి నీళ్లలో పడేయడం, పెట్రోల్‌లో ముంచి తీయడం, మిరపకాయల కుప్పల్లో పొగబెట్టి వదిలేయడం, రహస్య అంగాలకు కరెంట్ షాకులు ఇవ్వడం, మరుగు దొడ్లు శుభ్రం చేయించడం, క్యాంపులు ఊడిపించడం వంటి ఎన్నో రకాల దారుణమైన చిత్రహింసలకు గురిచేసి ఆ తర్వాత డబ్బులు రాబట్టుకొని వదిలేసేవాళ్లు. ఇది ఒక్క అఫ్జల్ పరిస్థితే కాదు. కశ్మీర్‌లో లొంగిపోయిన ప్రతి మిలిటెంట్ పరిస్థితీ ఇదే.

ఒకసారి అఫ్జల్‌ను ఎస్టీఎఫ్ వాళ్లు పట్టుకొని హమ్హమా క్యాంపుకు తీసుకుపోయారు. అక్కడ డీఎస్పీ వినయ్ గుప్తా ఆయనను చిత్రహింసలు పెట్టాడు. కరెంటు షాక్ ఇచ్చాడు. మంచుగడ్డలాంటి చల్లటి నీళ్లలో పడేశాడు. పెట్రోల్, మిరపకాయ లాంటి అన్ని చిత్రహింసా సాధనాలు వాడాడు. తన దగ్గర ఆయుధాలున్నాయని

ఒప్పుకొమ్మని నిర్బంధించాడు. అక్కడ నుండి హమ్‌హమా క్యాంపుకు తీసుకుపోయారు. అక్కడ డీఎస్పీ ద్రవీందర్ సింగ్ చిత్రహింసలు పెట్టాడు. లక్ష రూపాయలు ఇస్తే వదిలేస్తామనీ లేకుంటే చంపేస్తామనీ బెదిరించారు. భార్య ఒంటి మీద వున్న నగలన్నీ అమ్మితే 80 వేలు వచ్చాయి. వాటితో పాటు, అఫ్జల్ రెండు మూడు నెలల క్రితమే కొనుక్కున్న స్కూటర్‌ను కూడా గుంజుకొని, జీవచ్ఛవంలా మారిన అఫ్జల్‌ను వదిలేసారు. ఆ హమ్‌హమా క్యాంపులోనే అఫ్జల్, తారిఖ్ అనే మరొక బాధితుడిని చూసాడు. తారిఖ్ అఫ్జల్‌తో ఎస్టీఎఫ్ వాళ్లు చెప్పినట్టు వినాలనీ, లేకుంటే ఎప్పటికీ ఇలాగే వేధిస్తారనీ, ఎప్పటికీ సాధారణ జీవితం గడపనీయరని చెప్పాడు. అప్పటి నుండి అఫ్జల్ ఎస్టీఎఫ్ వాళ్లు చెప్పినట్లు వినాలనుకున్నాడు. కశ్మీర్‌లో బతకాలంటే అతనికి అంతకు మించి మరో మార్గం లేకుండా పోయింది.

కొద్ది రోజులకు హమ్‌హమా క్యాంపు డీఎస్పీ ద్రవీందర్ సింగ్ అఫ్జల్‌ను పిలిపించి ఒక పని అప్పజెప్పాడు. ఢిల్లీ అఫ్జల్‌కు బాగా తెలుసు కనుక, ఒక మనిషిని ఢిల్లీ తీసుకుపోయి, ఒక ఇల్లు కిరాయికి కుదిర్చి పెట్టాలని ఆదేశించాడు. గత్యంతరం లేని అఫ్జల్, డీఎస్పీ పరిచయం చేసిన మహమ్మద్ అనే వ్యక్తిని ఢిల్లీకి తీసుకుపోయి, ఇల్లు చూసి పెట్టాడు. డీఎస్పీ ఆదేశం మేరకు, అఫ్జల్ కూడా అక్కడే వున్నాడు. మహమ్మద్ కశ్మీరీ మాట్లాడకపోయేవాడు కనుక అతను కశ్మీరీ కాదని అఫ్జల్ అర్థం చేసుకున్నాడు. మహమ్మద్ కారు కొనుక్కోవడానికి అఫ్జల్ సాయపడ్డాడు. మహమ్మద్ ఢిల్లీలో చాలా మందిని కలుస్తుండే వాడు. మహమ్మద్‌కూ, అఫ్జల్‌కూ తరచూ ద్రవీందర్ సింగ్ ఫోన్ చేసేవాడు. ఒకరోజు మహమ్మద్, అఫ్జల్‌తో 'ఇక నువ్వు కశ్మీర్ వెళ్లిపోవచ్చు' అని చెప్పాడు. ఇది 'నా కానుక' అంటూ 35 వేల రూపాయలు అఫ్జల్‌కు ఇచ్చాడు. అప్పటికే భార్యా, నాలుగేళ్ల కొడుకుతో పాటు తానిక ఢిల్లీలోనే వుండాలని నిర్ణయించుకున్న అఫ్జల్, ఒక గది కిరాయికి తీసుకొని కశ్మీరుకు ప్రయాణం అయ్యాడు. అతను కశ్మీర్‌లో అడుగుపెట్టి సోపోర్ పోవడానికి శ్రీనగర్ బస్టాండ్‌లో వుండగానే, డిసెంబర్ 14న (పార్లమెంట్‌పై దాడి జరిగిన తర్వాతి రోజు) పోలీసులు అతన్ని అరెస్టు చేసారు. ఎస్టీఎఫ్ ప్రధాన కార్యాలయానికి తీసుకుపోయి కొట్టారు. అతని జేబులోని 35 వేల రూపాయలు గుంజుకున్నారు. ఆ తర్వాత ఢిల్లీ తీసుకుపోయి అక్కడ స్పెషల్ పోలీస్ టార్చర్ సెల్‌లో పెట్టారు. అక్కడ అఫ్జల్ తనకు తెల్సిన అన్ని వివరాలు చెప్పాడు. మహమ్మద్ గురించీ చెప్పాడు. కానీ పోలీసులు తను, తనతో పాటు తన బంధువు అయిన షౌకత్, అఫ్షాన్, గిలానీలు పార్లమెంట్ దాడి వెనుక వున్నారని ఒప్పుకోమని బెదిరించారు. ఒప్పుకోకుంటే తన కుటుంబానికి హాని చేస్తామని బెదిరించారు. అప్పటికే అఫ్జల్ తమ్ముడు హిలాల్ అహ్మద్ గురు ఎస్టీఎఫ్ కస్టడీలోనే వున్నాడన్న విషయం పోలీసులే అఫ్జల్‌కు తెలియజేశారు. తాము చెప్పినట్టు వింటే కేసును బలహీనం చేస్తామని, కొంత కాలం తర్వాత విడుదల కావొచ్చని చెప్పారు. తన కుటుంబాన్ని కాపాడుకోవాలంటే పోలీసుల మాట వినక తప్పని పరిస్థితి. అయితే పోలీసులు ఎంత బలవంతపెట్టినా షౌకత్, అఫ్షాన్, గిలానీలకు సంబంధం వుందని అఫ్జల్ ఒప్పుకోలేదు. గిలానీకి సంబంధం లేదనే విషయం చెప్పొద్దన్నారు. పోలీసులు అతన్ని చిత్రహింసలు పెట్టారు. నోట్లో మూత్రం పోసారు. అతనితో దాదాపు మూడు వందల తెల్లకాయితాలపై సంతకాలు పెట్టించుకున్నారు. మీడియా ముందు తను చేయాల్సిన ఒప్పుకోలు ప్రకటనను అనేక సార్లు రిహార్సల్ చేయించారు. అట్లా అఫ్జల్‌ను తమ కస్టడీలోకి తీసుకున్న కొద్దిరోజుల తర్వాత చేతులకు బేడీలతోనే పోలీసులు అతన్ని మీడియా ముందు హాజరుపరిచారు. పోలీసులు రిహార్సల్ చేయించినట్టుగానే అఫ్జల్ చెప్పాడు. అయితే దాడిలో గిలానీ పాత్ర ఏమిటని ఒక విలేకరి అడిగిన ప్రశ్నకు, గిలానీకి ఎటువంటి సంబంధం లేదని చెప్పాడు. అఫ్జల్ నోటి నుండి ఆ మాట రాగానే ఏసీపీ రాజ్‌బీర్ సింగ్ కుర్చీలోంచి లేచి అఫ్జల్‌ను తిట్టడం మొదలుపెట్టాడు. 'గిలానీ గురించి పెదవి విప్పొద్దని నీకు చెప్పలేదా' అని అరిచాడు. ఇదంతా మీడియా ముందే జరిగింది. కాబట్టి అఫ్జల్ కేవలం పోలీసులు రాసిన స్క్రిప్టునే చదువుతున్నాడనే విషయం మీడియాకు అర్థమయ్యే వుంటుంది. తన కుటుంబాన్ని కాపాడుకోవడానికి అఫ్జల్ చేసిన ఈ బలవంతపు ఒప్పుకోలు ప్రకటనే నేడతనికి ఉరిశిక్ష వేయడానికి ప్రధాన ఆధారం అయింది. ఇదీ అఫ్జల్ కథ. భారత ప్రభుత్వం చేత దగా పడిన కశ్మీరీ యువకుడి కథ. హిందూ మతోన్మాదానికి బలైన ఒక ముస్లిం యువకుడి కథ కూడా.

పై విషయాలన్నీ అఫ్జల్ జైల్లో ఇచ్చిన ఇంటర్వ్యూ ద్వారా, అతను తన లాయర్‌కు రాసిన లేఖ ద్వారా, సుప్రీం కోర్టుకు ఆయన భార్య తబస్సుమ్ రాసిన లేఖ ద్వారా వెలుగులోకి వచ్చాయి. అయితే తనను ఎస్టీఎఫ్ ఇరికించిందని, అఫ్జల్ చెప్తున్న దాన్ని యథాతథంగా పరిగణనలోకి తీసుకొని, అఫ్జల్ ఈ కేసులో బలిపశువయ్యాడని వాదిస్తే, చాలా మంది ఒప్పుకోకపోవచ్చు. కాని అఫ్జల్ చెప్తున్న విషయాలపై విచారణ జరిపి నిజానిజాలను వెలికితీయడానికి న్యాయ వ్యవస్థకు అన్ని అవకాశాలు వున్నాయి. దానికి ఆ బాధ్యత కూడా వుంది. పార్లమెంట్‌పై దాడితో ఎస్టీఎఫ్ అధికారికి సంబంధం వుండడమనేది ప్రభుత్వానికి చాలా ఆందోళనాకరమైన విషయం కావల్సింది. కానీ అఫ్జల్ చెబుతున్న దాన్ని ఎవరూ పట్టించుకోలేదు. న్యాయస్థానం కూడా అఫ్జల్ చెప్తున్న దాంట్లో నిజా నిజాలను తెలుసుకోవడానికి ఎటువంటి ఆసక్తి చూపలేదు. ముఖ్యంగా మహమ్మద్‌తో పాటు తాను ఢిల్లీలో వున్న కాలంలో ఎస్టీఎఫ్ డీఎస్పీ తనతోనూ, మహమ్మద్‌తోనూ మొబైల్ ఫోన్‌లో మాట్లాడిన రికార్డును పరిశీలిస్తే, నిజాలు తెలుస్తాయని అఫ్జల్ ఎంత చెప్పినా పట్టించుకున్న వాళ్లు లేరు. ఇక పోలీసుల కస్టడీలో నిందితుడు చేసిన ఒప్పుకోలును, సాక్ష్యాలుగా కచ్చితంగా తీసుకోలేమని, గతంలో ఎన్నో సందర్భాల్లో పలు న్యాయస్థానాలు ప్రకటించే వున్నాయి. పైగా అఫ్జల్ మీడియా ముందు మాట్లాడినప్పుడు పోలీసుల ఒత్తిడి అతడిపై వుందనేది స్పష్టంగానే అర్థమైన విషయం. అయినప్పటికీ కింది నుంచి పైదాకా అన్ని న్యాయస్థానాలు, ఆ ఒప్పుకోలునే అఫ్జల్ దోషి అనడానికి ప్రధాన ఆధారంగా తీసుకున్నాయి.

అఫ్జల్ లొంగిపోయిన మిలిటెంట్ అనే దాంట్లో ఎటువంటి

సందేహం లేదు. లొంగిపోయిన మిలిటెంట్లపై కశ్మీర్‌లో అనుక్షణం పోలీసుల, ప్రభుత్వ సాయుధ బలగాల నిరంతర నిఘా కొనసాగుతుందనేది కశ్మీర్ చరిత్ర గురించి ఏ మాత్రం పరిచయం వున్న వాళ్లకయినా తెలిసే విషయం. పైగా అక్కడ పోలీసులు అతన్ని ఎన్నోసార్లు పట్టుకుపోయి తమ కస్టడీలో నిర్బంధించిన రికార్డు కూడా వుంది. అట్లా నిరంతర నిఘా కొనసాగుతున్న మనిషి పర్యవేక్షణలో, అంత పెద్ద దాడి విజయవంతం అవడం సాధ్యమా? న్యాయవ్యవస్థ ఈ విషయాలపై ఎటువంటి శ్రద్ధ పెట్టకుండా, దోషి అంటూ, ఉరితీయమంటూ పాలకులు తన ముందుకు తెచ్చిన మనిషికి గుడ్డిగా ఉరివేసి, తాను కూడా ఫాసిస్టు రాజ్యాన్ని నిలబెడుతున్న, ఒక ముఖ్యమైన స్తంభాన్నేనని మరోసారి చాటుకుంది.

ఇక ఒక నిందితుడిగా అఫ్జల్‌కు వున్న అన్ని హక్కులు నిరాకరించబడ్డాయి. ఎటువంటి నేరారోపణలు ఎదుర్కొనే వాళ్లకైనా, న్యాయవాదిని నియమించుకునే హక్కు ఉంటుంది. ఎవరైనా నియమించుకోలేని పరిస్థితిలో, న్యాయస్థానమే వాళ్లకి న్యాయవాదిని నియమించాల్సి వుంటుంది. కాని అఫ్జల్‌కు కింది కోర్టులో న్యాయవాది లేరు. న్యాయవాది కోసం మూడుసార్లు ఆయన కోరినప్పటికీ పట్టించుకున్న వాళ్లు లేరు. ఇక హైకోర్టులో ఒక న్యాయవాదిని నియమించినప్పటికీ ఆ న్యాయవాది ఎప్పుడూ అఫ్జల్‌ను కలువలేదు. పైగా అఫ్జల్‌కు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పించాడు. అఫ్జల్‌కు వ్యతిరేకంగా అతని న్యాయవాది చేసిన కొన్ని వాదనల గురించి, అఫ్జల్‌కు కోర్టు తీర్పు వెలువడిన తర్వాతనే తెల్సిందంటే, న్యాయ విచారణలో పారదర్శకత ఎంతగా లోపించిందో అర్థం చేసుకోవచ్చు.

పైగా సుప్రీం కోర్టు తన తీర్పులో, అఫ్జల్ గురు తీవ్రవాద సంస్థలో సభ్యుడనే విషయాన్ని నిర్ధారించడానికి, కచ్చితమైన ఆధారాలేమీ లేవని అభిప్రాయపడింది. పార్లమెంట్‌పై చేసిన దాడిలో, ప్రభుత్వ సాయుధ బలగాల చేతిలో చనిపోయాడని చెబుతున్న మహమ్మద్‌కు ఇల్లు, కారు సమకూర్చడం అనే సందర్భ సాక్ష్యం (సర్కమ్‌స్టాన్షియల్ ఎవిడెన్స్) తప్ప కుట్రను రుజువు చేయడానికి మరే ప్రత్యక్ష సాక్ష్యం లేదని చెబుతూనే ఉరిశిక్షను వేసింది. వంద మంది నేరస్తులు తప్పించుకోనీ గాక, ఒక నిర్దోషికి శిక్ష పడకూడదనే నైతిక సూత్రాలను వల్లెవేసే కోర్టులు, సాధారణంగా సందర్భ సాక్ష్యం మీద ఆధారపడి శిక్షలు వేయవు, ఉరిశిక్షలు అసలే వేయవు. 'ప్రజల మనోభావాలను సంతృప్తి పరచడానికి' ఈ శిక్ష వేస్తున్నట్టుగా కోర్టు పేర్కొంది. అంటే న్యాయాన్ని నిలబెట్టడానికి కాక, ప్రజలను సంతృప్తి పరచడానికి, అది కూడా పాలకులు ఎక్కిస్తున్న మత్తు ప్రభావానికి లోనై వున్న ప్రజలను సంతృప్తి పరచడానికి, శిక్షలు వేయడమనేది చాలా ప్రమాదకర ధోరణి. అందుకే కోర్టు చేసిన ఈ వ్యాఖ్యానం రాజకీయ పరిభాష తప్ప, న్యాయ పరిభాష కాదని గిలానీ వ్యాఖ్యానించారు.

ఎందుకు అందరూ ఇంతగా కక్షగట్టి, కూడబలుక్కొని అఫ్జల్‌ను ఉరితీసినట్టు? పార్లమెంట్‌పై దాడి చేయడం అనేది చాలా తీవ్రమైన నేరం కనుకనా? అందుకే అని కోర్టు తన తీర్పులో పేర్కొంది. పార్లమెంట్‌పై దాడి, భారత ప్రభుత్వంతో యుద్ధం చేయడంగా సుప్రీం కోర్టు భావించింది. సుప్రీం కోర్టు అభిప్రాయాన్ని కాస్సేపు అంగీకరిద్దాం. మరి 'ఇంత తీవ్రమైన నేరం' వెనుక ఏ శక్తులు వున్నాయో కనుక్కోవడానికి కోర్టులైనా, ప్రభుత్వాలైనా, రాజకీయ పార్టీలయినా పట్టించుకున్నాయా? పకడ్బందీ రక్షణ వలయంలో, అనేక తనిఖీలను దాటుకొని పార్లమెంటు భవన ద్వారాలను సైతం దాటుకొని, నిండా పేలుడు పదార్థాలతో కూడిన కారులో ఐదుగురు సాయుధులు పార్లమెంట్ ఆవరణలోకి రావడం అంత సులువైన విషయమా? ప్రభుత్వం, పోలీసు విభాగంలోని ముఖ్యమైన వారి సహకారం లేకుండా ఇది సాధ్యమా? అంతే కాదు దాడి సందర్భంగా చనిపోయిన ఉగ్రవాదులుగా పేర్కొంటున్న ఆ ఐదుగురు ఎవరు? వాళ్లు మహమ్మద్, రాణా, రజా, హమ్‌జా, హైదర్ అనే పేర్లతో, తనకు తెలిసినట్టుగా అఫ్జల్ చెప్పాడని తప్ప, వాళ్ల పూర్తి పేర్లు ఏంటి? ఏ ప్రాంతం వాళ్లు? అని తెలుసుకునే ప్రయత్నం ఎవరూ ఎందుకు చేయలేదు? వాళ్ల శవాలను పాత్రికేయులు సహా ఎవరికీ ఎందుకు చూపలేదు? దాడి మధ్యాహ్నం జరిగితే హడావుడిగా ఆ రాత్రికే శవాలను ఎందుకు తగులబెట్టారు? ఎవరి పాత్రను మరుగుపరచడానికి ఈ హడావుడి? పార్లమెంట్‌పై దాడిని తీవ్రమైన విషయంగా నిజంగానే భావించినట్టయితే, అసలైన దోషులను పట్టుకోవడానికి తీవ్రంగానే ప్రయత్నించేవాళ్లు. అట్లా ప్రయత్నించకపోగా అఫ్జల్ దోషి కాదనే నిజం ఎక్కడ బయటపడుతుందో అన్నట్టుగా అందరూ వ్యవహరించారు.

దీన్నిబట్టి నేరం జరిగాక దోషులను పట్టుకోవడం కాకుండా, కొందరిని దోషులను చేయడానికే పార్లమెంట్ దాడి అనే నాటకం ఆడినట్టుగా కొందరికైనా అనిపిస్తున్నది. కశ్మీరీ వుద్యమకారులను పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులుగా, దేశంలోని ఏ ప్రాంతపు ముస్లింలనైనా, పాకిస్థాన్ ఏజెంట్లుగా ముద్ర వేసి, దేశభక్తి పేరుతో హిందూ మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్న, బీజేపీ పాలనలో ఇది జరగడం ఈ అనుమానాలకు మరింత బలం చేకూర్చే అంశం. ముస్లింలను బద్‌నాం చేయడానికీ, ఉగ్రవాదం బూచిని చూపించి తమ ఫాసిస్ట్ పాలనను, తాము తెచ్చే ఫాసిస్ట్ చట్టాలను సమర్థించుకోవడానికీ, హిందూత్వ శక్తులే పాల్పడ్డ ఉగ్రవాద చర్యలెన్నో వెలుగులోకి వచ్చాయి. అందుకే పార్లమెంట్ దాడి నాటికి గృహమంత్రిగా వున్న అద్వానీ నేతృత్వంలో, భారత ప్రభుత్వం, నిఘా సంస్థలు, కశ్మీరీ పోలీసులు కలిసి ఆడిన నాటకంగా దేశంలోని ఒక చిన్న సెక్షనే అయినా బలంగా చెబుతున్నది. నాటి బీజేపీ ప్రభుత్వం రక్తి కట్టించిన ఈ నాటకానికి, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం ఏ మాత్రం తగ్గని స్థాయిలో ముగింపునిచ్చి, హిందూత్వను వాడుకోవడంలో బీజేపీకి ఏ మాత్రం తీసిపోనని నిరూపించుకుంది. ఉగ్రవాదం పట్ల కాంగ్రెస్ మెతగ్గా వ్యవహరిస్తున్నదనీ, కసబ్, అఫ్జల్ గురులను ఉరితీయకుండా ఆలస్యం చేస్తున్నదని బీజేపీ గత కొంత కాలంగా విమర్శిస్తూ వస్తున్నది. ముస్లిం ఉగ్రవాదాన్ని బూచిగా చూపించి ముస్లింలను అణచిపెట్టడంలో 'ప్రఖ్యాతి' గాంచిన నరేంద్ర

మోడీని వచ్చే ఎన్నికల్లో ముందుపెట్టి గెలుపుకోసం ప్రయత్నించే అవకాశాలున్నాయి. ఈ అవకాశాలను దెబ్బతీసి, రాహుల్ గాంధీని ప్రధాని గద్దెపై కూర్చోబెట్టడానికి, తాను కూడా ముస్లిం ఉగ్రవాదం పట్ల కఠినంగానే వుంటానని, హిందూ ప్రజానీకానికి హామీ ఇవ్వడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కసబ్, అఫ్జల్‌లను ఉరితీసింది. అంటే వురిశిక్ష వెనుక రాజకీయ ప్రయోజనాలు తప్ప, దేశ ప్రయోజనాలు ఎంత మాత్రమూ లేవు. రాజకీయ పార్టీల ఎన్నికల ఎత్తుగడల్లో అఫ్జల్ వంటి వారు బలిపశువులు కావడం, న్యాయ వ్యవస్థ కూడా ఒక రాజకీయ వేదిక కావడం చాలా ఆందోళనాకరం.

ఇకపోతే పార్లమెంట్‌పై దాడి అనేది మరణశిక్ష విధించే నేరమవుతుందా? ప్రజాస్వామ్యానికి, సార్వభౌమత్వానికి పట్టుగొమ్మ అయిన పార్లమెంట్‌పై దాడి సహించరానిదని గంభీర ప్రకటనలు చేస్తున్నారు 'దేశభక్తులు'. నిజంగానే నేడు పార్లమెంటు ఆ విలువలను నిలబెడుతున్నదా? పార్లమెంటులో ప్రశ్నలడగడానికి, తీర్మానాలకు అనుకూలంగానో, ప్రతికూలంగానో ఓట్లు వేయడానికి కోట్ల రూపాయల సూట్‌కేసులు చేతులు మారినప్పుడు ఏమైపోయింది ప్రజాస్వామ్యం? ప్రజల ప్రయోజనాలను, వుందని భ్రమిస్తున్న దేశ సార్వభౌమత్వాన్ని అమెరికా పాదాల దగ్గర పెడుతూ, అణు ఒప్పందం తదితర ఎన్నో బిల్లులకు ఆమోదముద్ర వేస్తున్నప్పుడు ఏమైపోయింది సార్వభౌమత్వం? ప్రజాస్వామ్యం, సార్వభౌమత్వాలకు కాదు దోపిడీ, అవినీతి, అక్రమాలకు రక్షకురాలిగా వుంది పార్లమెంటు. అందుకే పార్లమెంట్ పందులదొడ్డిని కూలగొట్టడానికి విప్లవకారులు నిరంతరం ప్రయత్నిస్తారు. అది నేరమయితే నాడు భగత్సింగ్ చేసింది కూడా నేరమే. ఒకవేళ ఈ దాడి కశ్మీరీ వుద్యమకారులే చేసి వుంటే, కశ్మీరీ విముక్తి వుద్యమ చరిత్రలో అది ఒక వీరోచిత ఘటనగా నిలిచిపోతుంది.

అఫ్జల్ క్షమాభిక్ష పిటిషన్‌ను రాష్ట్రపతి ఫిబ్రవరి 3న తిరస్కరించాడు. ఈ విషయాన్ని బహిర్గతం చేయలేదు. రాష్ట్రపతి క్షమాభిక్ష తిరస్కరించిన తర్వాత కూడా న్యాయ సమీక్ష కోసం దాఖలు చేసుకునే హక్కు ఖైదీలకు వుంటుందని, కొన్ని తీర్పుల్లో కోర్టులు చెప్పాయి. క్షమాభిక్ష తిరస్కరించారనే విషయం అఫ్జల్‌కు వురితీయబోయే ఒక గంట ముందు, అఫ్జల్ కుటుంబీకులకు వురితీసిన తర్వాత తెలువడంతో న్యాయ సమీక్షను కోరే హక్కును అఫ్జల్ కోల్పోయాడు. అఫ్జల్‌కు ఉరిశిక్ష వేయడమే తప్పంటే, ఆయన క్షమాభిక్ష పిటిషన్ మీద తేల్చకుండా, ఇన్ని రోజులు కాలయాపన చేసి, చావుకూ బతుక్కూ మధ్య ఆయనను వేలాడదీయడం, అఫ్జల్‌కైనా, ఆయన కుటుంబీకులకైనా భయంకరమైన చిత్రవధ. ఇది ఉరిశిక్ష కంటే తక్కువదేమీ కాదు. ఒక నేరానికి ఒకటే శిక్ష అనే నైతిక సూత్రం ప్రకారం ఎటువంటి నేరం చేసిన వాళ్లకయినా ఆ శిక్ష సరిపోతుంది. ఇకపోతే 'సరైన కారణం లేకుండా మరణశిక్షలు అమలు చేయకుండా కాలయాపన చేస్తే, అతని మరణశిక్షను రద్దు చేయాలని' గతంలో సుప్రీం కోర్టు తీర్పు చెప్పింది. భారత రాజ్యాంగంలోని 72వ అధికరణ ప్రకారం ఉరిశిక్ష అమలు చేయడంలో జరిగిన జాప్యం కూడా ఉరిశిక్షను యావజ్జీవ ఖైదుగా మార్చాలని కోరుకోవడానికి, ఒక న్యాయ సమ్మతమైన కారణం అవుతుంది. ఈ ప్రకారం మరోసారి సుప్రీం కోర్టు తలుపులు తట్టి, ఉరిశిక్షను యావజ్జీవ ఖైదుగా మార్చుకోవడానికి అవసరమైన అన్ని అర్హతలూ అఫ్జల్‌కు వున్నాయి. అందుకే అట్లా వెళ్లే అవకాశాన్ని లేకుండా చేశారు. ఎక్కడ సుప్రీంకోర్టును ఆశ్రయిస్తారోననే అనుమానంతో, ఆయన భార్యకు సకాలంలో తెలియజేయలేదని హోం మంత్రి స్వయంగా ఒప్పుకున్నాడు కూడా.

ఇక ఉరితీసే తేదీని చట్టం ప్రకారం కనీసం 24 గంటల ముందు ఖైదీకి చెప్పాల్సి వుండగా, కేవలం ఒక గంట ముందు మాత్రమే చెప్పారు. అట్లా అతను ఉరికంభం ఎక్కేముందు భార్యనూ, కొడుకునూ, సన్నిహితులనూ చూసే హక్కును కోల్పోయాడు. అఫ్జల్ భార్యకు కూడా అతన్ని ఉరితీయబోయే తేదీని చెప్పలేదు. అట్లా చివరిసారి భర్తను చూసే అవకాశాన్ని ఆమెకూ, తండ్రిని చూసే అవకాశాన్ని కొడుక్కూ లేకుండా చేశారు.

క్షమాభిక్షను తిరస్కరిస్తూ రాష్ట్రపతి చేసిన నిర్ణయాన్ని సవాల్ చేసుకునే హక్కును, కసబ్ విషయంలో కూడా నిరాకరించారు. ప్రపంచంలోని అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమని గొప్పలు చెప్పుకుంటూ, ఇలా రహస్యంగా ఉరి బిగించడం అనేది హేయమైనది. ఇలా భారత పాలకులు కసబ్ వురితో ప్రారంభించిన ఈ దుస్సాంప్రదాయం ఉరిశిక్షలు పడిన ఇతర ఖైదీలను, వారి బంధువులను తీవ్ర ఆందోళనలో పడేస్తున్నది. తమకు ఆఖరి చూపులకు కూడా అవకాశం లేకుండా చేస్తారేమోనని, ఉరిశిక్ష పడినవారి బంధువులు ఆందోళన పడుతున్నారు. తమ వాళ్లను వురితీసిన వార్తను మోసుకు వస్తుందేమోనని, ప్రతి వుదయాన్నీ వాళ్లు సందేహించవలసి వస్తున్నది.

బతికుండగా చివరి చూపులకు నోచుకోని భార్యకూ, కొడుక్కూ, సన్నిహితులకూ కనీసం అఫ్జల్ మృతదేహాన్ని కూడా చూసే అవకాశం లేకుండా చేసి, తీహార్ జైల్లోనే అతన్ని పూడ్చిపెట్టారు. అడుగడుగునా అఫ్జల్‌కు వున్న న్యాయపరమైన హక్కులను హరించడం అనేది అతన్ని ఉరితీసే వరకే కాదు, ఉరితీసిన తర్వాత కూడా కొనసాగించారు. మృతదేహాన్ని ఇవ్వాలని తబస్సుం చేసిన విన్నపానికి బదులుగా భద్రతా కారణాల వల్ల మృతదేహాన్ని ఇవ్వలేమనీ, కావాలంటే జైల్లోనే అతన్ని ఖననం చేసిన చోట ప్రార్థనలు చేసుకోవచ్చని, ప్రభుత్వం తన 'ఉదారత'ను చాటుకుంది.

ఇలా భారత ప్రభుత్వం చేత ఉరితీయబడిన కశ్మీరీల్లో అఫ్జల్ రెండవ వాడు. భారత దౌత్యవేత్తను బ్రిటన్‌లో హత్యచేశాడని ఆరోపిస్తూ, 1984 ఫిబ్రవరి 11న జేకేఎల్ఎఫ్ నాయకుడు మఖ్బూల్ భట్‌ను ఉరితీశారు. మఖ్బూల్ భట్ మృతదేహాన్ని కూడా ఇవ్వకుండా, తీహార్ జైల్లోనే పూడ్చివేశారు. అతన్ని పూడ్చిన చోటు పక్కనే ఇప్పుడు అఫ్జల్‌ను కూడా పూడ్చి వేశారు. నాటి బ్రిటీష్ సామ్రాజ్యవాదులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల మృతదేహాలను ఇవ్వలేదు. అమెరికా సామ్రాజ్యవాదులు బిన్‌లాడెన్ మృతదేహాన్ని ఇవ్వలేదు. మృతదేహాలను కూడా ఇవ్వకుండా పాలకవర్గాలు తమ నిరంకుశత్వాన్నే కాదు, పిరికితనాన్నీ చాటుకుంటున్నాయి. ఇప్పటికీ

కశ్మీరీ ప్రజలు మఖ్బూల్ భట్ అవశేషాలనైనా ఇవ్వాలని డిమాండ్ చేస్తూనే వున్నారు. అతని అవశేషాలను వుంచడం కోసం శ్రీనగర్‌లో సమాధిని ఏర్పాటు చేశారు. మఖ్బూల్ భట్ మృతదేహాన్ని ఇవ్వకుండా ప్రభుత్వం అడ్డుకుంది. కాని కశ్మీరీ అమరుడుగా అతన్ని ప్రజలు గుర్తించడాన్ని, అడ్డుకోలేక పోయింది. అతని అమరత్వం కశ్మీరీ యువతలో ఆజాదీ స్ఫూర్తిని నింపింది. అసంఖ్యాక యువత సాయుధ పోరాట బాట పట్టారు. స్వయంగా అఫ్జల్ కూడా ఆ స్ఫూర్తితో వుద్యమబాట పట్టిన వాడే.

అఫ్జల్‌ను ఉరితీయడానికి కొద్ది గంటల ముందు నుండే కశ్మీర్‌లోని వీధులన్నీ ప్రభుత్వ సాయుధ బలగాలతో నిండి పోయాయి. ఉరివార్త బయటకు పొక్కగానే 144 సెక్షన్ విధించి కశ్మీర్‌ను దిగ్బంధించారు. మూడు రోజుల పాటు పత్రికల ప్రచురణను ఆపేశారు. టెలివిజన్ ప్రసారాలను, మొబైల్ నెటవర్క్‌ను, ఇంటర్ నెట్‌ను ఆపేశారు. అతని వూరి చుట్టూ సైనిక పహరాను పెట్టారు. దాన్ని దాటుకొని వెళ్లే వాళ్ల మీద కాల్పులు జరిపి, అయిదుగురిని పొట్టనబెట్టుకున్నారు. ఈ కాల్పుల్లో, మరెంతో మంది గాయపడ్డారు. అయినప్పటికీ నిరసనలు ఆగలేదు. అన్ని దిగ్బంధాలను తెంచుకొని అఫ్జల్ గ్రామానికి అసంఖ్యాక ప్రజలు చేరుకున్నారు. శ్రీనగర్‌లో మఖ్బూల్ పేరుతో ఏర్పాటు చేసిన సమాధి పక్కనే అఫ్జల్ పేరిట సమాధిని ఏర్పాటు చేశారు. మఖ్బూల్ అవశేషాల కోసం, అతని సమాధి పంతొమ్మిదేళ్లుగా ఎదురు చూస్తున్నట్టుగానే, ప్రస్తుతం అఫ్జల్ అవశేషాల కోసం అతని సమాధి ఎదురుచూస్తున్నది. అఫ్జల్ హత్య జరిగిన చాలా రోజుల వరకూ నిరసనలు కొనసాగుతూనే వున్నాయి. తుపాకీ తూటాలు, లాఠీ ఛార్జీలు, రోజుల తరబడి విధించిన కర్ఫ్యూ, ఆ నిరసనలను ఆపలేకపోయాయి. అఫ్జల్ హత్యకు వ్యతిరేకంగా ఫేస్‌బుక్, ట్విటర్‌లలో సైతం కశ్మీరీ యువత ప్రతిస్పందిస్తోంది. అఫ్జల్‌ను వురితీసి కశ్మీరీ ప్రజల పోరాటచేవను నీరుకార్చగలమని, భారత ప్రభుత్వం కలలు కంటున్నదేమో కాని, మఖ్బూల్ మరణం ఒక తరాన్ని పోరుబాట పట్టిస్తే, అఫ్జల్ మరణం మరో తరాన్ని పోరు బాట పట్టిస్తుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

మరో రెండు రోజుల్లో మఖ్బూల్ వర్ధంతిని జరుపుకోవడానికి, కశ్మీర్ ప్రజానీకం సన్నాహాలు చేసుకుంటుండగా అఫ్జల్‌ను వురితీయడం ద్వారా కశ్మీరీ ప్రజలకు భారత ప్రభుత్వం ఎటువంటి సంకేతాలను పంపింది? మీ భావోద్వేగాలను మేం లెక్క చెయ్యం గాక చెయ్యం అనే కదా.

ఇకపోతే కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఇంకో ప్రమాదకరమైన వాదన చేస్తున్నాడు. నాడు భగత్‌సింగ్‌ను కరాచీ సభల కంటే ముందే వురితియ్యాలని గాంధీ కోరుకున్నట్టుగనే, ఒమర్ అబ్దుల్లా కూడా కశ్మీర్‌లో బాగా మంచు కురిసే సమయంలోనే అఫ్జల్‌ను వురి తియ్యాలని, ఆ సమయంలో తీయడం వల్ల కశ్మీర్‌లో చెలరేగే నిరసనను అడ్డుకోవడానికి ప్రకృతి కూడా సహకరిస్తుందని కోరుకున్నట్టు వార్తలు వచ్చాయి. ఇప్పుడేమో 'రాజీవ్ గాంధీ, బియాంత్ సింగ్‌ల హంతకులకు విధించిన మరణశిక్షను అమలు చేయాలని, బీజేపీ ఎందుకు డిమాండ్ చేయడం లేదు?' అని ప్రశ్నిస్తున్నాడు. బీజేపీలోని హిందూ మతోన్మాద దృక్పథాన్ని, లేదా కశ్మీరీ వ్యతిరేక, ముస్లిం వ్యతిరేక దృక్పథాన్ని బహిర్గతం చేయడానికి కాదు, ఆయన ఈ వాదన చేస్తున్నది. అఫ్జల్ హత్యలో తన భాగస్వామ్యాన్ని తక్కువ చేసి చూపించుకోవడానికి. అంతేకాదు అఫ్జల్‌ను ఎంపిక చేసుకొని మరీ చంపలేదని, ప్రపంచానికి వివరించే బాధ్యత న్యాయవ్యవస్థపై వుందన్నాడు. అంటే అఫ్జల్‌ను కశ్మీరీ అయినందుకో, ముస్లిం అయినందుకో చంపలేదని నిరూపించుకోవడానికి, ముస్లిమేతరులనో, కశ్మీరీయేతరులనో చంపాలన్నమాట. ఒక కాంగ్రెస్ నాయకుడు 'అవుట్‌లుక్' పత్రికతో మాట్లాడుతూ "కసబ్, అఫ్జల్‌లను మాత్రమే ఉరితీస్తే మేం మైనారిటీలను చంపినట్టుగానే అనిపిస్తుంది. అందుకే మేం దీన్ని బ్యాలెన్స్ చేయవల్సి వుంటుంది."అని అన్నాడు. నిజానికి దీన్ని బ్యాలెన్స్ చేయడానికి, వీరప్పన్ అనుచరులకు కూడా రాష్ట్రపతి క్షమాభిక్ష నిరాకరించాడు. అయితే సుప్రీం కోర్టు కలుగజేసుకోవడంతో వురిశిక్ష అమలు తాత్కాలికంగా ఆగింది. అంటే హిందూత్వ ఓటు బ్యాంకును పెంచుకోవడానికి ముస్లింలను చంపడానికీ, మళ్లీ లౌకికవాదులను 'గెలుచుకోవడానికి', ముస్లిమేతరులను కూడా చంపడానికి, పాలకులు వెనుకాడరన్నమాట.

ఏ నేరం చేసిన వాళ్లకైనా మరణశిక్ష విధించడం అనేది ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థనీయం కాదు. అసలు పాలకులు, చట్టాలు నేరాలుగా భావించే కొన్ని చర్యలు, ప్రజా దృక్పథం నుండి చూస్తే నేరాలు కానేకావనే విషయాన్ని పక్కన పెడితే, నేరస్తులుగా మారడం వెనుక సామాజిక, ఆర్థిక, రాజకీయ కారణాలుంటాయి. నేరాలు పెరిగే అవకాశాలను సమాజంలో పెంచుతూ, నేరస్తులను చంపడం అనేది అర్థ రహితం. ఇలా చంపడం ప్రతీకారం అవుతుందే గాని, నేరస్తులను సంస్కరించడం కాదు. అందుకే ప్రపంచంలోని దాదాపు 96 దేశాలు మరణశిక్షను రద్దు చేశాయి. 34 దేశాలు రద్దు చేయకపోయినా, మరణశిక్షను అమలుచేయడం లేదు. ఇటీవల ఐక్య రాజ్య సమితి మరణశిక్షకు వ్యతిరేకంగా తీర్మానం చేసింది. అయితే దీన్ని వ్యతిరేకించిన 39 దేశాలలో, మన దేశం కూడా వుండడం సిగ్గుపడాల్సిన విషయం.

మన దేశంలో కూడా మరణశిక్షలను వ్యతిరేకించేవాళ్లు చాలా మంది వుంటారు. అటువంటి వారు కూడా కసబ్, అఫ్జల్‌ల మరణశిక్షలను వ్యతిరేకించడానికి ముందుకు రాలేదు. వ్యతిరేకిస్తే దేశభక్తి లేనివాళ్లుగానో, ఉగ్రవాదాన్ని సమర్థిస్తున్న వాళ్లుగానో, శత్రు దేశంగా భావిస్తున్న పాకిస్థానీ ఏజెంట్లుగానో, తమను చూస్తారనే సంకోచం చాలా మందిలో వుంటుంది. అమాయకుల ప్రాణాలను తీసాడనే కారణంగా కసబ్ పట్ల చాలా మందికి న్యాయబద్ధమైన కోపం వుండొచ్చు. అయితే ఆ పేలుళ్లకు ఎవరు కుట్ర పన్నారు? కసబ్‌ను సాధనంగా వాడుకున్నదెవరు? కసబ్‌ను చంపేస్తే, ఈ వాస్తవాలు బయటకు వచ్చే అవకాశం లేదనే విషయాన్ని మాట్లాడడానికి కూడా భయపడుతున్న వాళ్లున్నారు. ఈ భయాలను ఛేదించుకొని మాట్లాడుతున్న వాళ్ల పట్ల హిందూ ఉగ్రవాదులు

# ఆర్థిక సంస్కరణల ఫలితమే నేటి విద్యుత్ సంక్షోభం!

దశాబ్దం తర్వాత, ఆంధ్రప్రదేశ్‌లో మళ్లీ విద్యుత్ ఉద్యమం వుధృతం అయింది. చంద్రబాబు పాలనలో పెంచిన విద్యుత్ ఛార్జీలకు వ్యతిరేకంగా, పెద్ద ప్రజా వుద్యమం చెలరేగిన రోజులూ, ఆ వుద్యమంపై ప్రయోగించిన అణచివేతకు పరాకాష్టగా, 2000 ఆగస్ట్ 28న హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ వద్ద పోలీసులు జరిపిన కాల్పుల్లో రామక్రిష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి, బాలస్వామి అనే ముగ్గురి ప్రాణాలు కోల్పోవడమూ మళ్లొకసారి రాష్ట్ర ప్రజల యాదిలోకి వస్తున్నాయి.

నిజానికి 2004లో తెలుగుదేశం ఓడిపోయి, కాంగ్రెస్ అధికారంలోకి రావడంలో, విద్యుత్ వుద్యమ పాత్ర కూడా వుంది. అంత తీవ్రమైన వుద్యమం జరిగిన నేపథ్యంలోనే, నాటి కాంగ్రెస్ ముఖ్యమంత్రి అభ్యర్థి రాజశేఖర్ రెడ్డి రైతులకు ఉచిత విద్యుత్ ఇస్తానని, గెలిస్తే మొదటి సంతకం వుచిత విద్యుత్ ఫైల్ మీదనే చేస్తానని వాగ్దానం చేసాడు.

2004లో అధికారంలోకి వచ్చిన తర్వాత, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఏడుగంటల వుచిత విద్యుత్‌తో పాటు, ఐదేళ్ల పాటు కరెంటు ఛార్జీలు పెంచనని ప్రకటించింది. 2009లో మళ్లీ అధికారంలోకి వచ్చినప్పుడు కూడా మరో ఐదేళ్లపాటు ఛార్జీలు పెంచనని ప్రకటించింది. అయితే ఇచ్చిన మాట మీద నిలబడకుండా 2010 నుండి ఛార్జీలు పెంచుతూనే వస్తున్నది. రైతులకు వుచితంగా ఇస్తున్నామనే పేరుతో గృహ అవసరాలకు, పరిశ్రమలకు విపరీతంగా ఛార్జీలు పెంచుతున్నారు. 2010-11లో 920 కోట్ల రూపాయలు, 2011-12లో 1000 కోట్ల రూపాయలు, 2012-13లో 4,950 కోట్ల రూపాయల ఛార్జీలు పెంచారు. 2010 వరకూ ప్రత్యక్షంగా ఛార్జీలు పెంచనప్పటికీ ఇంధన సర్దుబాటు ఛార్జీల పేరుతో, ప్రజలపై భారం వేస్తూనే వున్నారు. 2008-09లో 1,690 కోట్ల రూపాయలు, 2009-10లో 1,481 కోట్ల రూపాయలు, 2010-11లో 3,957 కోట్ల రూపాయలు, 2011-12లో 2,014 కోట్ల రూపాయలు, 2012-13 ఆర్థిక సంవత్సరంలోని మొదటి మూడు నెలలకు 1,800 కోట్ల రూపాయల భారాన్ని వేశారు. మొత్తంగా 2008 నుండి 17,812 కోట్ల రూపాయల భారం ప్రజలపై పడింది. ఛార్జీలను ఇంతగా పెంచడమే కాకుండా కస్టమర్ ఛార్జీలు, మినిమమ్ ఛార్జీలు అనే పేరుతో ఏర్పడకుండా, వందల కోట్ల రూపాయలను గుంజుతున్నారు.

ఇక ఈ సంవత్సరం ఏప్రిల్‌తో మొదలయ్యే 2013-14 ఆర్థిక సంవత్సరానికి కనీ వినీ ఎరుగని స్థాయిలో 41 శాతం అంటే 12,723 కోట్ల రూపాయల ఛార్జీలు పెంచాలని పంపిణీ సంస్థలు (డిస్కంలు) చేసిన ప్రతిపాదనను ప్రభుత్వం ఆమోదించింది. ఈ లెక్కన ప్రతి యూనిట్ ఛార్జీ 30 పైసల నుంచి 1.53 పైసల వరకూ పెరగనుంది. ఇక ఇంధన సర్దుబాటు ఛార్జీల రూపంలో మరో 2,165.97 కోట్ల భారాన్ని ప్రజలపై వేయదల్చుకుంది ప్రభుత్వం. పెరుగుతున్న ఈ ఛార్జీల భారం గృహ, వాణిజ్య, చిన్న, మధ్య తరహా కుటీర పరిశ్రమలపై పడుతుంది. దోబీఘాట్లను, ఆఖరికి వీధి దీపాలను కూడా వదలకపోవడం వల్ల గ్రామ

---

విరుచుకుపడుతున్నారు. ఇట్లా మాట్లాడేవారిపై కూడా రాజద్రోహం కేసులు మోపాలంటున్నారు. అంటే భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ రోజు రోజుకూ మరెంతగా దిగజారిపోతున్నట్లు?

ఉగ్రవాదం పేరిట తమ క్రూరమైన చట్టాలకు, ఎన్నో దేశాలు నిషేధించిన ఉరిశిక్షలకు, సాధికారతను కల్పించుకుంటున్న పాలకులు రేపు వీటిని విప్లవకారులపై కూడా ప్రయోగిస్తారు. వామ పక్ష తీవ్రవాదమే మన దేశానికి ప్రమాదకరమని, మన్‌మోహన్ ఎప్పుడో ప్రకటించే వున్నాడు. ఇప్పటికే విప్లవకారులపై మోపిన చిన్నా, చితకా కేసులకు కూడా పదేళ్ల ఖైదు, జీవితఖైదులు వేయడం సాధారణమైపోయాయి.

మన దేశంలో బొంబాయి దాడుల కంటే, పార్లమెంట్‌పై దాడి కంటే అనేక రెట్లు ప్రాణహాని జరిగిన దాడులు ఎంతో అమానుషత్వం వ్యక్తమయిన దాడులు ఎన్నో వున్నాయి. సుదూర చరిత్రలోకి పోనవసరం లేదు. చాలా వుదాహరణలు కూడా తీసుకోనవసరం లేదు. పదేళ్ల క్రితం జరిగిన గుజరాత్ మారణకాండ ఉదాహరణ ఒక్కటి సరిపోతుంది. తుపాకులతో ధనా ధన్ కాల్చి చంపలేదక్కడ. నరికి, కోసి, త్రిశూలాలతో గుచ్చి, పేగులు బయటకు తీసి, పిండాలను బయటకు తీసి, త్రిశూలాకు గుచ్చి ఎగురవేసి, పసి పిల్లలను కూడా కూరగాయలను కోసినట్టు కోసి, కరెంట్ తీగలు విసిరి, సజీవంగా తగులబెట్టి చంపారు. నిండు గర్భిణులని చూడకుండా, పసి పిల్లలని చూడకుండా అత్యాచారాలు చేశారు. ఇంత ఘోరమైన దాడులకు కుట్ర పన్నిన నరేంద్రమోడీకి ఏ శిక్ష పడింది? శిక్ష కాదు కనీసం క్షమాపణ చెప్పినా చాలని అడిగారు బాధితులు. కానీ మోడీ ససేమిరా అన్నాడు. అయినప్పటికీ నాలుగోసారి కూడా గద్దెనెక్కగల్గాడు. రేపు ప్రధాని గద్దెను ఎక్కాలని కూడా కలలు కంటున్నాడు. కసబ్, అఫ్జల్‌లు ముస్లింలు కాబట్టి, అందులోనూ ఒకరు పాకిస్థానీ, ఒకరు కశ్మీరీ కాబట్టి వాళ్లను వురితీయాలి. నరేంద్ర మోడీ హిందువు, హిందూత్వ పరిరక్షకుడు కూడా. పైగా చంపింది ముస్లింలను కాబట్టి అతన్ని అధికార సింహాసనాలెక్కించాలి. ఇదీ దేశభక్తంటే!

చట్టం, న్యాయం, రాజకీయాలు ఇంతగా కాషాయీకరణ చెందుతున్నాయి. ప్రజల మనసులు కూడా కాషాయీకరించబడుతున్నాయి. దీనిని అడ్డుకోవాల్సిన బాధ్యత లౌకికవాదులందరిపైనా వుంది.

అంతేకాదు ఉరిశిక్షలను రద్దుచేయాలని బలమైన ప్రజాస్వామిక వుద్యమాలను నిర్మించాల్సి వుంది. ★

## ఇంధన సర్దుబాటు ఛార్జీలు

*విద్యుత్ రంగంలో సంస్కరణలు మొదలయిన తర్వాత సాధారణ ప్రజలకు ఏ మాత్రం అంతు చిక్కని ఇంధన సర్దుబాటు సర్‌చార్జి (ఎఫ్ఎస్ఏ) అనే పేరుతో అదనపు భారం పడుతున్నది.*

*విద్యుత్ ఛార్జీలు నిర్ణయించడానికి ముందు విద్యుత్ ఉత్పత్తి ఖర్చులను లెక్క వేస్తారు. ఈ ఖర్చులో బొగ్గు, గ్యాస్, నాఫ్తా వంటి ఇంధనాల కొనుగోళ్లకయ్యే ఖర్చు ముఖ్యమైన భాగం. ముందు సంవత్సరంలో ఈ ఇంధనాల ధరలు ఎలా పెరిగాయో పరిశీలించి, ప్రస్తుతం ఛార్జీలు నిర్ణయిస్తున్న సంవత్సరంలో ఎలా పెరుగుతాయో అంచనా వేసి, ఆ అంచనాలకు అనుగుణంగా ఛార్జీలను నిర్ణయిస్తారు. ఇంధనాల ధరల్లో ముందు అంచనా వేసిన దానికన్నా మార్పు వస్తే ఆ వ్యత్యాసాన్ని ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి విద్యుత్ ఛార్జీలలో సర్దుబాటు చేస్తారు. అంటే అనుకున్న దాని కంటే ఇంధనాల ధరలు పెరిగితే విద్యుత్ ఛార్జీలకు కలుపుతారు. తగ్గితే ఛార్జీలను తగ్గిస్తారు. దీనినే ఇంధన సర్దుబాటు సర్‌ఛార్జీ అంటున్నారు. విద్యుత్ వినియోగదార్లకిచ్చే బిల్లులో ఎఫ్ఎస్ఏ అని ఒక ప్రత్యేక పద్దు వుంటుంది.*

*అయితే ఇందులో కూడా ప్రభుత్వం, రెగ్యులేటరీ కమిషన్, విద్యుత్ సంస్థలు కలిసి వినియోగదారులను మోసం చేస్తున్నాయి. సాధారణంగా అంచనా వేసిన దాని కంటే ఇంధనాల ఖర్చు 10, 15 శాతం కంటే పెరగదు. కనుక ఛార్జీలు కూడా 10, 15 శాతమే పెరగాలి. కానీ ఛార్జీల కన్నా ఇంధన సర్దుబాటు ఛార్జీలు వందల శాతంలో పెరుగుతున్నాయి. దీనికి కారణమేంటంటే, ఇంధనాల ధరను ముందుగా చాలా తక్కువగా అంచనా వేస్తారు. అట్లా తక్కువ వేయడం వల్ల కరెంటు ఛార్జీలు సాపేక్షికంగా తక్కువగా వుంటాయి. ప్రభుత్వం ఆ ఛార్జీలపై ఆధారపడే సబ్సీడీని ఇస్తుంది. ప్రస్తుతం వ్యవసాయానికి 31 శాతం కరెంటు సరఫరా అవుతున్నది. అంటే 31 శాతానికి ప్రభుత్వమే ఛార్జీలు చెల్లిస్తుంది. అంటే ప్రభుత్వం ఈ సబ్సిడీ వ్యయాన్ని తగ్గించుకోవడానికి ఇంధనాల వ్యయాన్ని తక్కువగా అంచనా వేస్తుంది. ఆ తర్వాత సంవత్సరాల్లో ఈ 31 శాతానికి వచ్చే ఇంధన సర్దుబాటు వ్యయం గురించి ప్రభుత్వం ఏమీ బాధ్యత పడదు. దాన్ని గృహ, పారిశ్రామిక వినియోగదారుల మీద వేస్తారు. అంటే వీరు కాల్చని కరెంటుకు ఛార్జీలు కట్టాల్సి వస్తుంది. నిజానికి ఈ ఇంధన సర్దుబాటు వ్యయం మొత్తాన్ని ప్రభుత్వమే భరించాల్సి వుంటుంది.*

పంచాయితీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లపై కూడా ఈ భారం పడుతుంది. మొత్తంగా ఛార్జీల పెరుగుదల భారం పేద, మధ్య తరగతి, చిన్న పారిశ్రామిక వర్గాలపై తీవ్రంగా పడనుంది. విపరీతంగా ఛార్జీలు పెంచడమే కాకుండా, గృహ వినియోగానికి ప్రస్తుతం అమల్లో వున్న టెలిస్కోపిక్ విధానాన్ని ఎత్తివేయాలనే నిర్ణయం కూడా జరిగింది. ఈ విధానం వలన ప్రజలపై మరింత భారం పడుతుంది.

ఛార్జీల పెరుగుదల సమస్య ఇట్లా వుంటే, కరెంటు కోత ప్రజలకు మరో పెద్ద సమస్యయి పోయింది. పాలకులు చేసిన వాగ్దానం ప్రకారం రైతులకు వుచితంగా ఏడుగంటల పాటు కరెంటు సరఫరా చేయాలి. అయితే గత సంవత్సరం అక్టోబర్ నెలలో అంటే మంచి వానా కాలంలో రోజుకు రెండు, మూడు గంటలు మాత్రమే వ్యవసాయానికి విద్యుత్ సరాఫరా చేస్తున్నారని రైతులు ఆందోళన చేశారు. అంటే వుచితం సంగతేమో గాని, అసలు కరెంటే అందని పరిస్థితి వుంది.

ఛార్జీలు పెరగడానికైనా, కోతలు పెరగడానికైనా కారణం రాష్ట్రంలో డిమాండ్‌కు సరిపడా కరెంటు వుత్పత్తి కాకపోవడమే. ఎన్నడూ లేని విధంగా నేడు రాష్ట్రంలో రోజుకు 50 మిలియన్ యూనిట్ల విద్యుత్ లోటు ఏర్పడింది. వ్యవసాయ, పారిశ్రామిక రంగాలపై కరెంటు కోత ప్రభావం బాగా పడుతున్నది. రాష్ట్రంలో 40 లక్షల ఎకరాల సాగు కేవలం కరెంటు మోటార్లపై ఆధారపడి వుంది. రబీలో వ్యవసాయానికి ఏడు గంటల విద్యుత్ సరఫరా చేయడం సాధ్యం కాదని, కాబట్టి రబీలో వరి పంటకు విరామం ప్రకటించాలని, పంపిణీ సంస్థలు ముందే ప్రకటించి వున్నాయి. అసలే సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న వ్యవసాయరంగాన్ని కరెంటు సమస్య మరింత దెబ్బ తీస్తున్నది. ఇక బోర్లు, లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలపై ఆధారపడిన తెలంగాణాలో ఈ పరిస్థితి మరింత తీవ్రంగా వుంటుంది. ఇచ్చిన కరెంటును కూడా ఒకేసారి ఇవ్వకుండా దఫదఫాలుగా ఇవ్వడం వల్ల వచ్చీపోయే కరెంటుతో, లోవోల్టేజీతో కరెంటు మోటార్లు కాలిపోయి రైతులు ఇంకింత నష్టపోతున్నారు.

కరెంటు అందక చిన్న, మధ్య తరగతి పరిశ్రమలు సగానికి సగం మూతపడ్డాయి. గత ఆరునెలల కాలంలో 20 వేల కోట్లకు పైగా వుత్పత్తి ఆర్డర్లు వెనక్కి పోయాయని ఒక అంచనా. రాష్ట్రంలో వున్న 374 పారిశ్రామిక వాడల్లో 70 శాతం వుత్పత్తి నిలిచిపోయిందంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. దీని వలన ఉపాధి కోల్పోయి కార్మికులు రోడ్డున పడుతున్నారు. అటు వ్యవసాయం దెబ్బతినడం మూలంగా కనీసం ఏదో ఒక కార్ఖానాలో పనిచేసుకుందామని ఆశించే రైతు కూలీలకు ఇటు కార్ఖానాలు కూడా మూతపడడంతో దిక్కుతోచని పరిస్థితి. పారిశ్రామికవేత్తలు స్వయంగా వీధుల్లోకి వచ్చి, విద్యుత్ కోతలు ఇట్లాగే కొనసాగితే పరిశ్రమలను

*టెలిస్కోపిక్ విధానంలో 100 యూనిట్ల వరకూ ఒక ఛార్జీ, 100 నుండి 200 వరకూ మరొక ఛార్జీ, 200 నుండి 300ల యూనిట్ల వరకు ఇంకొక ఛార్జీ... ఈ రకంగా వుంటుంది. నాన్ టెలిస్కోపిక్ విధానంలో మొత్తం యూనిట్లకు ఒకే ఛార్జీ వుంటుంది.*

***ఉదా: టెలిస్కోపిక్ విధానంలో 300 యూనిట్లు వాడితే ప్రస్తుత ఛార్జీల ప్రకారం***

| | | | |
|---|---|---|---|
| *0–100 దాకా* | *రూ. 2.60* | = | *రూ. 260* |
| *101–200 దాకా* | *రూ. 3.60* | = | *రూ. 360* |
| *201–300 దాకా* | *రూ. 5.75* | = | *రూ. 575* |
| | *మొత్తం బిల్లు* | = | *రూ. 1195* |

***నాన్‌టెలిస్కోపిక్ విధానంలో పెరగబోయే ఛార్జీల ప్రకారం***

| | | | |
|---|---|---|---|
| *0–300 దాకా* | *రూ. 6.15* | = | *రూ. 1845* |
| | *అదనపు భారం* | = | *రూ. 650* |

నడుపలేమని ఆందోళనలు చేస్తున్నారు.

ఇక ఎండా కాలం, అందులోనూ పరీక్షల కాలం కూడా కనుక ఇండ్లలో కరెంటు లేక ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు ఎన్నో ఇబ్బందులకు గురి అవుతున్నారు. ఇండ్లకు వాడుకునే కరెంటులో గ్రామాల్లో దాదాపు 12 గంటలు, పట్టణాలు, నగరాల్లో 3 నుండి 6 గంటల వరకూ అధికారికంగా కోతలు విధిస్తున్నారు. ఇక అప్రకటిత కోతలకు లెక్కేలేదు. నీటి ఎద్దడికి తోడు కరెంటు కూడ లేకపోవడంతో బోర్లు, నల్లాలపై ఆధారపడే జనం తాగే నీళ్లకు కూడా అవస్థ పడాల్సి వస్తున్నది. ముఖ్యంగా కరెంటుతో అనుసంధానించబడిన పట్టణ ప్రజల జీవితం కరెంటు లేకుంటే స్థంభించినట్టే వుంటుంది.

నేడు దేశంలోనే అత్యధిక విద్యుత్ లోటు ఎదుర్కొంటున్న రాష్ట్రాల జాబితాలో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో వుంది. సాధారణంగా కరెంటు కోతలు ఎండా కాలంలోనే వుంటాయి. వానలు పడగానే కోతల బాధ కొంత తీరుతుంది. అయితే ఇప్పుడు కరెంటు కోతలు అనేవి అన్ని కాలాలకు వర్తించే సాధారణ అంశం అయిపోయింది. ఒక్క ఆంధ్రప్రదేశ్‌నే కాదు, కరెంటు సంక్షోభం నేడు దేశమంతటినీ పట్టి పీడిస్తున్నది.

వర్షాలు లేకపోవడం వల్ల జలవిద్యుత్ వుత్పత్తి తగ్గిపోయిందని, బొగ్గు సరఫరా లేకపోవడం వల్ల థర్మల్ విద్యుత్ వుత్పత్తి తగ్గిపోయిందని, గ్యాస్ కొరత వల్ల గ్యాస్ ఆధారిత విద్యుత్ తగ్గిపోయిందని, చెప్తూ తప్పును పూర్తిగా ప్రకృతి మీదికి నెట్టేసి, సర్కార్ తన బాధ్యతను మరుగుపరుస్తున్నది. కాని పాలకులు అనుసరిస్తున్న విధానాలే నేడు తీవ్రమవుతున్న కరెంటు సమస్యకు కారణం.

దేశంలో విద్యుత్ రంగంలో సంస్కరణలు 1991లో మన్మోహన్ సింగ్ ఆర్థిక మంత్రిగా వున్న కాలం నుండే మొదలయినాయి. ఇక రాష్ట్రంలో, కరెంటు సమస్యను పరిష్కరించడంలేదని, నేడు కాంగ్రెస్‌ను విమర్శిస్తున్న చంద్రబాబు పాలనలోనే మొదలయినాయి. 1998లో చంద్రబాబు సర్కార్ అసెంబ్లీలో కేవలం ఒక్కరోజు చర్చతో ఆంధ్రప్రదేశ్ విద్యుత్ రంగ సంస్కరణల చట్టం తెచ్చింది. ప్రపంచబ్యాంకు ఒప్పందాలకు సాష్టాంగపడి అన్ని రంగాల్లోనూ ప్రైవేటీకరణకు పెద్ద పీట వేసిన చంద్రబాబు విద్యుత్ రంగం మొత్తాన్ని ప్రైవేటీకరించడానికి తీవ్రంగా ప్రయత్నించాడు. అందులో భాగంగా విద్యుత్ బోర్డును జెన్‌కో, ట్రాన్స్‌కోలుగా విడగొట్టాడు. సబ్సిడీలను ఎత్తేసాడు. ప్రైవేటీకరణ లక్ష్యంతోనే రాష్ట్ర విద్యుత్ బోర్డుకు బడ్జెట్ కేటాయింపులను నిర్లక్ష్యం చేసాడు. చంద్రబాబు తర్వాత అధికారంలోకి వచ్చిన పాలకులు కూడా, ప్రైవేటీకరణపై వున్న ప్రేమతోనే, ప్రభుత్వ విద్యుత్ వుత్పత్తి సంస్థ ఏపీ జెన్‌కోకు నిధులు కేటాయించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. కొత్త నిధులు కేటాయించక పోగా బకాయిలు కూడా చెల్లించడం లేదు. దీని వల్ల జెన్‌కో తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయింది. కరెంటు వుత్పత్తిని విదేశీ, దేశీయ కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడానికే జెన్‌కోను ఇట్లా దివాళా తీయిస్తున్నది. జెన్‌కోను దివాళ తీయించి ఎన్నో ప్రైవేట్ విద్యుత్ సంస్థలకు విచ్చలవిడిగా అనుమతులిస్తున్నది. ఒక్క నెల్లూరు జిల్లాలోనే 15 ప్రైవేటు థర్మల్ విద్యుత్ సంస్థలకు అనుమతులిచ్చిందంటే, పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. చౌకగా కరెంట్‌ను వుత్పత్తి చేసే జెన్ కోను నిర్లక్ష్యం చేస్తూ ప్రైవేట్ విద్యుత్ కంపెనీలపై ఆధారపడిన ఫలితమే నేటి కరెంటు సంక్షోభం.

రాష్ట్రంలో ప్రస్తుతం కరెంటు వుత్పత్తి కోసం బొగ్గు పైన ఎక్కువగా ఆధారపడుతున్నాం. ఆ తర్వాత నీటి పైన, సహజ వాయువులపైన

**ఉచిత విద్యుత్ పేర ప్రభుత్వం చేస్తున్న మోసం**

*వ్యవసాయానికి వుచితంగా విద్యుత్ ఇస్తున్నానని, గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం, ఆ భారాన్ని దొంగచాటుగా విద్యుత్ వినియోగదారులపై ఛార్జీల రూపంలో వేస్తున్నది. ఇది ఎలా జరుగుతుందంటే వ్యవసాయానికి సరఫరా చేసే వుచిత విద్యుత్ అంచనా లెక్కలను ప్రభుత్వం కావాలని తక్కువ వేస్తుంది. అది అంచనా వేసిన మేరకే సబ్సిడీని పంపిణీ సంస్థలకు చెల్లిస్తుంది. అయితే ఈ అంచనాలకు మించి వ్యవసాయానికి కరెంటు సరఫరా అవుతుంది. ఇలా ఎక్కువ సరఫరా అయిన కరెంటుకు ప్రభుత్వం ఒక్క పైసా ఇయ్యదు. కనుక ఈ భారాన్ని పంపిణీ సంస్థలు ప్రజల మీదనే వేస్తాయి.*

ఎక్కువగా ఆధారపడుతున్నాం. బొగ్గు, సహజ వాయువు, చమురు క్షేత్రాలను ప్రైవేట్ సంస్థల చేతుల్లో పెట్టినందువల్ల వాటి ధరలను ప్రభుత్వం నియంత్రించలేకపోతున్నది. వీటి ధరలు పెరగడం వలన విద్యుత్ ఛార్జీలు పెరుగుతున్నాయి.

మన దేశంలో అవసరాలకు సరిపడా బొగ్గు వుత్పత్తి జరగక మనం దిగుమతులపై ఆధారపడుతున్నాం. అదే సమయంలో వున్న బొగ్గు గనులను వుపయోగించుకోవడం లేదు. ఎన్నో బొగ్గు గనులను విద్యుత్, స్టీల్, సిమెంట్ తదితర ప్రైవేటు వుత్పత్తి సంస్థల స్వంత వినియోగానికి ప్రభుత్వం కేటాయిస్తున్నది. వీటి నుండి బొగ్గును సరిగా వెలికితీయడం లేదు. పైపొరను మాత్రమే తవ్వితీసి ఆ భూమిని రియల్ ఎస్టేట్‌కు ఉపయోగించుకుంటున్నారు. ఉన్న బొగ్గు గనులను సక్రమంగా వినియోగించుకుంటే, మనకు బొగ్గును దిగుమతి చేసుకునే అవసరం వుండదు. ప్రైవేటు సంస్థలకు బొగ్గు గనులను కట్టబెడుతున్న ప్రభుత్వం జెన్‌కో, ఎన్‌టిపిసి లాంటి ప్రభుత్వ విద్యుత్ సంస్థలకు బొగ్గును సమకూర్చడంలో ఎటువంటి శ్రద్ధ చూపించడం లేదు. ఈ కారణంగా ఈ సంస్థలు ఎక్కువ ధరకు విదేశాల నుండి బొగ్గును దిగుమతి చేసుకోవాల్సి వస్తుంది. జెన్‌కో ప్రతి సంవత్సరం 20 లక్షల టన్నుల బొగ్గును ఎక్కువ ధర చెల్లించి కొంటున్నది. బొగ్గు ధర పెరగడం వల్ల కరెంటు వుత్పత్తి ధర పెరుగుతున్నది. డీజిల్ ధరలు పెరగడం వల్ల కూడా బొగ్గు ధరలు పెరుగుతాయి. యూపీఏ సర్కార్ మొత్తంగా తన ఏలుబడిలో 22 సార్లు పెట్రో వుత్పత్తుల ధరలు పెంచింది. ఈ ప్రభావం బొగ్గు ధరల పైనా, ఆ తర్వాత కరెంటు ఛార్జీల పైన పడక తప్పదు.

ఇక గ్యాస్ ఆధారిత విద్యుత్ సంగతి చూస్తే, గ్యాస్ ధరలు పెరగడం వల్ల దానిపై ఆధారపడుతున్న కరెంటు ధర కూడా పెరుగుతున్నది. అంతే కాదు గ్యాస్ కొరత తీవ్రంగా వున్నందువల్ల, గ్యాస్ ఆధారిత విద్యుత్ కేంద్రాలు వుత్పత్తి లక్ష్యాలను సాధించలేకపోతున్నాయి. దేశవ్యాప్తంగా గ్యాస్ కొరత వల్ల తగ్గిపోతున్న విద్యుత్ వుత్పత్తి 13 వేల మెగావాట్లు. ఇందులో 5 వేల మెగావాట్ల తగ్గుదల మన రాష్ట్రం నుండే వుంటున్నది. గ్యాస్ కొరత తీవ్రంగా వున్నప్పటికీ, ప్రైవేట్ సంస్థల ఒత్తిడులకు లోబడి ఇష్టానుసారంగా గ్యాస్ ఆధారిత ప్రాజెక్టులకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఒకవైపు గ్యాస్ కొరత తీవ్రంగా వుంటే, మరోవైపు వున్న గ్యాస్ వనరులను కూడా రిలయన్స్ వంటి కార్పొరేట్లకు కట్టబెడుతున్నారు పాలకులు. అవి వుత్పత్తి చేస్తున్న గ్యాస్ ధరలపై ఎటువంటి నియంత్రణ విధించక పోవడం వల్ల విద్యుత్ కేంద్రాలు వాటి దగ్గర అధిక ధరలకు గ్యాస్‌ను కొనాల్సి వస్తున్నది. కేజీ బేసిన్‌లో గ్యాస్‌ను వెలికితీస్తున్న రిలయన్స్ సంస్థ విదేశాలకు ఎగుమతి చేస్తున్న ధరకంటే, దాదాపు రెట్టింపు ధరకు రాష్ట్రంలో అమ్ముతున్నది. అంతర్జాతీయ ధరలు అన్న పేరుతో ప్రభుత్వం కూడా అధిక ధరకే విద్యుత్ కేంద్రాలకు బొగ్గు, గ్యాస్‌లను అమ్ముతున్నది. రిలయన్స్ వంటి సంస్థలు గ్యాస్ ధర పెంచడంతోనే సరిపుచ్చుకోవడం లేదు. ఉత్పత్తిని బాగా తగ్గించి, కొత్త బావుల నుండి గ్యాస్‌ను వెలికి తీయకుండా సరఫరాను బాగా తగ్గిస్తున్నది. దీని వల్ల అధిక ధర పెట్టడానికి సిద్ధపడ్డా, అవసరానికి తగినంత గ్యాస్ దొరకక విద్యుత్ సంస్థలు తక్కువ పిఎల్ఎఫ్‌తో పని చేయాల్సి వస్తుంది. ఫలితంగా వుత్పత్తి చేయకపోయినా, చేసినట్టుగా భావించి విద్యుత్ కంపెనీలకు ప్రభుత్వం పెద్ద మొత్తాలను వృధాగా చెల్లించాల్సి వస్తుంది. ఇలా వృధాగా చెల్లించినదంతా వినియోగదారుల నెత్తి మీదనే పడుతుంది.

*ఉత్పత్తి సామర్థ్య వినియోగాన్ని ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ (పీఎల్ఎఫ్) అంటారు. విద్యుత్ కేంద్రాలు కనీసం 75 శాతం పీఎల్ఎఫ్‌తో పనిచేయాల్సి వుంటుంది. అంతకన్నా తక్కువ పీఎల్ఎఫ్‌తో పనిచేసినా 75 శాతం పీఎల్ఎఫ్ స్థాయిలో జరిగే వుత్పత్తి పరిమాణానికి అనుగుణంగా స్థిర ఛార్జీలు చెల్లించాల్సి వుంటుంది. ఇలా వుత్పత్తి సామర్థ్యం వృధాగా పడి వుండడం ఒక నష్టం కాగా, విద్యుత్తు వుత్పత్తి చేయకపోయినా చెల్లించడం మరొక నష్టం.*

నాఫ్తా, ఆర్ఎల్ఎన్‌జీ వంటి ఖరీదైన ఇంధనాలు వుపయోగించి కూడా విద్యుత్‌ను వుత్పత్తి చేస్తున్నారు. దీని వల్ల కూడా వుత్పత్తి ఖర్చు పెరిగిపోతున్నది.

ఉత్పత్తి సంస్థల వద్ద ట్రాన్స్‌కో కొనే కరెంటు ధరను రూపాయల్లో కాకుండా డాలర్లలో లెక్కించే విధంగా ప్రభుత్వం ఒప్పందాలు చేసుకొంది. దీనివల్ల రూపాయి విలువ పడి పోయినప్పుడల్లా ట్రాన్స్‌కో చెల్లించాల్సిన మొత్తం పెరిగిపోతూ వుంటుంది. ఎక్కువ ధరకు కొనడం వల్ల ప్రజలపై ఎక్కువ భారం పడుతుంది.

కరెంటు ధరనే కాక రిలయన్స్ నుంచి కొనే గ్యాసు ధరను కూడా డాలర్లలోనే నిర్ణయించారు. ఇటీవలి కాలంలో రూపాయి విలువ దారుణంగా పడిపోవడంతో రిలయన్స్ గ్యాస్‌కు అధిక మొత్తాన్ని చెల్లించాల్సి వస్తుంది. దీని వల్ల గ్యాస్ ఆధారిత విద్యుత్ ఖర్చు విపరీతంగా పెరిగిపోతున్నది.

రాష్ట్రంలో డిమాండ్‌కు సరిపడినంత విద్యుత్ లేకపోవడంతో పంపిణీ సంస్థలు ఇతర రాష్ట్రాల్లో నుంచి పెద్ద మొత్తంలో విద్యుత్‌ను కొంటున్నాయి. బహిరంగ మార్కెట్లో ధరలపై ఎటువంటి నియంత్రణ లేకపోవడంతో, చాలా ఎక్కువ ధరకు కొనాల్సి వస్తున్నది. ఇలా ఒక వైపు రాష్ట్రంలోని పంపిణీ సంస్థలు ఇతర రాష్ట్రాల నుండి కొంటుంటే, రాష్ట్రంలోని ప్రైవేట్ విద్యుత్ కేంద్రాలు ఇతర రాష్ట్రాలకు విద్యుత్‌ను అమ్ముకుంటున్నాయి.

పంపిణీ సంస్థల చేత అవసరాల కోసం ఇబ్బడి, ముబ్బడిగా కరెంటు కొనుగోలు చేయిస్తున్న సర్కార్, వాటికి సకాలంలో నిధులు మంజూరు చేయకపోవడం వల్ల, అవి దెబ్బ తింటున్నాయి. రాష్ట్రంలో 30 లక్షల 50 వేలకు పైగా ఉచిత కనెక్షన్లు వున్నాయి. వీటికి అనుగుణంగా పంపిణీ సంస్థలకు బడ్జెట్ కేటాయించాల్సి వుంటుంది. కానీ ప్రభుత్వం ఆ పని చేయడం లేదు. ఇప్పటికి ప్రభుత్వం పంపిణీ సంస్థలకు పన్నెండు వేల కోట్ల రూపాయలకు పైగా బకాయిపడి

వుంది. దీని వల్ల పంపిణీ సంస్థలు ద్రవ్య కొరతలో కూరుకొనిపోయినయి. దీని మూలంగా అవి అవసరమైన విద్యుత్‌ను, ఇతర చోట్ల నుండి కొనలేకపోతున్నాయి.

విద్యుత్ కొరత నివారణకు, ప్రైవేట్ విద్యుత్ సంస్థలను వుదారంగా అనుమతించడమే పరిష్కారం అని చెప్పిన ప్రభుత్వం, వాటితో అధిక ధరలకు విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను కుదుర్చుకుంది. వాటికి అధిక రాయితీలు కల్పించింది. బొగ్గు గనులను కేటాయించింది.

ఇకపోతే మన ప్రభుత్వాలు ఇష్టమొచ్చినట్టుగా మర్చంట్ పవర్ ప్లాంట్లకు అనుమతులిస్తున్నాయి. ప్రభుత్వం సమకూర్చిన భూమి, నీరు, ఇతర మౌలిక సదుపాయాలను ఉపయోగించుకొని, వుత్పత్తి చేసే కరెంటును, ఈ మర్చంట్ పవర్ ప్లాంట్లు ఇష్టమొచ్చిన ధరకు, ఇష్టమొచ్చిన వాళ్లకు, ఇష్టమొచ్చిన చోట అమ్ముకోవచ్చు. అంటే ఈ మర్చంట్ పవర్ ప్లాంట్లు రాష్ట్రంలో ఎన్ని వున్నా, వాటి నుండి రాష్ట్రానికి సముచిత ధరకు కరెంటేమీ దొరకదు. వీటి నుండి జెన్‌కో కూడా కొనాల్సి వస్తున్నది. మర్చంట్ పవర్ ప్లాంట్లకు కల్పించే రాయితీలను, జెన్‌కోకే కల్పిస్తే దాని ఉత్పత్తి సామర్థ్యం పెరుగుతుంది. కానీ బడా కార్పొరేట్ సంస్థలకు పాదసేవ చేసే పాలకులు ఆ పని చేయరు.

అంతేకాదు కరెంటును కొని, ఎక్కువ ధరకు అమ్ముకునే అవకాశాన్ని దళారీ వ్యాపార వర్గానికి డీమ్డ్ జనరేషన్ ఒప్పందం పేరుతో ప్రభుత్వం కల్పించింది. మొత్తంగా ఈ విధానాలన్నింటి వల్ల బహుళజాతి కంపెనీలు కోట్లు గడిస్తుంటే, ప్రజలు మాత్రం తీవ్రంగా నష్టపోతున్నారు.

అవసరానికి తగినంత కరెంటు వుత్పత్తి చేయడంలోనే సమస్య వుందంటే, ఇక సరఫరాలో 17.8 శాతం కరెంటు వృధా అవుతున్నది. ఈ వృధాతో పాటు బడా కంపెనీలు బిల్లులు కట్టకుండా కరెంటును వాడుకుంటున్న విషయం పలుసార్లు వెలుగులోకి వస్తున్నది. ఇలా నష్టపోయిన కరెంటు భారాన్ని కూడా పంపిణీ సంస్థలు ప్రజల మీదనే వేస్తున్నాయి. పంపిణీ సంస్థలు సరిగ్గా పనిచేస్తే కనీసం 20 శాతం కరెంటును కాపాడుకోవచ్చు. ఇట్లా కాపాడుకోగలిగితే ఛార్జీలు పెంచాల్సిన అవసరమే పెద్దగా వుండదు.

ఇకపోతే చాలా పెద్ద మొత్తంలోనే కరెంటు దుర్వినియోగం జరుగుతున్నది. కొద్ది శాతం ప్రజల విలాసాల కోసం ఎక్కువ శాతం కరెంటు ఖర్చయిపోతున్నది. ఈ ఖర్చును తగ్గించగలిగితే రాష్ట్రం ఎదుర్కుంటున్న విద్యుత్ కొరత చాలా మేరకు తగ్గుతుంది.

ప్రస్తుతం రాష్ట్రంలో విద్యుత్ సంక్షోభం తీవ్రమవుతున్నప్పటికీ, ఛార్జీలు పెంచడం, కోతలు పెంచడం తప్ప ప్రభుత్వం ఇంకేమీ చేయడానికి పూనుకోవడం లేదు. రాష్ట్ర అవసరాలకు సరిపడా కరెంటును ఎట్లా సాధించాలన్న విషయంలో ప్రభుత్వానికి దీర్ఘకాలిక ప్రణాళికలు ఏమీ లేవు. అన్నింటికీ పరిష్కారం ప్రైవేటీకరణలోనే వెతికే ప్రభుత్వాలకు, అటువంటి ప్రణాళికలు వుంటాయని కూడా ఆశించలేం. కరెంటు సంక్షోభానికి అణు విద్యుత్తే మందని ఇప్పుడు ప్రభుత్వాలు చెబుతున్నాయి. అయితే అణు విద్యుత్ పట్ల ప్రజల్లో తీవ్రంగా వ్యతిరేకత వస్తున్నది. తామే సృష్టించిన కరెంటు సంక్షోభాన్ని అడ్డం పెట్టుకొని నేడు అణు విద్యుత్ ప్రాజెక్టులకు జనామోదాన్ని పొందే ప్రయత్నాలు ప్రభుత్వాలు చేస్తున్నాయి. మానవాళి మనుగడకే అత్యంత హానికరమైన అణు కేంద్రాల పట్ల ప్రపంచవ్యాప్తంగా వ్యతిరేకత వస్తున్నది. జపాన్‌లోని ఫుకుషిమా అణు కేంద్రంలో జరిగిన ప్రమాదం నేపథ్యంలో అత్యధిక దేశాలు తాము స్థాపించిన అణు కేంద్రాలను మూసివేస్తున్నాయి. కాని దేశ ప్రయోజనాలను పణంగా పెట్టి అమెరికాతో చేసుకున్న అణు ఒప్పందాన్ని, ఆచరణలో పెట్టడానికి మన దేశంలో అణు విద్యుత్ కేంద్రాలను స్థాపించడానికి, మన పాలకులు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగా అణు విద్యుత్ కేంద్రాలను అడ్డుకుంటున్న ప్రజలపై వుక్కుపాదాన్ని మోపుతున్నారు.

అణు విద్యుత్‌ను నేడు మనం ఎదుర్కుంటున్న కరెంటు సమస్యకు పరిష్కారంగా చూపెడుతున్న పాలకులు ప్రమాదరహితమైన ఇతర మార్గాలపై దృష్టి పెట్టడం లేదు. ప్రపంచమంతా సౌర విద్యుత్‌పై దృష్టి పెడుతున్నా, మన పాలకులకు మాత్రం ఈ విషయంలో ఎటువంటి విధానం లేదు. సూర్యరశ్మి, గాలి, సముద్ర అలలు, చెత్త తదితర ఎన్నింటి నుంచో కరెంటును వుత్పత్తి చేయవచ్చు. అయితే ప్రస్తుతం వీటి ద్వారా చేయడం ఖర్చుతో కూడుకున్నదే. అయినప్పటికీ ప్రమాద రహితమే కాక, ఉచితంగా, విస్తారంగా లభించేవి కనుక, ఇందులో ఖర్చును తగ్గించేలా టెక్నాలజీని అభివృద్ధి చేయడం ఎంతో ఉపయోగం. కానీ అమెరికాతోనో మరో సామ్రాజ్యవాద దేశంతోనో ఈ విషయంలో ఎటువంటి ఒప్పందాలు చేసుకోలేదు కనుక పాలకులు శ్రద్ధ పెట్టరు.

నేడు రాష్ట్రం ఎదుర్కొంటున్న కరెంటు సంక్షోభానికి మూలాలు పాలకులు అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాల్లో వున్నాయి. నేడు రాష్ట్రంలో విద్యుత్ కొరతను ఎదుర్కోవడానికి కారణం రాష్ట్రంలో విద్యుత్ వుత్పత్తి సామర్థ్యం లేక కాదు. దాన్ని ప్రజల కోసం కాకుండా, కార్పొరేట్ సంస్థలకు లాభాలు కట్టబెట్టడం కోసమే వుపయోగించడంలోనే సమస్య వుంది. కాబట్టి పెంచిన కరెంటు ఛార్జీలను తగ్గించుకోవాలన్నా, అవసరమైనంత కరెంటును పొందాలన్నా ఈ పాలకులు అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ప్రజాపోరాటం కొనసాగాలి.

★

**ఈ సంచిక నుండి పత్రిక మూడు నెలలకు ఒకసారి వెలువడుతుంది. ఈ మార్పును గమనించగలరు.**

# అత్యాచారాలను పెంచి పోషిస్తున్న పాలకుల విధానాలు

డిసెంబర్ 16న ఢిల్లీలో కదులుతున్న బస్సులో జ్యోతి సింగ్ పాండేపై ఘోరమైన రీతిలో జరిగిన సామూహిక అత్యాచారం, ఫలితంగా పదమూడు రోజులు మృత్యువుతో పోరాడి, ఆమె మరణించడం, దేశీయంగానే కాదు, అంతర్జాతీయంగా సైతం సంచలనం సృష్టించింది. ఈ అత్యాచార ఘటన మొత్తంగా దేశంలోని మహిళల దుస్థితిని మరోసారి చాటి చెప్పింది. 2012 గణాంకాల ప్రకారం మన దేశంలో 21 నిమిషాలకు ఒక అత్యాచారం జరుగుతున్నది. కాని గణాంకాలకు ఎక్కని అత్యాచారాలను కూడా లెక్కలోకి తీసుకుంటే నిమిషానికొక అత్యాచారం జరుగుతున్నదని ఒక అంచనా. చాలా సందర్భాలలో అత్యాచార బాధితులు ప్రాణాలు కోల్పోతున్నారు. అత్యాచారాలు ఇంత సర్వ సాధారణం అయిపోయిన చోట, జ్యోతి సింగ్ పాండేపై జరిగిన అత్యాచారం ఇంత ప్రాచుర్యం పొందడం ఆశ్చర్యకరమే! అత్యాచారం జరిగిన తీరు వల్లనే కాదు, అత్యాచారం అనంతరం మృత్యువుతో ఆమె చేసిన పోరాటం వల్లనే కాదు, ఈ అత్యాచారంపై ఢిల్లీలోనూ, దేశంలోని మరి కొన్ని చోట్లా అపూర్వ స్థాయిలో వెల్లువెత్తిన ఆందోళన వల్ల కూడా ఈ అత్యాచార ఘటన చాలా ప్రాచుర్యం పొందింది. వెల్లువెత్తిన ఈ ఆందోళనే, మృత్యువుతో పోరాడుతున్నంత సేపూ నిర్భయగా, దామినిగా, అమానత్‌గా, మృత్యువు చేతిలో ఓడిపోయిన తర్వాత జ్యోతి సింగ్ పాండేగా కోట్లాది మందికి ఆమెను ఆత్మీయురాలిని చేసింది.

మన్మోహన్ సింగ్, సోనియా గాంధీ, షీలా దీక్షిత్‌ల ఇండ్లతో పాటు దేశ చరిత్రలో మొదటిసారి రాష్ట్రపతి భవన్‌ను ఈ ఆందోళన ముట్టడించింది. గడ్డకట్టే చలిలో అర్ధరాత్రి సైతం తన ఇంటి ముందు బైఠాయించిన ఆందోళనాకారులకు నచ్చజెప్పడానికి సోనియా గాంధీకి అర్ధరాత్రి రోడ్డు మీదికి రాకతప్పలేదు. యువతీ యువకులు తమ అక్కకో చెల్లెకో ఈ అత్యాచారం జరిగినట్టుగా, పెద్దవాళ్లు తమ బిడ్డకే ఈ అత్యాచారం జరిగినట్టుగా స్పందించారు, ఆక్రోశించారు, కన్నీళ్లు పెట్టుకున్నారు. ఆందోళన అంటేనే వులిక్కి పడే పోలీసుల చేతిలో లాఠీ దెబ్బలు, భాష్ప వాయువు ప్రయోగాలు, జల ఫిరంగులను చవి చూశారు. తట్టుకోలేక పోలీసులపై తిరగబడ్డారు. ఒక పోలీసు చావుకూ కారణమయ్యారు.

ఈ ఆందోళనే లేకుంటే, దేశంలో ఎందరో అత్యాచార బాధితుల వలెనే, జ్యోతి సింగ్ కూడా, నిశ్శబ్దంగా రాలిన కన్నీటి చుక్క వలె చరిత్ర గర్భంలో కలిసిపోయేది. ఒక దుర్మార్గాన్ని మౌనంగా భరించడం కంటే, మనమేం చేయగలం అని నిర్లిప్తంగా వుండడం కంటే, దాన్ని ఏదో స్థాయిలో ప్రశ్నించడం సంతోషించవలసిన విషయం. ముఖ్యంగా పక్క వాళ్ల గురించి కూడా పట్టించుకోనంతగా, ఒంటరి ప్రపంచంలోకి జారిపోతున్న యువత, ఇలా సామూహికంగా కదలడం ఒక ఆశావహ భవిష్యత్‌కు సూచిక.

అయితే ఇంత విస్తృత స్థాయిలో ముందుకు వచ్చిన ఈ ఆందోళన సమస్యకున్న విస్తృతిని పట్టుకోలేదు. మూలాలను చూడలేదు. దోషులను కఠినంగా శిక్షించాలె, ఉరి తియ్యాలె, నపుంసకులను చెయ్యాలె అని డిమాండ్ చేయడం మేరకే, ఈ ఆందోళన పరిమితం అయింది. మహిళలకు భద్రత కల్పించడంలో ప్రభుత్వ, పోలీసు యంత్రాంగపు అసమర్థతను ఎత్తిచూపడం మేరకే ఈ ఆందోళన పరిమితమైంది.

నేరస్తులను శిక్షించాలన్నారు కానీ, నేరస్తులను తయారు చేస్తున్న పరిస్థితుల గురించి పట్టించుకోలేదు. అత్యాచారాలు పెరగడాన్ని ప్రభుత్వ, పోలీసు యంత్రాంగాల అసమర్థతగానే చూశారు గానీ, అసలవే పెంచి పోషిస్తున్నాయని అర్థం చేసుకోలేదు.

అత్యాచారం అనేది అత్యంత హేయమైన పితృస్వామిక వ్యక్తీకరణ. మహిళల మనసు, శరీరాలను గాయపరిచే పితృస్వామిక దాడి. మహిళను అవయవాల కుప్పగా తప్ప మనసు, ఇష్టాయిష్టాలు, అభిప్రాయాలతో వ్యక్తిత్వాన్ని సంతరించుకున్న సంపూర్ణ మానవిగా పితృస్వామ్యం గుర్తించదు. ఆమె ఇష్టాయిష్టాలను, అభిప్రాయాలను పట్టించుకోవాలని, గౌరవించాలని అర్థం చేసుకోదు. పురుషుడి సౌఖ్యం కోసమే మహిళ పుట్టిందని అది బోధిస్తుంది. మహిళను పతివ్రతను చేయడం ద్వారా వేళ్లూనుకున్న పితృస్వామ్యం, పురుషులకు ఎటువంటి నైతిక విలువలను బోధించదు. పైగా పురుషత్వం పేర విచ్చలవిడితనాన్ని ప్రబోధిస్తుంది. ఇట్లా అత్యాచారానికి కావాల్సిన మూలాలు పితృస్వామ్య సమాజంలోనే వున్నాయి.

ఇక వర్గ దోపిడీ మీద ఆధారపడే అన్ని సమాజాలు, పితృస్వామ్యాన్ని బలమైన ఆధారంగా చేసుకుంటాయి. అందుకే అవి అన్ని పితృస్వామ్య విలువలను కాపాడుతాయి. కాబట్టి సమాజం పురోగమిస్తున్నదని, మహిళల స్థితిగతుల్లో అభివృద్ధికర మార్పులు వస్తున్నాయని, పాలకులు ఎన్ని గొప్పలు చెప్పుకుంటున్నా, మహిళల పట్ల సమాజ దృక్పథంలో కొంచెం కూడా మార్పు రాలేదు. ఈ దృక్పథం మారనంత వరకూ, మహిళల మీద అత్యాచారాలు అంతం కావు.

ముఖ్యంగా సామ్రాజ్యవాదానికి దాసోహం అంటున్న, మన పాలక విధానాలు అత్యాచారాలు పెరగడానికి దోహదం చేస్తున్నాయి. నూతన ఆర్థిక విధానాలు అమలవుతున్న ఈ ఇరవై యేళ్లలో మహిళలపై హింస అనేక రెట్లు పెరిగింది. తన దోపిడీని సానుకూలం చేసుకోవడానికి, సామ్రాజ్యవాదం, సంస్కృతిని, ఒక ముఖ్యమైన సాధనంగా చేసుకుంటుంది. తన మార్కెట్‌కు దోహదం చేసే సంస్కృతిని అది ప్రజలపై రుద్దుతుంది. అందుకోసం, సమాజ పురోగమనానికి దోహదం చేసే అన్ని విలువలను నాశనం చేసి, తన దోపిడీకి వుపయోగపడే విలువలను పాదుగొల్పుతుంది. అందులో భాగంగా సమాజంలో విచ్చలవిడి సెక్స్ సంస్కృతిని పెంపొందింపజేస్తున్నది. తన దోపిడీని గుర్తించకుండా, అర్థం చేసుకోకుండా, ప్రశ్నించకుండా వుండడం కోసం కూడా ప్రజలపై

## మార్చ్ 8 – అంతర్జాతీయ మహిళా దినం వర్ధిల్లాలి!

- ★ **మహిళలపై జరుగుతున్న అన్ని రకాల హింసకు వ్యతిరేకంగా సంఘటితంగా పోరాడుదాం!**
- ★ **ప్రజా ఉద్యమాల అణచివేతలో భాగంగా సాయుధ బలగాలకు విచ్చలవిడి అధికారాలిచ్చి, మహిళలపై అత్యాచారాన్ని ఒక సాధనంగా వాడుకుంటున్న రాజ్య ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా పోరాడుదాం! ఓడిద్దాం!**
- ★ **మహిళను అంగట్లో సరుకుగా మార్చి, హాస్టల్ బాలికలపై, విద్యార్థినులపై, మహిళలపై పెట్రేగిపోతున్న అత్యాచారాలకు కారణమవుతున్న కుళ్లు భూస్వామ్య సంస్కృతికి, సామ్రాజ్యవాద విష సంస్కృతికి, పితృస్వామ్య విలువలకు వ్యతిరేకంగా పోరాడుదాం! వాటిని పెంచి పోషిస్తున్న రాజ్యాన్ని దోషిగా నిలబెడదాం!**
- ★ **'మహిళా విముక్తి' నినాద స్ఫూర్తితో గ్రామగ్రామాన సభలు, సమావేశాలు, ప్రదర్శనలు విజయవంతం చేద్దాం!**

సెక్స్ సంస్కృతిని మత్తు మందులా వుపయోగిస్తున్నది. నూతన ఆర్థిక విధానాలను, భారత ప్రభుత్వం ఒప్పుకున్నాక, అది మొదట సంతకం చేసిన ఫైలు, టీవీ ఛానెల్లలో హాలివుడ్ సినిమాల ప్రసారంపై వున్న నిషేధాన్ని ఎత్తివేయడం అనేది, యాధృచ్ఛికం కాదు. ఇక ఇప్పుడు ఇంటర్‌నెట్ల ద్వారా విపరీతమైన అశ్లీలత ప్రవహిస్తున్నది. మహిళలను సినిమాల్లో, టీవీల్లో, వ్యాపార ప్రకటనల్లో సెక్స్ సింబల్స్‌గానే చూడడానికి అలవాటుపడిన వారు, నిజ జీవితంలో కూడా ఆమెను గౌరవించలేరు. జ్యోతి సింగ్‌ను అత్యాచారం చేసిన వాళ్లలో ఒక మైనర్ కూడా వున్నాడంటే, పిల్లలపై కూడా ఈ సంస్కృతి ప్రభావం ఎంతగా పడుతున్నదో అర్థం చేసుకోవచ్చు. అధికార గణాంకాల ప్రకారమే 2011లో 33,887 మంది బాలలు వివిధ నేరారోపణలతో అరెస్టయ్యారు. ఇందులో 1,419 మంది అత్యాచార ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. మహిళల పట్ల వంకర దృష్టిని పెంచుతున్న ఇటువంటి సంస్కృతిని, ఆ సంస్కృతిని పెంచి పోషిస్తున్న పాలక వర్గాలను వేలెత్తి చూపకుండా, అత్యాచారాలకు వ్యతిరేకంగా చేసే పోరాటం అర్థరహితం.

జ్యోతి సింగ్‌ను అత్యాచారం చేసిన ఆరుగురూ తాగేసి వున్నారని వార్తా కథనాలు చెబుతున్నాయి. వాళ్లలోని మైనర్, ప్రధాన నిందితుడు రాంసింగ్‌తో పాటు తనను క్రూరాతి క్రూరంగా హింసించాడని జ్యోతి సింగ్ మరణ వాంగ్మూలంలో పేర్కొన్నది. ఈ ఘోరంలో బాధితుడుగానూ, ఈ ఘోరానికి ఏకైక సాక్షిగానూ వున్న జ్యోతి స్నేహితుడు కూడా ఈ విషయాన్ని నిర్ధారించాడు. ఇంత క్రూరంగా ప్రవర్తించిన ఆ మైనర్‌ను కూడా ఉరితీయాలని, దానికోసం అవసరమైతే బాల నేరస్తుల న్యాయ చట్టం (జువెనైల్ జస్టిస్ యాక్ట్)ను సవరించాలని అందరూ కోరుతున్నారు. సుప్రీం కోర్టు కూడా బాల నేరస్తులుగా పరిగణించేందుకు ప్రస్తుతం అమల్లో వున్న నిర్వచనాన్ని పరిశీలించాలని ఈ అత్యాచారం నేపథ్యంలో నిర్ణయించింది.

మితిమీరిన తాగుడు విచక్షణా జ్ఞానాన్ని చంపుతుందనడంలో ఎటువంటి సందేహం లేదు. కాబట్టి ఈ నిందితులు అత్యాచారం చేయడంలోనైనా, ఘోరాతి ఘోరంగా బాధితురాలిని హింసించడంలోనైనా, తాగుడు పాత్ర కూడా వుండే అవకాశం వుంది. తాగి కన్నూ మిన్నూ గానక కన్నతల్లుల మీదనే, కన్న బిడ్డల మీదనే అత్యాచారానికి పాల్పడ్డ సంఘటనలు, ఎన్నో జరుగుతూనే వున్నాయి. తాగుడు ఇంతగా విలువలను పతనం చేస్తున్నా, ప్రభుత్వం తన ఆదాయాన్ని పెంచుకోవడానికి, మద్యాన్ని ఒక ప్రధాన వనరుగా భావిస్తున్నది. ప్రజల్లో తాగుడును ప్రోత్సహిస్తున్నది. మరి అత్యాచారాలను వ్యతిరేకించేవాళ్లు మద్యాన్ని కూడా తప్పకుండా వ్యతిరేకించవలసే వుంటుంది.

ఇకపోతే మైనర్ సైతం అంత ఘోరంగా ప్రవర్తించడంలో హింసను మంచినీళ్ల ప్రాయంగా అలవాటు చేస్తున్న మీడియా, సినిమాల పాత్ర లేదా? ఇవ్వాళ చట్టాలను సవరించయినా ఆ మైనరుని ఉరితీయడం పెద్ద కష్టం కాకపోవచ్చు. కాని చిన్న పిల్లలను కూడా మృగ ప్రాయులుగా మారుస్తున్న సంస్కృతిని అడ్డుకోకుండా, దాని బారిన పడిన ఎంత మంది పిల్లలను వురితీసుకుంటూ పోదాం?

కుల, మత ఆధిపత్యం కూడా మహిళలపై అత్యాచారాలకు దారితీస్తున్న ముఖ్యమైన కారణంగా వుంది. కారంచేడు, నీరుకొండ, చుండూరు, వేంపెంట, ఖైర్లాంజీ తదితర చోట్ల దళితులపై జరిగిన దాడుల్లోనూ, గుజరాత్‌లో ముస్లిం మతంపై, ఒడిశాలో క్రిష్టియన్ మతంపై జరిగిన దాడుల్లోనూ, మహిళలపై జరిగిన ఘోరమైన అత్యాచారాలన్నీ కుల, మత ఆధిపత్యాన్ని చాటుకోవడానికే. ఒక కులంపై, లేదా మతంపై తమ ఆధిపత్యాన్ని చాటుకోవడానికి, ఆ కులానికి, లేదా మతానికి చెందిన మహిళలపై అత్యాచారాలకు పాల్పడడం అనేది మహిళలను సొంత ఆస్తిగా చూసే భావజాలం నుండి జరుగుతుంది.

ఇక పాలకవర్గాలు అత్యాచారాన్ని ఆయుధంగా వాడుకోవడం వల్ల మహిళలపై అత్యాచారాలు తీవ్రంగా పెరుగుతున్నాయి. నిజానికి

ఇవ్వాళ వుద్యమ ప్రాంతాలన్నింటా మహిళలపై అత్యాచారాలకు పాల్పడుతున్నది, మహిళల భద్రతను హరిస్తున్నది, రక్షక భటులూ, భద్రతా బలగాల పేరుతో చెలామణీ అవుతున్న పోలీసులూ, అర్ధ సైనిక, సైనిక బలగాలే. జ్యోతి సింగ్ అత్యాచార సంఘటనకు చలించి సోనియా గాంధీ కన్నీళ్లు పెట్టుకుందట. మంచిదే! ఆమె హృదయంలో ఏ మూలనైనా ఆ మాత్రం తడి మిగిలి వుండడం సంతోషించవల్సిన విషయమే. కాని ఆమె కనుసన్నలలోనే నేడు ప్రభుత్వ సాయుధ బలగాలు ఎన్నో అత్యాచారాలకు పాల్పడుతున్నాయి. ఆమె కనుసన్నలలోనే ఛత్తీస్‌గఢ్‌లో నిన్నటి సల్వాజుడుంలోనూ, నేటి గ్రీన్‌హంట్‌లోనూ, మహిళలు జుగుప్సాకరమైన చిత్రహింసలకూ, అత్యాచారాలకూ గురవుతూ చివరకు ప్రాణాలు కూడా కోల్పోతున్నారు. జ్యోతి సింగ్ వలెనే, కుమ్లి, చైతేలు కూడా దారుణమైన అమానుషత్వానికి గురయ్యారు. ఆమె కనుసన్నలలోనే ఆంధ్రప్రదేశ్‌లోని వుద్యమ ప్రాంతాల్లో మహిళలపై ఎన్నో అత్యాచారాలు జరిగాయి. వాకపల్లిలో పదకొండు మంది ఆదివాసీ మహిళలపై గ్రేహౌండ్స్ పోలీసులు చేసిన అత్యాచారం అందులో ఒకానొక సంఘటన మాత్రమే. నిజానికి ఈ ప్రాంతాల్లో అత్యాచారాలతో పాటు మహిళలపై అమలవుతున్న అన్ని రకాల అణచివేతలను అంతం చేయడానికి, విప్లవోద్యమం నేతృత్వంలో ఒక విశేషమైన కృషి జరుగుతున్నది. అందులో మహిళలు కూడా విశేషంగా భాగస్వాములవుతున్నారు. కాని నేడు జ్యోతి సింగ్ పట్ల, మొసలి కన్నీళ్లు కారుస్తున్న పాలకులు, ఈ మహిళా చైతన్యాన్ని అడ్డుకోవడానికి, మహిళలపై అత్యాచారాలనే కాదు హత్యలను కూడా ఆయుధాలుగా ప్రయోగిస్తున్నారు.

ఇక ఈశాన్య రాష్ట్రాల్లో, కశ్మీర్‌లో సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని అడ్డం పెట్టుకొని, ప్రభుత్వ సాయుధ మూకలు ఇష్టమొచ్చినట్టుగా మహిళలపై అత్యాచారాలకు పాల్పడుతున్నారు. అటువంటి ఫాసిస్టు చట్టాన్ని రద్దు చేయాలని మణిపూర్ తల్లులు నగ్నంగా చేసిన ప్రదర్శనకు, 11 ఏళ్లుగా మణిపూర్ బిడ్డ ఇరోం షర్మిల చేస్తున్న నిరాహార దీక్షకు ప్రపంచం తల్లడిల్లిపోయింది, తల్లడిల్లిపోతున్నది. జ్యోతి సింగ్ సంఘటనతో కదిలిపోయినట్టుగా నటిస్తున్న పాలకులను వందలాది మహిళల మీద, తమ బలగాలు చేస్తున్న అత్యాచార వార్తలు మాత్రం కదిలించడం లేదు. కదిలించవు కూడా. ఎందుకంటే వుద్యమాలను అణచడానికి అత్యాచారాలను ఒక ఆయుధంగా పాలకులే వాడుకుంటున్నారు. ఇప్పుడు కన్నీళ్ల మాటున తమ అసలు స్వభావాన్ని – అత్యాచారాలను ఆయుధంగా వాడుకుంటున్న స్వభావాన్ని – మరుగుపరిచే ప్రయత్నం చేస్తున్నారు. జ్యోతి సింగ్‌పై అత్యాచారం చేసిన వాళ్లు, వుత్త ఆవారాగాళ్లు కాకుండా సంఘంలో పెద్ద పలుకుబడి వున్న వాళ్లో, రాజకీయ అండదండలు వున్న వాళ్లో, ప్రభుత్వ సాయుధ బలగాలో అయివుంటే సోనియాకు కన్నీళ్లు వచ్చి వుండేవా? నేడు పార్లమెంటులో, రాష్ట్ర అసెంబ్లీల్లో అత్యాచార ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎంపీలు, ఎమ్మెల్యేలు ఎంతో మంది వున్నారు. వీళ్లలో కాంగ్రెస్ పార్టీ వాళ్లే ఎక్కువగా వున్నారు. సోనియాకు అత్యాచార బాధితుల పట్ల ఏమాత్రం సానుభూతి వున్నా, అత్యాచార ఆరోపణలు ఎదుర్కొంటున్న వాళ్లకు టికెట్లు ఇవ్వకుండా వుండేది. 16 ఏళ్ల క్రితం కేరళలోని సూర్యనెల్లిలో 16 ఏళ్ల అమ్మాయిపైన 42 మంది అత్యాచారానికి పాల్పడ్డారు. ప్రస్తుతం రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్‌గా వున్న కురియన్ కూడా ఈ అత్యాచారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. ఢిల్లీ అత్యాచార ఆందోళనల నేపథ్యంలోనైనా కురియన్‌పై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. పైగా కురియన్‌ను వెనకేసుకొస్తూ ఒక కాంగ్రెస్ ఎంపీ సూర్యనెల్లి అత్యాచార బాధితురాలు వేశ్య అంటూ నోరుపారేసుకున్నాడు. కాని సోనియాలో ఏ ప్రతిస్పందన లేదు!

అత్యాచారాలను ఒక ఆయుధంగా వాడుకుంటున్న వాళ్లు, అత్యాచార నిందితులకు పదవులను కట్టబెడుతున్న వాళ్లు అత్యాచారాలను నిరోధించడానికి తగిన చర్యలు తీసుకుంటారా? బాధితులకు కనీస న్యాయమైనా చేయగలరా?

ఢిల్లీలో వున్న పోలీసులు చాలా మంది వీఐపీల భద్రతా బాధ్యతల్లోనే వున్నారని, అందుకని కూడా మహిళల భద్రతకు సమస్యగా వుందని ఒక వాదన బలంగానే ముందుకు వచ్చింది ఈ సందర్భంగా. నిజంగా పోలీసులు మహిళలకు భద్రత కల్పిస్తారా? పోలీసు స్టేషన్లు అత్యాచార నిలయాలుగా మారడం నిజం కాదా? ఒకవైపు ఈ అత్యాచార నిరసనలు వెల్లువెత్తుతుండగానే గుంటూరు, చిత్తూరు జిల్లాల్లో కంప్లైంట్ ఇవ్వడానికి వెళ్లిన మహిళలను పోలీసులు అత్యాచారం చేసిన వార్తలు వెలుగులోకి వచ్చాయి. ఖాకీ బట్టలను తమ కామదాహాన్ని తీర్చుకోవడానికి వాడుకుంటున్న పోలీసులు, మహిళలకు ఎన్నడూ భద్రత కల్పించలేరు!

దేశంలో నిమిషానికొకటి చొప్పున జరుగుతున్నా, ఎన్నో అత్యాచారాలు వెలుగు చూడకుండానే చరిత్ర చీకటి గర్భంలో కలిసిపోతున్నాయి. వెలుగులోకి వచ్చినవి చాలా అరుదుగా ఆందోళన రూపం తీసుకుంటున్నాయి. ఢిల్లీ అత్యాచారం తర్వాత దేశవ్యాప్తంగా ఎన్నో అత్యాచారాలు జరిగాయి. చిన్న పిల్లలపై కూడా ఎన్నో అత్యాచారాలు జరిగాయి. అత్యాచారానికి పాల్పడిన వాళ్లలో మైనర్లు సహా అన్ని రకాల వాళ్లు వున్నారు. ఢిల్లీలో కూడా ఎన్నో అత్యాచారాలు జరిగాయి. ఢిల్లీ పోలీసుల రికార్డుల ప్రకారమే జ్యోతి సింగ్ ఘటన తర్వాత నెల రోజుల్లోనే 45 అత్యాచారాలు, 75 లైంగిక వేధింపుల కేసులు నమోదయ్యాయి. ఇక ఇటీవల అయిదేళ్ల చిన్నారి మీద జరిగిన అత్యాచారం మరోసారి ఆందోళనలకు దారితీసింది. కాని మిగతా అత్యాచారాలన్నీ ఏ ఆందోళనలకు దారి తీయలేదు. వెలుగులోకి వచ్చిన, ఆందోళనగా వెల్లువెత్తిన సందర్భాలలోనైనా, అత్యాచారాలకు దారితీస్తున్న పరిస్థితుల గురించి, మగవాళ్లను మృగాల కంటే హీనంగా మారుస్తున్న సంస్కృతి గురించి మాట్లాడుకోవడం అవసరం. అత్యాచారానికున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ నేపథ్యం గురించి మాట్లాడుకోకుండా కేవలం శిక్షల గురించే మాట్లాడుకుంటే ఎటువంటి ప్రయోజనం వుండదు. కేవలం శిక్షలను డిమాండ్ చేయడం అనేది ప్రతీకారం కోరుకోవడమే అవుతుంది తప్ప, అత్యాచారాలను నిర్మూలించడం వైపుగా ఆలోచించడం అవదు. తనను అత్యాచారం చేసిన వాళ్లను సజీవ

దహనం చేయాలని జ్యోతి సింగ్ కోరుకుందట. ఆమె అనుభవించిన వేదన నుండి ఆమె అలా కోరుకోవడాన్ని తప్పకుండా అర్థం చేసుకోవాల్సిందే. కాని ఆ శిక్ష మరి కొన్ని అత్యాచారాలను ఆపగలదా? జ్యోతి సింగ్ బతికుంటే, నేరస్తులకు పడే కఠిన శిక్షలు, ఆమె గాయానికి కొంత ఉపశమనాన్ని ఇచ్చి వుండేవేమో కాని, ఆ గాయాన్ని మాన్పలేకపోవును. ఆ కఠిన శిక్షలు, ఇప్పుడామె తల్లిదండ్రులకు కొంత సాంత్వనను ఇస్తాయేమో, కాని వాళ్ల గర్భశోకాన్ని మాత్రం పోగొట్టలేవు. అంతే కాదు జ్యోతి సింగ్‌లా మరి కొందరు మహిళలు బలికాకుండా కూడా ఆ శిక్షలు అడ్డుకోలేవు. ఎవరూ నేరస్తులుగా పుట్టరు. ఈ సమాజమే నేరస్తులుగా తయారు చేస్తుంది. నేరస్తులుగా మారుతున్న ప్రక్రియను అడ్డుకోకుండా శిక్షలతో భయపెట్టి నేరాలను ఆపలేము. నేరస్తులుగా తయారయ్యే ప్రక్రియ కొనసాగుతూనే వుంటే, సాక్ష్యాలను నిర్మూలించి చట్టాలకు, శిక్షలకు దొరక్కుండానో, లేదా శిక్షలకు సిద్ధపడో నేరాలకు పాల్పడుతూనే వుంటారు. కాబట్టి నేరస్తులను నిర్మూలించడం గురించి కాదు, నేరాలను నిర్మూలించడం గురించి సమాజమంతా దృష్టి పెట్టాల్సి వుంది.

ఇకపోతే, దోషులను కఠినంగా శిక్షించాలనే ఆందోళనాకారుల డిమాండ్‌ను, ప్రభుత్వం వెంటనే ఆమోదించింది. మహిళల భద్రతను తీవ్రంగా పట్టించుకుంటున్నట్టు, కొన్ని చర్యలను చేపట్టింది. దేశ రాజధానిలో మహిళల భద్రతకు సూచనలు చేసేందుకు జస్టిస్ ఉషా మెహ్రాతో ఏక సభ్య కమిటీని ఏర్పాటు చేసింది. అత్యాచారాలను నిరోధించడానికి, అత్యాచారాలకు పాల్పడిన వారికి కఠిన శిక్షలు వేయడానికి, చట్టాలలో ఏమేం మార్పులు చేయాల్సి వుంటుందో సూచించమంటూ జస్టిస్ వర్మ నేతృత్వంలో ముగ్గురితో ఒక కమిటీని వేసింది. నెల రోజుల పాటు అధ్యయనం చేసి వర్మ కమిటీ ఇచ్చిన నివేదికపై ఆధారపడి, చాలా వేగంగా క్రిమినల్ సవరణ బిల్లు – 2013ను తీసుకువచ్చింది. వర్మ కమిటీ నివేదిక, ప్రభుత్వం తెచ్చిన బిల్లు మంచి చెడ్డల గురించి విడిగానే మాట్లాడుకోవాల్సి వుంటుంది. అయితే అత్యాచారాలను నిరోధించడం కోసమంటూ, ఇవ్వాళ హడావుడిగా బిల్లు తెచ్చిన ప్రభుత్వం, ఇన్నాళ్లూ అమల్లో వున్న అత్యాచార చట్టాలను ఎంతమేరకు వుపయోగించింది? నిజానికి అత్యాచార బాధితులు పోలీసు స్టేషన్లకు పోయి కేసు పెట్టే పరిస్థితి కూడా లేదు. ఎవరైనా ధైర్యం చేసి కేసు పెట్టడానికి ప్రయత్నిస్తే, దోషుల దగ్గర లంచాలు తిన్న పోలీసులు కేసులను బుక్ చేయడం లేదు. చేసినా వాటిని నిర్వీర్యపరుస్తున్నారు. పోలీసులు సృష్టించే అడ్డంకులను అతి కష్టం మీద దాటుకొని తమ దాకా వచ్చిన కేసులను ఏళ్లకేళ్లు సాగదీస్తూ, కోర్టులు బాధితులను అగ్ని పరీక్షకు గురిచేస్తున్నాయి. ఇకపోతే ఏ నేరం చేశారు? ఎలా చేశారు? అనే అంశాలపై కాకుండా నేరం ఎవరు చేశారు అన్న దానిపై ఆధారపడి శిక్షలు వుంటున్నాయి. నేరస్తుల కులం, వర్గం, వాళ్లకున్న పలుకుబడి, రాజకీయ అండదండలు... వీటన్నింటిపై ఆధారపడి శిక్షలు వుంటున్నాయి. కాబట్టి చాలా మంది తమ పలుకుబడిని వుపయోగించుకుని శిక్షలు తప్పించుకుంటున్నారు. నేషనల్ క్రైమ్ బ్యూరో వెల్లడించిన నివేదిక ప్రకారం 2009–11 మధ్య కాలంలో దేశవ్యాప్తంగా 68 వేల అత్యాచార కేసులు నమోదయితే, 16 వేల మందికి మాత్రమే శిక్షలు పడ్డాయి. అందులో చాలా మేరకు, చాలా నామమాత్రమైన శిక్షలని ఊహించడం కష్టం కాదు. ఇక అప్పీళ్లలో మరెన్నో కేసులు కొట్టుడుబోయే అవకాశం ఎట్లాగూ వుంటుంది. సూర్యనెల్లి అత్యాచారం కేసులో 42 మందిపై ఆరోపణలు వుంటే కంటి తుడుపు కోసం ఒకరికి శిక్ష వేసి మిగతా వాళ్లందరినీ వదిలేశారు. మరి ఇన్నాళ్లూ వున్న చట్టాలను వుపయోగించుకోకుండా, వాటిని నిర్వీర్యం చేస్తూ, ఇవ్వాళ కొత్త చట్టాలు, లేదా సవరణలు ఎందుకు చేస్తున్నట్టు?

ఇవ్వాళ ఆందోళన నేపథ్యంలో వెంటనే ఓ చట్టం చేసి పారేసి, ఇన్నాళ్లూ చట్టాలను నిర్వీర్యం చేస్తూ ఎంతో మంది దోషులను కాపాడిన తమ చరిత్రను మరుగుపరుచుకోవాలని పాలకులు చూస్తున్నారు. అంతేకాదు వెల్లువెత్తిన ఆందోళనను అత్యాచార మూలాల్లోకి పోకుండా చల్లార్చడం, చట్టాలతోనే సంతృప్తిపరచడం కూడా, ఈ హడావుడి బిల్లు తేవడం వెనుక వున్న వుద్దేశం. ఈ అత్యాచారం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తన బడ్జెట్‌లో నిర్భయ నిధి పేరుతో మహిళల భద్రత, సాధికారత కోసమంటూ వెయ్యి కోట్లను కేటాయించింది.

పాలకుల కుట్రను అర్థం చేసుకోవాలి. అత్యాచారాలను నిరోధించడానికి చట్టాలు, కఠిన శిక్షలు, బడ్జెట్‌లో కేటాయింపులు మాత్రమే సరిపోవని, మహిళను విలాస వస్తువుగా చూసే పితృస్వామ్య వ్యవస్థతోను, అత్యాచారాలను మరింతగా పెంచుతున్న సామ్రాజ్యవాద సంస్కృతితోను పోరాడాలని అర్థం చేసుకోవాలి.

ఇక ఈ అత్యాచారాం నేపథ్యంలో ఎందరో బుర్రలకు పట్టిన బూజు ఏ స్థాయిలో వుందో మరోసారి అర్థమైంది. అత్యాచారం జరిగినప్పుడు పితృస్వామ్య సమాజం ముందుగా మహిళనే బోనెక్కిస్తుంది. ఆమె ప్రవర్తన, వేషధారణ అన్నీ శల్య పరీక్షకు గురవుతాయి. ఈ సందర్భంగానూ అదే జరిగింది. "రెండు చేతులూ కలిస్తేనే కదా చప్పట్లు, జ్యోతి తిరగబడకుండా 'అన్నా' అని ప్రాధేయపడితే ఇలా జరిగేది కాదు." "అర్ధరాత్రి స్వాతంత్ర్యం వచ్చింది కదాని అర్ధరాత్రి ప్రయాణాలు చేస్తే ఎలా?" "మహిళల అందంతోనే వచ్చింది సమస్యంతా'' ''బాల్య వివాహాలే అత్యాచారాలకు మందు" "మహిళలు వంటింటికే పరిమితమైతే అత్యాచారాలుండవు." "మహిళ పురుషుడికి విధేయంగా వున్నంత కాలం ఆమెను రక్షిస్తాడు." "90 శాతం అత్యాచారాలు మహిళల అంగీకారంతోనే జరుగుతాయి"... ఇంకా ఈ కోవకు చెందిన ఎన్నో కరడుగట్టిన పితృస్వామిక వ్యాఖ్యానాలు వెలువడ్డాయి. వీటిని చేసింది ప్రముఖులుగా గుర్తించబడుతున్న పురుషులు.

ఇక మహిళల కట్టూ, బొట్టూ గురించి ఎంతోమంది వ్యాఖ్యానించారు. ఢిల్లీ ముఖ్యమంత్రి షీలా దీక్షిత్ కూడా "పురుషులను రెచ్చగొట్టే విధంగా మహిళల వస్త్రధారణ వుండకూడదని, జీన్స్ ప్యాంట్లు వేసుకోవద్దని, నిండుగా వుండే దుస్తులే వేసుకోవాల"ని

సెలవిచ్చారు. రాజస్థాన్‌లో స్కర్టులు వేసుకోవడం నిషేధించాలని ఒక బీజేపీ ఎమ్మెల్యే అన్నాడు.

అత్యాచారాలకు కారణం వస్త్రధారణే అయితే, నిండా బురఖా ధరించే ముస్లిం మహిళల మీద ఎందుకు అత్యాచారాలు జరుగుతున్నాయి? ఏ అలంకరణలు లేకుండా నిండా తెల్లటి బట్టలు కట్టుకునే క్రైస్తవ సన్యాసుల మీద ఎందుకు జరుగుతున్నాయి. పసిపాపల మీద, ముసలమ్మల మీద కూడా ఎందుకు జరుగుతున్నాయి? అర్ధనగ్న వస్త్ర ధారణ వుండే ఆదివాసీ సమాజంలో అత్యాచారాల శాతం ఎందుకు తక్కువగా వుంది? వీటిన్నింటినీ చూస్తే సమస్య కట్టూ, బొట్టులో లేదని మహిళల పట్ల సమాజ దృక్పథంలో వుందని అర్థం కావడం లేదా?

ఇకపోతే మహిళల కట్టూ, బొట్టే కారణం అనుకుంటే, అసలు మహిళల కట్టూ, బొట్టును ఎవరు నిర్దేశిస్తున్నారు? పితృస్వామ్య సమాజం కాదా? భూస్వామ్య పితృస్వామ్యం ఒక రకమైన కట్టూ, బొట్టును రుద్దితే, సామ్రాజ్యవాద పితృస్వామ్యం మరో రకమైన కట్టూ, బొట్టును రుద్దుతున్నది. మహిళల ఇష్టాయిష్టాలు, సౌకర్యంతో సంబంధం లేకుండా, వాళ్ల కట్టూ, బొట్టును నిర్దేశిస్తూ, మళ్లీ ఆ కట్టూ, బొట్టు కారణంగా, మహిళలనే తప్పు పట్టడం అంటే మహిళల మీద సాంప్రదాయ బంధనాలను పెంచడానికే. కట్టూ బొట్టూ సాంప్రదాయకంగా కాదు, సభ్యతగా, సౌకర్యంగా వుండాలి. అయితే ఈ సూత్రం మహిళలకే కాదు, పురుషులకు కూడా తప్పకుండా వర్తించి తీరాలి.

మహిళల కట్టూ, బొట్టు మీద ఇంతగా నోరుపారేసుకునే ఈ పెద్ద మనుషులు, వ్యాపార ప్రకటనల్లో మహిళలను నగ్నంగా చూపించడంపై మాత్రం నోరెత్తరు. సినిమాలు, టీవీలు, ఇంటర్నెట్‌ల ద్వారా ప్రవహిస్తున్న అశ్లీలత గురించి మాట్లాడారు. పైగా వీళ్లే అనుమతులు కూడా ఇస్తారు. ఢిల్లీ అత్యాచారం నేపథ్యంలో సినిమా నటులు కూడా ఆందోళనల్లో పాల్గొన్నారు. కొందరు కన్నీళ్లు కూడా పెట్టుకున్నారు. సినిమాల ద్వారా ప్రవహిస్తున్న అశ్లీలం కూడా అత్యాచారాలు పెరగడానికి దోహదం చేస్తున్నదనే విషయం వాళ్లు కొంతైనా గుర్తిస్తే, వాళ్లు ఆందోళనలో పాల్గొనడం కంటే ఎక్కువ వుపయోగకరంగా వుండేది.

ఈ అత్యాచారం నేపథ్యంలో అమ్మాయిలకు ఆత్మరక్షణ మెళకులు నేర్పించాలనే చర్చలు దేశవ్యాప్తంగా జరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో హైస్కూల్ నుండి డిగ్రీ వరకూ కరాటే నేర్పించాలని హోం శాఖ నిర్ణయించింది. గుంటూరు జిల్లాలో ఎస్పీ అమ్మాయిలకు కారం పొట్లాలు పంచాడు. ఆత్మరక్షణ మెళకువలను తప్పుపట్టాల్సిన అవసరం లేదు. కాని మహిళల మీద అనుక్షణం దాడులు జరిగే అవకాశమున్న పరిస్థితిని మార్చకుండా, ఆ దాడుల నుంచే రక్షించుకునే మార్గాలను వెతకడం అంటే, ఆ పరిస్థితులతో రాజీపడడమే. పైగా కరాటే, కారంపొట్లం వంటి వాటితో చేసుకునే ఆత్మరక్షణకు ఎన్ని పరిమితులుంటాయో తెలియనిది కాదు. వీటితో ఒకరిద్దరిని ఎదుర్కోవచ్చేమో గాని, గుంపును ఎదుర్కోవడం పూర్తిగా అసాధ్యం. సమస్య మూలాల్లోకి పోకుండా తప్పుడు పరిష్కార మార్గాలతో సరిపెట్టడమిది.

ఇకపోతే జ్యోతిసింగ్‌కు (మరణానంతరం) అమెరికా సాహస వనితలకిచ్చే అవార్డును ప్రకటించింది. ఒకవైపు జ్యోతిసింగ్‌లను బలితీసుకుంటున్న సంస్కృతిని దిగుమతి చేస్తూ, మరోవైపు జ్యోతిసింగ్‌కు అవార్డు ఇవ్వడమనేది, తన నేరాన్ని కప్పిపుచ్చుకోవడానికే. సరిగ్గా భారత ప్రభుత్వం కూడా ఇదే పనిచేసింది. ఈ సారి మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినం సందర్భంగా జ్యోతిసింగ్‌కు (మరణానంతరం) ఝాన్సీ లక్ష్మీబాయి అవార్డును ప్రకటించింది. జ్యోతి సింగ్‌ను బలితీసుకున్న నేరంతో పాటు, ఝాన్సీ లక్ష్మీబాయి వంటి సాహస వనితలెందరినో చంపుతున్న నేరాన్ని కప్పిపుచ్చుకోవడానికే ఈ అవార్డు.

భారత ప్రభుత్వం జ్యోతిసింగ్‌కు ఈ అవార్డ్ ఇచ్చిన సందర్భంగా ఒక రెండు విషయాలను గుర్తు చేసుకోవాల్సి వుంటుంది. 2011లో ఛత్తీస్‌గఢ్‌లో సోనీ సోడీ అనే ఒక ఆదివాసీ వుపాధ్యాయినిని, మావోయిస్టులతో సంబంధాలున్నాయనే బూటకపు ఆరోపణతో అరెస్టు చేసి, సభ్య సమాజం తలదించుకోవాల్సినంత హేయంగా, ఆమెను చిత్రహింసలు పెట్టిన దంతెవాడ ఎస్పీ అంకిత్ గర్గ్‌కు గత సంవత్సరం వీరతా పురస్కార్‌ను ఇచ్చి సన్మానించింది ప్రభుత్వం. జ్యోతిసింగ్‌కు అవార్డ్ ఇచ్చిన చేతులతోనే ఎల్‌టీటీఈ మహిళా గెరిల్లాలను దారుణంగా అత్యాచారాలు చేసి, చంపి, నగ్నంగా కుప్పలు వేసి, శరీరావయవాలను కోసి, భయంకరమైన క్రూరత్వానికి పాల్పడ్డ రాజపక్షేను, ఎర్రతివాచీ పరచి మన దేశానికి ఆహ్వానించింది. జ్యోతిసింగ్, సోనీ సోడీ, ఎల్‌టీటీఈ మహిళా గెరిల్లాలు అందరూ బాధితులే. సోనీ సోడీని బాధించినవాడికి అవార్డు ఇచ్చి, రాజపక్షే వంటి పరమ క్రూరులకు ఎర్రతివాచీ స్వాగతాలు పలికిన అపఖ్యాతిని తెరమరుగు చేయడానికి, జ్యోతి సింగ్‌కు ఈ అవార్డు ప్రకటించారని అర్థం చేసుకోవాలి.

చివరగా, జ్యోతి సింగ్ అత్యాచారం నేపథ్యంలో ప్రజా స్పందనకు సంబంధించిన రెండు భిన్నమైన కోణాలు వ్యక్తమయ్యాయి. జ్యోతి సింగ్ పైనా, ఆమె స్నేహితుడి పైనా నిందితులు చాలా తీవ్ర స్థాయిలో దాడి చేసి రోడ్డు మీదికి విసిరేసి పోయారు. నగ్నంగా, నెత్తుటి ముద్దలుగా వాళ్లిద్దరూ చేసిన ఆర్తనాదాలు ఆ రోడ్డున వెళుతున్న ఎవర్నీ కదిలించలేదు. ప్రేక్షకుల్లా చూస్తూ వుండిపోయారే తప్ప, ఎవరూ సాయం చేయడానికి ముందుకు రాలేదు. కాని ఆ తర్వాత మాత్రం అపూర్వమైన స్పందన వచ్చింది. ఈ నేపథ్యంలోనే జ్యోతి సింగ్ స్నేహితుడు "కొవ్వొత్తుల ప్రదర్శనలతో మనుషుల వైఖరిని మార్చలేరు. రోడ్డు పక్కన సహాయం కోసం ఎదురుచూసే వారిని ఆదుకోండి. ఆ రోజు ఒక్కరు మా మొర ఆలకించి వున్నా, పరిస్థితి భిన్నంగా వుండేది" అని వ్యాఖ్యానించాడు. ఈ వ్యాఖ్యానం ఆక్రోశం నుండి చేసిందే కావొచ్చు, కాని చాలా ఆలోచింపచేసేది.

ఎదుటి వాళ్లు చస్తున్నా పట్టించుకోని ఒక నిర్లిప్త వైఖరిని పాలకులు పథకం ప్రకారమే ప్రజల్లో పెంచుతున్నారు. దాని

# ఓట్ల, సీట్ల పార్టీలు తెలంగాణను సాధించలేవు

తెలంగాణ సంగతి మళ్ల మొదటికొచ్చింది. 2012 డిసెంబర్ 28న అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేసి, తెలంగాణ సమస్యను పరిష్కరిస్తమన్న ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలు, మళ్లోసారి తెలంగాణ ప్రజల్ని గోరంగ మోసం చేసింద్రు.

అసలీ అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసింది, ప్రజల్ని మళ్లోసారి మోసం చేస్తందుకే తప్ప, నిజంగ సమస్యను పరిష్కరించాల్నన్నే వుద్దేశంతోటి గాదు. సెప్టెంబర్ 30న హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్డు మీద సాగరహారం పేరుతోటి జరిగిన తెలంగాణ కవాతు విజయవంతం అయింది. ఈ కవాతు సందర్భంగ తెలంగాణ కాంగ్రెస్ నాయకుల మీద మరోసారి ఒత్తిడి పెరిగింది. తెలంగాణ కోసం తాము పోరాడుతున్నట్టుగ, జనానికి కనిపియ్యకపోతే తమకింక తెలంగాణల పుట్టగతులుండవనే విషయం వాళ్లకు అర్థమయ్యింది. అందుకే ఆనాడు సాగరహారంకు అనుమతియ్యనని కిరికిరి పెట్టిన ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డిని బతిలాడింద్రు, బామాడింద్రు, ఆఖరికి కొట్లాడింద్రు. ఆ తర్వాత పార్లమెంట్ చలికాలం సమావేశాల సందర్భంగ లోపల, బయటా గూడా తెలంగాణ ఎంపీలు లొల్లి జేసింద్రు. ఆఖరికి తెలంగాణ ఇస్తమని ప్రకటించేదాంక ఎఫ్‌డీఐ బిల్లుకు ఓటెయ్యమన్నరు. ఇగ ఢిల్లీ కాంగ్రెసోళ్లకు ఏదో ఒక మాయ జెయ్యక తప్పలేదు. అందుకే డిసెంబర్ 28న అఖిల పక్ష మీటింగ్ బెట్టి, అండ్ల తెలంగాణ సంగతి తేలుస్తమని కేంద్ర హోం మంత్రి సుశీల్ కుమార్ షిండే ప్రకటించిండు. తెలంగాణ కాంగ్రెస్ నాయకులకు గావల్సింది, తెలంగాణ కోసం ఏదో వొకటి జేత్తున్నం అన్న పేరే గావట్టి, అఖిల పక్షం అని ప్రకటించంగనే, ఇగ తెలంగాణ ఇచ్చేసినట్టుగనే ఎఫ్‌డీఐ బిల్లుకు ఓటేసింద్రు.

ఇట్ల తప్పనిసరి పరిస్థితిల మళ్లొకసారి అఖిల పక్ష సమావేశం అనే నాటకానికి తెరలేసింది. నిజానికి ఇదొక అర్థంలేని విషయం. అఖిల పక్ష సమావేశం దేని కోసం? తెలంగాణ గురించి రాష్ట్రంలున్న ఓట్ల రాజకీయ పార్టీల అభిప్రాయాలు తెల్సుకుంటందుకు! అట్ల తెలుసుకొని, దాని మీద ఆధారపడి తెలంగాణ ఇచ్చుడో, ఇయ్యకపోవుడో తేలుస్తమనడం చాలా అన్యాయం. ఎందుకంటే రాష్ట్రంలోని కాంగ్రెస్, టీడీపీ, టీఆర్ఎస్, వైఎస్ఆర్‌సీపీ, బీజేపీ, సీపీఎం, సీపీఐ, ఎంఐఎం, లోక్‌సత్తా ఇట్ల మొత్తం తొమ్మిది పార్టీలను కేంద్రం పిల్సిందీ మీటింగుకు. తెలంగాణను ఏర్పాటు జేస్తందుకు ఈ పార్టీల అభిప్రాయాల్నే ప్రామాణికంగ తీసుకునేటట్టయితే ఈ తొమ్మిది పార్టీల్ల మూడంటే మూడు – టిఆర్ఎస్, బీజేపీ, సీపీఐ – మాత్రమే ఇప్పటికి స్పష్టంగ తెలంగాణకు మద్దతిస్తున్నయి. ఇగ సీపీఎం, ఎంఐఎం, లోక్‌సత్తాలు స్పష్టంగ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును వ్యతిరేకిస్తున్నయి. కాంగ్రెస్, టీడీపీలు పచ్చి అవకాశవాదాన్ని ప్రదర్శించుకుంట ఏ రోటికాడ ఆ పాట పాడుతున్నయి. ఓట్ల ముందు ఒక మాట, ఓట్ల తర్వాత ఇంకొక మాట మాట్లాడుతున్నయి. మాటలు ఏం జెప్పినా, రాష్ట్రంల సీమాంధ్ర నాయకుల పెత్తనం కింద నడుస్తున్న ఈ పార్టీలు, తెలంగాణకు మద్దతిచ్చే అవకాశం లేదు. ఈ పరిస్థితిల అఖిల పక్ష మీటింగులు పెట్టి, ఏం తేల్చాలనేది కాంగ్రెస్ పెద్ద మనుషుల పన్నాగం? ఏకాభిప్రాయం లేదు అనేగదా!

నిజానికి ఏకాభిప్రాయం అనేది ఏ విషయంల గూడ వుండదు. ప్రజాస్వామ్యం అని జెప్పుకునే ఏ వ్యవస్థయినా మెజారిటీ అభిప్రాయాన్ని లెక్కలకు తీసుకొని నిర్ణయాలు జేస్తది. తెలంగాణ

---

ఫలితమే జ్యోతిసింగ్, ఆమె స్నేహితుడి పట్ల ప్రజల్లో మొదట వ్యక్తమయిన వుదాసీనత. అయితే ఎన్ని కుట్రలు పన్నుతున్నా, పాలకులు తయారు చేయాలనుకుంటున్న మూసలో అందరూ ఒదిగిపోవడం లేదనడానికి, ఆ తర్వాత వచ్చిన స్పందన ఒక వుదాహరణ. కాని ఇలా స్పందిస్తున్న వాళ్లకు సరైన దృక్పథం కొరవడుతున్నది. ఆ దృక్పథాన్ని అందించాల్సిన బాధ్యత ప్రజా వుద్యమాల మీద వున్నది. అంతేకాదు ఆ స్పందన కూడా చాలా యాదృచ్ఛికంగా వుంటున్నది. జ్యోతి సింగ్ కంటే ముందూ, తర్వాత ఎన్నో అత్యాచారాలు జరిగాయి. ముఖ్యంగా దేశంలో ఆదివాసీ, దళిత మహిళలపై అత్యాచారాలకు అంతే వుండడం లేదు. ఈ అత్యాచారాల పట్ల యువతలో ఏ స్పందనా కానరావడం లేదు. వీటన్నింటి పైనా స్పందించే చైతన్యాన్ని కూడా యువతకు అందించడానికి తీవ్రంగా కృషి చేయాల్సి వుంది. ముఖ్యంగా నేడు జ్యోతి సింగ్‌పై అత్యాచారానికి వ్యతిరేకంగా యువత ఉవ్వెత్తున నిరసనలు తెలుపుతున్నది. కాని గుజరాత్‌లో వందల, వేల అత్యాచారాలకు కారకుడైన మోడీని యువతనే ఎక్కువగా ఆదరిస్తున్నదని సర్వేలు చెబుతున్నాయి. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని యువతకు సరైన సామాజిక దృక్పథాన్ని అందించాల్సి వుంది. అప్పుడు మాత్రమే యువత స్పందనను సామాజిక మార్పు కోసం వుపయోగించుకోవడం సాధ్యమవుతుంది. లేకుంటే ఇలా వచ్చి అలా వెళ్లే కెరటాల్లాగా ఆ స్పందన నిష్ప్రయోజనం అవుతుంది.

మహిళల మీద కొనసాగుతున్న అత్యాచారాలతో పాటు, అన్ని రకాల అణచివేతలను అంతం చేయడం కోసం, మన దేశంలో మహిళా విముక్తి వుద్యమం కొనసాగుతున్నది. పితృస్వామ్యాన్ని తమ దోపిడీకి బలమైన సాధనంగా చేసుకున్న, భూస్వామ్య, దళారీ నిరంకుశ బూర్జువా, సామ్రాజ్యవాదాలే మహిళలపై అమలవుతున్న అన్ని రకాల అణచివేతలకు మూలమనే స్పష్టమైన ఎరుకతో, ఈ వర్గాలను లక్ష్యంగా చేసుకొని మహిళా వుద్యమం ముందుకు సాగుతున్నది. నేడు అత్యాచారాలను అంతం చేయాలని నినదిస్తున్న మహిళలు ఈ వుద్యమంలో చేరి, పోరాడడం ద్వారానే మహిళలు భద్రంగా జీవించే సమాజాన్ని సాధించుకోగలరు.

★

ఏర్పాటుకు గూడ అట్ల మెజారిటీ అభిప్రాయాన్నే లెక్కలకు తీసుకోవాలె. అయితే ఆ మెజారిటీ అభిప్రాయం ఎవరిదై వుండాలె? ప్రజలదా? పార్టీలదా? మనది ప్రజాస్వామ్యం అని చెప్పుకుంటున్నం గనుక ప్రజలదే అయివుండాలె. అయితే పార్టీలు ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తయని, పార్టీల అభిప్రాయమంటే ప్రజల అభిప్రాయమేనని పాలకులు నమ్మబలుకుతరు. నిజంగనే నిజమైన అర్థంల ఈ పార్టీలు ప్రజలకు ప్రాతినిధ్యం వహించేటట్లయితే, ఈ పార్టీల అభిప్రాయాన్నే ప్రజల అభిప్రాయంగ తీసుకోవచ్చు. కాని అటువంటి పరిస్థితి వున్నదా? ఉంటే ప్రజాభిప్రాయానికి విరుద్ధంగ ఇన్ని విధానాలు ఎట్ల తయారైతున్నయి? ఇగ తెలంగాణ సంగతే చూస్తే ఒక్క టీఆర్ఎస్ తప్ప తెలంగాణకు ప్రాతినిధ్యం వహించే పార్టీలు ఏమున్నయి? సీమాంధ్ర నాయకుల పెత్తనం కింద నడిచే పార్టీలు తెలంగాణ ప్రజలకు ఎట్ల ప్రాతినిధ్యం వహిస్తయి? మరి ఆ పార్టీల అభిప్రాయాన్ని లెక్కలకు తీసుకుంటే తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు ఎట్ల న్యాయం చేయగలుగుతరు ఎవరైనా? కాబట్టి పార్టీల అభిప్రాయం కాదు ప్రజల అభిప్రాయమే గీటురాయిగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు వుండాలె. అది గూడ కేవలం తెలంగాణ ప్రజల అభిప్రాయమే గీటురాయిగా వుండాలె. సీమాంధ్ర ప్రజల అభిప్రాయం అవసరం లేదు. తెలంగాణ ప్రజల అభిప్రాయాన్నే గీటురాయిగ తీసుకోదల్చుకుంటే, తెలంగాణ ప్రజలు తమ అభిప్రాయాన్ని పోరాటాల రూపంలో ఎల్లవేళలా చాటుతనే వున్నరు.

అఖిల పక్ష సమావేశం, అది సాధించే ఏకాభిప్రాయం అనేది, ఇంత బూటకమైనది కనుక, అఖిల పక్షం అనంగనే, తెలంగాణ జనమేమీ మురిసిపోలేదు. ఏకాభిప్రాయం వచ్చినా, రాకున్నా దానితోటి ఒరిగేదేం లేదని అందరూ అనుకున్నరు. ఎందుకంటే 2009 డిసెంబర్ 7న ఆనాటి ముఖ్యమంత్రి రోశయ్య నేతృత్వంల మొదటి అఖిల పక్ష మీటింగ్ జరిగింది. ఆ మీటింగుల తెలంగాణ ఏర్పాటు పట్ల ఏకాభిప్రాయం వచ్చింది. కాని తెలంగాణ రాలేదు. డిసెంబర్ 7న పైపై మాటలతోటి తెలంగాణకు మద్దతునిచ్చిన పార్టీలు, తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ మొదలైతదని డిసెంబర్ 9న చిదంబరం ప్రకటించంగనే ప్లేటు ఫిరాయించినయి. ఆ తర్వాత జనవరి 5న చిదంబరం నాయకత్వంలో జరిగిన అఖిల పక్ష సమావేశంల తెలంగాణను వ్యతిరేకించినయి. ఈ వ్యతిరేకత శ్రీకృష్ణ కమిటీ ఏర్పాటుకు అవకాశం కల్పించింది. తర్వాత మరో అఖిల పక్ష సమావేశం 2011 జనవరి 6న జరిగింది. అయితే అక్కడ అభిప్రాయాలేమీ కోరలేదు. శ్రీకృష్ణ కమిటీ నివేదిక ప్రతులను అందరి చేతుల్ల పెట్టి పంపిన్రు. ఆ తర్వాత ఎనిమిది పార్టీలతో మళ్లొక సమావేశం ఏర్పాటు జేసిండ్రు. దాంట్ల అన్ని పార్టీల నుండి ఇద్దరిద్దరు ప్రతినిధులు హాజరయింద్రు. కాంగ్రెస్, తెలుగు దేశం వంటి పార్టీల నుండి హాజరయిన ఇద్దరు ప్రతినిధులు చెరోవాదన– ఒకరు తెలంగాణకు అనుకూలంగ, ఇంకొకరు తెలంగాణకు వ్యతిరేకంగ– వినిపించిన్రు. ఇగ కొన్ని పార్టీలు మొత్తంగనే తెలంగాణను వ్యతిరేకించినయి. ఇగ ఏకాభిప్రాయం ముచ్చటేముంటది?

పార్టీ నుంచి ఏ ప్రాంతం వాళ్లు ప్రతినిధులుగ హాజరైనా వాళ్లు తమ పార్టీ వైఖరినే జెప్పాలె. ఏ విషయంలనైనా పార్టీకంతటికీ ఒకే వైఖరి వుంటది గాని, పార్టీలోని వ్యక్తులను బట్టి, ప్రాంతాలను బట్టి వైఖరి మారదు. అట్ల మారితే పార్టీ క్రమశిక్షణకే విరుద్ధం. తెలంగాణ విషయంల, ఇట్లా ఒకటే పార్టీ నుంచి రెండు వాదనలు వినిపించుడనేది తెలంగాణ పట్ల ఆ పార్టీలు అనుసరిస్తున్న అవకాశవాదం తప్ప ఇంకోటి గాదు.

ఏకాభిప్రాయం వచ్చినా, రాకున్నా అఖిల పక్ష మీటింగులల్ల తెలంగాణకు ఒరిగిందేం లేదు గావట్టి, జనాలు పెద్ద ఆశలు పెట్టుకోలేదు. ఇంకొంత కాలం పొద్దుపుచ్చుతందుకు, ఇదొక ఎత్తుగడని అందరూ అనుకున్నరు. అయితే తెలంగాణకు వ్యతిరేకం గాదని, కేంద్రం ఇస్తే మేమడ్డం బోమని, గోడ మీది పిల్లుల్లెక్క వుంటున్న కొన్ని పార్టీల అసలు బండారం, ఇప్పుడు బయటపడుతదని మాత్రం అనుకున్నరు. అంతేకాదు అఖిల పక్ష సమావేశంల తెలంగాణకు అనుకూల వైఖరిని ప్రకటించాలని, పాదయాత్రల కోసం తమ గడ్డమీదికి వచ్చిన చంద్రబాబు, షర్మిలలను తెలంగాణ జనం డిమాండ్ చేసింద్రు.

అయితే కొంచెం ఆశ్చర్యకరంగనే, చిదంబరం నాయకత్వంల జరిగిన సమావేశాల కంటే, డిసెంబర్ 28న జరిగిన అఖిల పక్ష సమావేశంల దాదాపుగా పార్టీలన్ని తమ వైఖరిని స్పష్టంగ ప్రకటించినయి. గతం లెక్క కాకుండ, ఈ అఖిల పక్ష సమావేశంల ఒక్క కాంగ్రెస్ తప్ప ప్రతి పార్టీ నుండి హాజరైన ఇద్దరు ప్రతినిధులు ఒకే వైఖరిని ప్రకటించిన్రు. తన ఎన్నికల ప్రణాళికల, యూపీఏ కనీస వుమ్మడి కార్యక్రమంల తెలంగాణ అంశాన్ని చేర్చినప్పటికీ, తెలంగాణ పోరాటం వుధృతంగా సాగుతున్న ఈ మూడేండ్లల్ల ఏకాభిప్రాయం కోసమని చెప్పుకుంట, ఇన్ని అఖిల పక్ష సమావేశాలు జరిపినప్పటికీ, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ తెలంగాణకు ఎన్నడూ మద్దతియ్యలేదు. ఈ సమావేశంల గూడా తెలంగాణ ప్రతినిధిగా హాజరైన కేఆర్ సురేష్ రెడ్డి రాష్ట్ర విభజనకు కాంగ్రెస్ పార్టీ అనుకూలంగ వుందని ప్రకటిస్తే, సీమాంధ్ర ప్రతినిధిగా హాజరైన గాదె వెంకటరెడ్డి మాత్రం తెలంగాణ వ్యతిరేక వైఖరిని ప్రకటించిండు. రెండు కండ్ల సిద్ధాంతకారుడు చంద్రబాబు పార్టీ, తెలంగాణకు అనుకూలంగా 2008లో ప్రణబ్ కమిటీకి ఇచ్చిన లేఖకే కట్టుబడి వుంటమని జెప్పి మళ్లొక లేఖనిచ్చింది. అంతేగని నోరుతెరిచి తెలంగాణకు అనుకూలమని మాత్రం జెప్పలే. ఇక వైఎస్సార్‌సీపీ అన్ని ప్రాంతాల వారికి ఆమోదయోగ్యమైన పరిష్కారం కనుగొనాలని చెప్పింది. అన్ని ప్రాంతాల వారికి ఆమోదయోగ్యమైన పరిష్కారం వుండదు కనుక, ఆ పార్టీ స్పష్టంగా తెలంగాణ వ్యతిరేక వైఖరిని ప్రకటించిందనుకోవాలె. ఇగ మిగతా పార్టీలన్ని గూడ తమ పార్టీల పాత వైఖరులనే మరోసారి గట్టిగ జెప్పినయి.

ఇట్ల చూసుకుంటే ఈ సమావేశంల మెజారిటీ పార్టీలు తెలంగాణ అనుకూల వైఖరిని ప్రకటించినట్లే. ఈ సమావేశం ముగిసినంక తుది నిర్ణయం ప్రకటిస్తందుకు నెల రోజులు వ్యవధి కావాల్నని, జనవరి 28న తమ నిర్ణయం ప్రకటిస్తమని షిండే

ప్రకటించిండు. ఇగ చాలా మంది తెలంగాణ వచ్చినట్టే అనుకున్నరు. సీమాంధ్ర నేతలు అధిష్ఠానంపై ఒత్తిడి పెంచిన్రు. ఢిల్లీకి పోయి మంతనాలు జేసిండ్రు. 'జై ఆంధ్రప్రదేశ్' అనుకుంట రాజమండ్రిల సభ జరిపిండ్రు. 'రాష్ట్రం సమైక్యంగానే వుంటుంది. కావాలంటే తెలంగాణవాదులారా మీరే రాష్ట్రం విడిచివెళ్లండి' అని లగడపాటి అహంకారం చాటుకున్నడు. (ఎంత బరితెగింపు!) ఇంతల గులాం నబీ ఆజాద్ నెలంటే ముప్పయి రోజులు గాదని, వారమంటే ఏడు రోజులు గాదని, షిండే ప్రకటనకు వక్రభాష్యాలు జెప్పుడు షురూ జేసిండు. మళ్లా వాయిదా వేసే కుట్రలు జరుగుతున్నట్టున్నయని అందరు గూడ అనుకుంటుండంగనే, జనవరి 28న షిండే తమ సంప్రదింపుల్ని పూర్తి చేయడానికి, మరి కొంత సమయం పడుతదని ప్రకటించిండు. ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు, మూడు ప్రాంతాలకు చెందిన సీనియర్ నేతలతోటి సంప్రదించాల్సి వుందని ఆజాద్ ప్రకటించిండు. ఆ సంప్రదింపులు ఎప్పుడు జరుగుతయో జెప్పలేదు. ఇగ తెలంగాణపై ఎటువంటి డెడ్‌లైన్ లేదని చెప్పి సమస్యను నిరవధికంగ వాయిదా వేసిండు. (ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు, మూడిట్ల రెండు ప్రాంతాల సీనియర్ నేతలు తెలంగాణను స్పష్టంగా వ్యతిరేకిస్తుంటే, ఇగ సంప్రదింపుల ఫలితం ఎట్లుంటదో ఎరగని అమాయకులెవరు?)

జనవరి 30న కాంగ్రెస్ అధికార ప్రతినిధి పీసీ చాకో, తెలంగాణకు మేం వ్యతిరేకం గాదనుకుంటనే, రాష్ట్ర విభజనకు అనుకూలంగ ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీల తీర్మానం జెయ్యాలన్నడు. దాదాపు మూడింట్ల రెండొంతుల మంది సీమాంధ్ర సభ్యులే వున్న అసెంబ్లీల తెలంగాణకు అనుకూలంగా తీర్మానం జేసుడనేది అయ్యేపనేనా? నిజానికి ఏ రాష్ట్ర విభజనకైనా, ఆ రాష్ట్ర అసెంబ్లీ తీర్మానంతోటి పనిలేదు. పార్లమెంటుల బిల్లు ఆమోదం పొందితే చాలు. అయితే రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ప్రకారం పార్లమెంటుల ప్రవేశపెట్టబోయే ముందుగాల, ఆ బిల్లును రాష్ట్ర శాసనసభకు అభిప్రాయం కోసం పంపాలె. ఆ అభిప్రాయం అనుకూలంగున్నా, వ్యతిరేకంగున్నా, లెక్కలకు తీసుకోవాల్సిన పన్లేదు. రాజ్యాంగంల లేని, ఆచరణ సాధ్యం కాని, అసెంబ్లీ తీర్మానంతోటి తెలంగాణ సమస్యను ముడిపెడుతున్నది, తెలంగాణ సమస్యను మరింత కాలం సాగదీస్తందుకే.

ఏకాభిప్రాయం పాట పాడుతున్న కాంగ్రెస్ పార్టీ, లేదా కేంద్ర ప్రభుత్వం, తెలంగాణ విషయంల పెద్ద వ్యతిరేకతను ఎదుర్కొంటున్నది గూడా లేదు. యూపీఏ భాగస్వామ్య పక్షాలైన నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ, రాష్ట్రీయ లోక్‌దళ్, బీఎస్పీ తదితర పార్టీలు ఇప్పుడు తెలంగాణకు పూర్తి అనుకూలంగా వున్నాయి. ప్రతిపక్ష ఎన్డీఏకు నేతృత్వం వహిస్తున్న బీజేపీ కూడా ప్రస్తుతం అనుకూలంగనే వుంది. పార్లమెంటులో బిల్లు పెడితే సహకరిస్తమని, ఈ పార్టీలు మాట్లాడుతనే వున్నయి. అయినా బిల్లు పెడ్తలేదంటే, కారణం అసలు కాంగ్రెస్‌కే ఇష్టం లేదు. తెలంగాణ రాష్ట్రం కావాల్సనే డిమాండ్ న్యాయమైనదా? కాదా? ప్రజాస్వామికమైనదా? కాదా? అనే ప్రాతిపదిక మీద కాకుండ, తెలంగాణకు అనుకూలంగా వుంటే తనకు లాభమా? నష్టమా? అనే లెక్కలే అది వేసుకుంటున్నది. తెలంగాణ దిక్కు మొగ్గు జూపిస్తే సీమాంధ్ర నేతలకు కోపం వస్తది. వాళ్ల ప్రయోజనాలకు భిన్నంగా వ్యవహరించే పరిస్థితి దానికి లేదు. సీమాంధ్ర నేతలకు కోపం వస్తే ఏం చేయగలుగుతరు? పెద్ద వుద్యమాలు లేవదీస్తరా, అంటే సీమాంధ్ర ప్రజలు సమైక్యాంధ్ర వుద్యమంల కదిలే పరిస్థితి లేదని నిఘా సంస్థల నివేదికలు చెబుతున్నయి. ప్రజలు కదలకుండా పిడికెడు మంది నాయకులు ఎట్ల వుద్యమాలు నడుపుతరు? మరెందుకు కాంగ్రెస్ అధిష్ఠానానికి భయం? దానికి సీమాంధ్ర పెట్టుబడిదారుల లాబీ గావాలె. రేపు యువ రాజావారికి పట్టం గట్టాల్నంటే ఆ లాబీ అవసరం ఎంతైనా వుండొచ్చు.

అట్లని తెలంగాణను ఇచ్చేది లేదని కూడా అది తేల్చి చెప్పదు. ఎందుకంటే తెలంగాణ ఓట్లను కాదనుకునే పరిస్థితి కూడా దానికి లేదు. తెలంగాణ ఓట్లు కావాలె, గనుకనే కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికల, యూపీఏ కనీస వుమ్మడి కార్యక్రమంల తెలంగాణ అంశాన్ని జేర్చింది. ఒకదిక్కు తెలంగాణకు తాను వ్యతిరేకం కాదనుకుంటనే, నెపాన్ని యూపీఏలోని ఇతర పార్టీల మీదికి నెట్టాలని చూస్తున్నది. ఇట్ల సాగినంతకాలం సాగదీసుకుంటనే కాలం ఎల్లదీయాలని చూస్తున్నది కాంగ్రెస్.

తెలంగాణ సమస్య గురించి షిండే అవగాహన కోసమే డిసెంబర్ 28 అఖిల పక్ష సమావేశమని గులాం నబీ ఆజాద్ అన్నడు. ఇటీవల పీసీసీ నేతలతో జరిగిన సమావేశంల తెలంగాణ సమస్య అధ్యయనానికి తనకు మూడు నెలల కాలం కావాల్నని రాహుల్ గాంధీ సెలవిచ్చిండు. ఇగ ఇట్ల రెడ్డొచ్చె మొదలాడమంటే తెలంగాణ ఎన్నటికీ తేలదు.

తెలంగాణ కాంగ్రెస్ నాయకులకు మాత్రం ఈ పరిస్థితి చాలా ఇబ్బందికరంగ వున్నది. వాళ్ల బాధంతా తెలంగాణ సాధన ఆలస్యమైతుందని కాదు. అది తమ రాజకీయ భవిష్యత్‌కు నష్టం జేస్తదనేదే. క్రెడిటంతా టీఆర్ఎస్ వాళ్లు కొట్టేస్తరేమో అనేదే. అందుకనే వాళ్లు తెలంగాణ ఇయ్యకుంటే మా పరిస్థితేంది? అని అధిష్ఠానాన్ని అడుగుతుండ్రు. అంటే తెలంగాణ రాకుంటే ప్రజల పరిస్థితేంది? నిరాశతో ఆత్మ బలిదానాలకు పాల్పడుతున్న తెలంగాణ యువత సంగతేంది? కడుపు కాలుతున్న తల్లుల పరిస్థితేంది? అనేది కాదు వాళ్ల బాధ. వాళ్ల పరిస్థితికి ఢోకా లేకుంటే తెలంగాణ ఒచ్చినా ఏం లేదు, వాళ్లకు రాకున్నా ఏం లేదు. తప్పనిసరి పరిస్థితిల తమ రాజకీయ భవిష్యత్‌ను కాపాడుకుంటందుకు, జనవరి 28 షిండే ప్రకటన తర్వాత ఏడుగురు కాంగ్రెస్ ఎంపీలు రాజీనామా జేసిండ్రు. అయితే ఎప్పటి తీర్గనే అధిష్ఠానం వాటిని ఆమోదించలేదు.

కాంగ్రెస్ ఒక్కటే కాదు, ఇట్ల తెలంగాణ సమస్యను ఆ ప్రాంత ప్రజల ప్రయోజనాల కోణం నుండి కాకుండ, తమ లాభ నష్టాల కోణం నుండే అన్ని పార్టీలు బేరీజు వేస్తున్నయి.

తెలుగు దేశం పార్టీ 2008ల తెలంగాణకు అనుకూలంగా తమ పార్టీల తీర్మానం చేసిందైనా, 2009 ఎన్నికల్ల టీఆర్ఎస్‌తో

పొత్తు పెట్టుకున్నదైనా, కేవలం తెలంగాణను వాడుకొని అధికారంలకు రావాల్సనే. డిసెంబర్ 7 అఖిల పక్ష సమావేశంల తెలంగాణ అనుకూల వైఖరిని ప్రకటించింది కూడా తెలంగాణ ఏర్పాటు నిజంగా కోరుకొని కాదు. కాంగ్రెస్ ఎట్లాగూ తెలంగాణను రానియ్యదనే ధీమాతోనే. కాగల కార్యం గంధర్వులే తీర్చేటట్టయితే మనమెందుకు బద్‌నాం గావాలె అనుకుని వుంటడు చంద్రబాబు. అయితే డిసెంబర్ 9న జేసిన చిదంబరం ప్రకటన తర్వాత, తన అసలు సిసలు తెలంగాణ వ్యతిరేక రంగును బయటపెట్టుకోక తప్పలేదు చంద్రబాబుకు. కనీసం సాగరహారం సందర్భంగనైనా అనుకూల వైఖరిని ప్రకటించలేదు. తెలంగాణల పాదయాత్ర సందర్భంగ కూడా తెలంగాణకు వ్యతిరేకం కాదు అన్నడే తప్ప, అనుకూలం అనలేదు. అటువంటిది అఖిల పక్షంల 2008ల రాసిన లేఖకే కట్టుబడి వున్నమన్నడంటే, అది తెలంగాణ మీద ప్రేమతోని కాదు. సీమాంధ్ర మీద వైఎస్సార్‌సీపీ పట్టు బిగుస్తున్నందున, చంద్రబాబు తన భవిష్యత్ ఆశలు తెలంగాణ మీదనే ఎక్కువ పెట్టుకున్నడని అర్థం.

ఇక తెలంగాణ సాధనే ఏకైక లక్ష్యమని చెప్పుకునే టీఆర్ఎస్ కూడా తెలంగాణను తన రాజకీయ ప్రయోజనాలకు వాడుకునుట్ల ఏమీ వెనకబడి లేదు. డిసెంబర్ 28 అఖిల పక్ష మీటింగు తర్వాత ఇక తెలంగాణ ఒచ్చేసినట్టే అనే వాతావరణం నెలకొన్న సమయంల టీఆర్ఎస్ ఏమీ సంబురపడలేదు. కొంత అసౌకర్యానికే గురయింది. ఎందుకంటే తెలంగాణను సాధించుకోవాలంటే 2014 ఎన్నికల్ల టీఆర్ఎస్‌కు వంద అసెంబ్లీ స్థానాలను, 16 పార్లమెంట్ స్థానాలను కట్టబెట్టాలని 'కరీంనగర్ మేధోమథనం'ల అది ప్రజలకు విజ్ఞప్తి చేసి వున్నది. అయితే గియితే మరిప్పుడు తెలంగాణకు అనుకూలంగా కాంగ్రెస్ నిర్ణయం తీసుకుంటే ఆ క్రెడిట్ కాంగ్రెస్‌కే దక్కుతుంది. కనుక 100 + 16 సీట్ల తన కల నెరవేరే అవకాశం వుండదని అది ఆందోళన పడ్డది. అంతేకాదు తమ పార్టీలు తెలంగాణకు అనుకూలంగ లేకపోవడంతోటి, ఆందోళన పడుతున్న తెలంగాణకు చెందిన కాంగ్రెస్, తెలుగుదేశం నాయకులు టీఆర్ఎస్‌లకు వలసపోవాలని ఆలోచిస్తుండ్రు. టీఆర్ఎస్ కూడా ఆ వలసలను ప్రోత్సహిస్తున్నది. అట్లా 2014 ఎన్నికల నాటికి మరింత బలంగ తయారైతనని అది కలలు కంటున్నది. ఇవన్నీ నిజం కావాల్నంటే కాంగ్రెస్ తెలంగాణను మరికొంత కాలం వాయిదా వేయడమే దానికి అవసరం. అందుకనే అఖిల పక్ష మీటింగు అయిపోంగనే దాని మీద అసంతృప్తిని ప్రకటించి, జేఏసీతో కూడా సంప్రదించకుండా ఒంటరిగనే కొన్ని ఆందోళన కార్యక్రమాలను చేపట్టింది. అట్ల తెలంగాణ పోరాటానికి తాను మాత్రమే ఛాంపియన్ అనిపించుకోవాలని ఆరాటపడ్డది.

తెలంగాణకు పూర్తి మద్దతును ప్రకటిస్తున్న బీజేపీ కూడా అఖిల పక్షం తర్వాత తెలంగాణ ఒచ్చేస్తదేమో అని ఆందోళనపడ్డది. ఎందుకంటే 2014 ఎన్నికల్ల, అది తెలంగాణ మీద కూడా ఎక్కువే ఆశలు పెట్టుకుంది. తెలంగాణ పట్ల ఎంఐఎం వ్యతిరేక వైఖరిని ఆసరా చేసుకొని, అది తెలంగాణల హిందూ మతోన్మాదాన్ని రెచ్చగొట్టాలని గూడ చూస్తున్నది.

అంటే తెలంగాణకు మద్దతిస్తే రేపు రెండు సీట్లు ఎక్కువొస్తయా? మద్దతియ్యకపోతే ఎక్కువొస్తయా? లేకుంటే ఇట్లనే సాగదీస్తెనే ఎక్కువ లాబమా అని, అన్ని పార్టీలు లెక్కలేసుకుంటున్నయి. ఇగ తెలంగాణ నాయకులు తెలంగాణ పేరుతోని రాజీనామా చేస్తే లాబమా? పదవులు పట్టుకొని వేళాడుతనే లాభమా అని లెక్కలేసుకుంటుండ్రు. అంతేగాని తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును తెలంగాణ ప్రజల న్యాయమైన, ప్రజాస్వామ్య ఆకాంక్షగా గుర్తించి ఎవరూ మద్దతు ఇస్తలేరు. ఓట్లు, సీట్లే పరమావధిగ వుండే రాజకీయ పార్టీల నుంచి ఇంతకంటే ఎక్కువ ఆశించలేం. ఇటువంటి రాజకీయ పార్టీల మెడలు వంచే బాధ్యత తెలంగాణ వుద్యమ సంగాల మీద, తెలంగాణ ప్రజల మీద వుంది. తెలంగాణ మంత్రులు ఇంకా పదవులు పట్టుకుని వేళ్లాడుతున్నరన్నా, చంద్రబాబు, షర్మిల వంటి తెలంగాణ వ్యతిరేకులు తెలంగాణల పాదయాత్రలు జేస్తుండ్రంటే, అది కచ్చితంగ తెలంగాణ వుద్యమ బలహీనతే. తెలంగాణ వుద్యమ సంగాలు ఏ పిలుపునిచ్చినా, ప్రజలు విస్తృతంగ పాల్గొని విజయవంతం చేస్తుండ్రు. జేఏసీ పిలుపు మేరకు మార్చి 21న 'సడక్ బంద్'ను కూడ విజయవంతం జేసిండ్రు. కాబట్టి వుద్యమ సంగాలు మరిన్ని మిలిటెంట్ పోరాటాలను చేపట్టవల్సి వున్నది. లేకుంటే వుద్యమం స్తబ్దతకు గురయ్యే అవకాశం, ప్రజలు, ముఖ్యంగ యువత మరింత నిరాశకు గురయ్యే అవకాశం వుంది. ఈ నిరాశ ధోరణి ఇప్పటికే వెయ్యి మందికి పైగా యువతను బలిగొన్నది. జనవరి 28న షిండే, ఆజాద్‌ల ప్రకటనలు రాంగనే మరి కొంతమంది ఆత్మహత్యలు చేసుకుండ్రు. ఆ తర్వాత కూడా కొనసాగుతనే వున్నయి. యువతలో నిరాశ ధోరణిని పారదోలే శక్తి ఒక్క మిలిటెంట్ వుద్యమానికి మాత్రమే వుంటది. కాబట్టి ప్రస్తుతం ఎదుర్కొంటున్న అన్ని రకాల బలహీనతల నుండి బయటపడి వుద్యమం మరింత ఐక్యంగా, మిలిటెంట్‌గా ముందుకు సాగవల్సిన అవసరం వుంది. లేకుంటే తెలంగాణ రాదు. ఈ బలిదానాలు ఆగవు.

★

**క్రాంతిని ఈ సైట్లో చూడొచ్చు, డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. 2006 నుంచి అన్ని సంచికలు, 1994-2004 మధ్య కాలంలో వెలువడిన కొన్ని సంచికలు ఇందులో వున్నాయి.**

http://www.bannedthought.net/India/Kranti/index.htm

# లౌకికవాదులను సవాల్ చేస్తున్న మోడీ గెలుపు

2012 డిసెంబర్ నెల మధ్యలో జరిగిన గుజరాత్ ఎన్నికల్లో నరేంద్ర మోడీ నాయకత్వంలోని బీజేపీ మూడోసారి గెలిచింది. అక్కడ బీజేపీకి ఇది వరుసగా అయిదో విజయం కాగా, మోడీ నాలుగోసారి ముఖ్యమంత్రి అయ్యాడు. గుజరాత్ అసెంబ్లీలోని మొత్తం 185 సీట్లకు గాను బీజేపీ గత ఎన్నికల కంటే రెండు సీట్లు తక్కువగా 115 సీట్లను గెలుచుకుంటే, ప్రధాన ప్రతిపక్ష కాంగ్రెస్ గత ఎన్నికల కంటే రెండు సీట్లు ఎక్కువగా 61 సీట్లు గెలుచుకుంది.

ఈ గెలుపును ఆ పార్టీ గెలుపుగా కాకుండా మోడీ గెలుపుగానే చెప్పుకోవచ్చు. ప్రభుత్వ వ్యతిరేకత అనేది ఒక సాధారణ అంశంగా మారి అధికారం ప్రతిసారీ పార్టీలు మారుతున్న కాలంలో బీజేపీ వరుసగా అయిదుసార్లు గెలవడమైనా, మోడీ వరుసగా నాలుగోసారి ముఖ్యమంత్రి కావడమైనా విశేషమే. ఈ గెలుపు ప్రాధాన్యత ఒక్క గుజరాత్‌కు సంబంధించినదిగానే లేదు. ఎందుకంటే ఈసారి మోడీ గెలుస్తే ఎన్‌డీఏ ప్రధాని అభ్యర్థి అతనేనని విస్తృతమైన ఊహాగానాలు, కొందరి అత్యుత్సాహ ప్రకటనల హోరు నడుమ చేకూరిన విజయమిది. అందుకే ఈ గెలుపు మొత్తం దేశంలోని లౌకికవాదులను ఆలోచనలో పడేస్తున్నది.

ఈ గెలుపు ఊహించనిదేమీ కాదు. సీట్ల లెక్కల్లో కొంత తేడా వున్నప్పటికీ ఎన్నికల ముందు నిర్వహించిన సర్వే ఫలితాలకు అనుగుణంగానే వుందీ గెలుపు. ఊహించనిదేమీ కాకపోయినా మోడీ గెలుపు అత్యధిక మెజారిటీ ప్రజానీకానికి అవాంఛనీయమైనది. ఆందోళనాకరమైనది కూడా. అందుకే ఓడిపోవాలని ఎందరో కోరుకున్నారు. కాని, వాళ్ల కోరికలకు భిన్నంగా మోడీ గెలిచాడు. మోడీ ఓటమిని కోరుకున్న వారందరికీ కారణాలు ఒక్కటిగానే వుండకపోవచ్చు. వుండవు కూడా. ఎంతో మందికి కేవలం తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాలు మాత్రమే వుండవచ్చు. కాని మరెంతో మందికి దేశ లౌకిక, ప్రజాస్వామిక ప్రయోజనాలే కారణంగా వున్నాయి.

ఈ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీ గెలవడమే ప్రమాదకరం అనుకుంటే, మోడీ నాయకత్వం గెలవడం ఇంకింత ప్రమాదకరం. బీజేపీని మతోన్మాద పార్టీ అంటున్నామంటే, మిగతా పార్టీలన్నీ లౌకిక పార్టీలనే అర్థం కాదు. మెజారిటీ హిందూ ప్రజలు వున్న భారతదేశంలో ఎన్నికల్లో గెలవడమే లక్ష్యంగా వుండే పార్టీలేవీ కూడా లౌకికతకు కట్టుబడి వుండలేవు. ప్రస్తుతం అన్నింటికంటే పెద్ద జాతీయపార్టీగా వున్న కాంగ్రెస్ లౌకికతను వల్లెవేస్తూనే హిందూ మతతత్వానికి మద్దతునిస్తున్నది. ఇది చరిత్రలో ఎన్నోసార్లు నిరూపితమైంది. వామపక్ష పార్టీలు కూడా లౌకికత గురించి మాట్లాడుతున్నాయి. కాని, మతతత్వానికి వ్యతిరేకంగా ఎటువంటి గట్టి పోరాటం చేయకుండా, తమ హిందూ మత ఓటుబ్యాంకును కాపాడుకోవాలని చూస్తున్నాయి. బీజేపీ సహా సంఘపరివార్‌కు చెందిన పార్టీలు హిందూ మతోన్మాదాన్ని ఎటువంటి ముసుగులు లేకుండా బహిరంగంగా చాటుకుంటున్నాయి. హిందూత్వను ప్రధాన ఎజెండాగా పెట్టుకున్నాయి. హిందువుల్లో మతోన్మాదాన్ని పెంచిపోషిస్తున్నాయి. మైనారిటీలకు ఈ దేశంలో బతికే హక్కును కాలరాస్తున్నాయి. అందుకే బీజేపీ అధికారంలోకి రావడం ప్రమాదకరం.

అందులోనూ మోడీ నాయకత్వం అధికారంలోకి రావడం మరింత ప్రమాదకరం. మోడీ మతోన్మాద బీజేపీలో వున్న అతివాదుల్లోకెల్లా అతివాది. మోడీ పేరు విన్న వెంటనే ఎవరికైనా పదేళ్ల క్రితం జరిగిన గుజరాత్ మారణకాండ గుర్తొస్తుంది. మైనారిటీ మతానికి చెందిన వారనే ఏకైక కారణంతో గోద్రా ఘటనను సాకుగా తీసుకొని అక్కడ ముస్లిం మహిళలను, పురుషులను, పిల్లలను, చివరికి కడుపులో వున్న పిండాల్ని కూడా వదలకుండా ఊచకోతకోయడం, సజీవ దహనం చేయడం, కరెంట్ తీగలను విసిరి చంపడం, మహిళలను మూకుమ్మడిగా అత్యాచారాలు చేయడం, వాళ్ల ఆస్తులను ధ్వంసం చేయడం... ఇవన్నీ గుర్తొస్తాయి. కనీస మానవత్వం వున్న ఎవరినైనా నిరంతరం దహించే విషయమిది. మొత్తంగా ఈ మారణకాండలో దాదాపు మూడు వేల మంది ముస్లింలు ప్రాణాలు కోల్పోయారు. ఇప్పటికి దేశంలో మైనారిటీలపై జరిగిన మారణకాండలన్నింటిలోకి, పెద్దదయిన ఈ మారణకాండ వెనుక ఒక ముఖ్యమంత్రిగా ఆయనకు బాధ్యత వుండడం వల్లనో, మారణకాండను ఆపే ప్రయత్నాలు ఆయన చేయలేదనో మాత్రమే కాదు, నాడు మోడీని ప్రపంచం వేలెత్తి చూపింది. స్వయంగా ఆ దాడులను ఆయన ప్రేరేపించాడు. గోద్రా ఘటన జరిగిన పన్నెండు గంటలు గడవక ముందే, ప్రాథమిక స్థాయి విచారణ నివేదిక సైతం అందకముందే 'ఇది మెజారిటీ హిందువులపై మైనారిటీలు ఏకపక్షంగా జరిపిన మారణకాండ' అని ప్రకటించి ప్రతీకారానికి పురిగొల్పాడు. 'మీరేం చేస్తారో తెలియదు. మీరేం చేసినా నేను కాపాడుతాను. కానీ మూడు రోజుల్లో జరగాల్సిందంతా జరిగిపోవాలి' అని మోడీ స్వయంగా చెప్పినట్టు తెహల్కా స్టింగ్ ఆపరేషన్‌లో వెల్లడయింది. అంతే కాదు ఆ మారణకాండను జరపడం కోసం ఒక్కో గుంపుకు 200 మంది ముస్లింలను చంపమని టార్గెట్ ఇచ్చినట్టుగా కూడా వెల్లడయింది. గోద్రా ఘటన తర్వాత సీనియర్ పోలీసు అధికారులను సమావేశపరిచి, 'గోద్రా ఘటనపై ఆగ్రహం వెళ్లగక్కుతున్న హిందువులను అడ్డుకోబోకండి' అని, మోడీ ఆదేశించినట్టుగా సీనియర్ ఐపీఎస్ అధికారి సంజీవ్ భట్ వెల్లడించాడు. కాని మన న్యాయస్థానాలు మోడీ దోషిత్వాన్ని నిరూపించలేకపోయాయి, శిక్షలు వేయలేకపోయాయి.

దాడుల తర్వాత సంవత్సరం తిరక్కుండా జరిగిన ఎన్నికలలో గెలిచి, మోడీ తిరిగి ముఖ్యమంత్రి కావడం లౌకికవాదులెవ్వరికీ

మింగుడుపడని విషయం. ఆ తర్వాత వరుసగా మరో రెండుసార్లు కూడా కావడం లౌకికవాదులకు సవాల్‌గానే వుంది. ఇలా అప్రతిహతంగా మోడీ కొనసాగడానికి కారణం రాష్ట్రంలో ఆయన సాధించిన అభివృద్ధేనని దాదాపు అందరూ విశ్లేషిస్తున్నారు. సగటు వృద్ధి రేటు పెరగడాన్నే అభివృద్ధిగా భావిస్తే, అక్కడ గత అయిదేళ్లు గా సగటు వృద్ధి రేటు 11.2 శాతం వుంటున్నది. దేశ, విదేశీ కార్పొరేట్ సంస్థలకు అనేక మౌలిక సదుపాయాలు, రాయితీలు కల్పించి పెట్టుబడులను ఆకర్షించడంలో గుజరాత్ ముందుంటున్నది. ఒక ప్రజా నాయకుడిగా కంటే, కార్పొరేట్ సంస్థకు సీయివోగా వ్యవహరిస్తాడని మోడీకి పేరుంది. పశ్చిమ బెంగాల్లో నానో కార్ల కంపెనీకి భూములను పొందలేక పోయిన టాటాకు, మోడీ పిలిచి మరీ భూములను కట్టబెట్టాడు. 'పెట్టుబడులు పెట్టడానికి వచ్చే వారు ఒక్క ఫోన్ చేస్తే చాలు, రాష్ట్ర యంత్రాంగమంతా కదులుతుంద'ని ముఖేష్ అంబానీ వంటి వారు గుజరాత్‌కు కితాబులిస్తున్నారు. ఇలా పెట్టుబడిదారులకు ఎర్ర తివాచీ స్వాగతాలు లభిస్తుండడం వల్ల ఇక్కడ పారిశ్రామికీకరణ పెరుగుతున్నది. అయితే దీన్ని కేవలం మోడీ హయాంలో జరిగిన అభివృద్ధిగానే చెప్పుకోలేం. గుజరాత్ మొదటి నుండి పారిశ్రామిక, వాణిజ్య, వ్యాపార రంగాలలో ముందుంటున్నది. 1992-97లో అక్కడ సగటు వృద్ధి రేటు 12.9 శాతం వుండింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా సుళ్లు తిరుగుతున్న ఆర్థిక సంక్షోభం ప్రభావానికి మన దేశం కూడా గురై, జాతీయ సగటు వృద్ధి రేటు పడిపోతున్న నేపథ్యం నుండి చూస్తే, మోడీ సాధిస్తున్న 'అభివృద్ధి' ప్రాధాన్యత తెలుస్తుంది. కొనసాగుతున్న పారిశ్రామిక అభివృద్ధి కారణంగా, ప్రస్తుతం అక్కడ పట్టణీకరణ పెరిగింది. పట్టణీకరణ విషయంలో గుజరాత్ దేశంలోనే మూడో స్థానంలో వుంది. ఫలితంగా అక్కడి జనాభాలో 42 శాతం పట్టణాల్లో వుంటున్నారు. ఈ నేపథ్యంలో సంపన్న వర్గాలే కాక వున్నత మధ్య తరగతి కూడా మోడీ దిక్కు మొగ్గే అవకాశం వుంది.

గుజరాతీలలో మోడీ పెంచిన ప్రాంతీయ భావం కూడా, ఆయన గెలుపుకు ప్రముఖంగానే దోహదం చేసిందని చెప్పవచ్చు. బీజేపీ హిందూ దురహంకారాన్ని పెంచి పోషిస్తున్నట్టుగానే, 'గరవో గుజరాతీ' అనే నినాదం ద్వారా మోడీ గుజరాతీయుల్లో తాము అందరికంటే అధికులమనే భావనను ఒక దురహంకార స్థాయిలో పెంచే ప్రయత్నం చేస్తూ, గుజరాతీ జాతి వుద్ధారకుడి పోజులో ముందుకు వస్తున్నాడు. ఏ దురహంకారమైనా పాలకులకు ఓటు బ్యాంకుగా మారుతుంది కనుక, ఈ నినాదం కూడా మోడీ విజయానికి బాగానే దోహదం చేసింది.

ఇక మోడీ గెలుపుకు దోహదం చేసిన అంశాల్లో సంక్షేమ పథకాల పాత్రను కూడా చెప్పుకోవచ్చు. కేంద్ర ప్రభుత్వమైనా, దేశంలోని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలైనా, సంక్షేమ రాజ్యాలుగా కాకుండా, కేవలం సంక్షేమ పథకాలను అమలు చేసే రాజ్యాలుగానే మారాయి. గుజరాత్ ఇందుకు భిన్నంగా ఏమీ లేదు. శిశు మరణాలను తగ్గించడం కోసం చిరంజీవి యోజన, మాతా శిశు సంక్షేమానికి మాతృ వందన, బాలికల కోసం బేటీ బచావో, గ్రామీణ విద్యుత్ సరఫరా కోసం జ్యోతిగ్రామ్ యోజన, ప్రభుత్వోద్యోగుల కోసం కర్మయోగి అభియాన్, మధ్యాహ్న భోజనం కోసం బాలభోగ్ యోజన, పేదల కోసం గరీబ్ కళ్యాణ్ మేళా, విద్యార్థులకు వుచిత వైద్య చికిత్సలు తదితర అనేక పథకాల ద్వారా ఆయన ఓటు బ్యాంకును పెంచుకునే ప్రయత్నం చేశాడు.

ప్రజాభిప్రాయాన్ని మోడీకి అనుకూలంగా మార్చడంలో మీడియా పాత్ర కూడా తక్కువేం లేదు. గత ఎన్నికల ముందు, మోడీని 'అగ్లీ ఇండియన్' (అసహ్యకరమైన భారతీయుడు)గా అభివర్ణించిన మీడియా, ఈ ఎన్నికల సందర్భంగా 'వికాస్ పురుష్'గా ఎత్తిపట్టడం ఇందులో భాగమే. ఎన్నికలకు మూడు నెలల ముందు టైమ్ మాగజైన్ కూడా మోడీని ఆకాశానికెత్తేసింది. వంద మంది ప్రభావశీలురలో మోడీకి మూడో స్థానం ఇచ్చింది. కాబోయే ప్రధాని ఆయనేనని, భారత దేశాన్ని పట్టి పీడిస్తున్న అవినీతి, అసమర్థతలను ఎదుర్కొనే సమర్థుడు ఆయనేని వ్యాఖ్యానించింది.

ఈ అనుకూలతలు వున్నప్పటికీ, ఈ గెలుపు కోసం మోడీ కొన్ని గట్టి ప్రతికూలతలను కూడా ఎదుర్కోవాల్సి వచ్చింది. ఈ ఎన్నికలకు మూడు నెలల ముందు నరోడా పాటియా కేసులో తీర్పులు వెలువడడం, కేశూభాయ్ పటేల్ పార్టీని వీడి మరో పార్టీ పెట్టడం, దేశమంతటికీ అత్యంత సాధారణ అంశంగా వున్న పేదరికం, అవినీతి, రైతాంగ సంక్షోభం గుజరాత్‌లో కూడా పెరుగుతుండడం తదితర ప్రతికూలతలు ఆయన ఎదుర్కోవాల్సి వచ్చింది.

97 మందిని దారుణంగా ఊచకోత కోసిన నరోడా పాటియా కేసులో అహ్మదాబాద్ ప్రత్యేక కోర్టు 32 మందికి, దోషులుగా నిర్ధారిస్తూ శిక్షలు వేసింది. ఇలా శిక్ష పడిన వారిలో నరేంద్రమోడీకి సన్నిహితురాలైన మాయా కొద్నానీ, బజ్‌రంగ్‌దళ్ నేత బాబూ బజరంగి వున్నారు. మాయా కొద్నానీకి 28 ఏళ్లు శిక్ష పడితే, బజరంగి బతికి వున్నంత కాలం జైలులోనే వుండాలని కోర్టు ఆదేశించింది. గుజరాత్ మారణకాండ నాటికి మాయా కొద్నానీ ఎం.ఎల్.ఏ.గా వుండింది. ఈమె బజరంగితో కల్సి నరోడా పాటియా ప్రాంతంలో మారణకాండకు పథకం వేయడమే కాకుండా, నేతృత్వం కూడా వహించింది. నరోడా పాటియా మారణకాండలో ఎక్కువగా ప్రాణాలు కోల్పోయింది మహిళలూ, పిల్లలే. నిండు గర్భిణులను కూడా వదలకుండా అత్యాచారం, హత్యలు చేసారు. ఇంత దారుణానికి బాధ్యురాలైన మాయా కొద్నానీకి 2007లో మోడీ మహిళా శిశు సంక్షేమ శాఖ కట్టబెట్టాడంటే మహిళా శిశు సంక్షేమానికి మోడీ ఇచ్చే నిర్వచనం ఏంటో అర్థం చేసుకోవచ్చు. ఇలా మోడీకి సన్నిహితురాలైన, మోడీ చేత పదోన్నతి పొందిన మాయా కొద్నానీని దోషిగా తేల్చిన ఈ కోర్టు తీర్పు ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేస్తుందని చాలా మంది ఆశించారు.

కానీ ఆశలు వమ్మయ్యాయి. ఈ ఎన్నికల్లో గుజరాత్ మారణకాండ ఒక అంశంగానే లేదు. కేవలం పదేళ్ల క్రితం జరిగిన

ఒక దారుణ మారణకాండ, ఇంకా కోర్టుల్లో విచారణ జరుగుతుండగానే, దానికి సంబంధించిన హృదయ విదారక గాథలు ఇంకా మీడియాలో చోటుచేసుకుంటుండగానే, తెరమరుగు అవుతున్నదంటే ప్రజల్లో ఒక పథకం ప్రకారం మతోన్మాద పార్టీలు ఎంతగా హిందూ మతతత్వాన్ని పెంచుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. హిందూ మతోన్మాదమే మోడీని గెలిపించడంలో శక్తివంతమైన ఆయుధంగా పని చేస్తూ వస్తున్నది. గుజరాత్ రాష్ట్రంలో పరిపాలనా, పోలీసు విభాగాలలో సైతం ఆర్.ఎస్.ఎస్. శాఖలను ఏర్పాటు చేసి, పథకం ప్రకారం హిందూ మతోన్మాదాన్ని పెంచుతున్నారు. హిందూ మత దృక్పథం నుండి పాఠ్యాంశాలను తయారు చేసి, పాఠశాల స్థాయి నుండే పిల్లలకు హిందూ మతోన్మాదాన్ని రంగరించి పోస్తున్నారు. అట్లా తన ఓటు బ్యాంకును మోడీ జాగ్రత్తగా కాపాడుకుంటున్నాడు. సోరాబుద్దీన్ షేక్ నకిలీ ఎన్‌కౌంటర్ కేసు నిందితుడు అమిత్ షా ఈ ఎన్నికల్లో 63 వేల ఆధిక్యతతో గెలవడాన్ని కూడా ఈ నేపథ్యంలోనే అర్థం చేసుకోవాల్సి వుంటుంది. హృదయంలో మతారాధన, మనసులో వినియోగదారీ తత్వం వున్న ఓటరే గుజరాత్‌లో కాషాయదళం ఎదుగుదలకు కారణమని ఒక విశ్లేషకుడు చేసిన వ్యాఖ్యానం సరైందే కావొచ్చు.

మతతత్వ పార్టీలుగా ముద్రపడిన పార్టీలే కాదు, కాంగ్రెస్ తదితర పార్టీలు కూడా హిందూ మతతత్వాన్ని పెంచే ప్రయత్నం చేస్తున్నాయి. కసబ్, అఫ్జల్‌గురు వంటి వారిని ఉరిశిక్షలు వేస్తూ, ఏవేవో పేలుళ్ల ఘటనలను ముస్లింలకు అంటగడుతూ, టెర్రరిస్టుల పేరిట ముస్లింలను అరెస్టు చేస్తూ, మొత్తంగా సమాజం ముందు ముస్లింలను దోషులుగా నిలబెడుతున్నది. దీని వల్ల మెజారిటీ ప్రజల్లో ముస్లింల పట్ల వ్యతిరేకత, ద్వేషం పెరుగుతుంటే, కొంత హేతుబద్ధంగా ఆలోచించేవారిలో సైతం ముస్లింలపై అమలయ్యే దారుణాల పట్ల ఉదాసీనత పెరుగుతున్నది.

గత ఎన్నికల ప్రచారం సందర్భంగా, మోడీని మృత్యు బేహారిగా వర్ణించిన సోనియా, ఈ ఎన్నికల్లో గుజరాత్ మారణకాండ గురించి, పెద్దగా ప్రస్తావించలేదు. ఆ మారణకాండను ఖండించడమంటే, ముస్లింలను సమర్థించినట్టుగా, హిందువులకు సంకేతాలు పోతాయని కాంగ్రెస్ భావించి వుంటుంది. అంటే కాంగ్రెస్ కూడా హిందూ మత ఓటు బ్యాంకును పదిలంగా కాపాడుకోవాలనే అనుకుంటున్నది.

గుజరాత్‌లో ముస్లింలు దాదాపు 55 లక్షల మంది వున్నారు. అంటే అక్కడి జనాభాలో పది శాతం. కాని 185 స్థానాల్లో ఒక్క స్థానాన్ని కూడా బీజేపీ ముస్లింలకు కేటాయించలేదు. అయినప్పటికీ, ముస్లింలు అధికంగా వుండే నియోజక వర్గాలలో సైతం బీజేపీ గెలిచింది. దీన్ని మోడీ పట్ల ముస్లింలు తీసుకున్న సానుకూల వైఖరిగా మీడియా భాష్యం చెప్పింది. ముస్లింల సంఖ్య 15 శాతానికి మించి వున్న 35 నియోజక వర్గాలలో మోడీ జరిపిన సద్భావన యాత్రలు మంచి ఫలితాలనిచ్చాయని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. నిజానికి గుజరాత్ మారణకాండ జరిగి పదేళ్లు దాటినప్పటికీ మోడీ ఎన్నడూ కనీసం పశ్చాత్తాపం వెలిబుచ్చలేదు. క్షమాపణ చెప్పడానికి ససేమిరా అన్నాడు. ఈ ఎన్నికల ముందు కూడా క్షమాపణ చెపితే మోడీకి మద్దతు ఇస్తామని పలు ముస్లిం సంస్థలు ప్రకటించాయి. ఈ దేశంలో ముస్లింలు వుండాలనుకుంటే, అణగిమణగి వుండాలనే సిద్ధాంతాన్ని నమ్మే మోడీ ఎందుకు క్షమాపణ చెప్తాడు? ఇటువంటి వాడిని ముస్లిం వర్గాలే కాదు, మానవత్వం వున్న వాళ్లెవరూ క్షమించలేరు. అయినప్పటికీ మోడీ ముస్లింలు అధికంగా వున్న నియోజక వర్గాల్లో గెలిచాడంటే, ఇప్పటికీ మోడీ పట్ల ముస్లింలకు వున్న భయమే ప్రధానం. కాంగ్రెస్ సభలకు వచ్చిన వారు కూడా, మోడీకి వ్యతిరేకంగా నినాదాలు చేయకపోవడాన్ని మోడీ పట్ల ప్రజలకు పెరుగుతున్న ఆదరణగా మీడియా పొగిడింది, కాని దాన్ని భయంగా ఎందుకు భావించకూడదు? అయినా మన ఎన్నికల ప్రజాస్వామ్యంలో రిగ్గింగ్ ఒక ప్రధాన ధోరణిగా వున్న నేపథ్యంలో ముస్లింల ఓట్లు ముస్లింలే వేసారని కచ్చితంగా ఎలా చెప్పగలం?

ఇక ఎన్నికల ముందే చోటుచేసుకున్న మరో పరిణామం, కేశూభాయ్ పటేల్ బీజేపీని వీడి, మరి కొందరు సీనియర్ నేతలతో కలిసి గుజరాత్ పరివర్తన పార్టీని ఏర్పాటుచేయడం. కేశూభాయ్ పటేల్ గుజరాత్‌లో పేరున్న సీనియర్ నాయకుడు. ముఖ్యమంత్రిగా పని చేసినవాడు. అంతేకాదు గుజరాత్‌లో ప్రాబల్యం వున్న పటేల్ కులానికి చెందిన వాడు. గుజరాత్‌లో పటేళ్లు అపర కుబేరులు. జనాభాలో 15 శాతం వున్న వీళ్లు, సౌరాష్ట్ర ప్రాంతంలో గట్టి ప్రాబల్యం కలిగి వున్నారు. పారిశ్రామిక, వ్యాపార, వ్యవసాయ రంగాల్లో ఆధిపత్యం వహిస్తున్నారు. బీజేపీ సహా సంఘ్ పరివార్‌కు ఎక్కువగా నిధులు అందుతున్నది వీళ్ల నుంచే. వీళ్లు ఆధిపత్యంలో వుండే ప్రాంతంలో 48 సీట్లున్నాయి. ఇటువంటి ప్రాబల్యం వున్న సెక్షన్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న కేశూభాయ్ పటేల్‌ను, మోడీ లెక్కచేయకుండా పక్కన పెట్టాడు. దీన్ని సహించలేని పటేల్, పార్టీ నుండి బయటికి వచ్చి కొత్త పార్టీని ఏర్పాటు చేయడంతో, పటేళ్లు కేశూభాయ్ వైపు నిలబడే అవకాశముందని, ఇది మోడీకి పెద్ద ప్రతికూల విషయమనీ విశ్లేషకులు భావించారు. కానీ పటేళ్ల ప్రాబల్య ప్రాంతంలో వుండే 48 సీట్లలో మోడీ 32 గెలుచుకోగా, కేశూభాయ్ రెండింటిని మాత్రమే గెల్చుకున్నాడు. (కేశూభాయ్ గెల్చుకున్న మొత్తం సీట్లు ఈ రెండే.) అంటే పటేళ్లు తమ వాడైన కేశూభాయ్ దిక్కు వుండకుండా, వెనుకబడిన కులానికి చెందిన వాడైనప్పటికీ, తమ ప్రయోజనాలను సమర్థవంతంగా నెరవేరుస్తున్న మోడీకి, అండగా నిలబడి, కుల ప్రయోజనాల కంటే వర్గ ప్రయోజనాలే మిన్న అని చాటారు. మోడీ కూడా కేశూభాయ్‌ని పక్కన పెట్టినా సౌరాష్ట్ర ప్రాంతంలో పటేళ్లకే ఎక్కువ సీట్లను కట్టబెట్టి వాళ్లను తనవైపు నిలబెట్టుకున్నాడు.

ఇక సగటు వృద్ధిరేటు పెరగడమే అభివృద్ధికి గీటురాయి కాదనే స్పష్టత మనకుంటే, గుజరాత్ సాధిస్తున్నదని చెప్పుకుంటున్న అభివృద్ధి వల్ల అక్కడ సంపద పెరుగుతున్నట్టే పేదరికం కూడా పెరుగుతున్నది. విద్య, ఆరోగ్య, పోషకాహార ప్రమాణాలు, ఉపాధి అవకాశాలు,

వేతనాలు రోజు రోజుకూ తగ్గిపోతున్నాయి. ధరలు, కాలుష్యం పెరిగిపోతున్నది. వివిధ పరిశ్రమలు, ప్రాజెక్టుల పేరుతో రైతుల భూములు బలవంతంగా గుంజుకోవడం సహజంగానే ఇక్కడ పెరుగుతున్నది. ఇటీవలి కాలంలో ఒక విశ్వ విద్యాలయం కోసం, ఒక అణు విద్యుత్ కేంద్రం కోసం తమ భూములను ఇవ్వడానికి రైతులు ససేమిరా అనడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గాల్సి వచ్చింది. పెద్ద ఎత్తున తీర ప్రాంత భూములను కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేయడం వల్ల మత్స్యకారులు, బలహీన వర్గాల్లో ఆగ్రహం కలుగుతున్నది. ఇలా భూములను గుంజుకోవడమే కాక పారిశ్రామికీరణకు ప్రాధాన్యత ఇవ్వడం వల్ల రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని పట్టించుకోవడంలేదు. వ్యవసాయానికి సాగునీరు అందించడంలో మోడీ ఘోరంగా విఫలమయ్యాడు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల ధరల వంటి సమస్యలకు కరువు కూడా తోడై, రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నది. దీనికి తోడు బ్యాంకులు, వడ్డీ వ్యాపారులు రైతులకిచ్చిన బాకీలను బలవంతంగా వసూలు చేస్తున్నారు. ఫలితంగా రైతాంగ ఆత్మహత్యలు ఇక్కడ పెరుగుతున్నాయి. వీటిన్నంటి మూలంగా రైతాంగం మోడీ పాలన పట్ల అసంతృప్తితో వున్నది. ఇక దేశమంతా వ్యాపించి వున్న అవినీతి గుజరాత్‌లో తక్కువేమీ లేదు. సర్కార్ నిధుల దుర్వినియోగం జరిగిందని కాగ్ నివేదికలు బయటపెట్టాయి. అవినీతిని కాపాడడంలో భాగంగా అక్కడ 2003 నుండి లోకాయుక్తను నియమించలేదు. ఇటీవలి కాలంలో ఆ రాష్ట్ర గవర్నర్ లోకాయుక్తను నియమిస్తే, దాన్ని అడ్డుకోవడానికి మోడీ విఫల ప్రయత్నం చేసాడు. వీటన్నింటి నేపథ్యంలో మోడీ పాలనపై వ్యతిరేకత కూడా పెరుగుతున్నది. ఈ ఎన్నికల్లో బీజేపీకి రెండు సీట్లు తగ్గడాన్నయినా, ఏడుగురు మంత్రులు ఓడిపోవడాన్నయినా ఈ నేపథ్యంలోనే అర్థం చేసుకోవచ్చు.

మైనారిటీల, పేదల, రైతుల మద్దతు లేనప్పటికీ మోడీ ఎన్నిక కావడం మన దేశ 'ప్రజాస్వామ్యం' సాధించిన 'గొప్పతనం'! మైనారిటీల మద్దతు లేకుంటేనేం చెక్కుచెదరని హిందూత్వ ఓటు బ్యాంకు వుంది. పేదల, రైతుల మద్దతు లేకుంటేనేం పెట్టుబడిదారుల, కార్పొరేట్ సంస్థల అండదండలు పుష్కలంగా వున్నాయి. ఆకాశానికెత్తేలా కార్పొరేట్ మీడియా చేస్తున్న ప్రచారం కూడా వుంది. వీటికి తోడు మన ఎన్నికల ప్రజాస్వామ్యానికి వన్నె తెచ్చే రిగ్గింగ్, ఓటర్లను బెదిరించడం, మాయచేయడం, మభ్య పెట్టడం వంటివన్నీ వున్నాయి. ఇక మోడీకి ఎదురేం వుంటుంది?

ఇక ఈ గెలుపు తర్వాత మోడీ ప్రధాని అభ్యర్థి అనే ప్రచారం ఊపందుకున్నది. ఆ మధ్య కాలంలో, విశ్వ హిందూ పరిషత్ (వి.హెచ్.పి.) మోడీతో కొంచెం దూరం పాటిస్తున్నదని వార్తలు వచ్చాయి. గుజరాత్ దాడుల కేసుల్లో శిక్షలు పడకుండా మోడీ అడ్డుకోవడం లేదనీ, హిందూత్వ కంటే అభివృద్ధికే ఎక్కువ ప్రాధాన్యతను ఇస్తున్నాడని వి.హెచ్.పి. భావిస్తుండడమే ఆ దూరానికి కారణమని విశ్లేషకుల అభిప్రాయం. అయితే ఈ ఎన్నికల తర్వాత మాత్రం వి.హెచ్.పి. మోడీని హిందూత్వ రక్షకుడిగా అభివర్ణిస్తున్నది. ఫిబ్రవరి నెలలో జరిగిన కుంభమేళాలో వి.హెచ్.పి., ఆర్.ఎస్.ఎస్.లతో పాటు హిందూ సన్యాసులు కూడా మోడీని ప్రధానిని చేయాలని ప్రకటించారంటే, హిందూ హృదయ సామ్రాట్‌గా మీడియా మోడీని ఎత్తిపడుతున్నదంటే రాజకీయాలూ, మీడియా ఎంతగా మతతత్వాన్ని సంతరించుకుంటున్నాయో అర్థం చేసుకోవచ్చు. బీజేపీ బయటకు తోసేసిన రాం జఠ్మలానీ, మోడీని అకళంక లౌకికవాదిగా అభివర్ణిస్తూ, ఆయన ప్రధాన మంత్రి అభ్యర్థిత్వాన్ని సమర్థిస్తున్నాడు.

ఈ గెలుపు అనంతరం బీజేపీ మోడీని పార్లమెంటరీ బోర్డులోకి తీసుకుంది. 2014 లోక్‌సభ ఎన్నికల ప్రచార సారథ్యాన్ని కూడా మోడీకి అప్పజెప్పనుంది. అయోధ్య అంశాన్ని మరోసారి ముందుకు తేవాలని సంఘ్ పరివార్ ప్రయత్నిస్తున్న నేపథ్యంలో మోడీ వంటి నాయకులనే అది ముందు పెట్టుకోవాలని చూస్తుంది. ప్రధాని మంత్రి అభ్యర్థిత్వానికి బీజేపీ అధిష్టానంలో కొంత మంది మోడీకి అనుకూలంగా వున్నట్టు సంకేతాలు వస్తున్నాయి.

అంతర్జాతీయ దోపిడీదారులు కూడా మోడీ పట్ల సానుకూలతను వ్యక్తం చేస్తున్నారు. గుజరాత్ మారణకాండ తర్వాత మోడీని దూరంగా పెట్టిన అమెరికా, ఇప్పుడు మోడీని దగ్గరకు తీయాలని చూస్తున్నది. యూరోపియన్ యూనియన్ (ఈయూ) కూడా మోడీని పొగడ్తలతో ముంచెత్తింది. భారత రాజకీయాల్లో కీలక వ్యక్తని మెచ్చుకుంది. జనవరి 7న ఢిల్లీలోని జర్మనీ రాయబార కార్యాలయంలో ఈయూ దౌత్యవేత్తలు మోడీతో భేటీ అయ్యారు కూడా.

అయితే మోడీ ప్రధాని అభ్యర్థిత్వాన్ని ఎన్‌డీఏలో ప్రధాన భాగస్వామిగా వున్న జనతాదళ్ (యునైటెడ్) గట్టిగా వ్యతిరేకిస్తున్నది. మోడీనే ప్రధాని అభ్యర్థిగా ప్రకటిస్తే అది ఎన్‌డీఏతో తెగతెంపులు చేసుకోవడానికి సిద్ధంగా వుంది. ఈ వ్యతిరేకత మోడీ ప్రధాని ఆశలకు గండికొట్టేలా వుంది.

ఫిబ్రవరిలో ఢిల్లీలోని శ్రీరాం కాలేజ్ ఆఫ్ కామర్స్‌లో, మోడీ హాజరై ప్రసంగిస్తున్న సమయంలో 'కిల్లర్ మోడీ', 'గో బ్యాక్ మోడీ' అనే నినాదాలు మారుమోగాయి. పోలీసులు లాఠీఛార్జ్ చేసి, వాటర్ కెనాన్‌లు ప్రయోగించి, ఈ నినాదాలను అణచివేయాల్సి వచ్చిందంటే వీటి తీవ్రతను ఊహించవచ్చు. మోడీ గెలుపుతో ఆందోళన పడుతున్న వారికి, ఈ నినాదాలు గొప్ప ఊరటను కలిగించి వుంటాయి.

ఏదేమైనా మోడీ గెలుపు గుజరాత్‌లో పెరుగుతున్న హిందూ మతతత్వాన్ని పట్టి చూపుతున్నది. ఈ గెలుపును ఆధారం చేసుకొని గుజరాత్ అభివృద్ధి మాయను, మోడీ నమూనాను చూపి, దేశమంతా హిందూ మతతత్వాన్ని పెంచే ప్రమాదం సమీప భవిష్యత్‌లో వున్నది. గుజరాత్ నమూనాను మొత్తం దేశానికి అన్వయించాలనే ప్రకటనలు మారణకాండ అనంతరం మోడీ చేసే వున్నాడు. ఇది ఇప్పటికి

# ప్రజా వ్యతిరేక విధానాల కొనసాగింపులో భాగమే

# కేంద్ర బడ్జెట్ 2013 - 14

సామ్రాజ్యవాదుల ప్రతినిధులు బడా దళారీ నిరంకుశ బూర్జువా – బడా భూస్వామ్య వర్గాలు పాలకులుగా ఉన్నప్పుడు తప్పనిసరిగా విధానాలు, బడ్జెట్‌లు ధనిక వర్గానికి అనుకూలంగా ఉంటాయి. రాజకీయ ప్రయోజనాలలో భాగంగా కఠినంగాను, సున్నితంగాను ప్రత్యక్షంగాను, పరోక్షంగాను, పేద, మధ్యతరగతి ప్రజలను దోచి ధనికులకు పెడుతుంటాయి. అందులో భాగంగానే 2013–14 బడ్జెట్‌లో సంపన్నులకు అధిక రాయితీలు, పేద, మధ్య తరగతి ప్రజలపై అధికంగా పన్నులు విధించడంతోపాటు, వారికి మేలు చేసే రాయితీలలో భారీగా కోత పెట్టారు. స్థూల దేశీయోత్పత్తి (గ్రాస్ డొమెస్టిక్ ప్రొడక్ట్ – జి.డి.పి.) ని మహా ప్రమాణంగా భావించే పాలకులు దాని పంపిణీలో ధనిక వర్గానికి తోడ్పడుతూ, దేశ సంపద అతిస్వల్ప సంఖ్యలో ఉన్న సంపన్నుల వద్ద పోగుపడటానికి, పేద, మధ్య తరగతి ప్రజలను మరింత పేదలుగా మార్చటానికి కారకులవుతున్నారు.

సుమారు 70 శాతం జనాభా అధారపడి ఉన్న వ్యవసాయ రంగానికి బడ్జెట్‌లో 1.6 శాతం మాత్రమే కేటాయించారు. 2012–13లో రూ.24,671 కోట్లు కేటాయించగా, 2013–14లో రూ. 29,772 కోట్లు కేటాయించారు. సాలీనా సగటున 7 శాతం ధరలు పెరుగుతున్నందువల్ల కేటాయింపులు తగ్గినట్లుగా పరిగణించాలి. ఎరువులు, పెట్రోల్, డీజిల్, కిరోసిన్, వంటగ్యాస్‌లపై రాయితీలను భారీగా తగ్గించారు. గిట్టుబాటు ధరలు లేకపోవడం, రాయితీలు తగ్గించడం, ధరల పెరుగుదల, అధిక వడ్డీలకు అప్పులు వంటి కారణాల వల్ల వ్యవసాయ ఉత్పత్తి వ్యయం విపరీతంగా పెరుగుతున్నది. ఇందువల్ల అప్పుల పాలవుతున్న రైతులు అప్పులు తీర్చలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఆకలి చావులు పెరుగుతున్నాయి. 1997 నుండి సుమారు రెండు లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు.

ఇదే కాలంలో 1997–2007 మధ్య 10 లక్షల టన్నుల ఆహార ధాన్యాలు ఎఫ్‌సిఐ గోదాములలో కుళ్ళిపోయాయి. సుప్రీం కోర్టు ఆదేశించినా, పేదలకు ఉచితంగా ఆహార ధాన్యాల పంపిణీకి తిరస్కరించిన పాలకులు ఆహార భద్రతా బిల్లు రూపొందించారు. దీని అమలుకు మూడు లక్షల కోట్ల రూపాయలు అవసరముండగా, 2013–14లో రూ. 10,000కోట్లు మాత్రమే కేటాయించారు. పంజాబ్, హర్యానాలలో హరిత విప్లవ విధానాలు విఫలమై వరి, గోధుమ దిగుబడులు తగ్గిపోయాయి. వాటి స్థానంలో వాణిజ్య పంటలను ప్రోత్సహించడానికి రూ. 500 కోట్లు కేటాయించారు. విఫలమైన హరిత విప్లవ విధానాలను అసోం, బీహార్, ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలలో విస్తరింపచేసేందుకు రూ. 1000 కోట్లు కేటాయించారు. దేశంలో ఆకలి చావులు పెరుగుతున్న కాలంలో 2002–03 మధ్య రెండేళ్ళ కాలంలో 20 మిలియన్ టన్నుల ఆహార ధాన్యాలను ఎగుమతి చేశారు. మన దేశంలో కిలో ఆరున్నరకు అమ్మే ధాన్యాన్ని విదేశాల్లో ఐదున్నరకే అమ్మింది. దాన్ని యూరపులో పశువుల కోసం ఎగుమతి చేశారు.

2013–14లో సకాలంలో రుణాలు చెల్లించే వారికి వ్యవసాయ రుణ లక్ష్యాన్ని రూ. 7 లక్షల కోట్లుగా నిర్ణయించారు. ఇది 2012–13లో రూ. 5.75 లక్షల కోట్లుగా వుంది. ఇప్పటి వరకు నాలుగు శాతం వ్యవసాయ రుణ సౌకర్యం ప్రభుత్వ, ప్రాంతీయ గ్రామీణ, సహకార బ్యాంకులకు వర్తిస్తుండగా, ఇక నుండి ప్రైవేటు బ్యాంకులకు కూడా వర్తింప చేయనున్నారు. ఇది ప్రజా ధనాన్ని ప్రైవేటు బ్యాంకింగ్ రంగానికి మళ్ళించి, దాన్ని బలోపేతం

---

నామమాత్రంగా వున్న లౌకికతను కూడా చంపేస్తుంది. పచ్చి హిందూ రాజ్యంగా దేశాన్ని మారుస్తుంది. యువత మోడీ వైపు ఆకర్షితులవడం కూడా చాలా ప్రమాదకర ధోరణి. మన విద్యా విధానం వల్ల, పాలకులు పెంచి పోషిస్తున్న రకరకాల భావజాలాల వల్ల శాస్త్రీయతను, సామాజిక చైతన్యాన్ని కోల్పోతున్న యువత, ఇలా స్వార్థ రాజకీయ ప్రయోజనాల గాలాల్లో సులువుగా చిక్కుకునే అవకాశం వుంటుంది. కాబట్టి దేశంలో లౌకిక భావజాలాన్ని, సామాజిక చైతన్యాన్ని పెంచాల్సిన బాధ్యత లౌకికవాదులైన ప్రతి ఒక్కరి మీదా వుంది. అందుకు హిందూ మతోన్మాదానికి వ్యతిరేకంగా బలమైన పోరాటాలను నిర్మించాల్సి వుంటుంది.

మతం మత్తుమందు వంటిది. అందుకే మన దేశంలో అమల్లో వున్న అర్ధ వలస, అర్ధ భూస్వామ్య సమాజం తన దోపిడీని కాపాడుకోవడానికి మతాన్ని వుపరితలంలో ఒక బలమైన సాధనంగా వాడుకుంటుంది. దాన్ని రోజు రోజుకూ మరింత బలోపేతం చేస్తుంది. సమాజంలో భావవాదాన్ని పెంచి, ప్రజల మధ్య ఐక్యతను దెబ్బతీసి, మతం దోపిడీ సమాజానికి నమ్మకమైన సేవకురాలిగా వుంటుంది. కనుక హిందూ మతోన్మాదానికి వ్యతిరేకంగా చేపట్టే పోరాటం కేవలం వుపరితలానికే పరిమితం కాకూడదు, మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్న దోపిడీ సమాజంపై కూడా గురిపెట్టాలి.

★

# కేంద్ర బడ్జెట్ ప్రణాళిక స్వరూపం

| శాఖల వారీగా (కోట్లలో) | 2011-12 వాస్తవ కేటాయింపు | 2012-13 బడ్జెట్ అంచనాలు | 2012-13 సవరించిన అంచనాలు | 2013-14 బడ్జెట్ అంచనాలు |
|---|---|---|---|---|
| మొత్తం | 508596 | 651509 | 556176 | 680123 |
| వ్యవసాయం | 12482 | 16121 | 13787 | 17095 |
| పౌర విమానయానం | 3866 | 7293 | 9288 | 8865 |
| కమ్యూనికేషన్, ఐటీ | 9228 | 21394 | 11248 | 16783 |
| పర్యావరణం, అడవులు | 1823 | 2430 | 1800 | 2430 |
| విదేశీ వ్యవహారాలు | 1104 | 1500 | 1620 | 3000 |
| ఆరోగ్య, కుటుంబ సంక్షేమం | 23159 | 30477 | 24894 | 32745 |
| హోం వ్యవహారాలు | 5919 | 10500 | 6828 | 10500 |
| మానవ వనరుల అభివృద్ధి | 50658 | 61427 | 56223 | 65869 |
| పెట్రోలియం, సహజ వాయువు | 64246 | 79728 | 76850 | 79052 |
| విద్యుత్ | 46084 | 62425 | 54696 | 59329 |
| గ్రామీణాభివృద్ధి | 66638 | 76376 | 55000 | 80194 |
| శాస్త్ర, సాంకేతిక | 5178 | 5975 | 5030 | 6275 |

చేయడానికి మాత్రమే తీసుకున్న నిర్ణయం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ, ఫీజు రీ ఎంబర్స్‌మెంట్ వంటి సంక్షేమ పథకాల వల్ల ప్రైవేటు ఆసుపత్రులు, కళాశాలలు బలపడ్డాయి. ఈ సంక్షేమ పథకాలు ప్రజా ధనాన్ని ప్రైవేటు వ్యక్తులకు, సంస్థలకు మళ్ళించటానికి రూపొందించిన ముసుగు పథకాలు మాత్రమే. అందువల్ల నాలుగు శాతం వడ్డీ వ్యవసాయ రుణ సౌకర్యం ప్రైవేటు బ్యాంకులకు వర్తింప చేయడం వల్ల, ప్రైవేటు బ్యాంకులు కూడా బలపడుతాయి.

2012-13లో కంటే 2013-14 బడ్జెట్‌లో రూ. 27,854 కోట్ల రాయితీలు తగ్గించారు. 2012-13లో రాయితీలు రూ. 2,47,854 కోట్లు కాగా, 2013-14లో రూ. 2.20 లక్షల కోట్లు కేటాయించారు. పెట్రోల్, డీజిల్, కిరోసిన్, వంటగ్యాస్ రాయితీల కోసం 2012-13 లో రూ. 96,880 కోట్లు కేటాయించగా, 2013-14లో రూ. 65,000 కోట్లు కేటాయించారు. ఎరువులపై రాయితీని తగ్గించారు. భారీగా రాయితీలు తగ్గించడం వల్ల వ్యవసాయ రంగం మరింత సంక్షోభంలో కూరుకుపోతుంది.

2013-14 బడ్జెట్‌లో దిగుమతి చేసుకునే వంట నూనెలు, తృణ ధాన్యాల రాయితీల్లో కోత పెట్టారు. జాతీయ ఉపాధి హామీ పథకానికి ప్రతి ఏటా నిధులు తగ్గిస్తున్నారు. ఇందిరా ఆవాస్ యోజన (ఐఎవై)కు నిధులు తగ్గించారు. ఇందువల్ల ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాలు తగ్గుతాయి. రాష్ట్ర ప్రభుత్వాలు నిధుల కొరతతో పూర్తి చేయలేని ప్రాజెక్టులకు, సాయం అందించే సత్వర సాగునీటి ప్రయోజన పథకానికి నిధులు తగ్గించారు. ఇది నీటి పారుదల రంగం, తద్వారా వ్యవసాయ రంగంపై ప్రభావం చూపుతుంది.

ఇంగ్లాండ్, అమెరికాలలో దేశీయంగా ఉత్పాదక రంగాన్ని బలోపేతం చేయటానికి అనేక రక్షణలు కల్పించారు. అమెరికాలో 2001లో 3 బిలియన్ డాలర్ల పత్తిని పండిస్తే, దాని మీద రాయితీ 3.9 బిలియన్ డాలర్లు ఇచ్చారు. 2005లో 3.9 బిలియన్ డాలర్ల పత్తి పండితే, ఇరవై వేల మంది రైతులకు 4.7 బిలియన్ డాలర్ల రాయితీ ఇచ్చారు.

సంవత్సరాదాయం కోటి రూపాయలకు పైగా కల్గిన వారు దేశంలో లక్షల సంఖ్యలో వుండగా, అతి స్వల్పంగా 42,800 మందిని మాత్రమే పన్ను పరిధిలోకి తెచ్చారు. వీరిపై విధించే 30 శాతం పన్నుపై 10 శాతం సర్‌ఛార్జీ విధించారు. దీనిని 2013-14 బడ్జెట్‌లో ప్రకటిస్తూ, వచ్చే సంవత్సరం తొలగిస్తామని హామీ ఇచ్చారు. సంపన్నులపై పన్నుల మొత్తం రూ. 13 వేల కోట్లు వుండగా, వారికి ప్రోత్సాహకాలు, మినహాయింపుల పేరుతో ఇచ్చే రాయితీలు రూ. 5.74 లక్షల కోట్లుగా వున్నాయి. సంపన్నులకు భారీగా రాయితీలు ఇచ్చి, అతి స్వల్పంగా పన్నులు విధిస్తున్నారు. పేద,

మధ్యతరగతిపై భారీగా పన్నులు విధిస్తూ, అతి స్వల్పంగా రాయితీలు ఇస్తున్నారు.

జనాభాలో సగ భాగంగా ఉన్న మహిళలకు విద్య, ఉపాధి, రాజకీయ రంగాలలో 50 శాతం రిజర్వేషన్ కల్పించాల్సిన అవసరం ఉంది. కానీ చట్ట సభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే మహిళా బిల్లును, కుంటి సాకులతో వాయిదా వేస్తున్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థ తనలోని అనేక చెడు లక్షణాలలో భాగంగా మహిళలను వినిమయ, విలాస, ప్రచార వస్తువుగా మార్చుతుంది. కేంద్ర బడ్జెట్‌లో రూ. 1000 కోట్ల మూలధనంతో మహిళలకు ప్రత్యేక బ్యాంకు ఏర్పాటు, మహిళల రక్షణకు నిర్భయ నిధి పేరిట రూ. 1000 కోట్ల కేటాయింపుకు నిర్ణయించారు. ఢిల్లీలో జరిగిన నిర్భయ ఆత్యాచార ఘటన నేపథ్యంలో నిర్భయ నిధిని ఏర్పాటు చేశారు. తాము అమలుచేస్తున్న విధానాల మూలంగా ఒకవైపు మహిళలపై అత్యాచారాలు పెరగడానికి కారణమవుతున్న పాలకులు, ప్రజల దృష్టిని మరల్చడానికి మాత్రమే నిర్భయ నిధి, మహిళా బ్యాంకు వంటివి ఏర్పాటు చేస్తున్నారు.

2013-14లో పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా రూ. 55,814 కోట్లు సేకరించటానికి నిర్ణయించారు. ఇందులో 40,000 కోట్లు స్పెక్ట్రం అమ్మకాల ద్వారా, ప్రభుత్వ రంగ సంస్థల వాటాల అమ్మకం ద్వారా సమకూర్చుకోవాలని నిర్ణయించారు. ఇప్పటికే స్పెక్ట్రం అవినీతి కుంభకోణంలో మంత్రులు జైలుకు వెళ్ళారు. విదేశీ పెట్టుబడులను ఆకర్షించటానికి సమర్థవంతమైన కంపెనీలను తక్కువ ధరకే ప్రైవేటు వ్యక్తులకు, సంస్థలకు అమ్ముతున్నారు.

ప్రజా సంక్షేమ రంగాలకు కేటాయించే నిధులలో భారీగా కోతలు పెడుతూ, రక్షణ రంగానికి మాత్రం గత సంవత్సరం కంటే 14 శాతం పెంచి, రూ. 2,03,672 కోట్లు కేటాయించారు. ఇందులో అత్యధిక భాగం ఆయుధాల కొనుగోళ్ళ కోసం బహుళజాతి సంస్థలకే ముడుతాయి. వాటిలో ఎక్కువ భాగం మంత్రులకు, అధికారులకు ముడుపులుగా అందుతాయి. ఇది 'దేశ భక్తికి' సంబంధించిన వ్యవహారం గనుక అధికార రహస్యాల చట్టాన్ని అన్వయించి ఎవరు ప్రశ్నించకుండా చూడవచ్చు. అందువల్ల ఇటీవలి కాలంలో ప్రజా ధనాన్ని కొల్లగొట్టడానికి పాలకులు రక్షణరంగ కేటాయింపుల మార్గాన్ని ఎంచుకుంటున్నారు. చాలా సంవత్సరాలుగా పొరుగు దేశాలతో యుద్ధం అవకాశాలు లేక పోయినా రక్షణ వ్యయం పెరుగుతూనే ఉంది. ఈశాన్య రాష్ట్రాలు, జమ్మూ కాశ్మీరు, దండకారణ్యం తదితర ప్రాంతాల్లో ప్రజలు వుద్యమించిన ప్రతిసారి ఏదో ఒక హింసాత్మక సంఘటనను పాలక వర్గాలు సృష్టిస్తున్నాయి. ఇటీవల భారత్-పాకిస్థాన్ సరిహద్దులల్లో జవాన్‌ల మీద జరిగిన దాడి, జమ్మూ కాశ్మీర్‌లో సైన్యాన్ని తొలగించాలన్న ప్రజా ఉద్యమం తర్వాత జరిగిందే. దాన్ని సాకుగా తీసుకుని సైన్యాన్ని మోహరిస్తున్నారు. రక్షణ రంగానికి కేటాయించిన లక్షల కోట్ల రూపాయలు ప్రజల మీద యుద్ధానికే కానీ మరొకందుకు కాదు.

2002 నుండి కనిష్ఠ వృద్ధిరేటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఐదు శాతం నమోదైంది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఎనిమిది శాతం వుంటుందని పాలకులు నమ్మబలుకుతున్నారు. ప్రపంచీకరణ ప్రారంభించినప్పటి నుండి వ్యవసాయరంగం ఉత్పత్తి వృద్ధి రేటు సగటున 5.2 శాతం నుండి 0.4 శాతానికి పడిపోయింది. వ్యవసాయరంగంలో ఉపాధి కోల్పోయిన వారికి పారిశ్రామిక, సేవారంగాలలో ఉపాధి కల్పించలేక పోయారు. పారిశ్రామిక వుత్పత్తి వృద్ధి 7.4 శాతం నుంచి 6.5 శాతానికి పడిపోతుంది. పారిశ్రామిక కార్మికుల వేతనాలు (1960 ధరలలో) 6.04 శాతం నుండి 5.50 శాతం మేర తగ్గాయి. వ్యవసాయ ఆదాయాలు, కార్మికుల వేతనాలు తగ్గడం, ధరల పెరుగుదల, పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడం, ఛార్జీలలో పెరుగుదల రాయితీలో భారీగా కోతలు విధించటం వంటి కారణాల వల్ల పేద, మధ్యతరగతి ప్రజల కొనుగోలు శక్తి క్షీణించింది. ఇందువల్ల దేశీయ మార్కెట్ సంక్షోభంలో పడింది. దీంతోపాటు చిల్లర వర్తకం, సమాచార మాధ్యమాలు, విమానయాన, బీమారంగాలలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అనుమతించారు. ఇందువల్ల ప్రజలు వుపాధి అవకాశాలు కోల్పోతారు. కావున పాలకులు చెబుతున్న అభివృద్ధి ధనిక వర్గానికి మాత్రమే మేలు చేస్తుంది. పేద, మధ్యతరగతి ప్రజలను మరింత సంక్షోభంలోకి నెడుతుంది. ★

---

***(40వ పేజీ తరువాయి)***

పాపం వీళ్లు చాలా కష్టపడుతున్నారు అనిపిస్తుంది ఎవరికైనా. కాని చాలా కష్టపడుతున్నట్టు నటిస్తున్న వీళ్లు ఈ పాదయాత్రలకు ఎన్ని విలాసాలను సమకూర్చుకుంటున్నారో. పడుకోవడానికి, కూర్చోవడానికి, స్నానం వగైరా చేయడానికి, కాలకృత్యాలు తీర్చుకోవడానికి అన్ని హంగులు వున్న ఒక భారీ ఏసీ బస్సు, వీళ్లను అనుక్షణం వెంబడిస్తూ వుంటుంది. ఎప్పుడు కావాలంటే అప్పుడు, అందులోకి చేరి విశ్రాంతి తీసుకుంటారు. ఇక రాత్రిపూట పడుకొనే టెంట్లలో ఎయిల్ కూలర్లు, మంచాలు, మెత్తటి పరుపులు వుంటాయి. అనుక్షణం ఒక డాక్టర్ల బృందం వీళ్ల వెంట వుంటూ, ఆరోగ్యంలో ఏ మాత్రం తేడా రాకుండా చూసుకుంటుంది. ఇవి మాత్రమే కాదు, చంద్రబాబు తాను నడిచే రోడ్డు మీద లక్షల కొద్దీ లీటర్ల నీళ్లు చల్లించుకుంటున్నాడట దుమ్ము లేవకుండా. ఇక ఎర్రని ఎండలో సైతం గాలి వీచేలా సోలార్ ఫ్యాన్ వున్న టోపీ పెట్టుకున్నాడట. పాదయాత్ర కోసం షర్మిల జర్మనీ నుండి బూట్లు తెప్పించుకుందట. వెనకాల ఇన్ని హంగులను ఏర్పాటు చేసుకొని, ప్రజల కోసం కష్టపడుతున్నట్టు బ్రహ్మాండంగా నటిస్తున్నారు వీళ్లు.

ఈ నాటకాలకు తెర దించాల్సిన బాధ్యత ప్రజలదీ, ప్రజా పోరాటాలదే! ★

# అధికార దాహంతో పాదయాత్రలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గత కొన్ని నెలలుగా రాజకీయ నాయకుల పాదయాత్రలు జరుగుతున్నాయి. 'వస్తున్నా మీ కోసం' అంటూ 2012 అక్టోబర్ 2 నుండి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాదయాత్ర మొదలు పెడితే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత జగన్మోహన్ రెడ్డి చెల్లెలు షర్మిల 'మరో ప్రజా ప్రస్థానం' పేరిట 2012 అక్టోబర్ 17 నుండి పాదయాత్ర కొనసాగిస్తున్నది.

గత కొన్నాళ్లుగా ఈ పాదయాత్రల వార్తలు, ఫోటోలు లేకుండా వార్తా పత్రికలు వెలువడడం లేదు. పాదయాత్రలంటే నడవడమే. ఒక మనిషి రోజూ కొన్ని గంటల పాటు నడవడం అంత విశేషమవుతుందా? అంటే సాధారణ మనుషులు నడిస్తే విశేషం కాదు గాని, ఎన్నడూ నేల మీద కాలు మోపని వాళ్లు, గడపదాటితే ఏసీ కార్లలోనే కాలు మోపేవాళ్లు, మట్టిరోడ్ల మీద నడవడం విశేషమే కద మరి.

ఏసీ కార్లలో తప్ప మోపని పాదాలను అతుకుల, గతుకుల, మట్టి రోడ్ల మీద నడిపిస్తూ ఎందుకు కష్టపెడుతున్నట్టు?

తన పాదయాత్రను మొదలుపెట్టిన రోజు చంద్రబాబు "ముఖ్యమంత్రి పదవి కోసం నేను ఈ యాత్రకు రాలేదు... పదవీ కాంక్షతో, అధికారం కోసం నేను మీ దగ్గరకు రాలేదు. రాజకీయ వుద్దేశంతో పాదయాత్ర చేపట్టలేదు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిర్ణయాలు, దోపిడీలను మీకు వివరించడానికీ, మిమ్ములను చైతన్యపరచడానికే వచ్చాను." అన్నాడు.

కాని రాష్ట్రంలోని పాలు తాగే పసిపిల్లలు కూడా ఈ మాటలు నమ్మలేదు. బూర్జువా రాజకీయ పార్టీల నాయకుల ప్రతి జిమ్మిక్కూ ఓట్ల కోసమూ, సీట్ల కోసమేనని తెలియని వాళ్లెవరూ లేరు. 2004లో అధికారంలోకి రావడానికి రాజశేఖర్ రెడ్డికి దోహదం చేసిన పాదయాత్ర అనే ఫీటు మీద, చంద్రబాబు బాగానే ఆశలు పెట్టుకున్నాడు.

పదవీ కాంక్ష లేదంటూనే చంద్రబాబు తన మనసులోని మాటను ఎన్నోసార్లు బయటపెట్టుకున్నాడు. నాకు అధికారం ఇస్తే మీ పెద్ద కొడుకునవుతానంటున్నాడు. అధికారంలోకి వస్తే మొదటి సంతకం రైతులకు రుణ మాఫీ ఫైలు మీదనే చేస్తానని ఒకచోట, బెల్టు షాపుల రద్దు ఫైలు మీదనే చేస్తానని ఒకచోట హామీలిచ్చాడు. ఇక అన్ని సెక్షన్ల ప్రజలపై వరాల జల్లు గుప్పిస్తున్నాడు. రైతులకు రుణమాఫీ, తొమ్మిది గంటల వుచిత విద్యుత్ ఇస్తానంటున్నాడు. చేనేత రంగానికి రుణమాఫీ సహా బోలెడు వరాలు కురిపించాడు. ముస్లింలకు ఇస్లాం బ్యాంకుతో పాటు వడ్డీ లేని రుణాలు, సబ్‌ప్లాన్ కింద బడ్జెట్‌లో 2500 కోట్ల కేటాయింపు, చట్టసభల్లో రిజర్వేషన్లు వంటి ఎన్నో హామీలు ఇచ్చాడు. గిరిజనులకు ప్రత్యేక ఏజెన్సీ అన్నాడు. లంబాడాల దగ్గరికి వెళ్లి తాను చంద్రబాబు నాయక్‌గా మారుతానన్నాడు. మాదిగల దగ్గరికి వెళ్లి తానే పెద్ద మాదిగనన్నాడు. ఇక కరెంటు బిల్లులు తగ్గిస్తానని, కరెంటు కోతలు లేకుండా చేస్తానని, సబ్సిడీపై సోలార్ విద్యుత్‌నిస్తానని, గ్యాస్ సిలిండర్ల ధరలు తగ్గిస్తానని, సంవత్సరానికి పది సిలిండర్లు ఇస్తానని, తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తానని... ఇట్లా ప్రస్తుతం ప్రజలు ఎదుర్కుంటున్న అన్ని సమస్యలకు పరిష్కారాన్ని తనకు అధికారం కట్టబెట్టడడంతోనే ముడిపెడుతూ, లేదు లేదంటునే తన పదవీ కాంక్షను చాటుకుంటున్నాడు.

ఇవ్వాళ మీ పెద్దకొడుకునవుతా అంటున్న చంద్రబాబు తన ఏలుబడిలో ఎందరి తల్లుల కడుపులు కాల్చిండో? ఖజానా ఖాళీ అయిందని నాడు సంక్షేమ పథకాలు ఎత్తేసిన పెద్ద మనిషి, నేడు రుణమాఫీ అంటున్నడు. నాడు విద్యుత్ సబ్సిడీని ఎత్తేసి నేడు వుచిత విద్యుత్ అంటున్నడు. నాడు వ్యవసాయాన్ని బొందపెట్టాలని చూసి, నేడు వ్యవసాయాన్ని లాభసాటి చేస్తనంటున్నడు. నాడు గాట్ వంటి ఒప్పందాలకు రైతులను బంధించి, నకిలీ విత్తనాలు, పురుగు మందులతో ఎందరో రైతుల చావుకు కారకుడయి, నేడు రైతు బాంధవుడిని నేనేనంటుండు. కరెంటు ఛార్జీలు తగ్గించమన్నందుకు, బషీర్ బాగ్‌లో కాల్పులు జరిపి, ముగ్గురి ప్రాణాలు తీసి నేడు ఛార్జీలు తగ్గిస్తనంటుండు. నాడు 1/70 చట్టాన్ని ఎత్తివేయాలని చూసి, నేడు ఆదివాసీలకు ప్రత్యేక ఏజెన్సీ అంటున్నాడు. నాడు మద్యంపై నిషేధాన్ని ఎత్తేసి నేడు మద్యం కారణంగా నా చెల్లెళ్లు బాధపడుతున్నారని మొసలి కన్నీళ్లు కారుస్తున్నడు. నాడు ప్రైవేటీకరణ పేరుతో ఎన్నో ప్రభుత్వ కంపెనీలను మూసేసి, నేడు విద్యుత్ కోత వల్ల కంపెనీలు మూతపడుతున్నయని అంటున్నడు. నాడు తాగే నీళ్లను కూడా అమ్మకం సరుకు చేసి నేడు తాగునీటి ప్రాజెక్టులంటున్నడు. విద్యను ప్రవేటుపరం చేసి ఎందరినో చదువుకు దూరం చేసి, నేడు విద్యార్థులను తనకు అండగా నిలబడమంటున్నాడు. నాడు అంగన్‌వాడీ వుద్యోగినులను గుర్రాలతో తొక్కించి, నేడు మహిళలను 'అక్కా, చెల్లీ' అంటున్నాడు.

నిజానికి ఈనాడు రాష్ట్రం ఎదుర్కొంటున్న అన్ని సమస్యలకూ, తొమ్మిదేళ్ల చంద్రబాబు పాలనతో బలమైన సంబంధం వుంది. నేడు ఎదుర్కొంటున్న చాలా సమస్యలు, ఆయన అవలంబించిన విధానాల ఫలితాలే. తను అధికారంలో వున్న తొమ్మిదేళ్లలో చంద్రబాబుకు నేల మీద ఎన్నడూ కాళ్లూ, కండ్లూ ఆనలేదు. హైటెక్ కలలు కని, ఫ్లై ఓవర్లలో విహరించిన ఈయన హఠాత్తుగా నేడు నేల మీద నడుస్తున్నది, తన తప్పిదం తెలుసుకొని కాదు. పాదయాత్రల నేపథ్యంలో చంద్రబాబు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో తన పాలనలో తాను జనం కంటే ముందు పరిగెత్తినట్టు, అట్లా కాకుండా జనాన్ని నడిపిస్తూ తాను నడవాలని అన్నాడు. అంటే సామ్రాజ్యవాదులకు రాష్ట్రాన్ని దోచిపెట్టిన ఆయన విధానాలు చాలా

సరైనవే, కాకపోతే జనమే వాటిని అర్థం చేసుకోవడంలో వెనకబడ్డారన్నమాట. అంటే దోచుకోవడం సరైందే కానీ, ఆ దోపిడీని ప్రజల చేత అంగీకరింపజేయడంలోనే తన వైఫల్యం వుందన్నమాట. తనను తాను సీయీవోగా ప్రకటించుకున్న చంద్రబాబుకు, తాను అవలంబించిన విధానాల పట్ల పశ్చాత్తాపం వుంటుందని ఎవ్వరమూ అనుకోలేం. అయితే మరోసారి ప్రజలను మోసం చేయడానికే ఇలా నేల మీద నడుస్తున్నది. తొమ్మిదేళ్ల పాటు తన అధికారంలో, అంతకు ముందు తన మామ అధికారంలో, చంద్రబాబు ఎన్నో కోట్లు వెనకేసుకున్నాడు. ముఖ్యంగా ప్రపంచబ్యాంకుకు గులాంగిరీ చేసి, ఎన్నో ప్రయోజనాలు పొందాడు. మళ్లీ అటువంటి ప్రయోజనాలు పొందాలంటే అధికారం కావాల్సిందే. అంతే కాదు ఆయన పాలనలో ప్రయోజనాలు పొందిన బడా పెట్టుబడిదారులు, కార్పొరేట్ సంస్థలు, బహుళ జాతి సంస్థలు ఆయనను మళ్లీ అధికారంలోకి తేవాలని కూడా తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. నిజానికి 2009 ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని 2008లో ఆయన 'మీ కోసం' అంటూ ప్రజల్లోకి పోయాడు. అప్పుడు కూడా ఇలాగే ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించాడు. కాని ప్రజలు నమ్మలేదు. అధికారం కట్టబెట్టలేదు. ఈసారి రాబోయే ఎన్నికల్లో కూడా అధికారం చేజిక్కించుకోకపోతే, ఆ పార్టీ వునికికి ప్రమాదం. అందుకే కాళ్లు బొబ్బలెక్కినా, షుగర్ పెరిగినా, డాక్టర్లు, కుటుంబం, అనుచరులు విశ్రాంతి తీసుకోమన్నా, జోరున వాన కురుస్తున్నా, ఎండలు మండిపోతున్నా పాదయాత్ర ఆపలేదు.

ఇక 2003లో చేసిన 'ప్రజా ప్రస్థానం' తండ్రిని అధికారంలోకి తెస్తే, ప్రస్తుతం చేసే 'మరో ప్రజా ప్రస్థానం' కొడుకును అధికారంలోకి తెస్తుందన్న విశ్వాసంతో, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరుపున షర్మిల పాదయాత్ర చేస్తున్నది. తండ్రి చనిపోగానే, తండ్రి సంపాయించిన ఆస్తులను సొంతం చేసుకోవాలనుకున్నట్టుగానే, అధికారం తన తండ్రి సొంత ఆస్తి అయినట్టుగా, దాన్ని సొంతం చేసుకోవాలనుకున్నాడు జగన్మోహన్ రెడ్డి. కాని తనకు విధేయంగా వుండే వారికే పదవులు కట్టబెట్టే కాంగ్రెస్ అధిష్టానం, జగన్మోహన్ రెడ్డిని దూరం పెట్టింది. దీన్ని భరించలేని జగన్ కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఏర్పాటు చేశాడు. రాష్ట్రంలో తన ప్రాబల్యాన్ని పెంచుకోవడానికి ఓదార్పు యాత్రను చేపట్టాడు. మరోవైపు నోట్ల కట్టలు కుమ్మరిస్తూ, ఇతర పార్టీ నాయకులను కొనేయడం మొదలుపెట్టాడు. తనకు జగన్ పార్టీ పెద్ద పోటీదారు అవుతుందని, భయపడ్డ కాంగ్రెస్ పార్టీ, రాజశేఖర్ రెడ్డిని పొగడుతూనే అతను చేసిన అవినీతి నేరాలకు గాను, జగన్‌ను జైలు పాలు చేసింది. ఛార్జిషీట్ల మీద ఛార్జిషీట్లు మోపుతూ బెయిల్ రాకుండా అడ్డుకుంటున్నది. అట్లా, జైల్లో నుంచే రాజకీయ నాయకులను కొనడాన్ని అడ్డుకోలేకపోయినా, ప్రజల్లోకి పోకుండా మాత్రం జగన్‌ను కాంగ్రెస్ పార్టీ అడ్డుకుంటున్నది. అందుకే జగన్ బదులు ఆయన చెల్లె షర్మిల 'మరో ప్రజా ప్రస్థానం' చేపట్టింది.

ప్రజా వ్యతిరేక కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టడం, జనం గోడు పట్టని ప్రధాన ప్రతిపక్ష నేత చంద్రబాబుపై ఒత్తిడి తేవడం, మరో ప్రజా ప్రస్థానం లక్ష్యమని ఆ పార్టీ చాటుకుంది.

తమ తండ్రిది సువర్ణ పాలన అనీ, ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ప్రస్తుత ప్రభుత్వం తూట్లు పొడుస్తున్నదని, తన పాదయాత్ర పొడుగునా షర్మిల ప్రచారం చేస్తున్నది. ఇటువంటి ప్రజా వ్యతిరేక పార్టీపై అవిశ్వాస తీర్మానం ఎందుకు పెట్టడం లేదంటూ, చంద్రబాబు మీద కూడా విమర్శలు గుప్పిస్తున్నది. ప్రస్తుత పాలనలో ఆగిపోయిన సంక్షేమ పథకాలు తిరిగి కొనసాగాలంటే, జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని, ఇంకా మరికొన్ని కొత్త పథకాలను తమ పాలనలో తెస్తామని కూడా వాగ్దానాలు చేస్తున్నది. రాజశేఖర్ రెడ్డి సువర్ణ పాలనను జగన్ తిరిగి తీసుకువస్తాడంటున్నది. కాని తన తండ్రి సువర్ణ పాలనలో గుట్టలు గుట్టలుగా తమ కుటుంబ సంపద పెరిగింది. శాతాల వారీగా కమిషన్లు నిర్ణయించి, ఎన్నో భూములను, గనులను, వనరులను కార్పొరేట్ సంస్థలకు తన తండ్రి కట్టబెట్టాడు. తన భర్తకు బయ్యారం గనులను కట్టబట్టాడు. సంక్షేమ పథకాల ముసుగులో ఎన్నో కార్పొరేట్ సంస్థలకు ప్రయోజనాలు చేకూర్చాడు. ఇట్లా విచ్చలవిడిగా సాగిన దోపిడీకి, ఏ ఆటంకం లేకుండా వుండడం కోసం రాష్ట్రంలో నెత్తుటి ఏరులు పారించాడు. తన తండ్రి చేసిన ఈ నిలువు దోపిడీని, సాగించిన దమనకాండను మరిచిపోయి, సంక్షేమ పథకాల పేరుతో వెదజల్లిన ఎంగిలి మెతుకులకు కృతజ్ఞత చూపించాలని షర్మిల అడుగుతున్నది.

నిజానికి తన తండ్రి పాలనలో గుట్టలుగా పోగేసుకున్న సంపదను కాపాడుకోవాలంటే, జగన్మోహన్ రెడ్డికి అధికారం ఎంత అవసరమో, షర్మిలకు కూడా అంతే అవసరం. ఎందుకంటే ఆమె పేర, ఆమె భర్త పేర పోగుపడిన సంపద అంతా ఇంతా కాదు. కట్న పిశాచి అయిన అల్లుడు అత్తగారింటిని గుల్ల చేసినట్టుగానే, షర్మిల భర్త బ్రదర్ అనిల్ కూడా రాష్ట్రాన్ని, తన శక్తి మేరకు గుల్ల చేశాడు. షర్మిల, షర్మిల భర్త ఎన్నో కంపెనీలకు డైరక్టర్లుగా వున్నారు. ఇప్పుడదంతా కాపాడుకోవాలంటే ఆ కుటుంబానికి అధికారం చాలా అవసరం.

చంద్రబాబు, షర్మిలల పాదయాత్రలకు తెలంగాణలో నిరసనలు చెలరేగాయి. తెలంగాణ వ్యతిరేకులైన వీళ్లకు తెలంగాణలో పాదయాత్రలు చేసే అర్హత లేదని తెలంగాణవాదులన్నారు. తెలంగాణకు అనుకూల వైఖరి ప్రకటించిన తర్వాతే తెలంగాణలో అడుగుపెట్టాలన్నారు. ఉస్మానియా విశ్వ విద్యాలయంలో షర్మిల చిత్రపటానికి చెప్పుల దండ వేసి, తెలంగాణ విద్యార్థులు తెలంగాణ వ్యతిరేకుల పట్ల తమ కోపాన్ని, ఏవగింపును చాటుకున్నారు. అట్లాగే ఆమెకు తొమ్మిది ప్రశ్నలతో కూడిన బహిరంగ లేఖ రాశారు. చంద్రబాబు మహబూబ్‌నగర్ జిల్లా రాజోలి వద్ద తెలంగాణలో అడుగుపెట్టాడు. దీన్ని అడ్డుకోవడానికి తెలంగాణ జేఏసీ 'ఛలో రాజోలి'ని తలపెట్టింది. కాని రాజోలికి పోయే తొవ్వలోనే, తెలంగాణ వుద్యమకారులను పోలీసులు అరెస్టు చేశారు. అట్లా చంద్రబాబు, షర్మిలలిద్దరూ స్పష్టమైన తెలంగాణ అనుకూల వైఖరిని

ప్రకటించకుండనే, గోడ మీద పిల్లుల్లెక్క వ్యవహరిస్తూ వేలాది పోలీసులను, తమ సొంత గూండా సైన్యాన్ని, వందల కొద్ది వాహనాల్లో వెంటేసుకొని తెలంగాణలో దండయాత్రలను తలపించేలా పాదయాత్రలు జరిపారు. ఎన్నోచోట్ల నిరసనలు తెలుపుతున్న తెలంగాణ ప్రజలపై పోలీసులు, గూండాలు జులుం ప్రదర్శించారు. అడ్డుకోవాలని కాకుండా కేవలం నిరసన తెలపాలని ప్రయత్నించినా, చాలా చోట్ల ప్రజలపై జులుంకు పాల్పడ్డారు. ట్యాంక్‌బండ్‌పై తెలంగాణ ఆడబిడ్డలు బతుకమ్మ ఆడుకుంటామంటే తిరస్కరించిన ప్రభుత్వం, తెలంగాణ ప్రజల మనోభావాలకు విరుద్ధంగా జరిగిన ఈ పాదయాత్రలకు మాత్రం, వేలాది పోలీసుల రక్షణ కల్పించింది. దీన్నిబట్టి అధికారం వద్ద కుమ్ములాటలున్నప్పటికీ, తెలంగాణ విషయంలో మాత్రం కిరణ్ కుమార్ రెడ్డి, చంద్రబాబు నాయుడు, జగన్మోహన్ రెడ్డిల మధ్య గట్టి ఐక్యత వున్నదని స్పష్టమవుతున్నది.

ఇక తెలంగాణలో ఇట్లా దండయాత్రలను కొనసాగిస్తూ, తెలంగాణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై మొసలి కన్నీళ్లు పెట్టారు. నల్లగొండ జిల్లాలో ఫ్లోరోసిస్ బాధితుల బాధలను చూసి షర్మిల కన్నీళ్లు పెట్టుకుందట. మరి వాళ్ల నాన్న 'సువర్ణ పాలన'లో ఫ్లోరోసిస్ బాధితులకు ఏం ఒరగబెట్టినట్టో. చంద్రబాబు కూడా తన డైరీలో ఫ్లోరోసిస్‌తో ప్రజలు పడుతున్న బాధల గురించి కవితాత్మకంగా రాసుకున్నాడు, లేదా రాయించుకున్నాడు. కాని ఆయన పాలనలో ఫ్లోరోసిస్ బాధితులకు చేసిన కించిత్తు సాయం లేదు. చంద్రబాబు పాలనలో మహబూబ్‌నగర్ జిల్లాను ప్రభుత్వం దత్తత తీసుకుంది. దీనివల్ల ఆ జిల్లాకు ఒరిగిందేమీ లేదు. జిల్లా నుండి దేశం నలుమూలలకు వెళ్లే వలసలు అప్పుడూ, ఇప్పుడూ కొనసాగుతూనే వున్నాయి. నిజానికి తెలంగాణ ప్రజల పరిస్థితి మరింత దిగజారింది చంద్రబాబు, రాజశేఖర్ రెడ్డిల పాలనలోనే. ఇక్కడి వనరులను విచ్చల విడిగా కార్పొరేట్ సంస్థలకు, బహుళ జాతి కంపెనీలకు, సీమాంధ్ర ప్రాంతానికి తరలించడంలోనూ, దీనిపై వచ్చిన వ్యతిరేకతను అణచిపెట్టడానికి, ఈ ప్రాంతంపై తీవ్ర దమనకాండను ప్రయోగించడంలోనూ, వీళ్లిద్దరి పాత్ర ప్రముఖమైంది. ఇటువంటి వీళ్లకు తెలంగాణ ప్రజల కష్టాల గురించి మాట్లాడే కనీస అర్హత వుందా?

తెలంగాణ అమరుల కుటుంబాలకు న్యాయం చేస్తానని కూడా ఈ సందర్భంగా మాట్లాడేందుకు సాహసించాడు చంద్రబాబు. డిసెంబర్ 9 చిదంబరం ప్రకటనను వ్యతిరేకించడంలో, దాన్ని వెనక్కి తీసుకునేటట్టు చేయడంలో, చంద్రబాబు పాత్ర ముఖ్యమైనది. ఈ పరిణామం తర్వాతనే ఆత్మహత్యల పరంపర మొదలై, నేటికీ కొనసాగుతున్నది. అట్లా ఇవ్వాళ వేయికి పైగా తెలంగాణ ప్రజలు, ముఖ్యంగా యువత ప్రాణాలు కోల్పోవడంలో, చంద్రబాబు పాత్ర ముఖ్యమైనది. ఆయన చీకటి పాలనలో సైతం తెలంగాణ వుద్యమకారులపై దాడులకు పాల్పడ్డాడు.

రాజకీయ నాయకులు అధికారం కోసం అందితే జుట్టు, లేకుంటే కాళ్లైనా పట్టుకుంటారనే విషయం తెలువనిది కాకపోయినా, ఈ పాదయాత్రల సందర్భంగా పత్రికల్లో అచ్చయిన ఫోటోలు చూస్తే, ఎవరికైనా కొంచెమన్నా ఆశ్చర్యం కలుగుతుంది. చంద్రబాబు పొలంలో గడ్డికోస్తూ, గొర్రెపిల్లను భుజాన మోస్తూ, మిషన్‌పై బట్టలు కుడుతూ, మగ్గం నేస్తూ, కమ్మరి కొలిమిలో కాలుతున్న గడ్డపారపై సుత్తితో దెబ్బలు వేస్తూ, భుజాన నాగలిని మోస్తూ, బండకత్తితో కొబ్బరి బొండాలు కొడుతూ, హోటల్లో బజ్జీలు వేస్తూ, ధరల పెరుగుదలకు నిరసనగా మెడలో వుల్లిగడ్డల దండ వేసుకొని, భుజం మీద గ్యాస్ సిలిండర్‌ను మోస్తూ, పిల్లలకు భోజనాలు వడ్డిస్తూ, దళిత మహిళల పక్కనే కూర్చొని అన్నం తింటూ, వాళ్లకు తినిపిస్తూ, లంబాడీ మహిళలు చేసి పెట్టిన జొన్నరొట్టెలను పచ్చకూర అద్దుకొని తింటూ, విద్యార్థుల భుజాల మీద చేతులేసి నడుస్తూ, విద్యార్థులతో కోలాటం ఆడుతూ, లంబాడీ మహిళల నృత్యానికి తాళం వేస్తూ, హరిదాసు వేషధారణలో భుజాన తంబూర మోస్తూ, డప్పు కొడుతూ, పిల్లలను ఎత్తుకుంటూ, ఓ చిన్నారి చేతికి గాజులు తొడుగుతూ... ఇలా రకరకాల ఫోజుల్లో చంద్రబాబు. ఇవ్వాళ గొర్రె పిల్లనెత్తుకున్న చంద్రబాబు తన ఏలుబడిలో గొర్రెల పెంపకాన్ని నిషేధించాలని చూశాడు. ఇవ్వాళ జొన్నరొట్టెలను లొట్టలేసుకొని తిన్న, లేదా తిన్నట్టు నటించిన చంద్రబాబు, ఆహార పంటలను చాలా నిరుత్సాహ పరిచాడు. మగ్గం నేస్తున్న, కమ్మరి కొలిమిలో సుత్తితో కొడుతున్న చంద్రబాబు నాడు చేతివృత్తులను దెబ్బతీసాడు.

ప్రజలతో సున్నితంగా ఎట్లా వ్యవహరించాలో ఈసారి పాదయాత్ర కంటే ముందు కొద్దికాలం పాటు శిక్షణ పొందాడట. అంటే నటనలో శిక్షణ పొందాడన్న మాట. దాని ఫలితమే ఎప్పుడూ సీరియస్‌గా వుండే చంద్రబాబు, ఈసారి చిరునవ్వులు చిందిస్తూ ప్రజల భుజాలపై చేతులు వేస్తూ కల్సి పోతున్నాడు. ఇంకా ఎన్నో చోట్ల నేల మీదే కూర్చొని ప్రజలతో మాట్లాడుతూ, మాయ చేయాలని చూస్తున్నాడు. కింద కూర్చోవడం ఎన్నడూ అలవాటు లేనిది కాబట్టి, ఒకసారి కింద కూర్చుంటే నడుం పట్టేసి మళ్లీ లేవలేకపోవడంతో డాక్టర్ల బృందం చికిత్స చేయవలిసి వచ్చింది. పాదయాత్రకు ముందు తాను శిక్షణ పొందితే, పాదయాత్రతో మాత్రం మహా మహా నటులకే శిక్షణ ఇచ్చేంతగా ఎదిగాడు.

షర్మిల కూడా పిల్లలనెత్తుకుంటూ, వికలాంగులాంగులను ముద్దు పెట్టుకుంటూ, రైతుల భుజాల మీద చేతులేసి నడుస్తూ, వాళ్ల చేత అన్నం తినిపించుకుంటూ... నటనలో చంద్రబాబుకు గట్టి పోటీనే ఇస్తున్నది.

కాళ్లు నొప్పులు పెడుతున్నా, ఆరోగ్యాలు దెబ్బతింటున్నా ప్రజల కోసం మేం నడుస్తాం అంటున్నారు వీళ్లు. షర్మిల మోకాలికి ఆపరేషన్ కూడా అయిందట. అయినా కొద్ది రోజులు విశ్రాంతి తీసుకుని మళ్లీ నడక మొదలుపెట్టింది. 'డాక్టర్లు విశ్రాంతి తీసుకోమన్నారు. కాని జనం మధ్యనే నాకు నిజమైన విశ్రాంతి అని చంద్రబాబు డైరీలో రాసుకున్నాడు. ఇవన్నీ చూస్తే అధికారం కోసమైనా సరే

***(మిగతాది 37వ పేజీలో...)***

# అమరుల చరిత్రలు...

# పీడిత ప్రజల ముద్దుబిడ్డ, ఆయుధ శిల్పి, సాహసిక పట్టణ గెరిల్లా, ఆదర్శ కమ్యూనిస్టు కామ్రేడ్ దాసారపు కనకస్వామికి అరుణాంజలి!

పీడిత, తాడిత ప్రజల ఉత్తమ పుత్రుడు కామ్రేడ్ దాసారపు కనకస్వామి (బాబ్జీ, అమన్) 2012 సెప్టెంబరు 24న ఉదయం 9.10 గంటలకు ఫాల్సిపెరం మలేరియాతో పోరాడుతూ, బీపీ సమస్య కూడా వికటించడంతో అమరుడైనాడు. ఆయనను రక్షించుకోవడానికి సహచరులు, ప్రజలు చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. పట్టణ రహస్య జీవితంలో అనామకంగా చనిపోకూడదనీ, సహచర పీఎల్‌జీఏ యోధుల, ప్రజల నడుమనే చనిపోవాలనే తన చిరకాలపు కోరికను నెరవేర్చుకుంటూ, అందరినీ విషాదంలో ముంచుతూ కామ్రేడ్ అమన్ తుదిశ్వాస విడిచాడు. దాదాపు మూడు దశాబ్దాల పాటు విప్లవోద్యమానికి ఎనలేని కృషి చేసిన కామ్రేడ్ అమన్‌ను కోల్పోవడం పార్టీకీ, విప్లవోద్యమానికీ తీవ్రమైన నష్టం. ఆయన అమరత్వంతో వుద్యమం ఎంతో అనుభవం కలిగిన ఒక మంచి కమ్యూనిస్టు టెక్నీషియన్‌ను కోల్పోయింది. విప్లవోద్యమానికి, ప్రజలకు మరెంతో కాలం పాటు సేవలందించాల్సిన కామ్రేడ్ అమన్ అకాల మృతితో పార్టీ శ్రేణులు, ప్రజలు తీవ్రంగా కలత చెందారు. అతని ఆశయాన్ని కడదాకా కొనసాగిస్తామని ప్రతిన బూనారు. అతని ఆదర్శాల్ని, సేవల్ని ఎత్తిపట్టారు.



### విప్లవాల ఖిల్లా ఓరుగల్లు జిల్లాలో రూపు దిద్దుకున్న బాల్యం

కామ్రేడ్ అమన్ వరంగల్ జిల్లా మద్దూరు మండలం కూటిగల్ గ్రామంలో ఒక పేదరైతు కుటుంబంలో 1969 జూలై 26న జన్మించాడు. తల్లి లక్ష్మమ్మ, తండ్రి ఈదయ్యల ఇద్దరు కుమారులలో అమన్ చిన్నవాడు.

1940ల చివరలో మహత్తర తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటం చురుగ్గా సాగిన ప్రాంతమిది. ఆ పోరాట వారసత్వం పునికి పుచ్చుకున్న నవతరాన్ని నక్సల్బరీ, శ్రీకాకుళం పోరాటాలు తట్టి లేపాయి. ఆ ఉద్యమాలు దెబ్బతిన్న తర్వాత తిరిగి 'జగిత్యాల జైత్రయాత్ర'గా ప్రసిద్ధి గాంచిన రైతాంగ వుద్యమం ఇక్కడి గ్రామాలన్నిటినీ కదిలించింది. విద్యార్థులను రాడికల్స్‌గా తీర్చిదిద్దింది. అంతటా ఏర్పడ్డట్టే ధూల్మిట్ట హాస్టల్, పాఠశాలల్లో కూడా రాడికల్ విద్యార్థి సంఘం (ఆర్ఎస్‌యు) ఏర్పడింది. కామ్రేడ్ కనకస్వామి ధూల్మిట్ట హాస్టల్లో వుంటూ 7వ తరగతి వరకు చదువుకున్నాడు. అట్లా 1983లో రాడికల్ విద్యార్థి సంఘంలో చేరాడు. సహజంగానే గ్రామంలో పెత్తందారుల, రాజకీయ నాయకుల దోపిడి, దౌర్జన్యాలను అసహ్యించుకునే కనకస్వామి పార్టీ పరిచయమైన తర్వాత చదువు కంటే విప్లవోద్యమ కార్యకలాపాలకే ఎక్కువ ప్రాధాన్యత యిచ్చాడు.

హాస్టల్‌లో వార్డెన్ అవినీతిని బహిర్గతం చేసి ప్రతి విద్యార్థికి కోటా ప్రకారం రావాల్సిన రేషన్, ఇతర సౌకర్యాలను చెల్లించేలా జరిగిన పోరాటాలలో కామ్రేడ్ కనకస్వామి పాల్గొన్నాడు. ధూల్మిట్ట హాస్టల్ 1990 వరకు చుట్టుపక్కల 20, 25 గ్రామాలకు విప్లవ రాజకీయాలను ప్రచారం చేసే కేంద్రంగా పని చేసింది. ఇక్కడ విద్యార్థులు రోజూ అనేక బ్యాచీలుగా విడిపోయి 'క్రాంతి', 'రాడికల్ మార్చ్', 'కార్మికపథం' వంటి విప్లవ పత్రికలను పంపిణీ చేయడం, కరపత్రాలు పంచడం, పోస్టర్లు వేయడం, వాల్‌రైటింగ్ చేయడం వంటి కార్యకలాపాల్లో పాల్గొనేవాళ్లు. సారా వ్యతిరేక పోరాటాలలో, భూస్వామ్య వ్యతిరేక పోరాటాలలో విద్యార్థులు పాలు పంచుకున్నారు. 1984 వరకు కామ్రేడ్ కనకస్వామి ఇలాంటి కార్యక్రమాలన్నింటిలో పాల్గొనేవాడు.

1984లో పార్టీ ఇచ్చిన పిలుపునందుకుని 'గ్రామాలకు తరలండి' క్యాంపెయిన్‌లో పాల్గొని విప్లవ గీతాలాలపిస్తూ నూతన ప్రజాస్వామిక విప్లవ రాజకీయాలను గ్రామాలలో ప్రచారం చేశాడు. అప్పటికే విప్లవోద్యమంలో క్రియాశీలంగా పని చేస్తున్న తన తోటి విద్యార్థుల నుండి, పార్టీ ఆర్గనైజర్ల నుండి ప్రేరణ పొందుతూ చిన్న వయస్సులోనే ఇంటిని వదిలెయ్యడానికి సిద్ధపడ్డాడు. అలా 1984లో, 15 సంవత్సరాల అతి చిన్న వయసులోనే పూర్తి కాలం కార్యకర్తగా పార్టీలో చేరిపోయాడు.

1984లో విప్లవోద్యమంలో భాగస్వామి అయ్యి 2012లో అమరుడయ్యే నాటి వరకు ఎన్నెన్నో బాధ్యతలు నిర్వహించాడు. బాబ్జీ, అమన్ తదితర మారుపేర్లతో విప్లవ కార్యకలాపాల్లో పాలు పంచుకున్నాడు. 1984 మధ్య నుండి 1985 మధ్య వరకు నర్సంపేట సెంట్రల్ ఆర్గనైజర్ (అమరుడు పైండ్ల వెంకట రమణ – కడవెండి)కి గార్డుగా బాధ్యతలు నిర్వహించాడు. ఆ తర్వాత హైదరాబాద్‌లో కార్మికుడిగా పని చేస్తూ కొరియర్‌గా పని చేశాడు.

అటు తర్వాత పార్టీ అవసరాల నిమిత్తం టెక్నికల్ రంగంలో ప్రవేశించి ఆయుధాల తయారీలో నైపుణ్యం సంపాదించాడు. వందలాది తుపాకులు, వేలాది గ్రెనేడ్లు తయారు చేసే యూనిట్లలో వివిధ బాధ్యతలు నిర్వహించి వాటిని యుద్ధరంగానికి సరఫరా చేయడంలో తన వంతు పాత్ర పోషించాడు.

## శత్రువు కంట్లో దుమ్ము కొట్టిన కొరియర్

1985 తర్వాత వరంగల్ జిల్లా సెక్రటరీ కామ్రేడ్ పులి అంజన్నకి కొరియర్‌గా అత్యంత కీలకమైన బాధ్యతలు చేపట్టి శత్రుమూకల కళ్లుగప్పి జిల్లాకు, రాష్ట్ర కమిటీకి మధ్య వారధిలా పని చేశాడు. కొంత కాలం వరంగల్ పట్టణ ఆర్గనైజరు అమరుడు కామ్రేడ్ రామకృష్ణకు కొరియర్‌గా పనిచేశాడు. సిటీ ఆర్గనైజర్లయిన కామ్రేడ్స్ రామకృష్ణ, యాకయ్య, నాగేశ్వర్‌రావులను పట్టుకుని, బూటకపు ఎదురుకాల్పుల్లో చంపేసి, హంటర్ రోడ్‌లో పడేసిపోతే, వారిని కలిసే అపాయింట్‌మెంట్‌కి వచ్చిన కామ్రేడ్ అమన్, అక్కడకు పోయి, వారిని గుర్తుపట్టడమే కాక, వెంటనే వార్తా పత్రికలకు స్టేట్‌మెంట్ పంపించాడు. ఆ సమయంలో ఎంతో సమయస్ఫూర్తిని, మరెంతో గుండె నిబ్బరాన్ని ప్రదర్శించాడు. రాష్ట్ర కమిటీ కొరియర్‌గా వున్నపుడు అమరులు కామ్రేడ్స్ దామోదర్, శాఖమూరి అప్పారావు, పటేల్ సుధాకర్ లాంటి వారితో కలిసి పనిచేశాడు. తన సహచరులు శత్రు చెర చిక్కిన వార్త తెలవగానే వారికి తెలిసిన డెన్నులను కొద్ది గంటల సమయంలోనే ఖాళీచేసి తూటాలు, తుపాకులను సురక్షిత ప్రదేశానికి తరలించేవాడు. తాను కొరియర్‌గా పనిచేస్తున్న కాలంలో అనేకసార్లు శత్రువు పన్నిన చక్రవ్యూహం నుండి చాకచక్యంగా తప్పించుకున్నాడు. ఒళ్లంతా కళ్లు చేసుకుని పరిసరాలను పరిశీలించి శత్రు జాడ పసిగట్టడంలో ఎంతో పట్టు సాధించాడు.

## క్రూర పోలీసు అధికారులను, ప్రజా కంటకులను మట్టుబెట్టిన గెరిల్లా

1993లో హైద్రాబాద్‌లో అత్యంత క్రూరుడైన పోలీసు అధికారి డిఐజి వ్యాస్ యాక్షన్‌ను విజయవంతం చేయడంలో తనవంతు సహాయ సహకారాలను చాకచక్యంగా అందించాడు. ఆ తర్వాత హైద్రాబాద్ నడిబొడ్డున ఎంఎల్ఏ సుధీర్ కుమార్‌ను బంధీగా పట్టుకుని శత్రు చెరలో వున్న పార్టీ నాయకులను విడిపించుకోవడంలో కూడా ఆయన అజ్ఞాత కృషి ఉన్నది.

జంట నగరాల్లోని కార్మికవాడల్లో, పేద బస్తీల్లో అలెగ్జాండర్ వంటి మేనేజ్‌మెంట్ తొత్తులు, గూండాలు కార్మికుల, ప్రజల, మహిళల జీవితాలతో చెలగాటమాడుతూ వారిపై తీవ్రమైన దౌర్జన్యాలు చేసేవారు. అక్కడి పార్టీ అలాంటి కంటకులను కొందరిని ఎంపిక చేసి అంతమొందించింది. కామ్రేడ్ బాబ్జీ అటువంటి యాక్షన్లలో టీం సభ్యునిగా చురుకైన పాత్ర నిర్వహించి ఎంతో సాహసాన్ని ప్రదర్శించాడు.

## ప్రజాయుద్ధ రంగానికి తుపాకులందించిన అజ్ఞాత యోధుడు

కామ్రేడ్ పులి అంజన్న అమరుడయిన తర్వాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ కార్యదర్శి కామ్రేడ్ మహేష్ (సంతోష్)కు కొరియర్‌గా కొంతకాలం పనిచేశాడు. తనతో పాటు నల్లమల గెరిల్లా జోన్ పరస్పెక్టివ్ ఏరియాకు పయనమయ్యాడు. చిన్నప్పుడు కాకతాళీయంగా జరిగిన ఒక దుర్ఘటన అతనికి జీవితకాలపు అంగవైకల్యాన్నిచ్చింది. కుడికన్నులో ఏర్పడ్డ పొర వల్ల రాత్రి పూట నడకకు చాలా ఇబ్బంది పడేవాడు. అయితే ఈ విషయం తెలిస్తే తనను దళంలోకి తీసుకోరనే భయంతో తన సమస్యను తెలియనియ్యకుండా దాచిపెట్టాడు. చివరికి కామ్రేడ్ మహేశ్‌కు సమస్య అర్థం అయింది. దానితో ఆ తరువాత పార్టీ అతనిని పట్టణాలలో పనికి మార్చింది.

1995 నుండి 2007 వరకూ కామ్రేడ్ అమన్ పార్టీ సెంట్రల్ టెక్నికల్ రంగంలో పనిచేశాడు. ఈ రంగంలో తన బాధ్యతలను సమర్థవంతంగా నెరవేర్చడం కొరకు అవసరమైన ఎన్నో టెక్నిక్స్‌ను పట్టుదలగా నేర్చుకున్నాడు. అప్పటి నుండి అమరుడయ్యేవరకూ టెక్నికల్ రంగపు అభివృద్ధిలోనూ, ఒడిదుడుకుల్లోనూ ముఖ్య భాగస్వామియై, అటు ప్రధాన ఉత్పత్తిరంగంలోనూ, మరో పక్క డెవలప్‌మెంట్ పనులలోనూ, ఆయుధాల సరాఫరా, డంపింగ్‌లలోనూ క్రియాశీలంగా పాల్గొని పార్టీ టెక్నికల్ రంగాన్ని అభివృద్ధి చేయడంలో ముఖ్య భూమికను నిర్వహిస్తూ జిల్లా/డివిజనల్ కమిటీ స్థాయికి ఎదిగాడు.

అత్యాధునిక టెక్నాలజీతో ముడిపడి ఉన్న టెక్నికల్ పనిలో మైక్రాన్సు ప్రమాణంలో ఖచ్చితమైన కొలతలు పాటించవలసి వుంటుంది. కంటి చూపు సమస్య వున్నప్పటికీ దాన్ని అధిగమిస్తూ కామ్రేడ్ అమన్ పనుల్ని నేర్చుకోవడం కోసం ఎంతో పట్టుదలగా కృషి చేశాడు. పనికి అవసరమైన అనేక రకాల సాంకేతిక పరిజ్ఞానాన్ని నేర్చుకోవటానికి ప్రైవేట్ వర్క్ షాపుల్లో వర్కర్‌గా చేరి తాను నేర్చుకుని వచ్చిన పనిని తన తోటి కామ్రేడ్స్‌కు నేర్పించాడు. ఇట్లా బయటి వర్క్‌షాపుల్లో పని నేర్చుకుంటున్న క్రమంలో యజమానులు చెప్పిన పనల్లా చేసేవాడు. షాపు ఊడ్వడం నుండి మొదలు పెట్టి ఎంగిలి చాయ్‌గ్లాసులు కడగడం వరకూ అన్ని పనులూ మారు మాట్లాడకుండా చేసేవాడు. ఒక కమ్యూనిస్టుకు తన లక్ష్యాన్ని చేరటానికి ఎటువంటి పనులు చేయడమైనా నామోషీ కాదని తన ఆచరణ ద్వారా నిరూపించాడు.

ఆయుధాల తయారీ పని కోసం అనేక రాష్ట్రాలలో సుదీర్ఘకాలం పాటు రహస్యంగా వుంటూ అనేక సాధక బాధకాలను భరించాడు. తయారైన ఆయుధాలను నల్లమల, దక్షిణ తెలంగాణ ప్రాంతాలకు చేర్చేవాడు. తుపాకులను సైకిళ్లకు కట్టుకుని పోలీసు స్టేషన్ల ముందు నుండే ఎలాంటి జంకు లేకుండా సురక్షిత ప్రదేశాలకు, అటవీ ప్రాంతాలకు తరలించేవాడు.

టెక్నికల్ రంగానికి రావటానికి ముందు కా. పులి అంజన్న కొరియర్‌గా ఉన్న కాలం నుండే కొనుగోలు చేసిన ఆయుధాలను రిసీవ్ చేసుకొని వాటిని సంబంధిత స్టోర్స్‌కు తరలించడం, స్టోర్ మెయింటెయిన్ చేయడం, తిరిగి వాటిని ఫీల్డ్‌కు అందించడంలో

ఎంతో చాకచక్యంగా పని చేసేవాడు. ఆ క్రమంలో మెట్రోపాలిటన్ సిటీల్లో సైతం అన్ని రకాల వాహనాలను నడిపించే నైపుణ్యాన్ని సంపాదించాడు. ఆ అనుభవాలన్నీ టెక్నికల్ రంగానికి ఎంతగానో ఉపయోగపడ్డాయి, ఆ పనిని సులభతరం చేసాయి కూడా.

కామ్రేడ్ అమన్ టెక్నికల్ రంగంలో ప్రవేశించేనాటికి టెక్నికల్ రంగంలో మహిళలకు ఓపెన్ వర్క్‌షాప్‌లో పని కల్పించడం ఎలా అనే సమస్య ముందుకు వచ్చింది. మహిళలు చేయగలిగే ప్రత్యేక పనులను ముందుగా కామ్రేడ్ అమన్ నేర్చుకున్నాడు. ఆ ప్రత్యేక వస్తువుల్ని ఫినిషింగ్ చెయ్యడం, ప్యాకింగ్ చెయ్యడం వంటి పనులు చేసే కవర్‌లో ఓపెన్ వర్క్ షాపుల్లో మహిళా కామ్రేడ్స్ పని చేయడం మొదలైంది. అలా కామ్రేడ్ అమన్ మహిళలు వర్క్ షాపుల్లో పని చెయ్యటానికున్న అడ్డంకుల్ని తొలగించడంలో తనవంతు కృషి చేశాడు.

ఈ పనుల్లో ఉండే ప్రమాదాలను కూడా లెక్క చేయకుండా వాటిని నిర్వహించడంలో కామ్రేడ్ అమన్ ముందుండేవాడు. ప్రెస్ పని చేస్తున్న ఒక సందర్భంలో అతని మూడు వేళ్లు చితికిపోయాయి. మరో సందర్భంలో చేతులు కాలాయి. మరోసారి ఒక చిన్న ఇనప ముక్క వేగంగా వచ్చి తగలడంతో ముందు పన్ను విరిగిపోయింది. అయినా ప్రమాదం ఉన్న పనులు నిర్వహించటానికి వెనకాడేవాడు కాదు. అయితే ఇటువంటి ప్రమాదకరమైన పనులలో పైస్థాయి నాయకత్వం పాల్గొనడాన్ని వ్యతిరేకించేవాడు, నివారించేవాడు.

తన పనిలో అభివృద్ధి సాధించడానికి చాలా శ్రద్ధగా, పట్టుదలగా అధ్యయనం చేసేవాడు. పార్టీ నిర్వహించే రాజకీయ తరగతులలో పాల్గొని తన రాజకీయ స్థాయిని పెంచుకోవడానికి కృషి చేసేవాడు.

## శత్రు చెరలో సైతం మొక్కవోని ఉక్కు సంకల్పం

2007 ప్రారంభంలో ఒడిశా రాష్ట్రంలోని రూర్కెలా పట్టణంలో ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ఇంటెలిజన్స్ బ్యూరో పోలీసు మూకలు పార్టీ నిర్వహిస్తున్న టెక్నికల్ విభాగపు టీము మీద చేసిన దాడిలో కామ్రేడ్ అమన్, అతని సహచరి, మరి కొందరు కామ్రేడ్స్ శత్రువు చేత చిక్కినారు. చెప్పనలవికాని చిత్రహింసలను ఆయన నిబ్బరంగా ఎదుర్కొని పార్టీ రహస్యాలను కాపాడినాడు. శత్రు నిర్బంధంలో, పోలీసు కస్టడీలో, జైలు జీవితంలో ఎన్నడూ శత్రువు కుతంత్రాలకు, ప్రలోభాలకు తలవంచలేదు. జైలులోని అక్రమాలకు, అక్కడ సాగుతున్న అవినీతికి వ్యతిరేకంగా పోరాటాలు నడిపించడంలో తన వంతు పాత్ర నిర్వర్తించాడు. బెయిల్ దొరకగానే ఎటువంటి తటపటాయింపులు లేకుండా గట్టి సంకల్పంతో దండకారణ్య వుద్యమంలో భాగమై, అక్కడి పశ్చిమ రీజియన్ టెక్నికల్ బాధ్యుడిగా పనిచేశాడు.

చాలా కాలం పాటు పట్టణాల్లో పనిచేసిన కామ్రేడ్ అమన్ అటవీ జీవితంలోని అన్ని రకాల ఇబ్బందులకు అలవాటుపడ్డాడు. బయట కార్ఖానాల్లో ఉండే పని పద్ధతులకూ, ఫీల్డులో ఉండే పని పద్ధతులకూ మధ్య వుండే తేడాను అర్థం చేసుకుంటూ క్రమక్రమంగా అనుభవాల నుండి నేర్చుకుంటూ పురోగమించాడు.

## ఆదర్శప్రాయమైన విప్లవ సాహచర్యం

కామ్రేడ్ అమన్ తన జీవిత భాగస్వామిని గౌరవంగా, సమాన హోదాలో చూసేవాడు. ఆమె అభివృద్ధికి పూర్తి సహకారం అందించేవాడు. వాళ్లిద్దరూ అటు పనిదగ్గర, ఇటు ఇంటి పనులలోనూ పరస్పర సహాయ సహకారాలందించుకుంటూ ఎంతో అన్యోన్యంగా ఉండేవారు. ఇంటి పనులలో తనే ఎక్కువ బాధ్యతపడుతూ పూర్తి ప్రజాస్వామిక పద్ధతిలో నిర్వహించటానికి ప్రయత్నించేవాడు. తన ఇష్టాయిష్టాలను సహచరిపై రుద్దే ప్రయత్నం ఎన్నడూ చేయలేదు.

తన సహచరికి టెక్నికల్ పనులు నేర్పించడంలో ఎంతో ఓపికగా బోధించేవాడు. పనిలోని మెళకువలు, జాగ్రత్తలు, నాణ్యత సాధించడానికి శ్రద్ధ పెట్టాల్సిన విషయాలను మళ్లీ మళ్లీ చెపుతూనే వుండేవాడు. తన సహచరికి తెలిసిన విషయాలను నేర్చుకోవటానికి ఆసక్తి చూపుతూ తానొక విద్యార్థి లాగా నమ్రతతో వ్యవహరించేవాడు. ప్రమాదాలతో కూడుకుని ఉన్న కీలకమైన పనులను ఇద్దరూ కలిసి సునాయాసంగా నెరవేర్చుకొచ్చేవారు. ప్రమాదవశాత్తు అరెస్టు అయి శత్రువు చేత చిక్కితే మనో నిబ్బరంతో, ధైర్యంగా వుండాలని అర్థం చేయించేవాడు. అతను నేర్పిన విషయాలు రూర్కెలాలో అరెస్టు అయినపుడు శత్రువు చేసిన రకరకాల ఇంటరాగేషన్‌ను నిబ్బరంగా ఎదుర్కొని నిలబడడానికి అతని సహచరికి ఎంతో ఉపయోగపడ్డాయి.

## అమన్ ఆశయాల్ని, ఆదర్శాల్ని అలవర్చుకుందాం!

తన సుదీర్ఘ విప్లవ జీవితంలో కామ్రేడ్ అమన్ ఎన్నో ఆదర్శాల్ని నెలకొల్పాడు. కామ్రేడ్ పులి అంజన్న అమరుడైన తర్వాత కామ్రేడ్ అమన్‌కు పార్టీతో సంబంధాలు తెగిపోయాయి. చేతిలో చిల్లిగవ్వ కూడ లేని పరిస్థితిలో, మనుగడే కష్టమైనపుడు మందుల దుకాణంలో, కిరాణా స్టోర్‌లో, పాల ఫ్యాక్టరీలో పనులు చేస్తూ పార్టీ కాంటాక్టు కోసం ప్రయత్నిస్తూ వచ్చాడు.

తాను ఎక్కడ వున్నా ప్రజలతో మమేకం అయ్యేవాడు. వాళ్ల ప్రేమాభిమానాలను విశేషంగా చూరగొనేవాడు. ఇలా ప్రజలతో స్నేహాన్ని కవచంగా ధరించడం వల్లనే శత్రు కోటలైన పట్టణాలలో సుదీర్ఘకాలం పనిచేయగలిగాడు. సామ్రాజ్యవాద సంస్కృతితో కుళ్లి కంపుకొట్టే పట్టణాల్లో సుదీర్ఘకాలం పనిచేసినప్పటికీ ఆ ప్రభావానికి అణువంత కూడా లోనుకాకుండా వుత్తమ కమ్యూనిస్టు విలువలను నెలకొల్పాడు.

టెక్నికల్ రంగం అభివృద్ధికీ, విప్లవాశయ సాధనకూ 28 సంవత్సరాలు అవిశ్రాంతంగా శ్రమించిన కా. అమన్‌ను కోల్పోవడం విప్లవోద్యమానికి తీవ్రమైన నష్టమే. అయితే ప్రజాయోధులకు చావు లేదు. కామ్రేడ్ కనకస్వామికి మరణం లేదు. ఆయన తయారుచేసిన ఆయుధాలు పీఎల్‌జీఏ యోధుల భుజాలపై పదిలంగా వున్నాయి. గ్రీన్‌హంట్ పేరుతో విప్లవోద్యమాన్ని సమూలంగా నిర్మూలించి, దేశ సహజ సంపదలన్నీ సామ్రాజ్యవాదులకు, దళారీ నిరంకుశ పెట్టుబడిదార్లకు కట్టబెట్టాలని చూస్తున్న దేశ దోపిడీ పాలకవర్గాలతో

***(మిగతాది 6వ పేజీలో...)***

# జోలారావ్ వీర వనితలు

# కామ్రేడ్స్ సమీర, అమీల, అరుణలకు అరుణారుణ జోహార్లు!

ఛత్తీస్‌గఢ్ ఒడిశా సరిహద్దు ప్రత్యేక జోనల్ కమిటీ పరిధిలోని, మైన్‌పూర్ డివిజన్, గరియాబంద్ జిల్లా, జోలారావ్ గ్రామంలో 2012 మే 31న సాయంత్రం నాలుగు గంటలకు దళంపై పోలీసులు చేసిన మూకుమ్మడి దాడిలో కామ్రేడ్స్ సమీర (ఏరియా కమిటీ కార్యదర్శి), అమీల (ఏరియా కమిటీ సభ్యురాలు), అరుణ (ఏరియా కమిటీ సభ్యురాలు) అమరులయ్యారు. ప్రజలలో రాజకీయ ప్రచారం చేయడం కోసం ఆగి వున్న గోబ్రా దళంపై వందలాది ఎస్టీఎఫ్, జిల్లా పోలీసులు అత్యాధునిక ఆయుధాలు, గ్రెనేడ్లు, మోర్టార్ షెల్స్‌తో పాటు, వేలాది తూటాలను ప్రయోగించి చేసిన దాడిలో ఈ ముగ్గురు వీరనారులు నేలకొరిగారు. పీడిత ప్రజల విముక్తి కోసం తమ నులివెచ్చని నెత్తుటినర్పించిన ఈ కామ్రేడ్స్‌కు అరుణారుణ జోహార్లర్పిద్దాం. వాళ్ల ఆశయ సాధనకై కొన ఊపిరి వరకూ పోరాడుదాం.

## విముక్తి బాటలో పోరు వెన్నెల – కామ్రేడ్ సమీర



అమరత్వం చెందే నాటికి మైన్‌పూర్ డివిజన్‌లోని నగరి ఏరియా కమిటీ కార్యదర్శిగానూ, గోబ్రా దళం కమాండర్‌గానూ, బాధ్యతలు నిర్వర్తిస్తున్న కామ్రేడ్ సమీరది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం. తెలంగాణలోని నల్లగొండ జిల్లా, మునుగోడు మండలం, ఇప్పర్తి గ్రామంలో 28 ఏళ్ల క్రితం మధ్య తరగతి రైతు కుటుంబంలో నగమ్మ, గుజ్జ రాములుల మొదటి సంతానంగా కామ్రేడ్ సమీర పుట్టింది. తల్లి దండ్రులు ఆమెకు పెట్టుకున్న పేరు ధనలక్ష్మి. ధనలక్ష్మికి ఒక చెల్లె మాత్రమే వుంది. చిన్న కుటుంబం కావడం, లేక లేక పుట్టడం వల్ల, తల్లి దండ్రులు ధనలక్ష్మిని అల్లారుముద్దుగా పెంచుకున్నారు.

లక్ష్మి పెరిగి పెద్దదవుతూనే కుటుంబ బాధ్యతలను పంచుకున్నది. వ్యవసాయ పనుల్లో తండ్రికి చేదోడు వాదోడుగా మారింది. ఆ పనుల్లో వుండే పితృస్వామ్య రేఖను చెరిపేస్తూ, నాగలి దున్నడం, ఒరాలు తియ్యడం, పత్తి, మిరప చేన్లకు వుదయం నుండి సాయంత్రం వరకు పురుగు మందులు పిచికారి చేయడం వంటి పనులన్నీ చేసేది. అట్లా మగ పిల్లలు లేకపోవడాన్ని పెద్ద లోటుగా భావించే పితృస్వామ్య సమాజాన్ని సవాల్ చేసింది.

బిడ్డ పెద్దదవుతుంటే ఆ తల్లిదండ్రులు పెండ్లి చేయాలనుకున్నారు. పెండ్లి కోసం కట్నం సమకూర్చుకోవడం మొదలుపెట్టారు. అయితే అప్పటికే వాళ్ల గ్రామం, నాటి సి.పి.ఐ.(ఎంఎల్) (పీపుల్స్‌వార్) నాయకత్వంలో జరుగుతున్న వ్యవసాయ విప్లవ ప్రభావానికి లోనయింది. రాచకొండ ఏరియా పరిధిలోకి వచ్చే, ఆ గ్రామ ప్రజలంతా సంఘటితం అయి భూమి, భుక్తి, విముక్తి పోరాటాల్లో కదిలారు. లక్ష్మి తండ్రి కూడా ఆ పోరాటాల్లో భాగమయ్యాడు. వాళ్ల పొలం, వ్యవసాయ బాయి దళానికి ఆశ్రయమైంది, ఆర్‌వీ అయింది. ఎంత కష్ట కాలంలో దళం అక్కడికి వెళ్లినా, ఆ కుటుంబం దళాన్ని కంటికి రెప్పలా కాపాడుకునేది. అటువంటి నేపథ్యంలో దళం పరిచయాల్లోకి వచ్చిన లక్ష్మి దళం పట్ల అభిమానాన్ని పెంచుకున్నది. దళానికి సహకరించడం మొదలుపెట్టింది. దళం తమ గ్రామ సమీపంలో ఎక్కడ వున్నట్టు తెలిసినా అన్నం వండి పంపేది. ఇట్లా లక్ష్మి దళానికి కలుస్తున్నదని అర్థమైన పోలీసులు ఆమెకు అరెస్టు వారెంట్ పంపారు. దానితో ఆమె తల్లిదండ్రులు భయాందోళనలకు గురయ్యారు. గ్రామంలో వున్న పెద్ద మనుషులను, రాజకీయ నాయకులను తీసుకొని పోలీస్ స్టేషన్‌కు పోయారు. అక్కడ పోలీసులు, లక్ష్మిని దళాన్ని కలవొద్దని బెదిరించి, వుదయం నుంచి సాయంత్రం వరకు స్టేషన్‌లో వుంచుకొని వదిలేశారు. కాని పోలీసుల బెదిరింపులు లక్ష్మి చైతన్యాన్ని అడ్డుకోలేకపోయాయి. వాళ్లు దళాన్ని కలువొద్దని బెదిరిస్తే, తాను మొత్తంగానే దళంలోనే కలిసిపోవాలని నిర్ణయించుకుంది.

### నల్లమలను అల్లుకున్న పోరు'లత'

అట్లా 2001లో కామ్రేడ్ లక్ష్మి రాచకొండ దళంలో చేరింది. లత అనే పేరుతో ప్రజలకు పరిచయం అయింది. ఆ తర్వాత మూడు, నాలుగు నెలలు కృష్ణపట్టి దళంలో పనిచేసింది. ఆ తర్వాత ఏపీలో కేంద్ర, రాష్ట్ర నాయకత్వ కామ్రేడ్స్ రక్షణ కోసం కొత్తగా ఏర్పాటు చేసిన ప్రొటెక్షన్ దళంలోకి బదిలీ అయింది. ఈ దళం ప్రకాశం, గుంటూరు, మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాలకు సరిహద్దుగా వున్న నల్లమల అడవిని కేంద్రంగా చేసుకొని వుండేది. చెంచు తెగ ఆదివాసీ ప్రజలు ఎక్కువగా నివసించే కొండలు, దట్టమైన అడవులతో కూడుకున్న ప్రాంతమిది. కొండలు, గుట్టలు ఎక్కుతూ, దిగుతూ మైళ్ల కొద్దీ నడుస్తూ తిండి సామాన్లు మోసుకురావడం, రాష్ట్ర కమిటీ కార్యదర్శికి ఇతర కామ్రేడ్స్‌తో వుండే అపాయింట్‌మెంట్లకు హాజరు కావడం, సమావేశాల కోసం వచ్చే కామ్రేడ్స్‌కు భద్రత కల్పిస్తూ

సమావేశ స్థలాలకు చేర్చడం, తీవ్రమైన శత్రు నిర్బంధంలో నీళ్లకు అరగంట, గంట దూరంలో వేసే మకాంలకు నీళ్లు మోయడం, తిండి సామాన్లు, ఆయుధ సామాగ్రి, కమిటీలకు, నాయకత్వానికి సంబంధించిన రహస్య పత్రాలు శత్రువు నుండి కాపాడుకోవడానికి డంపులు చేయడం వంటి పనులెన్నింటినో, ఈ దళంలోని కామ్రేడ్స్ చేసే వాళ్లు. ఈ కామ్రేడ్సందరూ ఇటువంటి కష్టభరితమైన పనులను ఎంతో క్రమశిక్షణతో చేసే వాళ్లు.

2004 వరకూ ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు, ఆ తర్వాత ముఖ్యమంత్రిగా వచ్చిన రాజశేఖర్ రెడ్డి హయాంలో నల్లమల్ల ప్రాంతంపై తీవ్ర నిర్బంధం కొనసాగింది. గ్రేహౌండ్స్ బలగాల విచ్చలవిడి దాడులు కొనసాగాయి. ఇటువంటి కఠిన, నిర్బంధ పరిస్థితిలో సైతం కామ్రేడ్ లత దృఢమైన సంకల్పంతో నాయకత్వ రక్షణ బాధ్యతలను నెరవేర్చింది. నల్లమలలో మలేరియా బెడద ఎక్కువగా వుండడం వల్ల, కామ్రేడ్ లత తరచూ మలేరియా బారిన పడుతుండేది. అది ఆమె ఆరోగ్యాన్ని దెబ్బతీసింది. కాని ఆమె విప్లవ సంకల్పాన్ని మాత్రం దెబ్బతీయలేదు. డోసుల మీద డోసులు మింగుతూ, పడుతూ లేస్తూనే అన్ని పనుల్లో పాల్గొనేది. మైగ్రేన్ వల్ల విపరీతమైన తలనొప్పితో ఇబ్బంది పడేది. అయినా దళం ఫంక్షనింగ్‌కు ఇబ్బంది కాకుండా వుండడానికి ప్రయత్నించేది. అన్ని పనుల్లో పోటీపడి పాల్గొనేది. ఊహించని విధంగా ప్రొటెక్షన్ దళం కమాండర్ అకస్మాత్తుగా, దళాన్ని వదిలి పారిపోయినా షాక్ తినకుండా బాధను దిగమింగుకొని రాజకీయంగా ఎదుగుతూ గట్టిగా పార్టీలో నిలబడింది. 2004లో తను బాగా ఇష్టపడిన కామ్రేడ్‌ను పెళ్లి చేసుకొని అన్యోన్యమైన విప్లవ సహచర్యంతో ముందుకు సాగింది.

కామ్రేడ్ లతను 2004లో ఏరియా కమిటీ స్థాయికి పార్టీ ప్రమోట్ చేసింది. అదే సమయంలో రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం విప్లవ పార్టీలతో చర్చల నాటకానికి సిద్ధపడింది. సి.పి.ఐ. (మావోయిస్టు) ప్రతినిధులుగా కామ్రేడ్స్ రామక్రిష్ణ, సుధాకర్, గణేష్‌లు చర్చల కోసం బయటకు వచ్చారు. ఆ సందర్భంలో నాయకత్వ రక్షణ కోసం పార్టీ ఒక రక్షణ బృందాన్ని ఏర్పాటు చేసింది. ఆ రక్షణ బృందంలోని నలుగురు మహిళల్లో కామ్రేడ్ సమీర కూడా వుంది. ప్రభుత్వం కుట్రపన్ని నల్లదండు ముఠాలతో దాడి చేయించినా నిరాయుధంగానే ప్రాణాలకు తెగించి నాయకత్వాన్ని కాపాడాలనే ప్రేరణ కల్పిస్తూ, ఆ బృందానికి రెండు రోజుల పాటు శిక్షణ కూడా ఇచ్చారు.

చర్చలకు వెళ్లే దారిలో గుంటూరు జిల్లా గుత్తికొండ బిలం వద్ద నిర్మించిన కామ్రేడ్ చారుమజుందార్ స్థూపావిష్కరణ సభను జరపాలని పార్టీ నిర్ణయించింది. సహజంగానే ఈ సభకు లక్షల మంది జనం ఉప్పెనలా కదిలి వచ్చారు. వెల్లువలా మీదకొచ్చి పడుతున్న జనంలో కలిసి, నల్లదండు ముఠావాళ్లు నాయకత్వానికి ఏమైనా హాని చేస్తారేమో అనే ఆందోళనతో రక్షణ బృందం కామ్రేడ్స్ ఒళ్లంతా కండ్లు చేసుకొని అనుక్షణం అప్రమత్తంగా వున్నారు. ఆ అప్రమత్తత కారణంగా కొందరు నల్లదండు ముఠా సభ్యులను కామ్రేడ్ లత పసిగట్టగలిగింది. ఆమె వెంటనే నాయకత్వం దృష్టికి తీసుకురాగా, వాళ్లను వెంటనే పట్టుకొని ప్రభుత్వ కుట్రలను పార్టీ ఎండగట్టింది.

చర్చల సందర్భంగా రక్షణ బృందంలోని నలుగురు మహిళలను మీడియా ఇంటర్వ్యూ చేసింది. ఆనాడు ఆ ఇంటర్వ్యూ సంచలనం సృష్టించింది.

## నిప్పులు చెరిగే నిర్బంధంలో చెక్కుచెదరని పోరు సంకల్పం

చర్చల నాటకానికి బూటకపు ఎన్‌కౌంటర్లతో ప్రభుత్వం తెరదించిన తర్వాత, నల్లమలలో నిర్బంధం నిప్పులు కురిసింది. చర్చల బృందానికి నాయకత్వం వహించి ప్రజల హృదయాలను గెలుచుకున్న కామ్రేడ్ రామక్రిష్ణ సహా ఇతర ముఖ్యమైన నాయకత్వాన్ని అంతమొందించడం ద్వారా విప్లవోద్యమం పట్ల ప్రజల్లో మరింతగా బలపడిన నమ్మకాన్ని దెబ్బతీయాలని, రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నించింది. గ్రేహౌండ్స్ బలగాలతో అడవులను జల్లెడ పట్టించింది. ఆ సమయంలో బూరుగుండాల గ్రామం వద్ద కామ్రేడ్ రామక్రిష్ణ వున్నాడనే సమాచారం తెలుసుకొని, డేరా మీద వందలాది గ్రేహౌండ్స్ బలగాలు మూకుమ్మడిగా దాడిచేసినయి. ఆ సమయంలో తమ సెక్షన్ కమాండర్ పని మీద వెళ్లడంతో సెక్షన్ డిప్యూటీ కమాండర్‌గా వున్న కామ్రేడ్ లత, సెక్షన్ మొత్తాన్ని సమన్వయం చేస్తూ నాయకత్వాన్ని సురక్షితంగా రిట్రీట్ చేసింది. అంత నిర్బంధంలో సైతం కామ్రేడ్ రామక్రిష్ణతో పాటు అమరులు కామ్రేడ్ చెరుకూరి రాజ్ కుమార్, సందె రాజమౌళి వంటి అగ్రస్థాయి నాయకత్వం నల్లమల అడవుల్లో కొంతకాలం పాటు సురక్షితంగా వుండగలిగారంటే కామ్రేడ్ లత వంటి ఎందరో కామ్రేడ్స్ త్యాగపూరిత ప్రతిఘటనే కారణం.

ఆ తర్వాత కొద్ది కాలానికే కామ్రేడ్ శాఖమూరి అప్పారావు, నల్లమల డివిజన్ కార్యదర్శి కామ్రేడ్ సుదర్శన్ వున్న సమాచారం తెలుసుకొని వందలాది గ్రేహౌండ్స్ బలగాలు చుట్టుముట్టి, హెడ్ క్వార్టర్ మీదనే తమ దాడిని ప్రారంభించాయి. తమ వీరోచిత ప్రతిఘటన ద్వారా నాయకత్వ కామ్రేడ్స్‌ను సురక్షితంగా రక్షించుకున్న

**పత్రికపై మీ విమర్శలూ, అభిప్రాయాలూ, సలహాలూ, సూచనలను ఎప్పటికప్పుడు తెలియజేయండి. అది పత్రిక అభివృద్ధికి దోహదపడుతుందని గుర్తించండి!**

వాళ్లలో కామ్రేడ్ లతది కూడా ముఖ్యమైన పాత్రనే. అప్పుడు 'ఏ' సెక్షన్‌లో వున్న కామ్రేడ్ లత శత్రువు పైకి అడ్వాన్స్ కావడంలోనూ, శత్రువు గుండెలదిరేలా కాషన్ ఇవ్వడంలోనూ చురుకైన పాత్ర వహించింది.

ఇంకా ఈ నిర్బంధ కాలంలో ఎన్నో సందర్భాల్లో శత్రువుతో తలపడిన ఘటనల్లో కామ్రేడ్ లత పాల్గొన్నది. నల్లమల డివిజన్‌లోని మహానంది దళం ఏరియాలో యంత్రకాయచల్ల అడవిలో దళం మకాం వేసినప్పుడు, మహానంది దళం ఏరియాలోనే పచ్చర్ల గ్రామం వద్ద దళం మకాం వేసినప్పుడు, శత్రువు దాడి చేస్తే కామ్రేడ్సందరితో పాటు, కామ్రేడ్ లత చురుగ్గా ప్రతిఘటించింది. నల్లమల దళం ఏరియాలో మానాలగయ్యి అడవిలో నీళ్లకు వెళ్లినప్పుడు, పని మీద ఒక సెక్షన్ సంఖ్యలో కామ్రేడ్స్ వెళ్తున్నప్పుడు, పోలీసులతో జరిగిన ఎదురుకాల్పుల్లో కామ్రేడ్ లత పాల్గొంది. పోలీసులతో తలపడే సందర్భంలో తోటి కామ్రేడ్స్‌ను సమన్వయం చేస్తూ, అనుభవం లేని కామ్రేడ్స్‌కు ధైర్యం చెప్తూ, కామ్రేడ్ లత ఆదర్శంగా వుండేది. ఆమె కాషన్స్ ఇస్తుంటే పిట్ట కొంచెం కూత ఘనం అన్నట్టుండేది.

## దండకారణ్య పోరు సంద్రంలో తానూ ఓ కెరటం

2005లో ఉద్యమావసరాలరీత్యా కామ్రేడ్ లతను నల్లమల నుండి బదిలీ చేశారు. కొద్ది కాలంపాటు సహచరుడితో పాటు పార్టీ పనులరీత్యా పట్టణాల్లో వుండింది. 2007లో ఆమె దండకారణ్యంలో సమీర పేరుతో అడుగుపెట్టింది. అక్కడ మొదట తూర్పు బస్తర్ డివిజన్‌లోని బేనూర్ ఏరియాలో కె.ఎ.ఎం.ఎస్ (క్రాంతికారీ ఆదివాసీ మహిళా సంఘం) ఏరియా బాధ్యతలు స్వీకరించింది. కొత్త ప్రాంతం, భిన్నమైన సామాజిక నేపథ్యం వున్న ప్రజలు, మరీ ముఖ్యంగా తెలియని భాష... ఇవేవీ కామ్రేడ్ సమీరకు ఆటంకం కాలేదు. గలగల మాట్లాడే అలవాటున్న సమీరకు గోండీ భాష తొందరగానే వచ్చింది. పట్టుదలగా భాషనే కాక యాసను కూడా నేర్చుకుని మహిళలకు రాజకీయాలు చెప్పడం మొదలుపెట్టింది. పితృస్వామిక అణచివేత గురించి, ఆ పితృస్వామ్యాన్ని వాడుకుంటూనే సామ్రాజ్యవాదులు, దళారీ నిరంకుశ పెట్టుబడిదారులు, భూస్వాములు చేస్తున్న దోపిడీ గురించి మహిళలకు వివరించి వాళ్లను సంఘటితం చేసేది. ఆర్గనైజేషన్ పని కొత్తే అయినా నాయకత్వాన్ని అడిగి తెలుసుకుంటూ, క్యాడర్ నుండి, ప్రజల నుండి నేర్చుకుంటూ, తన ఆలోచనలను స్పష్టంగా చర్చిస్తూ, సరైన పద్ధతులను రూపొందించుకుంటూ, మహిళా వుద్యమాన్ని ముందుకు తీసుకెళ్లడానికి తీవ్రంగా కృషి చేసింది. కొత్త ప్రాంతమైనా, సివిల్ దుస్తుల్లో ఒంటరిగా తిరుగుతూ, నీటిలో చేపగా పనిచేసిందంటే ప్రజలపై తనకున్న ఎనలేని విశ్వాసమే కారణం.

## విప్లవోద్యమ విస్తరణలో దృఢమైన అడుగు

2009లో కామ్రేడ్ సమీర మైన్‌పూర్ డివిజన్‌కు బదిలీ అయింది. దండకారణ్య వుద్యమంపై పాలకవర్గాలు తలపెట్టిన గ్రీన్‌హంట్ దమనకాండను ఓడించే ఎత్తుగడల్లో భాగంగా అక్కడి పార్టీ విప్లవోద్యమ విస్తరణను చేపట్టింది. అందులో భాగంగా 2007లో మైన్‌పూర్‌లో అడుగుపెట్టింది. మైన్‌పూర్ డివిజన్ ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్, దమ్‌తరి, గరియాబంద్; ఒడిశాలోని నవరంగ్‌పూర్, నవపడా జిల్లాల సరిహద్దుల్లో వుంటుంది. అనేక ఖనిజాలతో పాటు ఎన్నో ప్రకృతి సంపదలతో కూడిన ప్రాంతమిది. ఖనిజాల మూలంగా ఇక్కడ లక్షల కోట్ల విలువ చేసే గనులు ప్రారంభమయ్యాయి. వజ్రాల గనులు కూడా వున్నాయి. వాటి మూలంగా నిర్వాసితత్వం, దోపిడీ, పర్యావరణ కాలుష్యం వంటి ఎన్నో సమస్యలు వున్నాయి. ఇక్కడ అభయారణ్యాలు, టైగర్ ప్రాజెక్టుల పేరుతో ప్రజలను నిర్వాసితులను చేయడం కూడా ఒక ముఖ్యమైన సమస్యగా వుంది.

ఈ డివిజన్‌లో పనిచేస్తూ క్రమంగా కామ్రేడ్ సమీర నగరి ఏరియా కమిటీ కార్యదర్శిగానూ, గోబ్రా లోకల్ ఆర్గనైజేషన్ స్క్వాడ్ (ఎల్‌ఓఎస్) కమాండర్‌గానూ బాధ్యతలు చేపట్టింది. ఆ బాధ్యతలను నెరవేర్చే క్రమంలో గనుల పేరుతో, అభయారణ్యాల పేరుతో సామ్రాజ్యవాదులకు, బహుళ జాతి సంస్థలకు ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి రమణ్ సింగ్, ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, కాంగ్రెస్ నేతలు సోనియా, మన్మోహన్, చిదంబరం, జైరాం రమేష్ తదితరులు ఎట్లా అటవీ సంపదను దోచిపెడుతున్నారో, ప్రజలకు అర్థం చేయించేది. జల్, జంగల్, జమీన్ ప్రజలకే చెందాలనీ, టైగర్ ప్రాజెక్ట్ ఎత్తివేయాలనీ డిమాండ్‌తో ప్రజలను సంఘటితం చేయడానికి తీవ్రంగా కృషి చేసింది.

నగరి ఏరియా వ్యాప్తంగా ప్రజలను సంఘటితం చేస్తూ రైతు కూలీ సంఘాలను, మహిళా సంఘాలను, మిలీషియా యూనిట్లను, పార్టీ సెల్స్‌ను నిర్మాణం చేయడంలో చొరవగా వుండింది. ఈ క్రమంలో ఆమె పలు పోలీసు దాడుల నుండి తృటిలో తప్పుకుంది. ఏరియాలో ఇన్ఫార్మర్లను పసిగట్టడంలోనూ, ఏరివేయడంలోనూ చురుకైన పాత్ర వహించింది.

సమీర ఇంటికాడ చదువుకోలేదు. పార్టీలోకి వచ్చిన తర్వాతనే చదువు మీద శ్రద్ధ పెట్టి నేర్చుకుంది. నల్లమలలో పనిచేస్తున్నపుడు తీరికలేని పనులతో కూడా సమయాన్ని దొరకబుచ్చుకొని చదువుకునేది. చాలా తక్కువ సమయంలో చదవడం, రాయడం నేర్చుకుంది. 2007లో డీకేకు వచ్చిన తర్వాత, అక్కడ హిందీ నేర్చుకోవడం మీద దృష్టి పెట్టింది. కొద్ది సమయంలోనే హిందీ చదవడం, రాయడం, మాట్లాడడం నేర్చుకుంది. అంతేగాక దళంలోకి కొత్తగా వచ్చిన సభ్యులకు హిందీ నేర్పించేది. గోండీ, ఛత్తీస్‌గఢీ భాషలు సైతం నేర్చుకొని ప్రజల యాసలోనే మాట్లాడేది. చిన్న చిన్న కవితలు కూడా రాయడానికి ప్రయత్నించేది. ఆర్గనైజేషన్‌లోకి వచ్చాక ఎంతో కష్టపడి చక్కగా రిపోర్టులు రాయడం నేర్చుకుంది.

కామ్రేడ్ సమీర ఏ ప్రాంతంలో వున్నా అక్కడి ప్రజలు ఆమెను ప్రేమించేవారు. తమ సొంత బిడ్డలా చూసుకునే వారు. ప్రజలను ప్రేమించడం, వారితో మమేకం అవడం, వారికి నిస్వార్థంగా

సేవచేయడం, వారి భాష, యాసలు, ఆహారపు అలవాట్లను సొంతం చేసుకోవడం ద్వారానే ఆమె ప్రజల హృదయాల్లో స్థానం సంపాయించుకుంది.

మే 31న జోలారావ్ గ్రామంలో వున్న సమయంలో, తమ డేరాకు అయిదారు గజాల దూరంలోకి వచ్చిన పోలీసులను మొదట కామ్రేడ్ సమీర గమనించింది. వెంటనే కాషన్ ఇస్తుండగానే పోలీసుల నుండి కాల్పుల వర్షం మొదలైంది. తొలి రౌండ్ కాల్పుల్లోనే పొత్తి కడుపు నుండి తూటా దూసుకుపోయి కామ్రేడ్ సమీర పడిపోయింది. 'కామ్రేడ్స్ నేను గాయపడ్డాను. నా తుపాకి తీసుకుపోండి' అని చెబుతూ తుదిశ్వాస విడిచింది.

మాన్‌పూర్ డివిజన్ ఉద్యమాన్ని బలోపేతం చేయడంలో కామ్రేడ్ సమీర పాత్ర చురుకైనది. తన ఆచరణ, పట్టుదల, కష్టపడేతత్వం ద్వారా ఆమె అక్కడి వుద్యమంలో అనేక రకాలుగా ఆధారపడతగిన కామ్రేడ్‌గా ఎదిగింది. సహజంగానే ఆమె మీద అక్కడి కమిటీ ఎన్నో ఆశలు పెట్టుకుంది. ఇంకా ఎంతో భవిష్యత్ వున్న ఈ యువ మహిళా నేతను కోల్పోవడం అనేది విప్లవోద్యమానికి తీరని నష్టం.

అయినప్పటికీ కామ్రేడ్ సమీర నెలకొల్పిన ఆదర్శాలు, క్రియాశీలమైన ఆమె ఆచరణ ఎందరో కామ్రేడ్స్‌కు పాఠాలుగా వుంటాయి. వాటిని నేర్చుకొని కామ్రేడ్ సమీర లేని లోటును ఎందరో కామ్రేడ్స్ పూరిస్తారు. నిస్వార్థంగా తమ మధ్య జీవించి, తమ కోసం పోరాడి, తమ గడ్డ మీదనే నేలరాలిన కామ్రేడ్ సమీర ఆశయాన్ని ఆ ప్రాంత ప్రజలు వృధా పోనీయరు. ఆమె అమరత్వం నుండి పొందిన ప్రేరణతో ఎందరో యువతీ యువకులు పార్టీ, పీఎల్‌జీఏ, ప్రజా సంఘాల్లో చేరి అంపూర్తిగా మిగిలిన ఆమె ఆశయాలను నెరవేర్చడానికి ముందుకు సాగుతారు.

## జనం గుండెల్లో పోరు పాటైన కామ్రేడ్ అమీల



కామ్రేడ్ అమీల దండకారణ్యంలోని కాంకేర్ జిల్లా, దుర్గ్‌కోందల్ బ్లాక్, మరక్‌చువ్వ గ్రామంలో ఒక పేద ఆదివాసీ కుటుంబంలో పుట్టింది. చిన్నప్పటి నుండే విప్లవ పాట, ఆటలతో ప్రభావితం అయింది. తన కుటుంబం అనుభవిస్తున్న పేదరికానికి కారణం దోపిడీ సమాజం అనే విషయం అర్థం చేసుకుంటూ పెరిగి పెద్దదయింది. 2006లో విప్లవోద్యమంలో చేరి మొదటి కంపెనీలో సభ్యురాలై, అందులో పనిచేస్తూనే చేతనా నాట్య మంచ్ (సీఎన్ఎం) పాటలతో, ఆటలతో ప్రజల్లో విప్లవ ప్రచారం చేసేది. 2007లో మైన్‌పూర్ జిల్లా విస్తరణలో భాగమై, అక్కడ సీఎన్ఎం బాధ్యతలు చేపట్టింది. తన దళంతో పాటు పాటలు, ఆటలతో ప్రజల్లోకి వెళ్లి అభయారణ్యాలకు, నిర్వాసితత్వానికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తూ, ప్రజలను నూతన ప్రజాస్వామిక విప్లవంలో భాగం చేస్తూ వచ్చింది. కామ్రేడ్ అమీలను ప్రజలు తమ ముద్దుబిడ్డగా చూసుకునే వాళ్లు. కామ్రేడ్ అమీలను గ్రామంలోని ఒక ఇంట్లో పట్టుకొని క్రూరంగా హింసించి తలపై కాల్చి చంపారు.

## మహిళా విముక్తి నినాదమైన కామ్రేడ్ అరుణ



కామ్రేడ్ అరుణ దండకారణ్యంలోని నారాయణపూర్ జిల్లా, బేనూర్ ఏరియా, కల్లెపాడ్ గ్రామంలో ఒక పేద ఆదివాసీ కుటుంబంలో 25 ఏళ్ల క్రితం పుట్టింది. గ్రామంలో వుంటూనే క్రాంతికారీ ఆదివాసీ మహిళా సంఘంలో పని చేసింది. సమాజంలో మహిళలపై కొనసాగుతున్న దోపిడీకి వ్యతిరేకంగా మహిళలను సంఘటితం చేసి పోరాటంలోకి తీసుకొచ్చింది. 2006లో పార్టీలో చేరిన కామ్రేడ్ అరుణ పార్టీ నేతృత్వంలో నడుస్తున్న నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయడానికి ప్రజలను, ముఖ్యంగా మహిళలను సంఘటితం చేసే బాధ్యతలు చేపట్టి గోబ్రా దళంలో ఏరియా కమిటీ సభ్యురాలిగా పనిచేసింది.

ఉద్యమాన్ని విస్తరింపజేయడంలో ముఖ్యమైన పాత్ర వహిస్తున్న ఈ ముగ్గురు కామ్రేడ్స్ అమరులు కావడం అక్కడి వుద్యమానికి తీవ్రమైన నష్టం. అయితే నిస్వార్థమైన, ప్రేరణాదాయకమైన తమ ఆచరణతో ఈ అమరులు వేసిన ప్రభావం అక్కడి వుద్యమ పురోగమనానికి తప్పక తోడ్పడుతుంది. ఈ కామ్రేడ్స్ అమరత్వ ప్రేరణతో నూతనంగా ఎంతో మంది యువతీ యువకులు పార్టీ, పీఎల్‌జీఏ, ప్రజా సంఘాల్లోకి భర్తీ అయ్యి ఈ కామ్రేడ్స్ లేని లోటు పూరిస్తారు. వాళ్ల ఆశయాన్ని కొనసాగిస్తారు. ★

**పత్రికకు మీ ప్రాంతంలోని పోరాట, ప్రతిఘటన, నిర్బంధ, సభలూ - సమావేశాల నివేదికలు, అమరుల చరిత్రలను ఎప్పటికప్పుడు పంపుతూ వుండండి.**

# కామ్రేడ్ పి.నాగభూషణంకు జోహార్లు!



విప్లవ రచయితల సంఘం వ్యవస్థాపక సభ్యుడు, కవి, విమర్శకుడు, విప్లవోద్యమ సానుభూతి పరుడు కామ్రేడ్ పి. నాగభూషణం మూత్రపిండాల వ్యాధితో 2012 డిసెంబర్ 23న మరణించారు. ఆయన క్రిష్ణా జిల్లాలోని వల్లూరిపాలెం అనే పల్లెటూరులో పుట్టారు. కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తగా పనిచేసిన తల్లి సీతా మహాలక్ష్మి ప్రభావంతో కమ్యూనిస్టు భావజాలానికి లోనయిన ఆయన జీవితాంతమూ ఆ భావజాలాన్ని ఎత్తిపడుతూనే వచ్చారు.

బెనారస్ హిందూ విశ్వ విద్యాలయంలో ఎం.ఏ. మాథమెటిక్స్ చదివిన ఆయన హైదరాబాద్‌లోని అకౌంటెంట్ జనరల్ ఆఫీస్‌లో అధికారిగా స్థిరపడ్డారు. నక్సల్బరీ మేఘగర్జనతో ప్రభావితుడై, చివరి వరకూ నక్సల్బరీ పంథా రాజకీయాలకు సానుభూతిపరుడుగా వున్నారు.

1970 జూలై 4న ఏర్పడిన విప్లవ రచయితల సంఘం ఆవిర్భావ పత్రం మీద సంతకం చేసిన పదిహేను మందిలో ఆయన ఒకరు. 'అరుణతార' వంటి పత్రికలకు 'పినాకపాణి' కలం పేరుతో కొంత కాలం పాటు రాశారు. తరువాత ఆయన సొంత పేరుతోనే రాసేవారు. ఆయన రాసిన కవిత్వం, వ్యాసాలు, విమర్శలు అన్నీ కల్సి 'స్వేచ్ఛ కోసం' సంపుటిగా వెలువడ్డాయి. విరసం ఏర్పాటుకు ముందు ఆయన 'రంజని' అనే సాహిత్య పత్రికను ప్రారంభించి, మంచి సాహితీ విలువలున్న పత్రికగా సమర్థవంతంగా నడిపించారు.

కామ్రేడ్ నాగభూషణం విస్తృతంగా అధ్యయనం చేశారు. చదివింది గణితం అయినా, ఆయన అధ్యయనం చేయని విషయం లేదు. మార్క్సిస్టు సాహిత్యాన్ని కూడా చాలా విస్తృతంగా అధ్యయనం చేశారు. కమ్యూనిస్టు మానిఫెస్టోను ఎల్లప్పుడూ ఎత్తిపట్టేవారు. ప్రజా వుద్యమాల్లో వున్న వాళ్లు మార్క్సిస్టు సాహిత్యాన్ని విస్తృతంగా అధ్యయనం చేయాలని, ఆయన ఎప్పుడూ చెబుతుండేవారు. సరైన సైద్ధాంతిక కృషి లేకుండా కళా, సాహిత్య రంగాల్లో ప్రజా దృక్పథాన్ని ఆవిష్కరించలేమని ఆయన గట్టిగా నమ్మేవారు. కమ్యూనిస్టులు ఏ విషయంలోనైనా అందరి కంటే ముందుండాలని, సున్నిత మనస్కులు, నిజాయితీ, ధైర్యం, నిబద్ధత గలవారిగా వుండాలని, మిగతా అందరి కంటే సహేతుకంగా వుండాలని ఆయన కోరుకునే వారు.

సమాజంలో ప్రస్తుతం నెలకొన్న స్తబ్దత బద్దలవ్వాలంటే మళ్లీ విద్యార్థులు, యువత వుద్యమించాలని, అప్పుడే విప్లవోద్యమం మరింతగా బలం పుంజుకుంటుందని గట్టిగా నమ్మేవారు.

ఇలా చివరి వరకూ మార్క్సిజంపై గట్టి నమ్మకాన్ని కలిగి వుంటూ, తన రచనల ద్వారా, చర్చల ద్వారా సమాజంలో మార్క్సిస్టు భావజాలాన్ని పెంపొందింపజేయడంలో తన వంతు కృషి చేస్తూ, నక్సల్బరీ రాజకీయాలే దేశాన్ని విముక్తి చేస్తాయని బలంగా నమ్ముతూ కన్నుమూసిన కామ్రేడ్ పి. నాగభూషణంను 'క్రాంతి' సదా స్మరించుకుంటుంది, ఆయనకు వినమ్రంగా జోహార్లు చెబుతుంది. ★

***(55వ పేజీ తరువాయి)***

మావోయిస్టు పార్టీ పేరుతో కాంట్రాక్టర్స్ వద్ద 9 లక్షల రూపాయలు వసూలు చేశాడు. పార్టీ ఇతనికి చెందిన ఒక ట్రాక్టరు, ఒక మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకుంది. శబరి ఏరియా చింతూరు మండలం తాటిలంక గ్రామానికి చెందిన పోలీసు ఇన్‌ఫార్మర్ మడకం హడ్మాల్‌ను 2012 డిసెంబర్ 1న దళం ఖతం చేసింది. ఇతను సల్వాజుడుంలో పని చేస్తున్న తన ఇద్దరు తమ్ముళ్ళ అండతో గ్రామస్తులను తీవ్ర ఇబ్బందులు పెట్టేవాడు.

### పీఎల్‌జీఏ వారోత్సవాలు

2012 డిసెంబర్ 2 నుండి 8 వరకు పిఎల్‌జిఎ 12వ ఆవిర్భావ వార్షికోత్సవం సందర్భంగా చింతూర్ మండలం బురకన్ కోట వద్ద రోడ్డు పనిలో ఉన్న రోడ్డు రోలర్‌ను డిసెంబర్ 1న దళం దగ్ధం చేసింది. వెంకటాపురం ఏరియా పరిధిలో పది గ్రామాల నుండి హాజరైన 300 మంది ప్రజలతో సభ జరిగింది. విప్లవ రైతుకూలీ సంఘం అధ్యక్షుడు జెండా ఎగురవేసి పిఎల్‌జిఎ ఆవిర్భావం గురించి మాట్లాడారు. కోనేవాయి గ్రామ సమీపంలో డిసెంబర్ 8న జరిగిన పిఎల్‌జిఎ ఆవిర్భావ వార్షికోత్సవ సభలో నాలుగు గ్రామాలకు చెందిన 130 మంది పాల్గొన్నారు. జన నాట్యమండలి కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కాంకేర్ గ్రామ సమీపంలో జరిగిన సభలో ఏడు గ్రామాలకు చెందిన దాదాపు 400 మంది పాల్గొన్నారు. ఇందులో ఎసిఎమ్ ప్రసంగించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

### పోలీసుల వేధింపులకు తట్టుకోలేక ఆత్మహత్యలు

చింతూర్ మండలం లంకపెల్లి గ్రామానికి చెందిన మిలీషియా కమాండర్ సోడి మంత్రి పోలీసుల చిత్రహింసలు భరించలేక 2012 డిసెంబర్ 1న గొంతు కోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇదే మండంలోని అందెలపాడు గ్రామానికి చెందిన మిలీషియా కమాండర్ రాజు పోలీసుల వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడు. ★

## 'చైనాలో స్త్రీ విముక్తి' గురించి తెలుసుకుందాం - 3

# మాతృత్వ విధుల్ని సామాజికం చెయ్యడం

ఒక సమాజానికి పిల్లల కంటే అమూల్యమైన సంపద మరేమీ వుండదంటాడు చలం. ఇది నూటికి నూరుపాళ్లూ నిజం. మరి ఈ అమూల్యమైన సంపద సమాజానికి ఉపయోగపడేలా తయారు కావాలంటే, ఆ పిల్లల్ని పెంచాలి. సంరక్షించాలి. వాళ్లకు విద్యాబుద్ధులు చెప్పించాలి. ఇదంతా అలవోకగా జరిగేపనికాదు. దీని కోసం ఎంతో శక్తిని వినియోగించాలి. ఎంతో సమయాన్ని కేటాయించాలి. ఎన్నెన్నో ఇబ్బందులను అధిగమించాలి, మరెన్నో కష్టాలను భరించాలి.

ఎవరు శక్తిని వినియోగించాలి? ఎవరు సమయాన్ని కేటాయించాలి? ఎవరు ఇబ్బందులను ఆధిగమించాలి? ఎవరు కష్టాలను భరించాలి?.... ఈ ప్రశ్నలన్నింటికీ ఒకటే సమాధానం. తల్లి! లేదంటే తల్లి స్థానంలో ఉన్న మరో స్త్రీ!

ఎందుకంటే పితృస్వామ్య సమాజం పిల్లల పెంపకం బాధ్యతను తల్లుల విధిగా మార్చింది. ఈ విధిని ఆమె సమర్ధవంతంగా నిర్వహించడం కోసం మాతృత్వం అనే భావనను అత్యంత కట్టుదిట్టంగా తయారు చేసింది. పిల్లల్ని తల్లే సమర్ధవంతంగా పెంచగలదనీ, వాళ్ల ఆలనా పాలనా చూడ్డంలో తల్లి అనిర్వచనీయమైన ఆనందాన్ని పొందుతుందనీ, సజావుగా పిల్లల్ని పెంచినపుడే ఆమె జీవితం సార్థకమవుతుందనీ, తల్లికి పిల్ల ఎన్నడూ భారం కాదనీ.... ఇంకా అదనీ, ఇదనీ ఎన్నెన్నో చెబుతారు. కానీ పిల్లల కోసం తమ అభిరుచుల్నీ, ఆశయాలనూ చంపుకున్న, సమాజంలో తమ స్థానాల్ని కోల్పోయిన తల్లుల అంతరంగంలోకి తొంగి చూస్తే తెలుస్తుంది పిల్లల  పెంపకం తల్లులకెంత భారంగా వుందో.

బూర్జువా సమాజం స్త్రీలను ఉత్పత్తి రంగంలోకి తీసుకొచ్చినప్పటికీ ఇంటిపని సమస్యను పరిష్కరించనట్టే, పిల్లల పెంపకం సమస్యను కూడా పరిష్కరించలేదు. కాకపోతే కొన్ని క్రెష్ (శిశు సంరక్షణ కేంద్రం)లను ఏర్పాటు చేసింది. ఇవి అవసరాలకు ఎంత మాత్రమూ సరిపోవు. వీటిలో సౌకర్యాలు కూడా అంతంత మాత్రంగానే వుంటాయి. ఇక వీటిలో పిల్లల్ని 'సంరక్షించినందుకు' తీసుకునే డబ్బులు కూడా అధికంగా వుంటాయి. కనుక మొత్తంగా ఈ క్రెష్‌లను వుపయోగించుకుంటున్న తల్లుల శాతం తక్కువే. బహుశా పెద్ద పెద్ద పట్టణాల్లో ఇటువంటి తల్లుల శాతం కొంచెం ఎక్కువే వుండొచ్చు.

అయితే బూర్జువా సమాజం వైరుధ్యాల మయంగా వుంటుంది. ఒక వైపు అది క్రెష్‌ల సౌకర్యం (కొద్దిమేరకే అయినా)కల్పిస్తున్నది. మరోవైపు ఆ క్రెష్‌లలో పిల్లలను వుంచుతున్న తల్లుల్లో అపరాధ భావననూ కల్గిస్తున్నది. తామే సంరక్షించవల్సిన పిల్లలను మరొకరి సంరక్షణకు వదిలివేస్తున్నందుకు వారు చాలా అపరాధ భావనకు లోనవుతారు. ఎందుకంటే పిల్లల పెంపకం బాధ్యత తల్లులదే అనే భావజాలాన్ని బూర్జువా సమాజం ఏమీ మార్చలేదు కనుక.

అందుకే ఫ్రాన్స్‌లో క్రెష్‌ల్లో పిల్లలను వుంచిన తల్లులను ఒక సర్వేలో భాగంగా ప్రశ్నించినపుడు, వారు ఏమాత్రం అవకాశం వున్నా తమ పిల్లల్ని తామే చూసుకుంటాం అని చెప్పారు.

మరి పిల్లల పెంపకం బాధ్యత తల్లులది మాత్రమే కాదు అనుకున్నప్పుడు మరెవరిది? నిస్సందేహంగా మొత్తం సమాజానిది.

సాధ్యమా!? కచ్చితంగా సాధ్యమేనని సోషలిస్టు చైనా నిరూపించింది.

చైనాలో ఇళ్ల దగ్గరా, పని చేసే దగ్గరా కూడా శిశు సంరక్షణ కేంద్రాలుండేవి. పని చేసే దగ్గర ప్రధానంగా పాలుతాగే పిల్లల కోసం వుండేవి. అలా వుండడం వల్ల తల్లులు మధ్య మధ్యలో పిల్లలకు అవసరమైనన్ని సార్లు పాలిచ్చి వెళ్లే అవకాశం వుంటుంది. పని స్థలాల్లో వున్న శిశు సంరక్షణ కేంద్రాలకు, తల్లులకు సౌకర్యం అనే లక్ష్యంతో పాటు మరొక ముఖ్యమైన రాజకీయ లక్ష్యం వుందంటుంది క్లాడీ బ్రాయెల్. అది "మేం కన్న పిల్లలు ఇదిగో వీరే. వీరి బాధ్యత మనందరిదీ. మామూలుగా అయితే వీళ్లను మీరు చూడరు. ఎవరూ వారిని చూసుకోకుండానే వారికి అన్నం పెట్టడం, బట్టలు తొడగడం, స్నానం చేయించడం వంటి వన్నీ ఏదో అద్భుత మహిమ వల్ల జరిగిపోతుంటాయని బహుశా మీరు అనుకుంటూ వుండవచ్చు. సరే లేవండి కళ్లు తెరవండి. వాళ్లు ఇక్కడ వున్నారు. మనందరం వాళ్ల గురించి ఏం చేయబోతున్నాం" అని  అడగడమేనంటుంది.

ఇక్కడ పురుషులను కూడా చైతన్యవంతం చేసేవారు. వారు పిల్లల పెంపకంలోని అనేక సమస్యలను తెల్సుకునేవారు. ఈ కేంద్రాల్లో నర్సులుగా పురుషులు అధిక సంఖ్యలో పని చేసేవారు. ఇది పిల్లల పెంపకంలోనూ, పురుషుల భావాల్లోనూ కూడా మంచి మార్పుకు దారితీసే అవకాశం కల్పిస్తుంది.

పాలు మానేసిన పాపాయిల కోసం విడిగా ఇండ్ల దగ్గర శిశు సంరక్షణ కేంద్రాలు వుండేవి. పిల్లలను ఇక్కడ వదిలేసి తల్లిదండ్రులు వారి వారి పనుల్లోకి వెళ్లే అవకాశం వుంటుంది. ఆరేడు సంవత్సరాల పిల్లల కోసం కిండర్ గార్డెన్లు వుండేవి. ఇందులో పని చేసే సిబ్బందిలో కొందరు ప్రత్యేక వైద్య శిక్షణను పొంది వుండేవారు.

పని వేళల తర్వాత సాంస్కృతిక, కళాత్మక, రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనాలనుకునే తల్లిదండ్రులకు, వెసులుబాటు కల్పించడానికి గాను ఈ కేంద్రాలు ప్రతిరోజూ, ఇరవై నాలుగ్గంటలూ తెరిచే వుండేవి. రాత్రి షిఫ్టుల్లో పని చేసేవారు

రాత్రిపూట ఇక్కడ పిల్లల్ని వదిలి పగటిపూట ఇంటికి తీసికెళ్లే అవకాశం వుండేది.

ఫ్యాక్టరీల్లో వుండే శిశు సంరక్షణ కేంద్రాలు ఉచితంగా పని చేస్తాయి. ఇండ్ల దగ్గర ఉండే కేంద్రాలకు డబ్బు ఇవ్వాల్సి వుండేది. అయితే ఇలా ఇవ్వాల్సిన డబ్బులో కొంత భాగం తల్లిదండ్రులు పనిచేసే ఫ్యాక్టరీ ఇచ్చేది. కొంత భాగం ఆ ప్రాంత సమిష్టి నిధుల నుండి యిచ్చేవారు. తల్లిదండ్రులు చాలా తక్కువ డబ్బునే ఇవ్వాల్సి వచ్చేది.

శిశు సంరక్షణ కేంద్రాల బాధ్యతలను, ఈ కేంద్రాల్లో పని చేసే కొంత మంది కార్మికులూ, ఈ కేంద్రాన్ని ఉపయోగించే తల్లిదండ్రులు, రిటైర్ అయిపోయిన ఉద్యోగులూ సంయుక్తంగా నిర్వహించేవారు.

వీరు పలు సర్వేల ద్వారా ఇటువంటి కేంద్రాల్లో వస్తున్న అనుభవాలను విశ్లేషించేవారు. ప్రజల సలహా మేరకు అవసరమైన మార్పుల్ని చేసేవారు. పిల్లల పెంపకంలో కొత్త పద్ధతుల్ని సంయుక్తంగా రూపొందించేవారు.

సాధారణంగా బూర్జువా సమాజంలో ఇటువంటి కేంద్రాల్లోని పిల్లల సంరక్షణ, ఈ విషయంలో శిక్షణ పొందిన కొందరు నిపుణుల బాధ్యతగానే వుంటుంది. తల్లిదండ్రులకు తమ పిల్లల పెంపకంలో ఎటువంటి పాత్రా వుండదు. పిల్లల పెంపకంలో తల్లిదండ్రుల అభిప్రాయాలను సర్వసాధారణంగా ఈ నిపుణులు కొట్టిపడేస్తారు. కానీ చైనాలోని శిశు సంరక్షణ కేంద్రాల నిర్వహణ తీరులో తల్లిదండ్రులకు కూడా తగిన పాత్ర వుండేది.

షాంఘైలో ఒక బస్తీలోని కిండర్ గార్డెన్ శిశు సంరక్షణ కేంద్రంలోని పిల్లలతో క్లాడీ బ్రాయెల్ బృందం ఒక రోజంతా గడిపింది. ఆ అనుభవాలను క్లాడీ ఇలా వివరించింది.

''ఒక అంతస్తు భవనాలతో ఉన్న ఆ దృశ్యం చాలా నిరాడంబరంగా ఉంది. కిటికీల కింద కుండీల్లో మొక్కలున్నాయి. ముందువైపు ఒక విశాలమైన ఆట స్థలం వుంది. అక్కడికి మేం వుదయం తొమ్మిది గంటల ప్రాంతంలో వెళ్లాం. చక్కగా ఎండకాస్తున్నా కూడా ఇంకా చలిగానే అన్పించింది. కానీ ఆ పిల్లలు – అమ్మాయిలూ, అబ్బాయిలూ కూడా బయటే చిన్న గౌన్లు వేసుకుని ఉన్నారు. గౌన్ల కింద ఎన్నో పొరల ఊలు దుస్తులు వేసుకున్నారు. అందుకని వారు గుండ్రని బంతుల్లా కనపడుతున్నారు. వారు సంగీత వాయిద్యాలతో, కాగితం పూలు పట్టుకుని మా కోసం ఎదురు చూస్తున్నారు. వరసగా నుంచుని కేరింతలు కొడుతూ, పాటలు పాడుతూ చాలా సంతోషంగా వున్నారు. మేం చెరి ముగ్గురు సభ్యులుండే నాలుగు బృందాలుగా కేంద్రంలోని వివిధ భాగాల్ని సందర్శించడానికి విడిపోయాం. నేను, ఎడిత్, డానియల్‌లతో కలిసి ఓ గదిలోకెళ్లాను. అక్కడ మూడు, నాలుగు సంవత్సరాల అమ్మాయిలూ, అబ్బాయిలూ చిన్న గుండ్రటి బల్లల చుట్టూ కూర్చుని గృహ విజ్ఞానం గురించిన పాఠాన్ని నేర్చు కుంటున్నారు. గిన్నెలు ఎలా తోమాలో వారు నేర్చుకుంటున్నారు. స్పాంజితోనూ, పౌడర్‌తోనూ ఒక చిన్న పిల్లవాడు ఇంత నైపుణ్యంగా ఒక గిన్నెను తోమగలడని మేం ఊహించగలిగి వుండేవాళ్లం కాదు. ఒక యువ ఉపాధ్యాయిని వారిని అప్పుడు గమనిస్తూ వుండింది. పిల్లలతో మాట్లాడుతూనే ఆమె గిన్నెల్ని తుడవడానికి నానా తంటాలు పడుతున్న ఒక పిల్లవాడికి సహాయం చేసింది. ఇంటి దగ్గర పిల్లల్ని ఎటూ మెసలకుండా చేసేస్తూ, 'జాగ్రత్త, ఆ గాజు పాత్ర బద్దలు కొడతావు' అని భయంతో అరిచే అరుపులు లేకుండా ఈ పిల్లలు గిన్నెలు తోమడాన్ని మేం ఇపుడు ఊహించగల్గుతున్నాం.

అంట్లు తోమే 'పాఠాన్ని' గమనిస్తున్నప్పుడు మాకు చాలా ఆశ్చర్యం కల్గించిన విషయం అంత చిన్న పిల్లల్ని ఒక వుపయోగకరమైన పని చేయమన్నారని కాదు. వారు అంత చక్కగా ఆ పనుల్ని చేయడమనేదే. అది మమ్మల్ని ఆలోచింపజేసింది. ఎవరో ఒకరు వాళ్లకు అదంతా చూపించే, నేర్పించే బాధ్యత తీసుకున్నారు; మరెవరో అంత చిన్న పిల్లలకు ఆ పనులు ఎలా ఉపయోగపడతాయో ఆలోచించారు. ఆ పిల్లలేమో ఆ విషయాన్ని చక్కగా అర్థం చేసుకున్నారు. ఆ పనిని సమిష్టిగా ఎలా చేయాలో వారికి తెలుసు. అబ్బాయిలు గూడా అమ్మాయిల్లాగే ఇవన్నీ చేస్తున్నారు. ఇవి వాళ్లకు అన్నం తినడం, పడుకోవడం అంత సహజమైపోయాయి. భోజనం బల్ల దగ్గరకొచ్చినప్పుడు ఈ పిల్లలకు అన్నం వండాల్సి వచ్చిందనీ, బల్ల మీద అన్నీ సర్దాల్సి వచ్చిందనీ, తిన్న తర్వాత గిన్నెలను తోమి సర్దాలి అనే విషయాలు తెలుసు. వాళ్లు కేవలం ఆకలితోనే వుండరు. బాధ్యతగా కూడా వుంటారు. సాయంత్రం అక్కడి వుపాధ్యాయులతోనూ, పెద్ద పిల్లలతోనూ(అంతా ఐదు ఏళ్ల వాళ్లు) మేం సుదీర్ఘంగా చర్చించాం. పిల్లల్ని పెంచడాన్ని గతితార్కిక సంబంధం ఉన్న, రెండు దశల్లో సాగే క్రమంగా తాము చూస్తామని వారు మాకు వివరించారు. మొదటి దశలో వీలైనంత త్వరగానూ, సంపూర్ణంగానూ వారికి వ్యక్తిగత స్వాతంత్ర్యం సంపాయించుకోవడం నేర్పిస్తారు : తామే సొంతంగా తినడం, స్నానం చేయడం, బట్టలు వేసుకోవడం – ఇవన్నీ సాధ్యమైనంత వరకూ పెద్దల సహాయం లేకుండా చేయడం. తర్వాత సమిష్టి విద్యకు ప్రాముఖ్యతనిస్తారు. సమిష్టి విద్య అంటే ఇంటి పనులు చేయడం వంటివి. ఈ రెండు దశలూ చాలా దగ్గరి సంబంధం కలిగి వుంటాయనేది విదితమే. తన బూట్లు ఎలా తొడుక్కోవాలో తెలీని పిల్లలకు మిగతా వారి బూట్లు తుడవమని ఎలా చెప్తాం? అలా చేయిస్తే అది శిక్షలాగ తయారవుతుంది.

అత్యంత ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ఈ చిన్న పిల్లల పనిని కాలక్షేపంగానో (వారిని ఏదో దాంట్లో నిమగ్నం చేయడానికి) లేదా పెద్ద వాళ్లకు చేసే చిన్న సహాయాలుగానో వాళ్లు చూడడం లేదు. 'వెళ్లి నాకది తెచ్చివ్వు'!. 'అది అందివ్వు!', 'ఇది పట్టుకో!' లాంటి పనులు వాళ్లకి మొదట్నుంచీ చివరి దాకా చేయడానికి అవకాశం ఉన్న సంపూర్ణమైన పనులు కావు. అది నిజానికి వారిని పూర్తి నైపుణ్యం లేని కార్మికులుగా చూస్తున్నట్లూ; వాళ్లు పూర్తిగా గ్రహించలేని పనులని వాళ్లతో చేయిస్తున్నట్లూ, మన కింద మన ఆజ్ఞల్ని పాటించే వాళ్లుగా వాళ్లని దిగజార్చినట్లూ అవుతుంది. చిన్న

పిల్లలకైనా ఏదో ఒకటో, అంతకంటే ఎక్కువో ఉపయోగకరమైన పనుల పూర్తి బాధ్యత ఇవ్వడం ధ్యేయంగా వుండాలి. పెద్దవాళ్లు ఒక్కళ్లు చేయగల పనిని ఐదారుగురు పిల్లలు మొదట్లో ఎక్కువ సమయం తీసుకుని చేసినా ఫర్వాలేదు. ఆ పని వల్ల వెంటనే కలిగే ఉత్పాదకతను కాక పిల్లలు దాని నుండి ఏం నేర్చుకోగలరనేది చూడడం ముఖ్యం."

పిల్లల పెంపకాన్ని సామాజికీకరించడం వల్ల విముక్తి తల్లులకే కాదు. ఆ పిల్లలకు కూడా. పిల్లల అల్లరిని భరించడం తల్లిదండ్రులకు సాధారణ విషయం కాదు. వాళ్ల అల్లరిని భరించలేక, తల్లిదండ్రులు పిల్లల్ని కొడతారు. లేదంటే అతి గారాబం చేస్తారు. పిల్లల వికాసానికి రెండూ హానికరమైనవే. కుటుంబ పరిధిలోనే పెరిగే పిల్లలకు తమ సమయాన్ని ఎలా వినియోగించాలో తెలియక కూడా ఏవో పేచీలు పెడుతుంటారు. ప్రస్తుతం ఒకర్నో ఇద్దర్నో మాత్రమే కంటున్న పరిస్థితిలో వాళ్లకు ఆడుకోవడానికి స్నేహితులు కూడా వుండడంలేదు. ఈ ఒకరిద్దరు పిల్లలను తల్లిదండ్రులు కూడా అతి గారాబం చేస్తారు. ముఖ్యంగా తల్లులు గారాబంతో పిల్లల్ని అన్నింటికీ తమ మీద ఆధారపడేలా తయారు చేస్తారు. దీనికి విరుద్ధంగా పిల్లల పెంపకం సమాజం పరిధిలో జరగడం వల్ల పిల్లల వికాసానికి ఎంతగానో వుపయోగపడుతుంది. పిల్లల్లో పెరిగే ఈ వికాసం పిల్లలను ఎలా సక్రమ మార్గంలో పెట్టాలోనని పడే ఆందోళన నుండి తల్లులను విముక్తి చేస్తుంది.

ఈ విషయం చైనా అనుభవం మనకు తెలియజేస్తుంది. పిల్లల పెంపకాన్ని సామాజికీకరించినపుడు, ఆ పిల్లలు సమాజానికి ఎలా వుపయోగపడ్డారోననేది ఒక శిశు సంరక్షణా కేంద్రం గురించిన వుదాహరణతో క్లాడీ ఇలా చెప్పింది. "ఏడేళ్ల వయసు లోపు పిల్లలూ, ఉపాధ్యాయులూ కలిసి సాగు చేసిన ఓ కూరగాయల తోట వుండింది అక్కడ. అందరూ పని చేస్తారక్కడ. వారు వయసుల్ని తప్పకుండా లెక్కలోకి తీసుకున్నారు. అందరికంటే చిన్నవాళ్లు నీళ్లు పెట్టారు. పెద్ద పిల్లలు నేలను తవ్వారు (ఒక్కొక్కరూ కొన్ని చదరపు మీటర్లే అయినా). మిగతా వారు విత్తనాలు చల్లారు. ఇంకా కొందరు కలుపు తీశారు లేదా అవసరమైన ఎరువులు చల్లారు.

శిశు సంరక్షణా కేంద్రంలో పిల్లలు తినే కూరగాయాల్లో ఎక్కువ భాగం వాళ్ల శ్రమ ఫలితాలే. కోతల సమయంలో వారు చిన్న చిన్న బృందాలుగా తమను తాము సంఘటితం చేసుకుంటారు. బ్రిగేడ్ విప్లవ కమిటీ వారికి పరిగెలు ఏరడం లేదా ధాన్యాన్ని నూర్చే కాంక్రీటు నేల మీద ఎండలో ఎండడానికి ధాన్యాన్ని పరచడం వంటి పనులు ఇస్తుంది. గ్రామంలోని పెద్దలకూ పిల్లలకూ మధ్య ఎన్నో విభిన్న సంబంధాలున్నట్లుగా మాకన్పించింది. ఇది గ్రామాల్లో మాత్రమే వుండే పరిస్థితి కాదు; పట్టణాల్లో కూడా అతి వుపయోగకరమైన చిన్న పనులను చేయడానికి శిశు సంరక్షణా కేంద్రంలోని పిల్లల్ని తర్ఫీదు చేస్తారు. మూడు, నాలుగేళ్ల వయస్సు నుండి కిండర్ గార్డెన్‌లలోని పిల్లలు సామాజిక ఉత్పత్తిలో పాల్గొనడం మొదలుపెడతారు. ఉదాహరణకు దగ్గరలోని ఒక ఫ్యాక్టరీలో తయారయ్యే మందుల్ని ప్యాక్ చేయడానికి తమ టీచర్ సహాయంతో చిన్న అట్ట పెట్టెల్ని మడవడం చూశాం మేం. వారు పొడుగాటి, ఎత్తు తక్కువ బల్లల చుట్టూ కూర్చుని పని చేస్తున్నారు. ప్రతివారూ ఈ పని చేస్తూ ఎక్కువ సమయం గడపరనేదీ వారి ఉత్పాదకత తక్కువనేదీ విదితమే. కానీ ఎర్రజెండా నాయకత్వంలో ఫ్యాక్టరీ కార్మికులకు తమ ఉత్పత్తులను చేరవేయడానికి బారులు తీరి వెళు తున్నప్పుడు వారు ఎంత గర్వంగా ఉంటారు!"

## పిల్లల చదువు తల్లులకు పరీక్ష

మన సమాజంలో తల్లిదండ్రుల ఆర్థిక స్థితిగతులే పిల్లల చదువును నిర్ణయిస్తాయి. ఎందుకంటే ఇక్కడ చదువును కొనుక్కోవాలి కనుక. అలా చదువును కొనగలిగిన కుటుంబాల్లో పిల్లల చదువుల పర్యవేక్షణ బాధ్యత తల్లులదిగానే వుంటుంది. ఈ పోటీ ప్రపంచంలో పిల్లలు ఎక్కడ వెనకబడుతారోననే ఆందోళన తల్లిదండ్రులను వెంటాడుతుంటుంది. కనుక ఆ పోటీలో వెనకబడకుండా చూసే బాధ్యత తల్లులదే అవుతుంది. పిల్లలను పొద్దున్నే నిద్ర లేపడం, వారిని చదవమని పోరడం, వారికి వేళకు అన్నీ అమర్చడం, ఇంటి పని భారం వారిపై ఏమాత్రం పడకుండా చూడ్డం. వాళ్ల ఆరోగ్యాల్ని కాపాడ్డం. జబ్బు పడితే తొందరగా కోలుకొనేలా చూడ్డం వంటివన్నీ తల్లి విధులుగా వుంటాయి. అట్లా పిల్లలకు చదువు అనే 'తపస్సు' తప్ప మరేమీ తెలియకుండా చూసే బాధ్యత తల్లిదే. ఒకవేళ పిల్లలకు 'తపోభంగం' అయితే తల్లే బాధ్యురాలవుతుంది. తమకు ఇంటి పని ఒత్తిడి పెరిగినపుడు పిల్లల సాయం కోరాలని తల్లులు అనుకుంటుంటారు. లేదంటే పిల్లలను కనీసం వారి పనులు వారే చేసుకోవాలనైనా చెప్పాలనుకుంటారు. కానీ అంతలోనే విరమించుకుంటారు. ఎందుకంటే ఆ పనుల వల్ల పిల్లల చదువుల పోటీలో వెనుకబడితే వారి భవిష్యత్తేం గాను? అంతేకాదు పోటీలో పిల్లలు వెనుకబడితే తండ్రుల చేత తల్లులకు తిట్లు తప్పవు.

కానీ సోషలిస్టు చైనాలో చదువుల తీరే వేరే రకంగా వుండేది. చదువంటే అక్కడ మిగితా సమాజం నుండి వేరుపడి చేసే తపస్సు కాదు.

అక్కడ చదువంటే చరిత్రను అర్థం చేసుకోవడం. సమాజాన్ని అర్థం చేసుకోవడం. సామాజిక మార్పులో పాల్గొనడం. ఆ చదువు నాలుగు గోడల మధ్య నిర్బంధ పాఠశాలల్లోనూ, కుటుంబ పరిధిలోనూ నేర్చుకునేది కాదు, సామాజిక ఆచరణలో భాగంగా నేర్చుకునేది. ఈ చదువుల్లో పరస్పర సహకారమే తప్ప పోటీ వుండేది కాదు. కనుక తల్లిదండ్రులకు తమ పిల్లలు వెనుకబడుతారనే ఆందోళన వుండేది కాదు. అందువల్ల ఈ చదువులు తల్లులకు భారంగా వుండేవి కాదు.

తమ పనులను తాము చేసుకోవడం, ఇంటి పనులను చేయడం, సామాజిక ఉత్పత్తిలో పాల్గొనడం, వైద్యం వంటివి నేర్చుకోవడం అనేది చదువులో భాగంగా ఉండేది కనుక తల్లుల శ్రమలో పిల్లలు పాలుపంచుకునేవారు.

ప్రస్తుత సమాజంలో తల్లులు పిల్లల్ని చదివించడంలో ముఖ్యమైన పాత్ర పోషించినప్పటికీ, పిల్లల పాఠ్యాంశాలూ, బోధనా పద్ధతులను రూపొందించడంలో వారికెటువంటి పాత్ర లేదు. వారి అభిప్రాయాలను తెలుసుకోవాలన్న ధ్యాస కూడా ప్రభుత్వాలకు వుండదు. పిల్లలకెటువంటి జ్ఞానాన్ని అందించాలనేది పాఠశాల (ప్రభుత్వం) మాత్రమే నిర్ణయిస్తుంది.

కానీ చైనాలో పాఠ్యాంశాల, బోధనా పద్ధతుల రూపకల్పనలో తల్లిదండ్రుల, కార్మికుల, ఉపాధ్యాయుల పాత్ర కలగలసి వుండేది. వీరు సంవత్సరానికి మూడుసార్లు సమావేశమై తగిన నిర్ణయాలు తీసుకునేవారు.

విద్యకు తప్పకుండా వర్గ దృక్పథం వుంటుంది. కనుక పాత సమాజ పాఠ్యాంశాలు ఆ వర్గ దృక్పథానికి లోబడే వుంటాయి. కనుక పిల్లలు కూడా అదే దృక్పథాన్ని సంతరించుకుంటారు. మనది పితృస్వామ్య సమాజం కనుక పాఠ్యాంశాల్లోనూ ఆ భావజాలం వుంటుంది. ఉదాహరణకు కుటుంబం అనే పాఠంలో తల్లి ఇంటిల్లిపాదికీ సేవలు చేస్తుందనీ, ఆడపిల్లలు తల్లికి సాయం చేస్తారనీ వుంటుంది. ఇటువంటి పాఠ్యాంశాలను జీర్ణించుకున్న పిల్లలు, ముఖ్యంగా మగ పిల్లలు తల్లులంటే తమకు సేవలు చేసే వారేనన్న భావజాలాన్ని ఏర్పరుచుకుంటారు. తాము ఇంటి పనిలో భాగం పంచుకోవాల్సిన అవసరం లేదని కూడా భావిస్తారు. మరి సోషలిస్టు చైనాలో ఇటువంటి పాఠాలను తిరుగ రాసినపుడు తల్లుల పట్ల పిల్లల దృక్పథమే మారిపోయింది.

ఇక్కడ చైనా విద్యలో భాగంగా ఉన్న గృహ శాస్త్రం (హోం సైన్స్) గురించి కూడా కొంచెం చెప్పుకోవాలి. మన దేశంలో 'హోం సైన్స్' కోర్సులో వంటలూ, కుట్లు, అల్లికలూ వంటివి నేర్పుతారు. అయితే ఈ కోర్సులు అమ్మాయిలకు మాత్రమే ఉంటాయి. అలా వుండడం యాదృచ్ఛికం కాదు. అమ్మాయిలను మంచి గృహిణులుగా తయారు చేసే సామాజిక ఎజెండాలో భాగమిది. అయితే చైనాలోని గృహ శాస్త్రానికి ఈ వుద్దేశం లేదు. ఆ తరగతిలో అమ్మాయిలూ, అబ్బాయిలూ కలిసి కొన్ని పనులు నేర్చుకునే వారు. చెప్పులు బాగుచెయ్యడం, చినిగిన బట్టలకు అతుకులు వేసి రిపేర్ చెయ్యడం, జుట్టు కత్తిరించడం, పాడయిపోయిన కుర్చీలు, బల్లలను బాగుచెయ్యడం వంటి పనులను అమ్మాయిలూ, అబ్బాయిలు అనే తేడా ఏం లేకుండా అందరూ నేర్చుకునేవారు. అంతేకాదు చిన్న అనారోగ్యాలకు ఆక్యుపంచర్ చికిత్సను చేయడం కూడా నేర్చుకునేవారు.

ఇటువంటి విద్యను అందించడం వల్ల పిల్లలు ప్రతీ పనికి తల్లుల మీద ఆధారపడకుండా వుంటారు. అంతేకాదు, పిల్లల మనసుల్లో ఆడ పనులు, మగ పనులు అనే విభజన రేఖ ఏర్పడదు.

ఇలా మొత్తంగా చూసుకున్నప్పుడు సోషలిస్టు చైనాలో చదువులు తల్లులకు కఠిన పరీక్షలుగా మారకుండా, అవి తల్లులకూ పిల్లలకు మధ్య నూతన సంబంధాలను ఏర్పర్చే సాధనాలయ్యాయని అర్థమవుతుంది.

దీన్నిబట్టి నూతన విద్యా విధానం మాతృత్వ విధుల నుండి మహిళలను విముక్తి చేయడంలో దోహదపడిందని అర్థమవుతుంది.

**ఆటలూ–వాటి అర్థం**

ప్రపంచంలో ఎక్కడ క్రికెట్ మ్యాచ్ జరిగినా సాధారణంగా తల్లులకు బెంగ పట్టుకుంటుంది. పిల్లల దృష్టిని టీవీలో నుంచి పుస్తకాల మీదకి మరలించడానికి వాళ్లు శత విధాలా పోరవల్సి వుంటుంది.

అంతేకాదు ఎప్పుడైనా తల్లులు పిల్లలకు ఏవైనా ఇంటి పనులు చెప్పిన సందర్భంలో కూడా పిల్లలు పనులపట్ల అయిష్టత చూపుతూ ఆటల్లో పడిపోవడం చూస్తుంటాం. అట్లా పనీ పాటూ లేకుండా ఆటలాడ్డాన్ని బాధ్యతా రాహిత్యంగా భావిస్తారు. అంటే ఇక్కడ పనికీ ఆటలకూ, పనికీ, చదువు (జ్ఞానం)కూ మధ్య వైరుధ్యం వుందన్నట్టు.

మరి పనికీ, ఆటలకూ వైరుధ్యం లేకుంటే? జ్ఞానానికీ, ఆటలకూ వైరుధ్యం లేకుంటే? వైరుధ్యం లేకపోవడమే కాదు, ఆటలు పనిలోనూ, జ్ఞాన సముపార్జనలోనూ భాగమైతే! మనకి ఊహకే అందడం లేదు. కానీ చైనాలో నూటికి నూరుపాళ్లూ వాస్తవ రూపం దాల్చింది!


చైనాలో పిల్లల ఆటలు ఎలా వుంటాయని క్లాడీ బృందం అడిగిన ప్రశ్నకు ఆ పిల్లలు ' ఆటలకు సాధారణంగా ఏదో ఒక ఉపయోగం వుంటుంది. మేం ఊళ్లకి నడుచుకుంటూ వెళ్లినప్పుడు వైద్యానికి ఉపయోగపడే మొక్కల గురించి మాకున్న జ్ఞానాన్ని ఆచరణలో పెట్టే అవకాశం లభిస్తుంది. ఆ మొక్కల్ని సేకరించి మా బస్తీ ఆసుపత్రికి తీసుకొస్తాం. మిగతా సమయాల్లో, ఉదాహరణకు కోతల సమయంలో, పొలాలకు వెళ్లే బ్రిగేడ్లు పోయే దారిలోనే మేమూ నడుచుకుంటూ వెళతాం. బళ్ల నుండి ఒలికిపోయిన ధాన్యాన్ని సేకరించి రైతులకిచ్చేస్తాం' అని చెప్పారు.

ఇది విని "పిల్లలు తమ తీరిక సమయంలో చేసే కార్యకలాపాలని వర్ణించిన వాటిల్లో, ఏది పనో, ఏది ఆటో చెప్పడం మాకు కష్టమైంది" అంటుంది క్లాడీ.

ఆటలు ఇంత బాధ్యతగా ఉంటే తల్లిదండ్రులకు ఎంత భారం తగ్గుతుంది?

ఇక మన పిల్లలు ఆడుకునే ఆటల్లో లింగ వివక్ష స్పష్టంగా వుంటుంది. ఆడపిల్లలు బొమ్మల పెళ్లిళ్లు చేస్తే, మగపిల్లలు యుద్ధం ఆట ఆడుకోవడమో, బొమ్మ విమానాలూ, బొమ్మ తుపాకులతో ఆడుకోవడమో మనం చూస్తూనే వుంటాం. అంతేకాదు ఆడ మగ పిల్లలు కల్సి అమ్మానాన్నల ఆటలు ఆడుకునే సందర్భాల్లో ఆడపిల్లలు తమ అమ్మను అనుకరిస్తే, మగపిల్లలు నాన్నను అనుకరిస్తారు. ఈ ఆటలు, పితృస్వామ్య సమాజంలో, రేపు తాము నిర్వహించబోయే పాత్రలకు రిహార్సల్స్‌గా ఉంటాయి. ఈ ఆటలను దృష్టిలో పెట్టుకొని "మన పిల్లలు ఆడే ఆటల గురించి ఆలోచించినపుడు వాటిల్లో చాలా కలచివేసేదేదో వుందనిపిస్తుంది. అవి మనం జీవించే ప్రపంచాన్ని ప్రతిబింబిస్తాయి. మరోవైపు అవి దాన్నుంచి పారిపోయే ప్రయత్నం కూడా" అంటుంది క్లాడీ.

# ప్రజా న్యాయవాది బి.చంద్రశేఖర్ మృతికి సంతాపం!



ప్రముఖ న్యాయవాది భువనగిరి చంద్రశేఖర్ (49) జనవరి 22న క్యాన్సర్ వ్యాధితో మరణించారు. ఆయన మృతికి 'క్రాంతి' ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నది.

గుంటూరు జిల్లాకు చెందిన చంద్రశేఖర్, గుంటూరు ఏసీ కాలేజ్‌లో లా చదువుతూ 80వ దశకంలో రాడికల్ విద్యార్థి వుద్యమం వైపు ఆకర్షితుడయ్యారు. క్రమంగా ఆ వుద్యమంలో చురుకైన పాత్ర వహిస్తూ, కోస్తా జిల్లాలన్నీ తిరుగుతూ శక్తివంతమైన వుపన్యాసాలతో విద్యార్థుల్లో విప్లవ రాజకీయాలను ప్రచారం చేశారు. లా పూర్తి చేసిన తర్వాత ఒకవైపు న్యాయవాదిగా పనిచేస్తూనే, ఆంధ్ర ప్రదేశ్ పౌర హక్కుల సంఘం (ఏపీసీఎల్‌సీ)లో చురుకైన పాత్ర వహించారు. ఏపీసీఎల్‌సీ గుంటూరు జిల్లా కార్యదర్శిగా చాలా కాలం పాటు పని చేశారు. ఆ తర్వాత ఏపీసీఎల్‌సీతో విభేదించి, మానవ హక్కుల వేదికను స్థాపించిన బాలగోపాల్‌కు అనుచరుడిగా, ఆ సంఘంలో కొంత కాలం పాటు పనిచేశారు.

ఈ కాలమంతానూ ఆ తర్వాత కూడా ఆయన ఒక న్యాయవాదిగా ప్రజల పక్షం నిలబడ్డారు. చిలకలూరి పేట బస్సు దహనం కేసులో వురిశిక్ష పడ్డ చలపతి, విజయవర్ధనరావుల ప్రాణాలు కాపాడ్డానికి వుద్యమ స్థాయిలో కృషి చేశారు. రాష్ట్రపతి దాకా పోయి ఆఖరి నిముషాల్లో ఆ వురిశిక్షను యావజ్జీవ కారాగార శిక్షగా మార్పించారు. చుండూరు దళితుల ఊచకోత కేసులో చుండూరు గ్రామంలోనే కోర్టును ఏర్పాటు చేసేందుకు కృషి చేసి, ఆ కేసులో తానే ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా వుండి, దోషులకు శిక్ష పడడంలో కీలకపాత్ర వహించారు. రాష్ట్రంలో జరిగిన పలు బూటకపు ఎన్‌కౌంటర్లకు వ్యతిరేకంగా పోలీసు అధికారులతో పోరాడారు. ముఖ్యంగా గుంటూరు, కర్నూలు జిల్లాల్లో ఎస్పీగా పనిచేసిన సీతారామాంజనేయులు పాల్పడిన బూటకపు ఎన్‌కౌంటర్లపై జాతీయ మానవ హక్కుల కమిషన్ దాకా పోయి పోరాడాడు. చంద్రశేఖర్ కృషి ఫలితంగా అవన్నీ బూటకపు ఎన్‌కౌంటర్లేననే తీర్పు వెలువడింది. ఇట్లా చంద్రశేఖర్ పలు సందర్భాలలో తన వృత్తి నిబద్ధతను చాటుకున్నారు.

చంద్రశేఖర్ మంచి అధ్యయనశీలి కూడా. లోతైన అధ్యయనం ఫలితంగా, ఆయన అమెరికాలో మరణశిక్షకు గురైన శాక్కో-వాంజెట్టిలపై ఒక పుస్తకం రాశారు. వరల్డ్ సోషల్ ఫోరమ్ నేపథ్యంలో, ఎన్జీవోల గురించి అధ్యయనం చేసి ఎన్జీవోల కథ అనే పుస్తకం రాశారు. ఇంకా మరెన్నో పత్రికల్లో ఆయన వ్యాసాలు రాశారు.

అయితే తర్వాతి కాలంలో తాత్వికంగా ఆయన ఆధునికతను వ్యతిరేకించారు. అన్ని సమస్యలకు ఆధునికతే కారణమని భావించారు. హక్కులు అనే దృక్పథం కూడా ఆధునికత నుండే వచ్చింది, కనుక తాను అంగీకరించనని ప్రకటించి హక్కుల సంఘాలకు దూరం అయ్యారు. ఆధునిక పూర్వ సమాజంలోకీ, ప్రకృతిలోకి ప్రయాణించాలన్నారు. విప్లవ రాజకీయాలకు దూరమయ్యాక, చంద్రశేఖర్‌లో చోటు చేసుకున్న తాత్విక ధోరణుల పట్ల తీవ్రమైన విభేదమున్నప్పటికీ, పీడితుల పక్షాన నిలబడ్డ ఆయన వృత్తి నిబద్ధతనూ, డబ్బు ప్రభావానికి లోనుకాని ఆయన వ్యక్తిత్వాన్నీ విప్లవోద్యమం గౌరవిస్తుంది.

★

అంతేకాదు చైనాలో ఈ ఆటలు బహుశా ఇలా వుండవచ్చు అంటుంది 'గట్లను కూల్చేస్తూ పెద్ద వర్షం వస్తుందట, పంటలన్నీ వరదలో మునిగిపోయే ప్రమాదం ఉంటుందట. మనమేమో గట్లని బాగు చేయాలన్నమాట....' లేదా వాళ్లు చెప్పినట్లు, 'ఊళ్లలో ప్రజా యుద్ధాన్ని ప్రాక్టీసు చెయ్యండి. ఒక గుట్టను పట్టుకొని దాన్ని మీ ఆధీనంలోనే ఉంచుకోవడం నేర్చుకోండి.'

పితృస్వామ్య భావజాలానికి తావివ్వని ఇటువంటి ఆటలు, తల్లుల పట్ల పిల్లల దృక్పథంలో మార్పుకు దోహదం చేస్తాయి.

ఇట్లా చెప్పుకుంటూ పోతే చైనా సమాజం పిల్లల ఆలనా పాలనా చూడ్డం, వారికి ఆటలూ, పాటలూ నేర్పడం, వారికి విద్యా బుద్ధులు చెప్పించడం వంటి అన్ని అంశాల్లో ఎంతో శ్రద్ధ వహించిందని అర్థమవుతుంది. ఇటువంటి నూతన పిల్లల పెంపకం స్త్రీ విముక్తికి ఎంతగానో దోహదం చేస్తుంది.

**(వచ్చే సంచికలో 'చైనా కుటుంబం : నూతన గ్రామీణ సమిష్టి తత్వం వైపు పయనం' గురించి)** ★

# పోరాటాలు - ప్రతిఘటన - సభలు

## ఉత్తర తెలంగాణ

### జోన్‌వ్యాప్త బంద్

సింగరేణి ఓపెన్ కాస్టు మైనింగ్, కవ్వాల్ టైగర్ ప్రాజెక్ట్ పోలవరం ప్రాజెక్టు, రంగరాయ చెరువు, విద్యుత్ ప్లాంట్లకు వ్యతిరేకంగా, నిర్వాసితులకు మద్దతుగా 2012 నవంబర్ 15,16 తేదీలలో రెండు రోజుల పాటు జోన్ వ్యాప్త బందుకు ఉత్తర తెలంగాణ స్పెషల్ జోనల్ కమిటీ పిలుపునిచ్చింది. ఈ బంద్‌ను విజయవంతం చేయడం కోసం, నవంబర్ 15న సాయంత్రం, మూడు గంటలప్పుడు ఖమ్మం జిల్లాలోని భద్రాచలం వెంకటాపురం జాతీయ రహదారిపై చెట్లు నరికి వేసి, వాహనాలు ఆపి ఆందోళన చేశారు. అర్ధ గంట సేపు రోడ్డుపై జరిగిన ఆందోళనలో ఏడు గ్రామాలకు చెందిన 150 మంది మిలీషియా సభ్యులు పాల్గొన్నారు. ఇదే సందర్భంగా చింతూర్ మండలం భద్రాచలం జాతీయ రహదారిపై 14 రాత్రి చెట్లు నరికి వేశారు. ఇందులో 33 మంది మిలీషియా సభ్యులు పాల్గొన్నారు. 14 రాత్రి 11 గంటల నుండి 15 ఉదయం 8 గంటల వరకు వాహనాలు నిలిచిపోయాయి.

అలాగే కె.కె.డబ్ల్యూ. డివిజన్‌లోని పాకాల, కొత్తగూడెం, గుండాల, బయ్యారం, గూడూరు, ఇల్లెందు, నర్సంపేట సెంటర్లలో, ఏటూరు నాగారం-మహదేవ్‌పూర్ ఏరియాలోని అనేక గ్రామాలలో, పట్టణాలలో విస్తృతంగా పోస్టర్ల ద్వారా బంద్ గురించి ప్రచారం చేశారు.

## కె.కె.డబ్ల్యూ డివిజన్

### భూ పోరాటం

కరీంనగర్ జిల్లా మహదేవ్‌పూర్ మండలం పంకెన గ్రామంలో గతంలో విప్లవోద్యమ నాయకత్వంలో ప్రజలు భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు చేసి బాషా దొర భూస్వామికి చెందిన 300 ఎకరాలు, కౌసల్యకు చెందిన 80 ఎకరాలు, మరొక భూస్వామికి చెందిన 30 ఎకరాలు మొత్తం కలిసి 380 ఎకరాల వరకు స్వాధీనం చేసుకున్నారు. భూస్వాములు పట్టణాలకు పారిపోగా, ఈ భూములను పంకెన, అప్పాజీపేట, బొడ్డాయిగూడెం గ్రామాల ప్రజలు సంఘాల నాయకత్వంలో పంపిణీ చేసుకోవాల్సి వుండె. అయితే ప్రజల్లో ఉండే చిన్నచిన్న వైరుధ్యాలు మితవాద, అవకాశవాద(ఎమ్ఎల్) గ్రూపుల నాయకుల విచ్ఛిన్నకర చర్యల మూలంగా భూమి పంపిణీ కాకుండా అనేకసార్లు వాయిదా పడుతూ వచ్చింది. క్రమంగా ఆ భూములు బీడుపడ్డాయి. ఇదే సమయంలో పార్టీపై తీవ్ర నిర్బంధం రావడం, సంఘాలు దెబ్బతిని పోవడం, దళాలు కుదించుకుపోవడం, గ్రామాల్లో శత్రువు బలం పుంజుకోవడంతో పాటు ఆర్థిక, రాజకీయ పరమైన మార్పులు కూడా చెందుతూ వచ్చాయి.

ఈనేలలు సారవంతమైనవి కావడం, నీటి సౌకర్యం ఉండడంతో భూకబ్జాదారుల కండ్లల్లో పడ్డాయి. వీటిని ఆక్రమించుకోవడానికి కాంగ్రెస్ పార్టీకి చెందిన చల్లా నారాయణ రెడ్డి (కాటారం మార్కెట్ చైర్మన్), పౌర సరఫరాల శాఖా మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబు అండదండలతో, పంకెన గ్రామానికి చెందిన దళారీ కమ్మ రాఘవులు (కాంగ్రెస్ పార్టీ) ద్వారా 300 ఎకరాలు కబ్జా చేశాడు. మిగతా భూములను ఇతరులు ఆక్రమిస్తూనే ఉన్నారు. పట్టణాలకు పారిపోయిన బాషా దొర చనిపోవడంతో అతని కొడుకును, కౌసల్యను కలిసి కోర్టుల వరకు వెళ్ళి పట్టాలను సంపాదించారు. పంకెన గ్రామంలో కమ్మరి రాఘవులు అధికార కాంగ్రెస్ పార్టీని అడ్డం పెట్టుకుని మంత్రి శ్రీధర్‌బాబుకు సన్నిహితుడుగా వుంటూ, విలేజి అసిస్టెంట్ వుద్యోగాన్ని దక్కించుకున్నాడు. తనకున్న రాజకీయ ఆధిపత్యంతో గ్రామానికి వస్తున్న ఫండును, పథకాల పేరుతో వచ్చే సొమ్మును కాజేసి లక్షలు సంపాదించాడు. ప్రజలు ప్రశ్నిస్తే పోలీసులతో కొట్టించేవాడు. ఈ సమస్యలన్నీ సంఘం, పార్టీ ముందు పెట్టి చర్చించింది.

ఆ రాఘవులు అవినీతికి వ్యతిరేకంగా నిర్దిష్ట సమస్యలతో ప్రజలంతా పోరాడడంతో, అవినీతి భాగోతం బయటపడి ప్రభుత్వం అతని నుండి 40 వేలు మాత్రమే రికవరీ చేసింది. విలేజి అసిస్టెంట్ ఉద్యోగం నుండి కూడా సస్పెండ్ చేసింది.

ఇన్‌ఫార్మర్‌గా, భూకబ్జాదారుడుగా వుంటూ కమ్మ రాఘవులు గ్రామంలోని అన్ని సమస్యలకు ప్రధాన కారణం కావడంతో అతన్ని ప్రజల సహకారంతో పీఎల్‌జీఏ ఖతం చేయడం జరిగింది. ఇక్కడే కాకుండా జిల్లా వ్యాపితంగా ఇలాంటి సమస్యలు అనేకం వుండడంతో అంతటా ఈ చర్య మంచి ప్రభావాన్ని వేసింది. దీనితో రెచ్చిపోయిన మంత్రి శ్రీధర్‌బాబు, చల్లా నారాయణ రెడ్డిల డైరెక్షన్‌లో భూస్వాములు, కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు, పోలీసులు కలిసి మావోయిస్టు వ్యతిరేక కమిటీ పెట్టి, కరీంనగర్ తూర్పు డివిజన్ కమిటీని పూర్తిగా తుడిచివేస్తామని శపథం చేస్తూ ప్రతాప్ పేరుతో బహిరంగంగా పత్రికా ప్రకటనలు, కరపత్రాలతో ప్రచారం చేశారు.

### జిల్లేలి గడ్డ భూపంపిణీ

వరంగల్ జిల్లా భూపాలపల్లి మండలం దీక్షకుంట గ్రామంలో 180 ఎకరాల భూమిని 2012 జూన్‌లో పంపిణీ చేసుకుని సాగు చేసుకుంటున్నారు. గతంలో ఈ గ్రామంలో జీఆర్‌సీ నాయకత్వంలో కొట్టిన పోడు భూమి సరిగా పంపిణీ కాక అలాగే మిగిలిపోయింది. ఆ తరువాత శత్రు నిర్బంధంతో, జీఆర్‌సీ దెబ్బతినడంతో కొంతమంది ధనిక, మధ్య తరగతి రైతులు ఆక్రమించుకుని సాగు

చేసుకుంటుండడంతో ప్రజల మధ్య వైరుధ్యంగా మారింది. ప్రజలే పరిష్కారానికి పూనుకున్నప్పటికీ, సాగు చేసుకుంటున్న రైతులు వినకపోవడంతో పరిష్కారం కాకుండా సంవత్సరాలు గడుస్తూ వచ్చింది.

2012 జనవరిలో ఒకసారి దళం ఆ గ్రామంలో కొంతమందితో మాట్లాడి 180 ఎకరాలు పోడు భూమిని పంపిణీ చేయాలని దూదేకులపల్లి, దీక్షకుంట రెండు గ్రామాల శివారు భూమి తగాదాను, భూస్వామి తిరుపతి రెడ్డి అక్రమంగా కబ్జా చేసుకున్నా 12 ఎకరాల భూమిని ఎలా పరిష్కరించుకోవాలో ప్రజలకు తెలియజెప్పడం జరిగింది. పార్టీ చెప్పినట్టుగానే ప్రజలంతా కలిసి 10 గుంటల చొప్పున 180 ఎకరాలను పంపిణీ చేసుకున్నారు. దూదేకులపల్లి గ్రామస్తులు కొట్టిన కొంత భూమిని వదులుకోవడంతో సమస్యను సామరస్యంగా పరిష్కారం చేసుకుని సాగు చేసుకుంటున్నారు. ఇదే గ్రామంలో భూస్వామి తిరుపతి రెడ్డి గత 2 సంవత్సరాల క్రితం పట్వారీకి దగ్గరగా ఉండి, అక్రమంగా పట్టా రాయించుకుని 12 ఎకరాల ప్రజల భూమిని కబ్జా చేశాడు. ఈ భూమిని కూడా స్వాధీనం చేసుకోవడానికి ప్రజలు పట్టుదలగా పోరాడుతున్నారు. ఈ భూపోరాటం ప్రజల్లో మంచి ప్రభావాన్ని వేసింది. అంతేకాక ఇప్పటి వరకు పార్టీ దెబ్బతిని పోయిందనే నిరుత్సాహ పడుతున్న ప్రజలు ఉత్సాహంగా, ధైర్యంగా ముందుకు వస్తున్నారు. ప్రజలు వివిధ సమస్యల పరిష్కారానికి సంఘ నాయకత్వాన్ని కోరుకుంటున్నారు.

# ఖమ్మం జిల్లా

## కుర్నపల్లి ఆపర్చునిటీ అంబుష్

2013 జనవరి 13న జరిగిన కుర్నపల్లి ఆపర్చునిటీ అంబుష్‌లో ఒక గ్రేహౌండ్ కానిస్టేబుల్ చనిపోయాడు. ఇద్దరు గ్రేహౌండ్స్ కానిస్టేబుల్స్ గాయపడ్డారు. చాలా రోజుల తరువాత ఎన్‌టీ భూభాగంలో జరిగిన ఈ ఘటన ప్రజల్లో, క్యాడర్‌లో మంచి ప్రభావం వేసింది. అందుకని శత్రువు ప్రజలను తప్పుదారి పట్టించేందుకు మావోయిస్టులే 8 మంది చనిపోయారనీ, గాయపడ్డారనీ తప్పుగా మీడియా ద్వారా ప్రచారం చేశాడు.

## అమరవీరుల సంస్మరణ సభలు

2012 జూలై 28 – ఆగస్టు 3 అమర వీరుల సంస్మరణ వారం సందర్భంగా శబరి ఏరియా, చింతూరు మండలంలో జరిగిన సభలో ఆరు గ్రామాలకు చెందిన 133 మంది (పురుషులు 100, మహిళలు 33) పాల్గొన్నారు. సభలో డి.సి.ఎమ్., ఎ.సి.ఎస్., ఎ.సి.ఎమ్.లు ప్రసంగించారు. దుమ్ముగూడెం మండలంలో జరిగిన సభలో రెండు గ్రామాలకు చెందిన 60 దాదాపు మంది ప్రజలు పాల్గొన్నారు. ఈ సభలో ఎ.సి.ఎమ్. ప్రసంగించారు. వెంకటాపురం ఏరియా పరిధిలో జరిగిన సభలో పాల్గొన్న ప్రజలను పుద్దేశించి ఎ.సి.ఎస్., డి.సి.ఎమ్., ఎస్.జెడ్.సి.ఎమ్.లు ప్రసంగించారు. జననాట్య మండలి కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

## ఆపరేషన్ గ్రీన్‌హంట్‌కు వ్యతిరేకంగా జిల్లా బంద్

ఖమ్మం జిల్లా కమిటీ ఆపరేషన్ గ్రీన్‌హంట్ దాడికి వ్యతిరేకంగా ఆగస్ట్ 17న జిల్లా బంద్‌కు పిలుపునిచ్చింది. ఈ పిలుపును విజయవంతం చేయడం కోసం 16 రాత్రి దుమ్ముగూడెం మండలంలోని కొత్తపల్లి మారాయిగూడెం గ్రామాల మధ్య రోడ్డు తవ్వడం వల్ల 17 ఉదయం ఎనిమిది గంటల వరకు వాహనాలు నిలిచిపోయాయి. ఈ చర్యలో 150 మంది మిలీషియా సభ్యులు పాల్గొన్నారు.

## పార్టీ ఆవిర్భావ సభలు

సిపిఐ (మావోయిస్టు) 8వ ఆవిర్భావ వారోత్సవాల సందర్భంగా 2012 సెప్టెంబర్ 21న చింతూర్ మండలంలో, 8 గ్రామాలకు చెందిన దాదాపు 200 మంది ప్రజలతో సభ జరిగింది. ఇందులో ఎ.సి.ఎస్, డి.సి.ఎమ్.లు ప్రసంగించారు. దుమ్ముగూడెం మండలంలో, మూడు గ్రామాలకు చెందిన 200 మంది ప్రజలతో మరొక సభ జరిగింది. ఇందులో ఇద్దరు ఎ.సి.ఎమ్.లు ప్రసంగించారు. వెంకటాపురం ఏరియా పరిధిలో ఆరు గ్రామాలకు చెందిన సుమారు 450 మంది ప్రజలు సభ జరుపుకొని పార్టీ 8వ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేశారు. ఇందులో ఎసిఎమ్ ప్రసంగించగా, జన నాట్యమండలి కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

## ఇన్ఫార్మర్లకు శిక్షలు

వెంకటాపురం ఏరియా, చర్ల మండలం, చెన్నపురం గ్రామానికి చెందిన పోలీసు ఇన్‌ఫార్మర్ మడకం భీమయ్యను 2012 సెప్టెంబర్ 25న దళం ఖతం చేసింది. ఇతను గతంలో మిలీషియాలో పనిచేసి పోలీస్ ఇన్‌ఫార్మర్‌గా మారాడు. ఒక భర్మార్‌ను పోలీసులకు అప్పగించాడు. సంఘం, ఆర్‌పిసి, మిలీషియా వాళ్ళ పేర్లు పోలీసులకు చెప్పడమే కాకుండా, వారికి పైలట్‌గా పని చేసేవాడు. చర్ల మండలం బూరుగుపాడు గ్రామానికి చెందిన పోలీస్ ఇన్‌ఫార్మర్ రవ్వ సింగయ్యను 2012 అక్టోబర్ 10న దళం ఖతం చేసింది. ఇతను ఒక భర్మార్, రెండు 12 బోర్ తుపాకులను పోలీసులకు అప్పగించాడు. పార్టీ సమాచారాన్ని పోలీసులకు తెలిపేవాడు. చింతూరు మండలం బందేరు గుంపు గ్రామానికి చెందిన పోలీసు ఇన్‌ఫార్మర్ వంజం ఇడ్మాల్‌ను 2012 ఆగస్టులో దళం ఖతం చేసింది. ఇతను గతంలో మూడు సంవత్సరాలు మిలీషియా కమాండర్‌గా పని చేసి ఇన్‌ఫార్మర్‌గా మారాడు. గ్రామాలలో తిరుగుతూ సంఘం సభ్యుల పేర్లు, పార్టీ సమాచారం పోలీసులకు తెలిపేవాడు. చింతూర్ మండలం జగ్గారం గ్రామానికి చెందిన పోలీస్ ఇన్‌ఫార్మర్ గుగులోతు బాలాజీని 2012 ఆగస్టు 13న దళం ఖతం చేసింది. ఇతను సిపిఎమ్‌లో పనిచేసేవాడు. పైరవీలు చేస్తూ ప్రజల నుండి డబ్బులు వసూలు చేసేవాడు. ఇతను

*(మిగతాది 48వ పేజీలో...)*

# భారత నక్సలైటు ఉద్యమానికి అంతర్జాతీయ మద్దతు

## ఇంటర్నేషనల్ కమిటీ ఆఫ్ సపోర్ట్ టు పీపుల్స్‌వార్ ఇన్ ఇండియా ఏర్పాటు

భారత నక్సలైటు ఉద్యమానికి మద్దతుగా కేవలం మూడు నెలల్లోనే రెండు పెద్ద అంతర్జాతీయ సమావేశాలు జరిగాయి. గత సంవత్సరం చివరలో జర్మనీలోని హాంబర్గ్‌లో, మళ్లీ ఈ సంవత్సరం జనవరి 19న ఇటలీలోని మిలాన్ పట్టణంలో మావోయిస్టుల అంతర్జాతీయ సంస్థ సమావేశమయ్యింది. ఇందులో ప్రపంచవ్యాప్తంగా 27 దేశాల నుండి మావోయిస్టు మద్దతుదారు సంస్థలు పాలు పంచుకున్నాయి.

ఈ సమావేశాలలో ఈ సంవత్సరం మే 1 'కార్మిక దినాన్ని' భారత మావోయిస్టు వుద్యమానికి మద్దతుగా అంతర్జాతీయ దినంగా ప్రపంచ వ్యాప్తంగా జరుపుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. ఇందులో 'ఇంటర్నేషనల్ కమిటీ ఆఫ్ సపోర్ట్ టు పీపుల్స్‌వార్ ఇన్ ఇండియా' అనే సంస్థ బ్యానర్ కింద భారతదేశ మావోయిస్టు వుద్యమానికి అన్ని రకాల మద్దతు అందించాలని నిర్ణయించారు. ఈ సంస్థలు భారతదేశంలో తమ కార్యాలయాన్ని ప్రారంభించాలని కూడ భావిస్తున్నాయి.

ఈ సమావేశాలలో మావోయిస్టు సంస్థలు భారత మావోయిస్టులపై ప్రభుత్వం కొనసాగిస్తున్న నిర్బంధంపై మిగతా ప్రపంచం నుండి సహాయాన్ని అభ్యర్థించాయి. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం మాడ్ ప్రాంతంలోని 750 చ.కి.మీ. అటవీ భూమిని సైన్య శిక్షణ కోసం కేటాయించిందని, రాష్ట్రంలో ఆదివాసుల భూములపై ఆదివాసీయేతరులకు యాజమాన్య హక్కులు కల్పిస్తూ, చట్టాలను ఉల్లంఘిస్తున్నారనడానికి, ఇది అతి పెద్ద ఉదాహరణ అని మావోయిస్టు సంస్థలు పేర్కొన్నాయి. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఐదవ షెడ్యూల్, పెసా వంటి చట్టాలు ఘోర ఉల్లంఘనకు గురవుతున్నాయని ఆరోపించాయి. నారాయణ్‌పూర్, కొండగాంలలో మిలిటరీ ట్రెయినింగ్ సెంటర్ తెరిచింది, ఏ సమయంలోనైనా నారాయణ్‌పూర్ పట్టణాన్ని దాటేసి మాడ్‌లోని గ్రామాలన్నిటినీ కబళించివెయ్యడానికేనని మావోయిస్టులు పేర్కొన్నారు.

జర్మనీలోని హాంబర్గ్‌లో జరిగిన సమావేశంలో ఇటలీ, ఫ్రాన్స్, జర్మనీ, నార్వే, స్వీడన్, కెనడా సహా అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. భారతదేశంలో మావోయిస్టు వుద్యమానికి ఏ రూపంలోనైనా సరే, అడ్డంకిగా వున్న బహుళజాతి కంపెనీలకు వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్త క్యాంపెయిన్‌ను నిర్వహించాలని ఈ సమావేశంలో తీర్మానించారు. ప్రపంచవ్యాప్తంగా మావోయిస్టు సంస్థలను ఒక దగ్గరికి తేవడం కోసం సమాచార విప్లవాన్ని వాడుకోవాలని కూడ ఈ సమావేశంలో తీర్మానం జరిగింది. భారతదేశంలో సాగుతున్న మావోయిస్టు ఉద్యమానికి సంబంధించిన సమాచారం అందించడం కోసం ఒక వెబ్‌సైట్‌ను రూపొందించాలనే నిర్ణయం కూడ జరిగింది. సభ్యుల కోరికపై రిపోర్టులను అనువాదం కూడ చేయాలని, సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవాలని నిర్ణయమైంది.

### యువజనులను కూడగట్టడం కోసం విద్యార్థులతో భేటీ

పై సమావేశంలో ప్రపంచవ్యాప్త విప్లవ సంస్థలు భారతదేశంలో మృతి చెందిన కామ్రేడ్స్‌ను అమరులుగా పేర్కొంటూ భారతదేశానికి వ్యతిరేకంగా క్యాంపెయిన్ నిర్వహించాలనే ముఖ్యమైన నిర్ణయం కూడ జరిగింది. భారతదేశంలో కొనసాగే మావోయిస్టు ఉద్యమానికి మద్దతుగా మరిన్ని సంస్థలను కూడగట్టబోతున్నారు. కామ్రేడ్స్ కిషన్‌జీ, ఆజాద్ తదితరుల పోస్టర్లు తయారు చేసి వేరువేరు దేశాల్లో పంచుతారు. భారతదేశంలో ప్రభుత్వం, సైన్యం సామాన్య ప్రజలకు వ్యతిరేకంగా పని చేస్తున్నాయని ప్రపంచమంతా ప్రచారం చేస్తారు. భారతదేశంలో కొనసాగుతున్న మావోయిస్టు ఉద్యమానికి మద్దతుగా యువజనులను కూడగట్టడం కోసం అనేక విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులను కలిశామని ఫ్రాన్స్, ఇటలీ, ఆస్ట్రియా దేశాల ప్రతినిధులు చెప్పారు. వాళ్లకు పోస్టర్లు పంచామని, భారతదేశంలో గెరిల్లా యుద్ధానికి సంబంధించిన వివరాలన్నీ తెలియజేశామని వాళ్లు అన్నారు. భారతదేశంలో కొనసాగుతున్న మావోయిస్టు వుద్యమం వియత్నాం యుద్ధానికి ఏ మాత్రం తీసిపోదని కూడ క్రొయేషియాకు చెందిన 'రెడ్ యాక్షన్ ఫోరమ్' పేర్కొన్నది.

### ప్రపంచవ్యాప్త కామ్రేడ్స్‌కు శ్రద్ధాంజలి

మావోయిస్టులతో సంబంధాలున్నట్టు అనుమానమున్న వెబ్‌సైట్లన్నిటినీ భారత్‌లో కేంద్ర ప్రభుత్వం మూసేయించిందన్నది గమనార్హం. హాంబర్గ్‌లో జరిగిన సమావేశంలో కామ్రేడ్స్ కిషన్‌జీ, ఆజాద్, అనురాధా గాంధీలతో పాటు అఫ్గానిస్తాన్‌కు చెందిన కామ్రేడ్ హాఫిజ్, టర్కీకి చెందిన నర్సే అస్లన్, ఫాత్మా అకార్, ఫిలిప్పీన్స్‌కు చెందిన కామ్రేడ్ రోజర్‌లకు కూడా శ్రద్ధాంజలి ఘటించారు. భారతదేశ మావోయిస్టు ఉద్యమానికి పూర్తిగా సహకారం అందజేస్తామని అంటూ బ్రెజిల్‌కు చెందిన 'రివల్యూషనరీ ఫ్రంట్ ఇన్ డిఫెన్స్ ఆఫ్ ద పీపుల్స్ రైట్స్' అనే మావోయిస్టు సంస్థ భారతదేశ మావోయిస్టు ఉద్యమం ప్రపంచంలోని మిగతా దేశాల్లో జరుగుతున్న విప్లవాలకు ఒక ఉదాహరణగా నిలుస్తుందని పేర్కొన్నది. సమావేశంలో ఇరాక్, అఫ్గానిస్తాన్, ఫిలిప్పీన్స్, కుర్దిస్తాన్ దేశాల స్వాతంత్ర్య పోరాటాలుగా చెప్పే వాటికి కూడా మద్దతునివ్వాలనే తీర్మానానికి సభ్యులు తమ ఆమోదం తెలిపారు.

మొత్తంగా ఈ పరిణామాలు అంతర్గత భద్రతకు పెద్ద ప్రమాదంగా, సీనియర్ రక్షణ వ్యవహారాల నిపుణుడు ఆలోక్ బన్సల్ భావిస్తున్నాడు. ★

# హైదరాబాద్ బాంబు పేలుళ్ల కారకులు పాలకులే

ఫిబ్రవరి 21న దిల్‌సుఖ్ నగర్‌లో వెంకటాద్రి థియేటర్ సమీపంలో 107 బస్టాప్ వద్ద మొదటి పేలుడు 6.58 గంటలకు జరిగింది. కోణార్క్ థియేటర్ సమీపంలోని ఆనంద్ టిఫిన్ (ఎ1) సెంటర్ వద్ద 7.01 గంటలకు రెండవ పేలుడు జరిగింది. ఈ పేలుళ్ళలో 17 మంది మరణించగా, సుమారు 130 మంది గాయపడ్డారు.

ముంబాయి దాడుల్లో పట్టుబడిన కసబ్, పార్లమెంటుపై దాడి కేసులో అఫ్జల్ గురులను ఉరితీశాక, పాకిస్థాన్ స్థావరంగా పనిచేస్తున్న కొన్ని ఉగ్రవాద సంస్థలు ప్రతీకారం తీర్చుకుంటామని హెచ్చరించాయనీ, 2012లో హైదరాబాద్‌లోని బేగంబజార్, అబిడ్స్, దిల్‌సుఖ్ నగర్‌లలో దాడులు చేయడానికి రెక్కీ నిర్వహించారని ఢిల్లీ పోలీసులు 2012 అక్టోబర్ 26న ప్రకటించారు. పేలుళ్ళకు రెండు రోజుల ముందే హైదరాబాద్ సహా దేశంలోని నాలుగు నగరాలలో దాడులు జరిగే అవకాశం వుందని కేంద్ర నిఘా సంస్థలు ఆయా రాష్ట్రాలకు సమాచారం అందించామని చెప్పుకుంటున్నాయి.

గతంలో 2012 నవంబర్ 21న దిల్‌సుఖ్ నగర్‌లోని సాయిబాబా దేవాలయం వద్ద బాంబు పేలిన ఘటనలో ఇద్దరు మరణించగా, సుమారు 20 మంది గాయపడ్డారు. 2007 మే 18న మక్కా మసీదు పేలుళ్ళలో 9 మంది మరణించగా, సుమారు 50 మంది గాయపడ్డారు. మరో మూడు బాంబులను భద్రతా దళాలు గుర్తించి నిర్వీర్యం చేశాయి. 2007 ఆగస్టు 25న లుంబినీ పార్కు, గోకుల్ చాట్ బండార్‌లలో పేలుళ్ళ వల్ల 42 మంది మరణించగా, సుమారు 200 మంది గాయపడ్డారు. అదే సమయంలో దిల్‌సుఖ్ నగర్ బస్టాప్ వద్ద పెట్టిన బాంబును పోలీసులు నిర్వీర్యం చేశారు.

మరణించిన వారి కుటుంబాలకు, గాయాలైన వారికి సహాయం అందించడంలో ఆలస్యం జరుగుతున్నది. లుంబినీ పార్కు, గోకుల్ చాట్ బండార్ బాధితులకు ఇప్పటి వరకు పరిహారం అందలేదు. ఇప్పుడు మరణించిన వారి మృతదేహాలు తీసుకుపోవడానికి వారి దగ్గరే డబ్బులు వసూలు చేశారు.

హిందుత్వ శక్తులు ఉద్రిక్తత పెంచడానికి కారణమయ్యాయి. తెలంగాణ ఉద్యమం సందర్భంగా కొంత మంది తెలంగాణ వ్యతిరేకులు పనిగట్టుకుని హైదరాబాద్‌కు సంబధించి వివాదాస్పద వ్యాఖ్యలు చేయటం, తమ మనుగడకు దాన్నే పునాదిగా చేసుకోవాలని చూడడం అత్యధిక ప్రజానీకంలో ఆందోళన కలిగించింది.

జాతీయ దర్యాప్తు సంస్థ (నేషనల్ ఇన్వెస్టిగేటింగ్ ఏజన్సీ - ఎన్ఐఎ), జాతీయ భద్రతా సిబ్బంది (నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్ - ఎన్.ఎస్.జి.), మహారాష్ట్రకు చెందిన ఉగ్రవాద నిరోధక బృందం (యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ - ఎ.టి.ఎస్.), రాష్ట్ర దర్యాప్తు సంస్థలు అన్నీ ముస్లింలను లక్ష్యంగా చేసుకుని దర్యాప్తు చేస్తున్నాయి. ముస్లిం యువతను హింసించి కేసుల్లో ఇరికించడం, అప్పటికే పలు కేసులలో ఖైదీలుగా ఉన్న వారిపై మరిన్ని కేసులు పెట్టడం చేస్తున్నారు.

పేలుళ్ళపై జరుగుతున్న విచారణలో ముస్లిం మత శక్తులనే కాకుండా, హిందుత్వ శక్తులను, తెలంగాణ రాష్ట్ర వ్యతిరేకులను భాగస్వాములను చేయడంతోపాటు, భిన్న కోణాలలో దర్యాప్తు చేసినప్పుడు మాత్రమే నిజమైన నేరస్తులను పట్టుకోవడం సాధ్యమవుతుంది.

కేంద్ర ప్రభుత్వం హైదరాబాదు, బెంగుళూరు బాంబు పేలుళ్ళను సాకుగా తీసుకుని జాతీయ ఉగ్రవాద నిరోధక కేంద్రం (నేషనల్ కౌంటర్ టెర్రరిజం సెంటర్ - ఎన్.సి.టి.సి.) ఏర్పాటుకు రాష్ట్రాలపై ఒత్తిడి పెంచుతున్నది. దీని వల్ల రాష్ట్ర పరిధిలోని శాంతి భద్రతలు ఎన్.సి.టి.సి.కి సంక్రమించి, సమాఖ్య స్ఫూర్తికే విఘాతం కలుగుతుంది. భాజపా, జనతాదల్(యు), వామ పక్షాల వంటి ప్రతి పక్షాలు, యూపీఏ అనాటి భాగస్వాములైన తృణముల్ కాంగ్రెస్, డిఎంకె మొదలగు పార్టీలు, 11 రాష్ట్రాలు వ్యతిరేకించడంతో ఎన్‌సీటీసీకి కొన్ని సవరణలు చేస్తూ దాన్ని అమలులోకి తీసుకొని రావడానికి కేంద్రప్రభుత్వం తీవ్ర ప్రయత్నం చేస్తున్నది.

సాధారణ ప్రజల భద్రత పట్ల పోలీసులు, ప్రభుత్వాల నిర్లక్ష్యం దిల్‌సుఖ్ నగర్ పేలుళ్ళతో మరోసారి బయట పడింది. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పలు నిఘా సంస్థలు, దర్యాప్తు సంస్థలను ఏర్పరచినప్పటికి వాటిని తమ రాజకీయ వ్యక్తిగత ప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్నాయి. ప్రపంచ వ్యాప్తంగాను, దేశంలోనూ అధికారంలోకి రావడానికి, మస్లిం దేశాలలోని చమురు, ఇతర సహజ వనరులను దోచుకోవడానికి ముస్లింలపైన, ముస్లిం దేశాలపైన దాడులు చేస్తున్నారు. దేశంలో హిందూ ఉగ్రవాదులు పాకిస్థాన్ వ్యతిరేకతను, హిందూ మతోన్మాదాన్ని ప్రోత్సహించటానికి అల్ప సంఖ్యాకులైన ముస్లిం, క్రిష్టయన్‌లపై దాడులు చేస్తున్నారు. గతంలో మక్కా మసీదు పేలుళ్ళకు హిందూ ఉగ్రవాదులే కారణమని బయట పడింది.

పాలకవర్గాలు అధికారం కోసం ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తూ, ప్రజలను కుల, మత, జాతుల పరంగా విభజిస్తున్నాయి. గుజరాత్ మారణకాండ అక్కడ బీజేపీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోనే జరిగింది. మక్కా మసీదు పేలుళ్లకు హిందూ వుగ్రవాదులు పాల్పడ్డారు. కాంగ్రెస్ పార్టీ సహకారంతో హిందూత్వ శక్తులు బాబ్రీ మసీదును కూల్చి వేశాయి. పార్లమెంటుపై దాడి బీజేపీ చేసిన కుట్రలో భాగంగానే జరిగింది. దానిని కాంగ్రెస్ పార్టీ కొనసాగించింది. కాబట్టి దేశంలో జరిగే వుగ్రవాద దాడుల వెనుక పాలకవర్గాలే వున్నాయి. వాటిలో సాధారణ ప్రజలను పావులుగా వుపయోగించుకుంటున్నాయి. ★

*(చివరి పేజీ తరువాయి)*

వీటితోపాటు ఆయా రాష్ట్రాలు కూడా ఇలాంటి చట్టాలను రూపొందించాయి. మహారాష్ట్రలో 'మాకోక', ఛత్తీస్‌గఢ్‌లో జన్ సురక్షా కానూన్, జమ్మూ కాశ్మీర్‌లో పబ్లిక్ సేఫ్టీ ఆక్ట్‌లు ఈ కోవకు చెందుతాయి.

రాజకీయ ఖైదీలపై బనాయించిన కేసులలో బెయిలు లభించడం గానీ, కొట్టి వేయడం కానీ జరిగి వారు విడుదల అయ్యే అవకాశం ఉన్నప్పుడు, వారిపై మరో నేరారోపణ చేసే అవకాశం లేనప్పుడు, వారిని నిర్బంధించడానికి క్రైం కంట్రోల్ యాక్ట్ (సి.సి.ఎ. ఝార్ఖండ్ 2002) నేషనల్ సెక్యూరిటీ యాక్ట్ (ఎన్.ఎస్.ఎ.) వంటి ముందస్తు నిర్బంధ చట్టాలను రూపొందించారు. సి.సి.ఎ., ఎన్.ఎస్.ఎ.ల కింద కనీసం ఏడాది పాటు నిర్బంధంలో ఉంచడానికి అవకాశం ఉంటుంది.

దోపిడి, అణచివేత పట్ల వక్రీకరణలు, అవాస్తవాలు ప్రచారం చేయడానికి, సమాచారాన్ని మరుగుపరచడానికి, సంక్షేమ పథకాల ముసుగులో తమకనుకూలమైన ప్రజాభిప్రాయాన్ని రూపొందించుకోవడానికి, చట్ట బద్ధ ప్రజా ఉద్యమాలు, వుద్యమకారులు, విప్లవోద్యమం, విప్లవకారుల పట్ల దుష్ప్రచారం చేయడానికి, పాశ్చాత్య సంస్కృతిని, విచ్చలవిడి జీవన విధానాన్ని, వ్యక్తిగత స్వార్థాన్ని, విశృంఖల లైంగిక సుఖాలు, మత్తు పదార్థాల వాడకం, వస్తు వ్యామోహాల వైపుకు ప్రజలను ప్రోత్సహించడానికి ప్రచార మాధ్యమాలను ఉపయోగించుకుంటున్నారు. తద్వారా విప్లవోద్యమాలకు ప్రజలను దూరం చేసే పాలక వర్గాల కుట్రల్లో భాగంగా, తమ వర్గ ప్రయోజనాలను కాపాడడానికి ప్రసార, ప్రచార మాధ్యమాలు తమ వంతు పాత్రను పోషిస్తున్నాయి.

అన్ని రకాల అసమానతలకు శాశ్వత పరిష్కారం వ్యక్తిగత ఆస్తులు రద్దు చేసి సమ సమాజాన్ని నిర్మించడమే అవుతుంది. దీని వల్ల ధనిక వర్గం తమ ఉనికిని కోల్పోతుంది. కాబట్టి పాలక వర్గాలు తప్పని సరిగా అణచివేతనే మార్గంగా ఎంచుకుంటాయి. అణచివేత, హత్యలు, అత్యాచారాల వల్ల చట్టబద్ధ, సాయుధ పోరాటాలను నిర్మూలించడం అసాధ్యమనే సత్యం చరిత్రలో రుజువు అవుతూనే వున్నా, పాలక వర్గాలు గుర్తించ నిరాకరిస్తాయి.

గాంధీ కాలం నుండి నేటి వరకు, రాజకీయ ఖైదీలకు మరణ శిక్షలు వేయడం సాయుధ పోరాటాలను అణచివేయడం జరుగుతూనే వుంది. లాహోర్ కేంద్ర కారాగారంలో 1931 మార్చి 23న భగత్‌సింగ్, రాజగురు, సుఖ్‌దేవ్‌లను బ్రిటీష్ వాళ్ళు ఉరి తీసినప్పుడు, గాంధీ మౌనం వహించాడు. భారత రిపబ్లిక్ ఏర్పడక పూర్వం కేరళలో 1943లో కయ్యూరు అమరులను ఉరితీశారు. నెహ్రూ ప్రభుత్వం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని అణచివేయడంలో భాగంగా సుమారు నాలుగు వేలమంది విప్లవకారులను, రజాకార్ల పేరుతో సుమారు లక్ష మంది ముస్లింలను హత్య చేసింది. సి.పి.ఐ. (ఎమ్.ఎల్.) నాయకుడు నాగభూషన్ పట్నాయక్‌కు విధించిన మరణ శిక్షను ప్రజాస్వామిక ఒత్తిడితో 1972లో రద్దు చేశారు. ఇందిరాగాంధీ ప్రభుత్వం ఎమర్జెన్సీ (1975-1977) కాలంలో రాజకీయ ప్రత్యర్థులను, విప్లవకారులను, విప్లవోద్యమ సానుభూతిపరులను, మద్దతుదారులను, రచయితలను, కళాకారులను జైల్లో పెట్టి చిత్రహింసలకు గురి చేసింది. 1975 డిసెంబర్ 1న భూమయ్య, కిష్టాగౌడ్‌లను ఉరితీసింది. ఈ సందర్భంగా "భూమయ్య కిష్టాగౌడ్‌లను ఉరితీసి ఇందిరాగాంధీ, డాస్టవ్‌స్కీని ఆఖరి క్షణాన వదిలి వేసిన జార్ చక్రవర్తి కన్నా, పదకొండు మంది విప్లవకారుల మరణ శిక్షపై సంతకం చేయని ఉస్మాన్ అలీఖాన్ కన్నా నియంత అనిపించుకోకూడదని ఆశిస్తున్నాని" శ్రీశ్రీ విజ్ఞప్తి చేశాడు. అప్పటికి ఇందిరాగాంధీ స్పెయిన్‌లో ఉరిశిక్ష పడిన ఐదుగురు యువకులకు క్షమాభిక్ష పెట్టవలసిందిగా నియంత ఫ్రాంకోకు విజ్ఞప్తి చేసి వున్నది. 1984 ఫిబ్రవరి 11న మఖ్బూల్‌భట్ కాశ్మీర్ స్వయం నిర్ణయాధికారం కోసం ఉరికంభం ఎక్కాడు. 2013 ఫిబ్రవరి 9న అఫ్జల్‌గురును ఉరి తీశారు. మఖ్బూల్‌భట్ ఉరితీతతో జాతి విముక్తి ఉద్యమాలు ఆగిపోలేదు. అఫ్జల్‌గురు ఉరితీతతో ఆగవు.

రాజకీయ ఖైదీలలో శిక్షపడిన వాళ్ళు, ఆరోపణలు ఎదుర్కొంటున్న వాళ్ళు వుంటారు. శిక్ష పడిన వారిలో చర్లపల్లి జైలులో ఉన్న పి.బి.వి. గణేష్ (1995 నుండి 18 ఏళ్ళుగా), ఖదీర్ (1991 నుండి 22 ఏళ్ళుగా) శిక్ష అనుభవిస్తున్నారు. దీర్ఘకాలంగా (నాలుగు నుండి ఎనిమిది ఏళ్ళ వరకు) కొండయ్య, పాండురంగారెడ్డి (సాగర్) ఎల్.ఎస్.ఎన్.మూర్తి, చంద్రశేఖర్ విచారణ ఖైదీలుగా జైళ్లలో వుంటున్నారు. శోభా దీదీ, నిర్మల, పద్మ, మాలతి, మీనా, సుగుణ, అనురాధ, రజిత, ఎంజిలా మొదలైన సీనియర్ మహిళా కామ్రేడ్స్ ఎంతో మంది దీర్ఘకాలంగా జైలు జీవితాన్ని అనుభవిస్తున్నారు.

మావోయిస్టు పరిచయాలు, భావజాలం కల్గి ఉన్నారనే ఆరోపణతో పీయూసీఎల్ అధ్యక్షుడు డాక్టర్ వినాయక్ సేన్‌కు యావజ్జీవ శిక్ష, ఆసిత్ కుమార్ సేన్ గుప్తాకు ఎనిమిదేళ్ళు జైలు శిక్ష విధించారు. గడ్చిరోలి, విదర్భ తదితర మహారాష్ట్ర ప్రాంతాల మావోయిస్టు కార్యకలాపాలతో, ఆ పార్టీ నాయకుడు దీపక్‌తో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణతో మహారాష్ట్రకు చెందిన రిపబ్లికన్ పాంథర్స్ నాయకుడు సుధీర్ దావ్లేను అరెస్టు చేశారు. ఊపా కింద అరెస్టు చేసి 28 రోజులు చిత్రహింసలు పెట్టడం వల్ల రక్తం కక్కుకుని బెంగాలీ పీపుల్స్‌మార్చ్ సంపాదకుడు స్వపన్‌దాస్ గుప్తా జైలులోనే మరణించారు. సాంస్కృతిక కార్యకర్తలైన జీతన్ మరాండీ, అనిల్‌రామ్, ఛత్రపతి మండల్, మనో రాజ్వర్‌లకు గిర్డీ సెషన్స్ కోర్టు విధించిన మరణ శిక్షను, ప్రజా అభిప్రాయానికి తలొగ్గి రాంచి హైకోర్టు రద్దు చేసినా, నేటికీ జీతన్ మరాండీ జైలులోనే ఉన్నారు. మావోయిస్టు పార్టీ అగ్రనాయకుడు నారాయణ సన్యాల్ పైన ఉన్న అన్ని కేసులలో బెయిలు దొరికి విడుదలయ్యే అవకాశం ఉండడంతో ముందస్తు నిర్బంధ చట్టం క్రైం కంట్రోల్ ఆక్ట్ (సిసిఎ – ఝార్ఖండ్)

కింద ఆయనను మళ్ళీ నిర్బంధించారు. దీంతో ఆయనను మరో ఏడాది పాటు జైలులో వుంచే అవకాశం వుంటుంది.

నేడు జైళ్లలో అత్యధికంగా కూలీలు, పేదవాళ్ళయిన ఆదివాసులు, దళితులు, వెనకబడిన తరగతులకు చెందినవారు, మహిళలు, మైనారిటీలు ఉన్నారు. జైళ్ళలో విప్లవ మహిళల సంఖ్య రోజు రోజుకు పెరుగుతున్నది. వీరిలో పార్టీ, ప్రజా సంఘాలకు చెందిన మహిళలు, పోరాట ప్రాంతాల సాధారణ మహిళలు ఉన్నారు. దేశవ్యాప్తంగా ముఖ్యంగా మధ్య భారతంలో సుమారు 20 వేల మంది ఆదివాసులు జైళ్ళలో ఉన్నారు.

రాజకీయ ఖైదీలు స్వేచ్ఛగా ఎక్కడికైనా తిరిగే హక్కును తప్ప, వాళ్ళు ఖైదీలయినంత మాత్రాన ఏ ప్రాథమిక హక్కును కోల్పోవడానికి వీలులేదు. కానీ పాలకులు ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదు. దేశవ్యాప్తంగా జైళ్ళలో జైలు మాన్యువల్‌ను అనుసరించి, అవసరాలను తీర్చడం లేదు. జైళ్ళలో వాటి సామర్థ్యాన్ని మించి మూడు, నాలుగు రెట్లు ఖైదీలను వుంచుతున్నారు.

జగదల్‌పూర్‌లోని కేంద్ర కారాగారంలో పాత బస్తర్‌లోని వర్తమాన ఏడు జిల్లాలలో అరెస్టు చేస్తున్న వారిని వుంచుతున్నారు. దీనిలో 600ల మందిని మాత్రమే వుంచగల పరిస్థితులు వుంటే 1600లకు పైగా ఖైదీలను వుంచుతున్నారు. ఖైదీలు తిండి, బట్టలు, సౌకర్యాల విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మహిళలు లైంగిక, మానసిక ఇబ్బందులకు గురవుతున్నారు. వారి ప్రత్యేక సమస్యలను దృష్టిలో పెట్టుకోవడం లేదు. భార్యా భర్తలు, తల్లీ పిల్లలు ఒకే జైలులో ఉన్నప్పటికి, వేర్వేరు బ్యారక్‌లలో వుంచి కలుసుకోనియకుండా మానవ సంబంధాల పట్ల దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారు. జగదల్‌పూర్ కేంద్ర కారాగారంలో 20 పడకల ఆసుపత్రి ఉన్నప్పటికి వైద్యులు, వైద్య సిబ్బంది లేకపోవటంతో, బయటి ఆసుపత్రులకు పంపక, 2012 తొలి ఆరుమాసాలలో ఆరుగురు ఖైదీలు చికిత్స అందక మరణించారు. అధికారుల, వార్డర్ల, గూండాల దోపిడి దౌర్జన్యాలతో ఖైదీలు ఇబ్బందులు పడుతున్నారు.

విచారణ ఖైదీలను ఏళ్ళ తరబడి కోర్టులకు తీసుకుపోవడం లేదు. రాజకీయ ఖైదీలకు విప్లవ సాహిత్యం అందకుండా అడ్డుకుంటున్నారు. రాజకీయ ఖైదీల విషయంలో సాధారణ ఖైదీలకు వర్తించే నియమాలేవి వర్తింప చేయడం లేదు. మావోయిస్టు పార్టీకి చెందిన రాజకీయ ఖైదీల కేసులను ఫాస్ట్‌ట్రాక్ కోర్టులలో సత్వరంగా విచారించి కఠిన శిక్షలు, యావజ్జీవ శిక్షలు విధిస్తున్నారు. విప్లవకారులను బతికినంతకాలం జైళ్ళలోనే ఉంచే విధంగా చట్టాలను రూపొందిస్తున్నారు. వీళ్లకు ప్రభుత్వాలు కల్పించే రెమిషన్ సత్ప్రవర్తనపై శిక్షాకాలం తగ్గింపును ఏవో కుంటిసాకులతో నిరాకరిస్తున్నాయి.

ఇటువంటి పరిస్థితులకు వ్యతిరేకంగా రాజకీయ ఖైదీలు పోరాడుతూనే ఉన్నారు. భగత్‌సింగ్, రాజగురు, సుఖ్‌దేవ్, జతీంద్రనాథ్‌దాస్‌లు 1929 జూన్ 6నాడు చరిత్రాత్మకమైన జైలు పోరాటాన్ని ప్రారంభించారు. రాజకీయ ఖైదీల హక్కుల కోసం సాగిన ఆ సమరశీల పోరాటంలో 63 రోజుల నిరాహార దీక్ష తర్వాత 1929 సెప్టెంబర్ 13న జతీంద్రనాథ్‌దాస్ అమరుడయ్యాడు. సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా పోరాడిన లాలా లజపతిరాయ్‌ని హత్య చేసిన బ్రిటిష్ అధికారి సాండర్స్‌పై కాల్పులు జరిపి అంతమొందించిన కేసులో భగత్ సింగ్, రాజగురు, సుఖ్‌దేవ్‌లకు బ్రిటిష్ ఇండియా న్యాయస్థానం ఉరిశిక్ష విధించింది. వారిని లాహోర్ కేంద్రకారాగారంలో 1931 మార్చి 23న ఉరితీశారు.

భగత్‌సింగ్, రాజగురు, సుఖ్‌దేవ్‌లను ఉరితీసిన మార్చి 23, ఎమర్జెన్సీ విధించి దేశాన్ని ఒక జైలుగా మార్చిన జూన్ 26, జతీంద్రనాథ్‌దాస్ అమరుడైన సెప్టెంబర్ 13, అంతర్జాతీయ మానవ హక్కుల దినమైన డిసెంబర్ 10లలో దేశమంతా అన్ని జైళ్ళలో రాజకీయ ఖైదీలు, వారి ప్రోత్సాహంతో సాధారణ ఖైదీలు కూడా పోరాట దినాలు నిర్వహిస్తున్నారు.

ఎనిమిది దశాబ్దాల తర్వాత కూడా అనాగరికంగా ఉరిశిక్షలు అమలు చేస్తున్న భారత ఫాసిస్టు ప్రభుత్వ దమన నీతికి వ్యతిరేకంగా, ప్రతి సంవత్సరం వలె ఒకటి, రెండు రోజులు కాకుండా ఈ సంవత్సరం భగత్‌సింగ్ వర్ధంతిని, మార్చి 23 నుండి 29 వరకు వారం రోజులు రాజకీయ ఖైదీల హక్కుల పోరాట వారంగా నిర్వహిద్దాం. ఉరిశిక్షలు పడిన వారందరి ఉరిశిక్షలు రద్దు చేయాలని, రాజ్యాంగం నుంచి మరణ శిక్ష చట్టాన్ని తొలగించాలని వుద్యమిద్దాం.

**★ దేశవ్యాప్తంగా వివిధ జైళ్లల్లో మగ్గుతున్న రాజకీయ ఖైదీలందరినీ వెంటనే బేషరతుగా విడుదల చేయాలి!**

**★ వివిధ న్యాయమైన ప్రజా ఉద్యమాలను, విప్లవోద్యమాన్ని అణచివేసే రాజ్య నిర్బంధ చర్యలలో భాగంగా జైలుపాలైన వాళ్లందరినీ రాజకీయ ఖైదీలుగా గుర్తించాలి!**

**★ జైళ్లలో ఖైదీలపై, ప్రత్యేకించి రాజకీయ ఖైదీలపై, మహిళలపై జరుగుతున్న అన్ని రకాల అణచివేతను, అత్యాచారాలను, హక్కుల హననాన్ని అరికట్టాలని డిమాండ్ చేయండి!**

**★ జైళ్లలో వైద్యసేవలు అందించకుండా ఖైదీల బలవన్మరణాలకు కారణమవుతున్న, జైలు అధికారులపై హత్యా కేసులు నమోదు చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేయండి!**

**★ తమ హక్కుల సాధనకై ఖైదీలు చేపట్టే పోరాటాలను బలపర్చండి!**

★

# దేశవ్యాప్తంగా వివిధ జైళ్లల్లో మగ్గుతున్న రాజకీయ ఖైదీలందరినీ వెంటనే బేషరతుగా విడుదల చేయాలి!

## 2013 మార్చ్ 23-29 వరకు రాజకీయ ఖైదీల హక్కుల వారంగా పాటించండి!

వ్యక్తిగత ఆస్తి పుట్టుకతో ఏర్పడిన వర్గ సమాజంలో సాంఘిక, ఆర్థిక అసమానతలకు వ్యతిరేకంగా పోరాడుతున్న వారిని పాలక వర్గాలు తమ వ్యక్తిగత ఆస్తిని, వర్గ ప్రయోజనాలను కాపాడుకోవడానికి అణచివేయడం, హత్యలు, అత్యాచారాలు చేయడం మొదలైంది. పాలకులు తమ దోపిడి, అవినీతి, అణచివేతలకు చట్టబద్ధత కల్పించుకోవడానికి క్రూర నిర్బంధ చట్టాలను రూపొందిస్తున్నారు.

1947 తర్వాత ఇండియాలో బ్రిటిష్ వలస పాలనకు గుర్తుగా నాటి క్రూర నిర్బంధ చట్టాలు మిగిలి వున్నాయి. బ్రిటిష్ వలస పాలన అణచివేత యంత్రాంగం ఇండియన్ పీనల్ కోడ్ (ఐ.పి.సి.) క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సి.పి.సి.), పోలీస్ చట్టం (1861), భూసేకరణ చట్టం (1894), ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టాలు, డిఫెన్స్ ఆఫ్ ఇండియా రూల్స్ రూపంలో కొనసాగుతున్నాయి.

పంజాబ్ మిలిటెన్సీని ఎదుర్కోవడం కోసం చేసిన టాడా(1985) పంజాబ్‌లో కన్నా ఎక్కువగా కాశ్మీరు, గుజరాత్, ఆంధ్రప్రదేశ్‌లలో వాడారు. గుజరాత్‌లో దేశంలోకెల్లా ఎక్కువగా కార్మిక ఉద్యమాలను అణచడానికి, కార్మికులను నిర్బంధించడానికి వాడారు. టాడా చట్టాన్ని అమల్లోకి తెచ్చిన 1985 నుండి 1989 వరకు ఆంధ్రప్రదేశ్‌లో 13 వేల మందిని అరెస్టు చేశారు. ప్రజాస్వామిక ఒత్తిడి వల్ల టాడా రద్దయింది. కాని వెంటనే మరో రూపంలో పోటా (2002)ను తీసుకువచ్చారు. దీన్ని కూడా దేశంలోని అన్ని పార్లమెంటరీ పార్టీలు ప్రయోగించాయి. ప్రజాస్వామిక ఒత్తిడితో ఒక సమీక్షా సంఘాన్ని వేసి, కొన్ని కేసులు ఎత్తివేసినా, తర్వాత చట్టాన్నే రద్దు చేసినా, ఈనాటికీ టాడా, పోటాల కింద అవి ఉన్న రోజులలో నమోదయిన కేసులన్నీ విచారణ, శిక్షలతో సహా కొనసాగుతున్నాయి.

టాడా, పోటా వంటి చట్టాలు రద్దయి, సవరించబడి చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (అన్‌లాఫుల్ ఆక్టివిటీస్ ప్రివెన్షన్ ఆక్ట్ (ఊపా) - 2008) ను తెచ్చారు. ఊపా అనేది టాడా, పోటా స్థానంలో వచ్చిన దుర్మార్గమైన చట్టం. దీన్ని వుపయోగించి ఎవరినైనా ఏ విచారణ లేకుండా ఆరు నెలల పాటు జైల్లో పెట్టవచ్చు. ఈ ఆరు నెలల కాలంలో ఎన్నిసార్లయినా పోలీస్ కస్టడికి తీసుకపోవచ్చు. టాడా, పోటాల వలె ఇందులో కూడా ముద్దాయిలే తమ నిర్దోషిత్వాన్ని రుజువు చేసుకోవాల్సి ఉంటుంది. ఊపా పరిధిలోకి వచ్చే నేరారోపణలు ఎదుర్కొంటున్న వారి విషయంలో, ప్రజలు, ప్రసార, ప్రచార మాధ్యమాల సిబ్బంది కూడా ఇన్‌ఫార్మర్లుగా వ్యవహరించాలి. లేకపోతే వాళ్లు కూడా నేరానికి దోహదం చేసిన వారవుతారు. పోలీస్ అధికారుల ఆదేశాలతో ఎప్పుడైన, ఎవరి ఇల్లయినా సోదా చేయవచ్చు, దాడి చేయవచ్చు. టెర్రరిజాన్ని ప్రోత్సహిస్తున్నాయనే సాకుతో ఏ రచననయినా, డాక్యుమెంటరీ ఫిల్మ్‌నయినా, రిపోర్ట్‌నయినా, వ్యాసాన్నయినా నిషేధించవచ్చు. రచయితలను, కళాకారులను, ప్రసార, ప్రచార మాధ్యమాల వ్యక్తులను కూడా అరెస్టు చేయవచ్చు. నిందితుల విచారణ బహిరంగంగా జరుగదు. ఇన్‌కెమెరా జరుగుతుంది. సాక్షుల పేర్లు చెప్పరు. ఈ కేసులు విచారించే స్పెషల్ కోర్టు పరిపాలనా విభాగం అధికార పరిధిలో ఉంటుంది. ప్రాథమిక హక్కులన్నింటిని హరించే ఈ చట్టం జీవించే హక్కును పరోక్షంగా హరిస్తుంది.

సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టం (ఆర్మ్‌డ్ ఫోర్సెస్ స్పెషల్ పవర్స్ ఆక్ట్ - ఎ.ఎఫ్.ఎస్.పి.ఎ.)ను జమ్మూ కాశ్మీర్, ఈశాన్య రాష్ట్రాలలోని జాతి విముక్తి ఉద్యమాలను అణచివేయడానికి రూపొందించారు. దీని రద్దు కొరకు ఈశాన్య రాష్ట్రాల్లో, ముఖ్యంగా మణిపూర్ ప్రజలు అపూర్వమైన పోరాటాలు చేశారు. మహిళలు దేశం ఎల్లకాలాలకు గర్వించదగిన పోరాట పటిమను చూపి, ప్రాణాలు ఒడ్డి ప్రతిఘటించారు. ఒకవైపు దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్యవాదులు, దీని రద్దును డిమాండ్ చేస్తుంటే, మరోవైపు పాలకులు దీనికి సవరణలు చేసి దేశానికంతా వర్తింపచేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఇందువల్ల దేశవ్యాప్తంగా జాతి విముక్తి వుద్యమాలను, చట్టబద్ధ ప్రజా ఉద్యమాలను, విప్లవోద్యమాలను అణచివేయడానికి ఉపయోగపడుతుంది. ఇక నుండి ఆయా రాష్ట్రాల శాంతి భద్రతల సమస్యలు పోలీసుల చేతుల్లో నుండి పారా మిలటరీ బలగాల చేతుల్లోకి వస్తాయి.

జాతీయ ఉగ్రవాద నిరోధక కేంద్రం (నేషనల్ కౌంటర్ టెర్రరిజం సెంటర్ - ఎన్.సి.టి.సి.) ఏర్పాటు ప్రస్తుతానికి కొన్ని రాష్ట్రాలు వ్యతిరేకించడం వల్ల తాత్కాలికంగా ఆగినా, త్వరలోనే దాని ఏర్పాటు జరిగే ప్రమాదం ఉంది. దీని వల్ల రాష్ట్రాల పరిధిలోని శాంతి భద్రతల సమస్య కేంద్రం పరిధిలోకి వస్తుంది.

*(మిగతాది 58వ పేజీలో...)*